www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 1-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 167 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి రా. 9.40 తదుపరి అమావాస్య; నక్షత్రం: పుబ్బ ఉ. 9.16 తదుపరి ఉత్తర; వర్జ్యం: సా. 5.24-7.12; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.18, రా. 9.59-10.46; అమృతఘడియలు: తె. 5.14-6.03; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.00 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మిథున్ చక్రవర్తికి దాదాసాహెబ్ ఫాల్కే

హిందీ, బెంగాలీ, భోజ్‌పురి, ఒరియాలో 370 చిత్రాల్లో నటన

గోపాల గోపాల చిత్రంతో తెలుగు సినిమాలోనూ..

ఈ ఏడాదే పద్మభూషణ్‌కు ఎంపిక

6 నెలలకే మరో విశిష్ట పురస్కారం

ఈ నెల 8న అవార్డ్ ప్రదానం

తొలి చిత్రంతోనే జాతీయ అవార్డ్ అందుకున్న.. 'ఐయామే డిస్కో డాన్సర్' అంటూ ఉర్రూతలూగించిన.. 80వ దశకంలో హిందీ సినిమాపై ఎంతో ప్రభావం చూపిన.. హీరో అనే పదానికి అర్థం మార్చేసిన మిథున్ చక్రవర్తికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును ప్రకటించింది.

6





ఇంధన సర్దుబాటు చార్జీ.... ఈ పేరు వింటేనే విద్యుత్ వినియోగదారుల వెన్నులో వణుకు పుడుతుంది. ఎప్పుడో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు 'అదనపు' బాదుడు! జగన్ సర్కారు ఒకే సమయంలో అనేక 'సర్‌చార్జీ'లతో షాకులు ఇచ్చింది. రెండేళ్లకు సంబంధించిన సర్‌చార్జీ వసూలుపై ఎన్నికల ముందు మౌనంగా ఉన్న విద్యుత్ నియంత్రణ కమిషన్... ఇప్పుడు ప్రజాభిప్రాయ సేకరణకు రంగం సిద్ధం చేసింది.

8,113 కోట్ల షాక్

వెంటాడుతున్న జగన్ పాపాలు!

2023-24లో 11,826 కోట్ల వసూలుకూ అభ్యర్థన

రెండూ కలిపితే వినియోగదారులపై రూ.20,096 కోట్ల భారం

సర్‌చార్జీల వడ్డనకు సిద్ధమైన డిస్కమ్‌లు

18న ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

గత ఏడాది ఏప్రిల్లోనే డిస్కమ్‌ల వినతి

ఎన్నికల ముందు బాదుడు 'వాయిదా'

8,113 కోట్లపై ఏడాదిన్నరకు స్పందించిన కమిషన్

భగ్గుమంటున్న పార్టీలు, ప్రజాసంఘాలు

అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జగన్ గద్దె దిగిపోయినా ఆయన నిర్వాకాలు జనాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. విద్యుత్ కొనుగోలులో అనుసరించిన అడ్డగోలు విధానాల భారం జనం నెత్తిన పడుతూనే ఉంది. ఒక్క ఏడాదిలోనే జగన్ చేసిన పాపాల తాలూకు రూ.8,113.60 కోట్ల బాదుడు జనం నెత్తిన పడుతోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ కొనుగోళ్ల కోసం చేసిన ఈ మొత్తాన్ని 'సర్దుబాటు' పేరుతో వసూలు చేసేందుకు ప్రజాభిప్రాయం సేకరించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సిద్ధమైంది. అక్టోబరు 18న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటామని సోమవారం ఓ ప్రకటన జారీ చేసింది.

* ఎన్నికల ముందు 'వాయిదా'

2022-23లో విద్యుత్, బొగ్గు కొనుగోళ్ల అదనపు భారాన్ని వినియోగదారుల నుంచి సర్దుబాటు చేసుకుంటామని గత ఏడాది ఏప్రిల్లోనే డిస్కంలు కోరాయి. ఈ మేరకు ఏపీఈఆర్‌సీలో ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ దరఖాస్తు చేశాయి. కానీ, ఈఆర్‌సీ స్పందించలేదు. తర్వాత 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.11,826.42 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీల వసూలుకు కూడా డిస్కంలు అనుమతులు కోరాయి. గత ఏడాది డిసెంబరు నాటికే ఈఆర్‌సీ

మిగతా 11వ పేజీలో...

లడ్డూ వ్యవహారంలో మీ వైఖరేంటి?

సిట్‌నే కొనసాగించాలా?.. కేంద్ర దర్యాప్తు అవసరమా?

అక్టోబరు 3 నాటికి స్పష్టత ఇవ్వండి

కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

దేవుడినైనా రాజకీయాలకు దూరంగా ఉంచాలి

నెయ్యి కల్తీ అయినట్టు ఆధారాలుంటే చూపాలి

విచారణ పూర్తికాకుండానే మీడియా ముందు సీఎం మాట్లాడడం ఏంటి?: సుప్రీం ధర్మాసనం





న్యూఢిల్లీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి లడ్డూ అపవిత్రమైన వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ స్థాయిలో దర్యాప్తు అవసరమా? లేదా అన్న విషయంపై స్పష్టత ఇవ్వాలని సుప్రీంకోర్టు కోరింది. వచ్చే గురువారం నాటికి కేంద్రం తన వైఖరిని తెలియజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లేదా సీబీఐ నేతృత్వంలో విచారణ జరిపించాలని, కోట్లాది భక్తుల మనోభావాలకు సంబంధించిన విషయమైనందున అందరికీ నిజం తెలియాలంటూ సుప్రీం కోర్టులో ఐదు వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. ఇందులో.. బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యస్వామి, టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డితో పాటు చరిత్రకారుడు డాక్టర్ విక్రమ్ సంపత్, ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు దుష్యంత్ శ్రీధర్ కలిపి దాఖలు చేసిన మరో పిటిషన్ సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో

మిగతా 11వ పేజీలో...

లడ్డూపై వాస్తవాలే చెప్పండి

కోర్టులపై వ్యతిరేక వ్యాఖ్యలు చేయొద్దు

పార్టీ నేతలకు నాయకత్వం ఆదేశం

సీఎం చంద్రబాబు స్వామిభక్తుడు

కల్తీని ల్యాబ్ నిర్ధారించాకే స్పందించారు

వాస్తవాలు తేల్చడానికే సిట్ వేశారు: టీడీపీ

11

నెయ్యి ల్యాబ్‌లో 'సిట్'

నాలుగున్నర గంటలపాటు పరిశీలన

తిరుమలకు నెయ్యి ట్యాంకర్లపై ఆరా

నేడు ముడిసరుకుల స్టోరేజీల తనిఖీ

రైజ్ ట్రైబ్!

గిరిజనుల కోసం ప్రత్యేక యాప్ రెడీ

వారి తలసరి ఆదాయం పెంచేందుకు చర్యలు

అవసరాలు గుర్తించేందుకు నేటి నుంచి ఇంటింటి సర్వే

2

నవంబరు నుంచి క్యాంపుల ఏర్పాటు

17 శాఖలతో ఆ శాఖ కార్యదర్శి కన్నబాబు సమావేశం



2

సిద్దరామయ్యకు బిగుస్తున్న ఉచ్చు

ముడా స్కామ్‌పై రంగంలోకి ఈడీ, సీబీఐ

మనీ లాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడీ

లోకాయుక్త ఎఫ్ఐఆర్ అధ్యయనంలో సీబీఐ

సాయంత్రం దాకా నివాసంలోనే సీఎం

వివిధ కార్యక్రమాలున్నా బయటికి రాని వైనం

దేశీయ గోవుకు 'రాజ్యమాత-గోమాత' హోదా!

ఆమోదముద్ర వేసిన మహారాష్ట్ర క్యాబినెట్

2

మరాఠా-కుంబీ సర్టిఫికెట్లపై జస్టిస్ శిందే కమిటీ నివేదికకు కూడా..

అసెంబ్లీ ఎన్నికల ముందు కీలక నిర్ణయాలు



12 నుంచి ప్రైవేటు మద్యం షాపులు

నేటి నుంచి 9 వరకు దరఖాస్తులు

11న 3396 షాపులకు లాటరీ

దరఖాస్తు రుసుము 2 లక్షలు


లైసెన్స్ ఫీజులు 50 నుంచి 85 లక్షలు

కొత్త పాలసీ నోటిఫికేషన్ విడుదల

అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారు తీసుకొచ్చిన ప్రభుత్వ మద్యం షాపుల విధానం త్వరలోనే ముగియనుంది. ఈ నెల 12వ తేదీన ప్రైవేటు మద్యం షాపులు తెరుచుకోనున్నాయి. ఈ మేరకు రెండేళ్ల కాల పరిమితితో నూతన మద్యం పాలసీకి ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. అందుకు అనుగుణంగా మంగళవారం ఉదయం జిల్లాల్లో ఎక్సైజ్ అధికారులు షాపులను నోటిఫై చేస్తూ

మిగతా 11వ పేజీలో...

నేరస్థులను వదలొద్దు



రాజకీయ అరాచక శక్తులను ఉపేక్షించొద్దు

పోలీసుల పనితీరులో మార్పు కనిపించాలి

గత ప్రభుత్వ తాలూకు వాసనలు ఒక్క పోలీసు స్టేషన్‌లోనూ కనిపించరాదు

వనరులు దోపిడీ చేసిన దొంగలు జైలుకెళ్లాలి

ఐదేళ్లు ప్రజల్ని వేధించిన వారికి శిక్ష పడాలి

పోలీసు ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు

తిరుమల కొండపైన అక్రమాలపై ఆరా

అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడే వ్యక్తులు ఎవరైనా, ఎంతటి వారైనా వదిలి పెట్టొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రాజకీయ ముసుగు వేసుకుని అరాచకాలకు తెగబడే శక్తులపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం అమరావతిలోని ఏపీ సచివాలయంలో సీఎస్, డీజీపీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, సీఐడీ ఏడీజీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌తో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల

మిగతా 11వ పేజీలో...

నేడు కర్నూలు జిల్లాకు చంద్రబాబు

గ్రామసభ, పింఛన్ల పంపిణీ కార్యక్రమం



కర్నూలు జిల్లా పుచ్చకాయలమడ గ్రామంలో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు తొలిసారి మంగళవారం కర్నూలు జిల్లాకు వస్తున్నారు. పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో జరిగే గ్రామ సభలో పాల్గొంటారు. అక్టోబరు నెలకు సంబంధించిన పింఛన్లు పంపిణీ చేస్తారు. చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్ పర్యవేక్షించారు. సీఎం భద్రతా అధికారుల సూచనల మేరకు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



అయ్యా..యస్ ప్రవీణ్ ప్రకాశ్.. ముగిసిన సర్వీస్

అధికారి ఎలా ఉండరాదనేందుకు రోల్‌మోడల్

జగన్‌నూ దెబ్బతీసిన నిర్ణయాల రూపశిల్పి

సీఎంవోలోనూ భరించలేక ఢిల్లీకి పంపిన వైనం

తిరిగొచ్చి పాఠశాల విద్యలో టీచర్లకు నరకం

కూటమి ప్రభుత్వం రాగానే వీఆర్ఎస్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఐఏఎస్ అధికారులకు రోల్ మోడల్... ఎస్ఆర్ శంకరన్! ఒక ఐఏఎస్ ఎలా ఉండకూడదో చెప్పాలంటే ఇప్పుడు వినిపిస్తున్న పేరు ప్రవీణ్ ప్రకాశ్!

జగన్ హయాంలో వివాదాస్పద అధికారిగా ముద్రపడిన ప్రవీణ్ ప్రకాశ్ కెరీర్ అర్ధాంతరంగా ముగిసింది. ప్రభుత్వం మారగానే నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న వాళ్లు రాజీనామాలు చేయడం సహజం. కానీ.. అఖిల భారత సర్వీసులో ఉన్న ప్రవీణ్ ప్రకాశ్ చిత్రమైన రాజకీయ లక్షణం ప్రదర్శించారు. కూటమి సర్కారులో పనిచేయలేనంటూ వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం దీనిని ఆమోదించడంతో సోమవారం ఆయన సర్వీసు ముగిసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రవీణ్‌ప్రకాశ్ 1994 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆయన కెరీర్ కర్నూలు అసిస్టెంట్ కలెక్టర్‌గా మొదలైంది. ఆ తర్వాత గుంటూరు, విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు విశాఖ కలెక్టర్‌గా పనిచేస్తూ ఎన్నికల కమిషన్ ఆగ్రహానికి గురయ్యారు. అయినా వైఎస్ చలవతో ఆయన తూర్పుగోదావరి, రంగారెడ్డి కలెక్టర్‌గా

మిగతా 11వ పేజీలో...



మరిన్ని వీసాలు

అందుబాటులో 2.5 లక్షల అమెరికా వీసా అపాయింట్‌మెంట్లు

12

పర్యాటకులు, నిపుణులైన కార్మికులకు, విద్యార్థులకు కేటాయింపు

దసరాకు 6100 ప్రత్యేక బస్సులు

సాధారణ టికెట్ ధరలే వర్తింపు

అక్టోబరు 4 నుంచి 11 వరకు 3040, దసరా తర్వాత 3060

బ్రహ్మోత్సవాలు, నవరాత్రులు, సెలవుల నేపథ్యంలో ఆర్టీసీ ఏర్పాట్లు

11

రాష్ట్రమంతటి నుంచి అదనపు బస్సులు

లెబనాన్‌లోకి ఇజ్రాయెల్!



ఇజ్రాయెల్ దాడులతో బీరుట్‌లో రోడ్డుపైనే నిద్రిస్తున్న ఓ చిన్నారి

అమెరికాకు సమాచారం.. సరిహద్దుల్లో వైదొలగిన లెబనాన్ ఆర్మీ

యుద్ధ ట్యాంకులతో అల్-వజానీ, అల్-ఖియామ్ వైపు ఐడీఎఫ్

డమాస్కస్‌పై దాడులు.. లెబనాన్‌లో పదుల సంఖ్యలో మరణాలు

ఇజ్రాయెల్‌పై ఇరాక్, ఇరాన్, సిరియా దాడులకు అవకాశం

లెబనాన్‌కు ఐఆర్‌జీసీ.. సిరియాకు హిజ్బుల్లా నాయకులు

ఇరాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను మట్టుబెడతాం: నెతన్యాహు

నెతన్యాహుకు మోదీ ఫోన్.. ఉగ్రవాదానికి చోటు లేదని వ్యాఖ్య

టెల్అవీవ్, సెప్టెంబరు 30: హిజ్బుల్లా అంతమే లక్ష్యంగా కంకణం కట్టుకున్న ఇజ్రాయెల్ సేనలు.. సోమవారం అర్ధరాత్రి దాటాక లెబనాన్ భూభాగంలోకి చొచ్చుకెళ్లాయి. సోమవారం ఉదయం నుంచే అమెరికా వార్తా సంస్థలు సీఎన్ఎన్, వాషింగ్టన్ పోస్ట్ తమ వెబ్ ఎడిషన్లలో భూతల దాడులకు సర్వం సిద్ధం అంటూ కథనాలను అప్‌డేట్ చేస్తున్నా.. ఇజ్రాయెల్ మాత్రం అర్ధరాత్రి అధికారికంగా నిర్ధారించింది. ముందుగానే హెచ్చరికలు జారీ చేయడంతో లెబనాన్ సైన్యం సరిహద్దుల్లోని రమిష్, అబూషానన్ ప్రాంతాల్లోని పోస్టుల్లోంచి వెనక్కి వెళ్లినట్లు లెబనాన్ వార్తాపత్రిక అల్-నహర్ వెల్లడించింది. రాత్రి కడపటి వార్తలందేసరికి

మిగతా 2వ పేజీలో...

నైరుతి నిష్క్రమణ

అసాధారణ వానలు, వరదలతో ముంచెత్తి.. ముగిసిన నాలుగు నెలల సీజన్

ఈ సీజన్‌లో ఏకంగా 9 అల్పపీడనాలు

ఏపీలో 18.6% అధిక వర్షపాతం

3

అయినా 42 మండలాల్లో వర్షాభావం

దేశమంతా సాధారణం కన్నా 8% ఎక్కువ వాన

దక్షిణ,మధ్య, వాయవ్యంలో అధిక వర్షాలు

తూర్పు, ఈశాన్య భారతంలో తగ్గిన వర్షపాతం

దేశంలోని 157 జిల్లాల్లో లోటు వర్షపాతం



నైరుతి నాలుగు నెలల సీజన్‌లో దేశవ్యాప్తంగా 868.6 మిల్లీమీటర్లకుగాను 934.8 మిల్లీమీటర్ల (సాధారణం కంటే ఎనిమిది శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. ఏపీలో.. 574.7 మిల్లీమీటర్లకు గాను 681.6 మిల్లీమీటర్ల (సాధారణం కంటే 18.6 శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే అధికంగా ఎన్టీఆర్ జిల్లాలో, అత్యల్పంగా నెల్లూరు జిల్లాలో వానలు పడ్డాయి.



బీమా భారం?

నేటి నుంచి అమల్లోకి సవరించిన పాలసీ సరెండర్ వాల్యూ మార్గదర్శకాలు

2

'చిన్న మొత్తాల' వడ్డీ రేట్లు యథాతథం

10

వాయుసేన కొత్త చీఫ్‌గా అమర్ ప్రీత్ సింగ్



» హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం

అల్వాల్, న్యూఢిల్లీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత వాయసేన కొత్త చీఫ్‌గా ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్ చౌదరి స్థానంలో ఆయన నియమితులయ్యారు. అమర్‌ప్రీత్ సింగ్ ఇంతకుముందు ఎయిర్‌ఫోర్స్ ఉప అధిపతిగా ఉన్నారు. వైమానిక దళ నూతన అధిపతిగా బాధ్యతలు స్వీకరించిన అమర్‌ప్రీత్ సింగ్‌కు హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ నుంచి 1984 డిసెంబరు 21న నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో నియామకం పొందారు. 1964 అక్టోబరు 27న అమర్‌ప్రీత్ సింగ్ జన్మించారు. 1984 డిసెంబరులో భారత వాయుసేనలోని యుద్ధరంగ పైలట్ విభాగంలో చేరారు. యుద్ధ పైలట్‌గా పలు రకాల యుద్ధ విమానాలపై అమర్‌ప్రీత్ సింగ్‌కు 5 వేల గంటలకు పైగా ఫ్లయింగ్ అనుభవం ఉంది. ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం నుంచి పరమ్ విశిష్ట్ సేవ, అతి విశిష్ట్ సేవా పతకాలను పొందారు.

కుమారస్వామిని పంది అనలేదు.. అది సామెత!

» లోకాయుక్త ఏడీజీపీకి కర్ణాటక హోంమంత్రి సమర్థన

బెంగళూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కుమారస్వామిని పంది అని లోకాయుక్త ఏడీజీపీ చంద్రశేఖర్ లేఖలో ప్రస్తావించలేదని కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర్ వెల్లడించారు. సోమవారం బెంగళూరులో పరమేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఐరిష్ రచయిత జార్జ్ బెర్నార్డ్ షా వ్యాఖ్యలను ఏడీజీపీ లేఖలో పొందుపరిచారు. సామెతలు, పెద్దల అభిప్రాయాలను అప్పుడప్పుడు ప్రస్తావించడం సహజం. అంతమాత్రాన కుమారస్వామి తనకు ఎందుకు అన్వయించుకోవాలి? అప్లికేషన్ ఆఫ్ మైండ్ కూడా ముఖ్యం' అని వ్యాఖ్యానించారు. దర్యాప్తును అడ్డగిస్తే పోలీసులు చర్యలు తీసుకుంటారని, వారికీ నిబంధనలు ఉంటాయని తేల్చి చెప్పారు. కుమారస్వామిని ఏడీజీపీ పందితో పోల్చారని, చర్యలు తీసుకోవాలని జేడీఎస్ నేతలు సీఎస్‌కు వినతిపత్రం సమర్పించారు.

మూలకణ చికిత్సతో మధుమేహం నయం

బీజింగ్, సెప్టెంబరు 30: జీవన విధానంతో సంబంధం లేకుండా చిన్న వయసులోనే వచ్చే టైప్-1 మధుమేహాన్ని మూలకణ చికిత్సతో నయం చేసినట్లు చైనా శాస్త్రవేత్తలు ప్రకటించారు. 11 ఏళ్లుగా టైప్- 1 డయాబెటిస్‌తో బాధపడుతున్న తియాంజెన్‌కు చెందిన ఓ 25 ఏళ్ల మహిళకు మూలకణ చికిత్సతో ఆమె ఇన్సులిన్ స్థాయిలను అదుపులోకి తీసుకొచ్చినట్లు పెకింగ్ వర్సిటీ వైద్య కేంద్రం పరిశోధకులు తెలిపారు. రోగి మూల కణాలను ప్రత్యేక కెమికల్ అణువులతో రీప్రోగ్రామ్ చేసి వాటిని ఆమె పొత్తికడుపు కింది కండరంలో క్లోమ గ్రంధికి దగ్గరగా ట్రాన్స్‌ప్లాంట్ చేశామని ఆ కణాలు ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తాయని చెప్పారు. భవిష్యత్తులో రోగ నిరోధక శక్తిపై ప్రభావం పడకుండా రోగి శరీరంలోని అడిపోస్ కణజాలం నుంచి కణాలను సేకరించి కేవలం అరగంటలో ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా ఆ మహిళ ఆమె షుగర్ స్థాయిలను అదుపులో ఉంచుకునే వీలు కలిగిందని పరిశోధకులు పేర్కొన్నారు.

ఏకాకి జీవితమే ఆనందం!



» వృద్ధాప్యంలో ఒంటరి బతుకే తృప్తిగా ఉందంటున్న 47శాతం మంది

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: వృద్ధాప్యంలో ఒంటరి జీవితమే ఆనందంగా ఉందంటున్నారు వృద్ధులు. ఒంటరిగా బతుకున్న ప్రతి 100మంది వృద్ధుల్లో 47శాతం మందిది ఇదేమాట! 'ఏజ్ వెల్ ఫౌండేషన్' అనే సంస్థ ఒంటరిగా బతుకుతున్న వృద్ధులపై దేశవ్యాప్తంగా ఓ సర్వే నిర్వహించింది. ఇందులో భాగంగా పట్టణ, పల్లె ప్రాంతాల్లో 10వేలమందిని ప్రశ్నించింది. వీరిలో 41.9శాతం మంది ఎవ్వరి మీదా ఆధారపడకుండా గత ఐదేళ్లుగా పూర్తి స్వతంత్రంగా బతుకుతున్నామని చెప్పారు. వీరిలో 46.5 శాతం మహిళలు ఉండటం గమనార్హం. 46.9శాతం మంది 'వృద్ధాప్యంలో ఒంటరిగా ఉండటం' సంతోషంగా ఉందని చెప్పినా, 41.5శాతం తమకీ జీవితం తీవ్ర అసంతృప్తిగా ఉందని తేల్చి చెప్పారు. స్వతంత్రంగా బతకాలనే ఒంటరిగా ఉండేందుకు ప్రాధాన్యమిచ్చామని 31% మంది, వృద్ధాప్యంలో ఒంటరిగా బతకడం వల్ల వ్యక్తిగత స్వేచ్ఛ ఉంటుందని 21.5% మంది స్పష్టం చేశారు. ఒంటరిగా బతకడం వల్ల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం పడుతుందని 41% మంది ఆవేదన వ్యక్తం చేశారు. 10.4% మంది ఎప్పుడూ ఒంటరిగా ఉన్నామనే భావనతో కాలంవెళ్లదీస్తున్నామని చెప్పారు.

గిరిజనుల కోసం రైజ్ ట్రైబ్!

ప్రత్యేక యాప్ రెడీ.. నేటి నుంచి ఇంటింటి సర్వే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా గిరిజనుల అవసరాలను గుర్తించాలని, మిగతా మైదాన ప్రాంతాలతో పోలిస్తే గిరిజన ప్రాంతాల్లో ఏయే అంశాల్లో వెనుకబడి ఉన్నారో అన్వేషించాలని ఇటీవల గిరిజన సంక్షేమశాఖ అధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మిగతా రాష్ట్రమంతా తలసరి ఆదాయం రూ.2.30 లక్షలు ఉండగా, గిరిజన ప్రాంతాల్లో కేవలం రూ.లక్ష ఉందని, గిరిజన ప్రాంతాల్లో తలసరి ఆదాయాన్ని మైదాన ప్రాంతాలకు సమానంగా తీసుకురావాలంటే ఏం చేయాలనే దానిపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. గిరిజనుల ప్రాథమిక అవసరాలను గుర్తించి, రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు, హెల్త్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు.. ఇలా కనీస అవసరాలను అందించడం ద్వారా వారి జీవనోపాధులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, తద్వారా వారి తలసరి ఆదాయం పెంచేలా కృషి చేయాలన్నారు. దీనికోసం ముందుగా గ్యాప్ అనాలసిస్ సర్వే చేయాలని నిర్ణయించారు. గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కన్నబాబు ఆ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో మొత్తం 17 శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయా శాఖలు గిరిజనులకు ఎన్ని రకాలుగా సహకారం అందించగలవో చర్చించారు. గిరిజనుల జీవన పరిస్థితులు, వారి అవసరాలను గుర్తించేందుకు సర్వే చేయడానికి రైజ్ ట్రైబ్ అనే యాప్‌ను తయారుచేశారు. ఈ యాప్ ద్వారా ఆయా గిరిజనుల కుటుంబాలకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ కార్డు, బ్యాంకు ఖాతా, ఆరోగ్యశ్రీ కార్డు, ఇల్లు, తాగునీటి కనెక్షన్ ఉన్నాయా? గిరిజనుల పొలాల్లో ఏ పంటలు పండించుకుంటున్నారు. వారికి పీఎం కిసాన్ అందుతోందా? లేదా? విద్యుత్ కనెక్షన్ ఉందా?.. ఇలా గిరిజనులకు సంబంధించి సంపూర్ణ డేటాను సేకరిస్తారు. తర్వాత అన్ని గిరిజన నివాసిత ప్రాంతాల్లో ఉన్న సమస్యలను కూడా గుర్తిస్తారు. ఆయా ప్రాంతాల్లో తాగునీరు, రోడ్డు, రవాణా సౌకర్యాలు, ఆసుపత్రి, పాఠశాల, సెల్‌ఫోన్ సిగ్నల్స్ తదితరాలు ఉన్నాయా? లేదా? పరిశీలిస్తారు. ఇలా సేకరించిన డేటాతో గ్యాప్ అనాలసిస్ ద్వారా వారి అవసరాలను తీర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తారు. అక్టోబరు మొదటి వారం నుంచి సర్వే చేపడతారు. గిరిజన ప్రాంతాల్లోని అన్ని ఇళ్లకు వెళ్లి, డేటా సేకరించి, క్రోడీకరించి అక్టోబరు నెలాఖరుకు సర్వే పూర్తి చేస్తారు.

క్యాంపుల ద్వారా సౌకర్యాలు..

గ్యాప్ అనాలసిస్ ప్రక్రియ పూర్తయిన వెంటనే గిరిజన ప్రాంతాల్లో గిరిజన సంక్షేమశాఖ క్యాంపులు ఏర్పాటు చేస్తుంది. నవంబరు 1 నుంచి ఆయా ప్రాంతాల్లో ఏయే అవసరాలున్నాయో? ఆయా శాఖల ద్వారా వారి అవసరాలను తీరుస్తుంది. మొదటగా క్యాంపుల ద్వారా గిరిజనులకు రేషన్‌కార్డు, ఆధార్, ఉపాధి హామీ, ఆరోగ్యశ్రీ కార్డులు, బ్యాంకు ఖాతా తదితర సౌకర్యాలు కల్పిస్తారు. గిరిజన ప్రాంతాల్లో సైతం మైదాన ప్రాంతాలకు సమానంగా తలసరి ఆదాయం వచ్చేలా ప్రభుత్వం అన్ని రకాల సహకారాలను గిరిజనులకు అందించనుంది. ఆ మేరకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. కర్ణాటకలో మాదిరి మన రాష్ట్రంలోనూ గిరిజన రైతులు పండించే కాఫీ దిగుబడి పెంచాలని సూచించారు. పీఎం కిసాన్ సాయం అందని రైతులకు అందేలా చర్యలు తీసుకోవడం, ఉపాధి హామీ కార్డులు అందని వారికి అందించి పనులు కల్పించడం ద్వారా వారి ఆదాయ వనరులు పెంచాలన్నారు. గిరిజనులకు సంబంధించి 17 శాఖలు ఏయే సేవలందిస్తాయి? ఎవరిని సంప్రదించాలన్న దానిపై అవగాహన కల్పించేందుకు, రైజ్‌ట్రైబ్ యాప్ గురించి తెలిపేందుకు కన్నబాబు అధికారులతో విస్తృతంగా చర్చించారు. నవంబరు నుంచి అవసరమైన అన్ని సౌకర్యాలు గిరిజనులకు అందేలా చర్యలు తీసుకోనున్నారు.

లెబనాన్‌లోకి ఇజ్రాయెల్!

(మొదటి పేజీ తరువాయి)

ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) యుద్ధట్యాంకులతో లెబనాన్‌లోని అల్-వజానీ, అల్-ఖియామ్ వైపు దూసుకెళ్తున్నట్లు తెలిసింది. ఆ ప్రాంతాల్లో యుద్ధట్యాంకులు, ఫిరంగులతో దాడులు జరిగినట్లు అల్-మనార్ పత్రిక ప్రతినిధి షోఫర్ నిర్ధారించినట్లు లెబనాన్ వార్తాసంస్థలు పేర్కొన్నాయి.

ఇజ్రాయెల్‌పై.. దాడులకు వ్యూహాలు..!

తాజా పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై దాడికి ఇరాక్, ఇరాన్, సిరియాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆయా దేశాల ముఖ్య నాయకులు సోమవారం చేసిన ప్రకటనలు.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇరాన్ ప్రజలను ఉద్దేశించి ఆంగ్లంలో ఇచ్చిన సుదీర్ఘ వీడియో సందేశం కూడా ఈ విషయాన్ని బలపరుస్తున్నాయి. ఇప్పటికే ఇజ్రాయెల్‌పై ఒకట్రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన ఇరాక్.. నేరుగా కదనరంగంలోకి దిగుతామని సూత్రప్రాయంగా వెల్లడించింది. ఇరాన్ వేల మంది రివల్యూషనరీ గార్డ్స్, ఫైటర్లను లెబనాన్‌కు తరలించింది. మరోవైపు అమెరికా కూడా పశ్చిమాసియాకు ముందుజాగ్రత్తగా అదనపు బలగాలను పంపుతుంది.

యుద్ధరంగంలోకి ఇరాక్?

ఇజ్రాయెల్‌పై యుద్ధానికి సిద్ధమని ఇరాక్ ఎంపీ యాసర్-అల్-హుస్సేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఖతార్‌కు చెందిన బ్రిటన్ వార్తాసంస్థ అల్-అరబి ఓ కథనాన్ని ప్రసారం చేసింది. "ఇరాక్ చమురు క్షేత్రాలను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకోనుందని, కీలక ప్రాంతాలపై దాడులకు సిద్ధమవుతోందని నిఘావర్గాలు మా ప్రధాని మహమ్మద్ షియా అల్-సుడానీకి సమాచారం అందించాయి. మా సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి మేం యుద్ధానికి సిద్ధమే" అని ఆయన వ్యాఖ్యానించినట్లు ఆ కథనంలో పేర్కొంది.

ఫైటర్లను లెబనాన్‌కు తరలించిన ఇరాన్

హిజ్బుల్లా చీఫ్‌తోపాటు.. తమ రివల్యూషనరీ గార్డ్స్ జనరల్ అబ్బాస్‌ను అంతమొందించిన ఇజ్రాయెల్‌పై ఇరాన్ అగ్గిమీద గుగ్గిలమవుతోంది. అంతకు ముందు సిరియాలోని డమాస్కస్‌పై ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల్లోనూ ఇరాన్ కమాండర్లు మృతిచెందారు. దీంతో ఇజ్రాయెల్‌పై ప్రతీకారానికి ఇరాన్ సిద్ధమైంది. హిజ్బుల్లాకు మద్దతుగా.. ఇరాన్ ఫైటర్లను, రివల్యూషనరీ గార్డ్స్‌ను వేల సంఖ్యలో లెబనాన్‌కు పంపినట్లు ఇజ్రాయెల్ వార్తా సంస్థలు కథనాలను ప్రచురించాయి.



లెబనాన్ సరిహద్దుల్లో ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకుల విన్యాసాలు



సిరియా కేంద్రంగా..

అగ్ర నాయకత్వాన్ని కోల్పోయిన హిజ్బుల్లా.. హమాస్ ఉగ్రవాద సంస్థల ఫీల్డ్ కమాండర్లు రెండ్రోజులుగా సిరియా బాట పట్టినట్లు ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ గుర్తించింది. అక్కడ ఉన్న ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) నాయకులతో వీరు భేటీ అవుతున్నారని, కలిసికట్టుగా ఇజ్రాయెల్‌పై దాడులకు సిద్ధమవుతున్నారని నిర్ధారించినట్లు ఇజ్రాయెల్ వార్తా సంస్థ 'వైనెట్' పేర్కొంది. మరోవైపు సిరియాపై జరుగుతున్న దాడులపై ఐక్య రాజ్య సమితి(ఐరాస) ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు హిజ్బుల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ నయీం కాసీమ్ సోమవారం ఓ అరబిక్ టీవీ చానల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ.. ఇజ్రాయెల్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తామని, శత్రువు తమ భూభాగంలోకి ప్రవేశిస్తే గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తమ మిలటరీ సామర్థ్యాన్ని ఇజ్రాయెల్ అంచనా వేయలేదని తెలిపారు. కాగా, ఐడీఎఫ్ వైమానిక దళం సోమవారం కూడా లెబనాన్‌పై భీకరదాడులు జరిపింది. ఆదివారం దాడుల్లో 105 మంది చనిపోయారు. ఆదివారం రాత్రి జరిపిన దాడిలో హిజ్బుల్లా మీడియం రేంజ్ మిస్సైల్స్ బృందం కమాండర్ ఈద్-హసన్ నెషార్‌ను అంతమొందించినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది.

ఏ దేశంలోనైనా చొరబడతాం

ఇరాన్ పౌరులను ఉద్దేశించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సుదీర్ఘ వీడియో సందేశం, లేఖను విడుదల చేశారు. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ చొరబడని ప్రదేశమంటూ లేదని చెబుతూనే.. ఇరాన్ పౌరులు మతోన్మాద శక్తుల ఉచ్చులో పడొద్దని హితవు పలికారు. "మతోన్మాదంతో మీ కలలను నాశనం చేసుకోవద్దు. మీలో మతోన్మాద విష బీజాలు నాటే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. మా ప్రజలను, మా దేశాన్ని రక్షించుకునేందుకు మేం ఎక్కడిదాకా అయినా వెళ్తాం. మీరు ఒక్క విషయాన్ని ఆలోచించండి. మీ ప్రభుత్వం పాలనను పక్కనబెట్టింది. సంక్షేమానికి కాకుండా.. అనవసర యుద్ధాలకు బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తోంది. ఇరాన్‌కు స్వేచ్ఛ వస్తే.. పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. ఆ సమయం వచ్చేలోగా.. మీ ప్రభుత్వం ఐదు ఖండాల్లో విస్తరించిన ఉగ్రవాద నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేస్తాం. అదే జరిగితే.. ప్రపంచ పెట్టుబడులు ఇరాన్‌కు వస్తాయి. ఇరాన్ సుభిక్షంగా మారుతుంది. యూదు-పర్షియన్ ప్రజలు శాంతియుతంగా ఉంటారు" అని ఆయన వ్యాఖ్యానించారు. నెతన్యాహు సందేశాన్ని బట్టి.. ఆయన ఇరాన్‌పై దాడికి సిద్ధమవుతున్నారనే సంకేతాలు వెలువడుతున్నాయని, అందుకే.. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ సురక్షిత ప్రాంతానికి తరలి వెళ్లి ఉంటారని విశ్లేషకులు చెబుతున్నారు.

తోక ఉగ్ర సంస్థల ఖేల్ ఖతం!

హిజ్బుల్లా, హమా‌స్‌కు అనుబంధంగా పనిచేస్తున్న రెండు ఉగ్రవాద సంస్థలపై మొస్సాద్ అందించిన సమాచారంతో ఐడీఎఫ్ దాడులు జరిపింది. పాపులర్ ఫ్రంట్ ఫర్ ద లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా(పీఎఫ్ఎల్‌పీ) సంస్థ హిజ్బుల్లాకు అనుబంధంగా పనిచేస్తోందని ఐడీఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది. ఆ సంస్థ చీఫ్ నిదల్ అబ్దుల్-అల్‌ను ఆదివారం రాత్రి జరిపిన రాకెట్ దాడుల్లో మట్టుబెట్టినట్లు ప్రకటించింది. పీఎఫ్ఎల్‌పీ మిలటరీ కమాండర్ ఇమాద్ ఓదేహ్‌ను కూడా అంతమొందించినట్లు తెలిపింది. అటు హమాస్ అనుబంధ సంస్థ లెబనాన్ ఎరీనాను కూడా టార్గెట్‌గా చేసుకున్నట్లు వివరించింది. ఈ సంస్థ హమాస్-హిజ్బుల్లా మధ్య సంధానకర్తగా పనిచేస్తోందని పేర్కొంది. సోమవారం జరిపిన దాడుల్లో లెబనాన్ ఎరీనా చీఫ్ ఫతా షరీఫ్‌ను హతమార్చినట్లు వెల్లడించింది.

ఉగ్రవాదానికి ప్రపంచంలో చోటు లేదు: మోదీ

ఉగ్రవాదానికి ప్రపంచంలో చోటు లేదని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సోమవారం ఆయన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులు, ఉద్రిక్తతలపై చర్చించినట్లు మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలు సురక్షితంగా వెనక్కి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. పశ్చిమాసియాలో శాంతికి భారత్ కృషిచేస్తుందని పునరుద్ఘాటించారు.

లోకం తీరు





కాంచీపురంలోని శివపార్వతుల విగ్రహాలపై తెలుగు శాసనం

చెన్నై, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాంచీపురంలోని ఏకాంబరేశ్వర ఆలయంలో ఉన్న శివపార్వతుల విగ్రహాలపై లిఖించబడిన తెలుగుశాసనం బయట పడింది. శివపార్వతులు, స్కంధ విగ్రహాల పీఠంపై ఈ శాసనం లిఖించివుంది. ఈ శాసనం 18వ శతాబ్దానికి చెందినదని పురావస్తు శాఖాధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ విగ్రహాలు అమెరికాలోని ఆసియన్ ఆర్ట్ మ్యూజియంలో భద్రపరిచారు. తొండమండల ప్రాంతానికి చెందిన వెల్లకొండ మనాయని కుమారుడు, రాఘవనాయని ముడుమన్నరప్ప నాయని మనవడైన వెంకట్రామ నాయని ఏకాంబరేశ్వర ఆలయానికి 11 విగ్రహాలు బహూకరించినట్లు శాసనం పేర్కొంటోంది.

దేశీయ గోవుకు 'రాజ్యమాత-గోమాత' హోదా!

» ఆమోదముద్ర వేసిన మహారాష్ట్ర క్యాబినెట్

ముంబై, సెప్టెంబరు 30: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు ఏక్‌నాథ్ శిందే సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. దేశవాళీ ఆవులకు 'రాజ్యమాత-గోమాత' హోదా కల్పించింది. సోమవారం భేటీ అయిన క్యాబినెట్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇక చారిత్రక రికార్డుల ఆధారంగా కుంబీ-మరాఠా, మరాఠా-కుంబీ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ప్రొటోకాల్‌ను ఖరారు చేస్తూ జస్టిస్ శిందే కమిటీ ఇచ్చిన రిపోర్టులకు కూడా క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది.

గాలి జనార్దన్‌రెడ్డికి ఊరట



» బళ్లారి, అనంతపురం, కడప జిల్లాలకూ వెళ్లొచ్చు

» సుప్రీం కోర్టు ఉత్తర్వులు

బళ్లారి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అక్రమ మైనింగ్ ఆరోపణలతో సీబీఐ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. గాలి జనార్దన్‌రెడ్డి ఇక నుంచి బళ్లారి, అనంతపురం, కడప జిల్లాలకూ వెళ్లవచ్చని సుప్రీంకోర్టు సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. గాలి జనార్దన్‌రెడ్డితో పాటు మరికొందరిపై 2009లో సీబీఐ కేసు నమోదు చేసింది. 2011 సెప్టెంబరు 5న జనార్దన్‌రెడ్డితో పాటు మరి కొందరిని సీబీఐ అరెస్టు చేసింది. ఈ కేసుకు సంబంధించి 2015లో గాలి జనార్దన్‌రెడ్డికి కండిషన్ బెయిల్ ఇచ్చారు. కేసు విచారణలో ఉన్నందున ఆయన బళ్లారి, కడప, అనంతపురం జిల్లాల్లో ప్రవేశించరాదని, తప్పని పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే తమ అనుమతి తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. 2021లో ఒకసారి, 2022లో ఒకసారి కోర్టు అయన్ను బళ్లారిలో ఉండేందుకు అనుమతించింది. కానీ అప్పట్లో సీబీఐ కోర్టులో కేసు విచారణలో ఉన్నందున జనార్దన్‌రెడ్డి సాక్షులను ప్రభావితం చేస్తారని టపాల గణేశ్ కోర్టుకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఆయన ఆ మూడు జిల్లాలకు రాలేదు. సుప్రీం ఉత్తర్వులతో గాలి జనార్దన్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. ఎక్స్ వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. 'బళ్లారి నేను పుట్టి పెరిగిన ఊరు. అక్కడ గాలి, నేల, జనాన్ని తాకక చాలా ఏళ్లు గడిచింది. దసరా నవరాత్రి ఉత్సవాలకు ఊరిలోకి అడుగు పెడుతాను. ముందుగా నేను గెలిచిన, నన్ను నమ్ముకున్న గంగావతికి వెళ్లి అక్కడి జనంతో మాట్లాడుతాను. అంజనాద్రి బెట్టను దర్శించుకుని బళ్లారికి వెళ్తాను. అక్కడ దుర్గామాతను దర్శించుకుని ఇంట్లో కాలు పెడతాను' అని గాలి పేర్కొన్నారు.

ప్రతిభావంతుడిని విద్యకు దూరం కానివ్వం!



ఆ దళిత యువకుడికి అడ్మిషన్ ఇవ్వండి

» ఐఐటీ-ధన్‌బాద్‌ను ఆదేశించిన సుప్రీంకోర్టు

» ఫీజు కట్టలేక సీటు కోల్పోయిన విద్యార్థికి ఊరట

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: నిర్దేశిత గడువులోపు ఫీజు చెల్లించలేక ఐఐటీ-ధన్‌బాద్‌లో సీటు కోల్పోయిన దళిత యువకుడికి సుప్రీంకోర్టు బాసటగా నిలిచింది. ఆ యువకుడికి బీటెక్ కోర్సులో అడ్మిషన్ ఇవ్వాలని సోమవారం ఐఐటీ-ధన్‌బాద్‌ను ఆదేశించింది. 'ఇలాంటి ప్రతిభావంతుడైన ఒక యువకుడిని ఇలా వదిలేయలేం. అతను ఇలా అనాదరణకు గురికాకూడదు' అని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా టిటోరా గ్రామానికి చెందిన దినసరి వేతన కార్మికుడి కుమారుడైన అతుల్ కుమార్‌కు ఐఐటీ-ధన్‌బాద్‌లో బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అడ్మిషన్ ఇప్పించేందుకు దేశ అత్యున్నత న్యాయస్థానం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన విశేష అధికారాలను ఉపయోగించింది. 'పిటిషనర్ లాంటి అట్టడుగువర్గాలకు చెందిన ప్రతిభావంతుడైన విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం కోసం చేసే ప్రయత్నాలను ఇలా వదిలేయలేం. అతను సకాలంలో ఫీజు చెల్లించి ఉంటే, ఏ బ్యాచ్‌లోనైతే అడ్మిషన్ ఇచ్చేవారో అదే బ్యాచ్‌లో విద్యాభ్యాసం కొనసాగించేలా అతనికి అడ్మిషన్ ఇవ్వాలని ఐఐటీ-ధన్‌బాద్‌ను ఆదేశిస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. అడ్మిషన్ పొందేందుకు అభ్యర్థి జూన్ 24వ తేదీలోపు అంగీకార రుసుము రూ.17,500 చెల్లించాల్సి ఉండగా, అతుల్ కుమార్ తల్లిదండ్రులు సకాలంలో ఆ డబ్బు చెల్లించలేకపోయారు. దీంతో ఐఐటీ-ధన్‌బాద్ అతనికి సీటు కేటాయించలేదు.

ఓ మాజీ చీఫ్‌జస్టిస్‌ను విచారించాలా?

సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ రంజన్ గొగొయ్‌ను ప్రతివాదిగా చేర్చి విచారణ జరపాలంటూ పిల్ దాఖలుచేసిన వ్యక్తికి జస్టిస్ చంద్రచూడ్ చీవాట్లు పెటారు. జడ్జి పేరును రాతపూర్వకంగా తొలగిస్తేనే 'పిల్'పై నిర్ణయం తీసుకుంటామని పిటిషనర్‌కు తేల్చిచెప్పారు. కార్మిక చట్టాల కింద తన సర్వీసు రద్దు చేసిన వ్యవహారంలో వేసిన పిటిషన్‌ను జస్టిస్ రంజన్ గొగొయ్ కొట్టివేస్తూ 2018లో ఇచ్చిన తీర్పు వల్ల తనకు అన్యాయం జరిగిందని నాగ్‌పూర్‌కు చెందిన వ్యక్తి తన పిటిషన్‌లో వాదించారు. అందువల్ల జస్టిస్ రంజన్‌ను కూడా తన పిల్‌లో భాగం చేసి, ఆయనపై ఇన్-హౌస్ ఎంక్వైరీ (కోర్టు నియమించిన కమిటీ జరిపే విచారణ) చేయించాలని కోరారు. పిటిషనర్ విజ్ఞాపనపై చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ మండిపడ్డారు. "ఒక మాజీ చీఫ్‌జస్టిస్‌పైనే ఇన్-హౌస్ ఎంక్వైరీ కోరతారా? కొంచమైనా గౌరవం ఉండాల్సి న అవసరం లేదా? ఓడిపోయిన ఓ కేసులో ఇలా కోరడం ఏమిటి? దీన్ని మేం సహించబోం" అని ఆగ్రహించారు.

బాధిత ట్రైనీ డాక్టరు పేరు వెల్లడించొద్దు

కోల్‌కతాలోని ఆర్.జి.కర్ వైద్య కళాశాలలో అత్యాచారానికి, హత్యకు గురయిన ట్రైనీ డాక్టర్ ఫొటో, పేరును ఎక్కడా వెల్లడించకూడదని సోమవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆమె వివరాలను వికీపీడియా సహా సామాజిక మాధ్యమాల్లో ప్రచురించకూడదంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలు కొనసాగుతాయని తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో బాధితురాలి ఫొటో, పేరు వస్తుండడంతో ఆమె తల్లిదండ్రులు బాధపడుతున్నారని న్యాయవాది వృందా గ్రోవర్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కృత్రిమ మేధ ద్వారా వీడియోలు సృష్టించి ఆన్‌లైన్‌లో పెడుతున్నారని తెలిపారు. ఆమెపై సినిమా కూడా తీశారని, అది మంగళవారం యూట్యూబ్‌లో విడుదల కానుందని చెప్పారు. దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ తాము ఉత్తర్వులు ఇచ్చామని, అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత ఏజెన్సీలపై ఉందని తెలిపారు. కాగా, వైద్య కళాశాలల్లో సీసీటీవీ కెమేరాల ఏర్పాటు నత్తనడకన సాగుతోందంటూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్టోబరు 15 నాటికి ఈ పనులన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించింది.

జీవిత బీమా ప్రీమియం పెరుగుతుందా?

» నేటి నుంచి అమల్లోకి సవరించిన పాలసీ సరెండర్ వాల్యూ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: జీవిత బీమా పాలసీల సరెండర్ విలువ సవరణకు సంబంధించి ఐఆర్‌డీఏఐ చేసిన ప్రతిపాదనలు మంగళవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఫలితంగా బీమా ప్రీమియంలు పెరగడమో లేదా ఏజెంట్ల కమీషన్ తగ్గడమో జరగవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. జీవిత బీమా పాలసీదారులు గడువుకన్నా ముందే తమ పాలసీలను సరెండర్ చేసినప్పుడు మెరుగైన ప్రతిఫలాలు అందించడానికి సంబంధించి సవరించిన సరెండర్ వాల్యూ మార్గదర్శకాలను ఈ ఏడాది తొలినాళ్లలో ఐఆర్‌డీఏఐ తెచ్చింది. ఇవి మంగళవారం నుంచి అమల్లోకి రానున్నాయి. కొందరు పాలసీదారులు పాలసీ గడువు ముగియడానికి ముందే తమ పాలసీని రద్దు చేసుకుంటారు. ఇలా చేయడాన్ని సరెండర్ అంటారు. పాలసీని సరెండర్ చేసినప్పుడు పాలసీదారుకు బీమా కంపెనీలు చెల్లించే మొత్తమే సరెండర్ విలువ.

నేటి నుంచి ఈ మార్పులు...

- ఈక్విటీ(క్యాష్), డెరివేటివ్స్ (ఫ్యూచర్స్, ఆప్షన్స్) ట్రేడింగ్ లావాదేవీలకు సంబంధించిన ఫీజులను బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లు మంగళవారం నుంచి మార్చుతున్నాయి. ఈక్విటీ డెరివేటివ్స్ సెగ్మెంట్ లో సెన్సెక్స్, బ్యాంకెక్స్ ఆప్షన్స్ కాంట్రాక్టులకు రూ. కోటి ప్రీమియం టర్నోవరుపై ట్రాన్సాక్షన్ ఫీజును రూ.3,250కి బీఎస్ఈ సవరించింది. ఇక క్యాష్ మార్కెట్‌కు లావాదేవీ రుసుమును రూ.లక్ష ట్రేడింగ్ విలువకు రూ.2.97గా ఎన్ఎస్ఈ నిర్ణయించింది.
- ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్ సెక్యూరిటీ లావాదేవీ పన్ను (ఎస్‌టీటీ) పెంపు అక్టోబరు 1 నుంచి అమల్లోకిరానుంది. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై ప్రస్తుతం ఉన్న 0.0125% ఎస్‌టీటీని 0.02 శాతానికి పెంచారు. ఆప్షన్స్ ట్రేడింగ్‌పై 0.0625% ఎస్‌టీటీ ఉండగా.. 0.1 శాతానికి పెంచనున్నారు. అక్టోబరు ఒకటి నుంచి బైబ్యాక్ సందర్భంగా షేర్లు అమ్మినప్పుడు వచ్చే ఆదాయంపై పన్ను చెల్లించాల్సి వస్తుంది. బైబ్యాక్‌లో భాగంగా కంపెనీ తన వాటాదారుల నుంచి షేర్లను తిరిగి కొనుగోలు చేస్తుంది.
- ఆదాయ పన్ను వివాదాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన వివాద్ సే విశ్వాస్ రెండో విడత పథకం మంగళవారం నుంచి అమల్లోకి రానుంది.

సిద్ధరామయ్యకు బిగుస్తున్న ఉచ్చు

» ముడా స్కాంపై రంగంలోకి ఈడీ, సీబీఐ

» 14 ప్లాట్లూ సరెండర్ చేస్తున్నా: సిద్ధూ భార్య

బెంగళూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మైసూర్ నగరాభివృద్ధి సంస్థ(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఉచ్చు బిగుస్తోంది. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రంగంలోకి దిగాయి. మరోవైపు సిద్దరామయ్య భార్య పార్వతి తనకు కేటాయించిన 14 ప్లాట్లను సరెండర్ చేస్తున్నట్లు నెలరోజుల క్రితం ముడా కమిషనర్‌కు రాసిన లేఖ.. సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇప్పటికే ఈ వ్యవహారంపై లోకాయుక్త పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఏ1గా.. ఏ2, ఏ3లుగా ఆయన భార్య బీఎం పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి, ఏ4గా భూ యజమాని దేవరాజు ఉన్నారు. ఈడీ, సీబీఐ కూడా రంగంలోకి దిగడంతో.. సిద్దరామయ్య ఇక ఏ క్షణంలోనైనా విచారణను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లోకాయుక్త ఎఫ్ఐఆర్‌ను పరిగణనలోకి తీసుకొని ఈడీ అధికారులు ఈ అంశంపై సిద్దరామయ్య, ఆయన భార్య పార్వతి తదితరులపై సోమవారం మనీ లాండరింగ్ కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్)ను నమోదు చేశారు. దాని ప్రకారం ఈడీ సమన్లు జారీ చేసి, నిందితులను ప్రశ్నించనుంది. అంతేకాదు.. పీఎంఎల్ఏ చట్టం కింద నిందితుల ఆస్తులను ఈడీ అటాచ్/జప్తు చేసే అవకాశం ఉంది. మరోవైపు లోకాయుక్త పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను సీబీఐ కూడా అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. ఈ వివాదంపై సీబీఐ ద్వారా దర్యాప్తు జరిపించాలని సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇలా అన్ని వైపుల నుంచి ముఖ్యమంత్రికి ఉచ్చు బిగుస్తోంది.

ముడా కమిషనర్‌కు సిద్ధూ భార్య లేఖ

ముడా కమిషనర్‌కు సిద్దరామయ్య భార్య పార్వతి తన 14 ప్లాట్లను సరెండర్ చేస్తున్నట్లు నెలక్రితం ఓ లేఖ రాశారు. ఈ లేఖ తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కన్నడ భాషలో పార్వతి రాసిన ఆ లేఖలో.. మైసూరు తాలూకా కసబాహోబ్లిలోని కేసరే గ్రామంలోని సర్వే నంబర్ 464లో 3 ఎకరాల 16 గుంటల భూసేకరణకు పరిహారంగా విజయనగర ఫేస్-3, 4లలో తనకు కేటాయించిన 14 ప్లాట్లను తిరిగి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ 14 ప్లాట్లకు సంబంధించిన డీడ్‌లను రద్దు చేయాలని కోరారు. వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. తన భర్తపై 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చలేదని, ఆయనపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.

నైరుతి నిష్క్రమణ

- నైరుతి సీజన్‌లో మొత్తం తొమ్మిది అల్పపీడనాలు ఏర్పడ్డాయి. అత్యధికంగా సెప్టెంబరులో నాలుగు, ఆగస్టు, జూలైలలో రెండేసి, జూన్‌లో ఒకటి బంగాళాఖాతంలో వచ్చాయి.
- దేశంలో అనేకచోట్ల పుష్కలంగా వర్షాలు కురిసినా, వర్షం కురిసే రోజుల సంఖ్య తగ్గింది. కుంభవృష్టి వర్షాలు కురిసే ప్రాంతాలు ఈ సీజన్‌లో భారీగా పెరిగాయి. రోజు వ్యవధిలో 30 సెంటీమీటర్లు, అంతకంటే ఎక్కువగా వర్షపాతం కురిసిన ప్రాంతాలు అనేకం ఉన్నాయి.

అసాధారణ వానలు, వరదలతో ముంచెత్తి...

- ముగిసిన నాలుగు నెలల సీజన్
- ఈ సీజన్‌లో ఏకంగా 9 అల్పపీడనాలు
- ఏపీలో 18.6% ఎక్కువ వర్షపాతం
- మొత్తం 42 మండలాల్లో వర్షాభావం
- దేశమంతా సాధారణం కన్నా 8%ఎక్కువ వాన
- దక్షిణ,మధ్య, వాయవ్యంలో మిగులు వర్షాలు
- తూర్పు, ఈశాన్యభారతంలో తగ్గిన వర్షపాతం

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

దేశ వ్యవసాయ రంగానికి కీలకమైన నైరుతి రుతుపవనాల సీజన్ సోమవారం ముగిసింది. వాతావరణ మార్పుల ప్రభావంతో నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలిసారిగా దేశంలో అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. అనేకచోట్ల కుంభవృష్టిగా వర్షాలు కురిశాయి. పలుచోట్ల వరదలు ముంచెత్తాయి. విజయవాడ చరిత్రలోనే రికార్డుస్థాయిలో బుడమేరు వరద చుట్టుముట్టింది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులు నెలకొనడం, హిందూ మహాసముద్రం వాతావరణం అనుకూలించడంతో... రాష్ట్రంలోను, దేశంలోను చాలా చోట్ల మిగులు వర్షపాతం నమోదైంది. కేరళలోని వయనాడ్, ఏపీలో కొన్నిచోట్ల ప్రకృతి ప్రకోపించి కొండచరియలు, వరదలు ముంచెత్తాయి. నైరుతి నాలుగు నెలల సీజన్‌లో 868.6 మిల్లీమీటర్లగాను 934.8 మిల్లీమీటర్ల (సాధారణం కంటే ఎనిమిది శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. అదే సమయంలో తూర్పు, ఈశాన్య భారతంతోపాటు ఉత్తరాదిలోని పంజాబ్, జమ్ము కశ్మీర్, లద్దాఖ్‌లో తీవ్ర వర్షాభావం నెలకొంది.

ఇది అసాధారణమే...

గత ఏడాది నైరుతి సీజన్‌లో సాధారణం కంటే ఆరు శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో దేశంలోని అనేక ప్రాంతాలు తీవ్ర దుర్భిక్షంలో చిక్కుకున్నాయి. ఈ ఏడాది మార్చి తరువాత పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులు ప్రారంభమయ్యాయి. తటస్థ పరిస్థితుల ప్రభావం జూన్ నుంచి దేశంపై కనిపించింది. మే 30న కేరళలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. జూన్‌లో అసోం, మేఘాలయలను అతలాకుతలం చేసిన వరదలు, తరువాత కేరళ, రెండు తెలుగు రాష్ట్రాలు, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. సెప్టెంబరు చివరి వారంలో కురిసిన వర్షాలకు బిహార్, యూపీల్లో వరదలు ముంచెత్తాయి. ఇప్పటికీ అనేక ప్రాంతాలు నీటిలోనే ఉన్నాయి. పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, బిహార్, నాగాలాండ్ తప్ప దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో గల రిజర్వాయర్లలో 87 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయి. గత ఏడాది 71 శాతం నిల్వలు ఉండగా..సాధారణ నిల్వల స్థాయి 77 శాతంగా కేంద్ర జల సంఘం పేర్కొంది. కుంభవృష్టి వర్షాలు కురిసే ప్రాంతాలు ఈ సీజన్‌లో భారీగా పెరిగాయి. మేఘాలయ, గుజరాత్, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, అసోం, త్రిపురలో 24 గంటల వ్యవధిలో 30 నుంచి 50 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదే సమయంలో వర్షం పంపిణీ (అన్ని ప్రాంతాల్లో కురిసే పరిస్థితి)లో తేడా కనిపించడంతో కొన్నిచోట్ల వర్షాభావం నెలకొంది. నైరుతి సీజన్ వర్షాకాలంగా పరిగణించినా...రోజుల తరబడి వేసవి తీవ్రత పెరగడం ఈ ఏడాది అసాధారణ చర్యగా వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

ఏపీలో 18.6 శాతం ఎక్కువ వాన

ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి సీజన్‌లో మంచి వర్షాలు కురిశాయి. జూన్‌లో కొన్నిరోజులు, ఆగస్టులో కొన్ని రోజులు పొడి వాతావరణం కొనసాగినా, గత ఏడాదితో పోల్చితే ప్రస్తుత సీజన్ ఆశాజనకంగా ముగిసింది. జూన్ ఒకటో తేదీ నుంచి సోమవారం వరకు నాలుగు నెలల సీజన్‌లో 574.7 మిల్లీమీటర్లకు గాను 681.6 మిల్లీమీటర్ల (సాధారణం కంటే 18.6 శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైందని ఏపీఎస్‌డీపీఎస్ పేర్కొంది. కోస్తాలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమలో కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, మిగిలిన జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని 670 మండలాల్లో 42 మండలాల్లో వర్షాభావం నెలకొంది. అన్నమయ్య జిల్లాలో 11 మండలాలు, నెల్లూరులో ఎనిమిది, కడపలో ఏడు, సత్యసాయిలో నాలుగు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మూడేసి, నంద్యాల, బాపట్ల, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఒక్కో మండలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. నైరుతి సీజన్‌లో వర్షాలు పుష్కలంగా కురిసి రిజర్వాయర్లు నిండాయి. జూన్ నుంచి సెప్టెంబరు వరకు కొన్నిరోజులు పొడి వాతావరణం నెలకొనడంతో వర్షాధార ప్రాంతాల్లో ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం చూపింది.

జిల్లాల్లో వాన ఇలా..

ఎన్టీఆర్ జిల్లా	1118.2 మిల్లీమీటర్లు (సాధారణం కంటే 52.7 % ఎక్కువ)
గుంటూరు జిల్లా	618.2 మిల్లీమీటర్లు (సాధారణం కంటే 52.1 % ఎక్కువ)
ఏలూరు	1136.1 మిల్లీమీటర్లు (సాధారణం కంటే 48.4 % ఎక్కువ)
కడప	376.6 మిల్లీమీటర్లు (సాధారణం కంటే 7% తక్కువ)
అన్నమయ్య	376.6 మిల్లీమీటర్లు (సాధారణం కంటే 3% తక్కువ)
నెల్లూరు	310.4 మిల్లీమీటర్లు (సాధారణం కంటే 3.1% తక్కువ)

అతివృష్టి.. అనావృష్టి

- రాష్ట్రంలో ఖరీఫ్ సాగు 84 శాతమే
- సాధారణం కన్నా 5 లక్షల హెక్టార్లలో తగ్గుదల
- నిరుటి కంటే 3.35 లక్షల హెక్టార్లు ఎక్కువ
- సీమలో సకాలంలో కురవని వర్షాలు
- వేరుశనగ సాగుపై తీవ్ర ప్రభావం

అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖరీఫ్ సాగు ముగిసింది. ఈ సీజన్‌లో 32.50 లక్షల హెక్టార్ల సాగు లక్ష్యంలో 27.44 లక్షల హెక్టార్లలో (84%) పంటలు సాగయ్యాయి. గతేడాది ఖరీఫ్‌లో 24.09 లక్షల హెక్టార్లలోనే సాగు జరిగింది. అయితే సాధారణ సాగు కన్నా 5 లక్షల హెక్టార్లలో పంట తగ్గింది. నిరుటితో పోల్చితే మాత్రం.. ఈ ఏడాది 3.35 లక్షల హెక్టార్లలో పెరగడం గమనార్హం. ప్రధాన పంటలైన వరి సాగు 10%, పత్తి 33%, వేరుశనగ 48% తగ్గింది. చిరుధాన్యాలు, అపరాలు, ఇతర నూనె గింజల పంటల సాగులో పెరుగుదల కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో 21% అధిక వర్షపాతం నమోదైనా.. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలు.. మరికొన్ని జిల్లాల్లో సకాలంలో వానలు పడకపోవడం వల్ల ఖరీఫ్ సాగుపై గందరగోళం ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. మెట్టప్రాంతాల్లో అతివృష్టి, అనావృష్టి వాతావరణం వల్ల పత్తి సాగు, వేరుశనగ, మిర్చి కూడా సాధారణ స్థాయిలో సాగవ్వలేదు. అయితే నీటి వనరులున్న ప్రాంతాల్లో మిర్చి నారుముళ్లు సాగుతున్నాయి. ఈ ఏడాది రాయలసీమలో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో వేరుశనగ సాగుపై ప్రతికూల ప్రభావం చూపింది. అలాగే కోస్తాలోనూ అతివృష్టి, అనావృష్టి వల్ల పత్తి సాగు తగ్గింది. అయితే జొన్న, సజ్జ, కొర్ర, రాగుల వంటి చిరుధాన్యాలు, కంది, మినుము, పెసర, ఉలవ వంటి అపరాలు, ఆముదం, సోయాబీన్, సన్‌ఫ్లవర్ వంటి నూనెగింజల సాగు ఆశాజనకంగా ఉంది.

ఖరీఫ్ సేద్యం ఇలా (లక్షల హెక్టార్లలో)

పంట	సాధారణం	సాగు విస్తీర్ణం	వ్యత్యాసం
వరి	15.12	13.64	-1.48
పత్తి	5.79	3.89	-1.90
మిర్చి	1.91	1.26	-0.65
వేరుశనగ	5.55	2.87	-2.68
చిరుధాన్యాలు	1.94	2.19	+0.25
అపరాలు	2.97	4.00	+1.03
నూనెగింజలు	0.57	0.51	-0.06

బుధ, గురువారాల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. అయితే ఇది అల్పపీడనంగా బలపడుతుందా? లేదా? అన్నదానిపై వివరాలు వెల్లడించలేదు.



సచ్చిదానంద మూర్తి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్య నాయుడు, బుద్ధ ప్రసాద్, కామినేని శ్రీనివాసరావు, వి పీ గంగాధర్ రావు తదితరులు

ప్రపంచ సమస్యలకు పరిష్కారం భారతీయ తత్వచింతనే

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

పెదకాకాని, సెప్టెంబరు 30: ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు భారతీయ తత్వచింతనే పరిష్కారమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. ప్రముఖ భారతీయ తత్వవేత్త ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి సందర్భంగా సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ సచ్చిదానంద మూర్తి సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ ఆఫ్రో-ఏషియన్ ఫిలాసఫీ నిర్వహించిన ప్రత్యేక సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ఆధునిక విద్యాభ్యాసంలో తత్వశాస్త్రం ఒక ప్రత్యేక విభాగంగా రూపుదిద్దుకోవడం మనిషి వికాసానికి, సమాజ వికాసానికి ఎంతో మేలు చేసే విషయం అన్నారు. వివిధ ఉపనిషత్తుల్లో మహర్షులు చేసిన బోధనలను ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు ఉటంకించారు. ప్రపంచం నలుమూలల విస్తరిస్తున్న పెడపోకడలకు భిన్నమైన సమాజంగా మనం ఎదగాలన్నా, ప్రపంచం మనల్ని అనుసరించాలన్నా తిరిగి మనం మన మూలాలకు వెళ్లాలని సూచించారు. తొలుత కొత్త సచ్చిదానందమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించి పుష్పాంజలి ఘటించారు. ఇప్పటివరకు ముద్రితం కాని ఆచార్య సచ్చిదానందమూర్తి రచనలను, ఆన్ ఎడ్యుకేషన్ అండ్ ది ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్ పేరుతో ప్రొఫెసర్ అశోక్ వోహ్రా, కె. రమేష్ సంపాదకత్వంలో తీసుకువచ్చిన పుస్తకాన్ని, ఆయన స్మృతి చిహ్నంగా తీసుకువచ్చిన పోస్టల్ కవరును వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, కామినేని శ్రీనివాసరావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్స లర్ ప్రొఫెసర్ కే. గంగాధరరావు, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ ఎం. త్రిమూర్తి రావు పాల్గొన్నారు.

రిఫ్రిజిరేటర్ల కొను‘గోల్‌మాల్’!

- పశుసంవర్ధక శాఖలో రెండేళ్ల క్రితం స్కాం
- సీఎంవోకు ప్రముఖ కంపెనీ ఫిర్యాదు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పశుసంవర్ధక శాఖలో రెండేళ్ల క్రితం ఐస్‌లైన్డ్ రిఫ్రిజరేటర్ల (ఐఎల్‌ఆర్) కొనుగోలులో నిధుల గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పశువుల వ్యాక్సిన్‌ను నిల్వ చేసేందుకు వినియోగించే ఈ రిఫ్రిజరేటర్లకు మార్కెట్‌లో లభించే ధర కన్నా రెట్టింపు చెల్లించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు వచ్చాయి. గత ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లతో వైసీపీ అనుకూల సంస్థకు పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారి ఈ కాంట్రాక్ట్ కట్టబెట్టినట్లు ఓ ప్రముఖ కంపెనీ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసింది. జాతీయ పశువ్యాధుల నియంత్రణ కార్యక్రమం కింద పశువుల్లో బ్రూసెల్లోసిస్, ఎఫ్‌ఎండీ వ్యాధులకు వాడే వ్యాక్సిన్‌ను నిల్వ చేసేందుకు కోల్డ్‌చైన్ సదుపాయాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని రాష్ట్రాలు, యూటీలకు కేంద్రం వంద శాతం నిధులు భరించింది. ఇందుకోసం మల్టీపుల్ స్పెసిఫికేషన్స్ జారీ చేసింది. ఆ మార్గదర్శకాల ప్రకారం విడతల వారీగా దాదాపు 1,700 ఐఎల్‌ఆర్‌లను కొనుగోలు చేసేందుకు కేంద్రప్రభుత్వం 2022లో ఏపీకి నిధులు మంజూరు చేసింది. ఏపీ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా టెండర్లు పిలవగా.. కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసి జెమ్ పోర్టల్ ద్వారానే పిలవాలని స్పష్టం చేసింది. దీంతో జెమ్ పోర్టల్ ద్వారా పశు సంవర్ధక శాఖ టెండర్లు పిలిచింది. 15 కంపెనీలు టెండర్‌లో పాల్గొనగా, 13 కంపెనీలు తిరస్కరణకు గురయ్యాయి. మిగతా రెండు సంస్థలలో పశుసంవర్ధక శాఖ రివర్స్ టెండరు కింద ఒక సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఒక్కో ఐఎల్‌ఆర్‌కు రూ.2.04 లక్షలు చెల్లించేందుకు జగన్ సర్కార్ అనుమతించినట్లు అధికారులు చెప్తున్నారు. వ్యాక్సిన్ పాడవకుండా ఉండాలంటే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా 72 గంటలు ఫ్రిజ్‌లో చల్లదనం తగ్గకుండా ఐఎల్‌ఆర్‌లో సామర్థ్యం ఉండాలని కేంద్రం స్పష్టం చేసిందని, ఈ మేరకు ఐదేళ్ల వారంటీతో పని చేసే ఐఎల్‌ఆర్‌లను కొనుగోలు చేశామని పశుసంవర్ధక శాఖ అధికారులు చెప్తున్నారు. అయితే 278 లీటర్ల ఐఎల్‌ఆర్.. రిఫ్రిజరేటర్ల తయారీలో ప్రముఖ కంపెనీ గోద్రెజ్ వద్ద ఇదే మోడల్ తక్కువ ధరకు లభిస్తున్నా పశుసంవర్ధక శాఖ రూ.లక్షా 20వేలు అదనంగా వెచ్చించిందని సీఎంవోకు ఫిర్యాదు చేసిన కంపెనీ పేర్కొంది. కాగా, ఐఎల్‌ఆర్‌ల కొనుగోలు వ్యవహారంపై పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్‌ను ‘ఆంధ్రజ్యోతి’ సోమవారం వివరణ కోరింది. కేంద్రం ఆదేశాల ప్రకారమే జెమ్‌లో టెండర్ కోట్ చేసిన కంపెనీని రివర్స్ టెండరింగ్ పద్ధతిలో ఎంపిక చేసినట్లు చెప్పారు. హారిజెండల్ మోడల్ ఐఎల్‌ఆర్‌లను కొనుగోలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టం చేసినందున వాటిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రీబిడ్డింగ్ మీటింగ్‌లో తమ వద్ద వర్టికల్ మోడల్ తప్ప హారిజెండల్ మోడల్ ఐఎల్‌ఆర్‌లు లేవని గోద్రెజ్ కంపెనీ రాతపూర్వకంగా తెలియజేసిందని ఆయన వివరించారు.

14 మంది స్పెషల్ పీపీల తొలగింపు

- తెనాలి ఏపీపీ మోహన్‌రెడ్డి రాజీనామా ఆమోదం

విజయవాడ లీగల్, సెప్టెంబరు 30: రాష్ట్రవ్యాప్తంగా 14 మంది స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీ)ను తొలగిస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ సోమవారం ఆదేశాలు జారీచేశారు. రెగ్యులర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నా గత వైసీపీ ప్రభుత్వం వీరిని అదనంగా నియమించిందని, అది ఖజానాకు భారంగా మారిందని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు ప్రభుత్వానికి లేఖ రాశారు. అందులో స్పెషల్ పీపీలను తొలగించాలని కోరారు. ఆయన సిఫారసులను ఆమోదించిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 14 మంది స్పెషల్ పీపీలను తొలగిస్తూ సోమవారం ఆదేశాలు జారీచేసింది.

తొలగించింది వీరినే..

మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద నియమితులైన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు... జి.లక్ష్మీనారాయణరెడ్డి (అనంతపురం), టి.మల్లికార్జునరావు (కడప), టి.మహేశ్వరరెడ్డి (కర్నూలు), దత్తాల రమణారెడ్డి (నెల్లూరు), ఎస్.శ్రీనివాసరావు (ఒంగోలు), తన్నీరు సాంబశివరావు (గుంటూరు), ఎరికపాటి దేవదానం క్రిస్టఫర్ (విజయవాడ), ఎం.రాధాకృష్ణ (మచిలీపట్నం), నిమ్మల రాము (ఏలూరు), ఎస్.వెంకటకనకరాజు (రాజమహేంద్రవరం), వంజరన గోవిందరావు (విశాఖపట్నం), చీపురు శ్రీకాంత్ (శ్రీకాకుళం), ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ యాక్ట్ కింద నియమితులైన ఒంగోలుకు చెందిన బి.శ్రీనివాసరావు, డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ కింద నియమితులైన విజయనగరానికి చెందిన చింతపల్లి అప్పారావును ప్రభుత్వం తొలగించింది. తెనాలికి చెందిన ఏపీపీ దాట్ల మోహనరెడ్డి రాజీనామాను ఆమోదించింది.



కసుమూరు దర్గాలో కడప పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీ, పక్కన ఏఆర్ రెహమాన్

వైభవంగా మస్తాన్‌వలి గంధమహోత్సవం

- కసుమూరుకు వచ్చిన ఏఆర్ రహమాన్

వెంకటాచలం, సెప్టెంబరు 30 : దక్షిణ భారతదేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని కసుమూరు మస్తాన్‌వలి 247వ గంధమహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆదివారం అర్ధరాత్రి మస్తాన్‌వలి గంధాన్ని బంగళాలో ఉంచి ముజావర్లతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం మేళతాళాలు, ఫకీర్ల జర్బ, కొమ్ము బూర వంటి వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గుర్రంపై గంధాన్ని ఊరేగించారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు తిరిగి దర్గా వద్దకు ఊరేగింపు చేరింది. అనంతరం మస్తాన్‌వలి సమాధిపై పూల చద్దర్లు, దుప్పట్లను కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ..సిజారా (వంశస్థుల పేర్లు) చదివిన తర్వాత గంధాన్ని సమాధికి పూశారు. అనంతరం దర్గా ముజావర్లు గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, డ్రమ్స్ కళాకారుడు శివమణి గంధమహోత్సవానికి హాజరై స్వామి వారి సమాధికి గంధం పూశారు.

టీటీడీ చైర్మన్ పదవికి నేను అనర్హుడిని

- ఆర్యవైశ్యుల్లో ఆ అర్హత కలిగిన వారు చాలామంది ఉన్నారు
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



కర్నూలు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు చైర్మన్ పదవికి తాను అనర్హుడినని, తనకున్న వ్యాపారాల దృష్ట్యా తిరుమలలో పూర్తి సమయాన్ని వెచ్చించలేనని రాజ్యసభ మాజీ సభ్యుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త టీజీ వెంకటేశ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడారు. టీటీడీ బోర్డు చైర్మన్ పదవి చేపట్టే అర్హత ఆర్యవైశ్యుల్లో చాలా మందికి ఉందన్నారు. పూర్తి సమయం శ్రీవెంకటేశ్వరస్వామి సన్నిధానంలో గడుపుతూ సేవ చేసే వాళ్లలో ఆర్యవైశ్యులు రాష్ట్రంలో చాలా మంది ఉన్నారని తెలిపారు. నిత్యం వ్యాపారాలతో తీరికలేకుండా ఉండే తాను టీటీడీ బోర్డు చైర్మన్ పదవికి అనర్హుడినని తెలిపారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

సెంథిల్ పునరాగమనం


కరుణానిధి మనవడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ప్రమోట్ అయ్యారు. తండ్రితో పోల్చితే కుమారుడికి మరీ ఇంత వేగంగా ఈ హోదా దక్కడం కొందరికి ఎబ్బెట్టుగా తోస్తున్నది. అన్నాడీఎంకే అధినేత్రి జయలలితకు రాజకీయవారసులు లేరు కానీ, కరుణానిధి కుటుంబానికి ఆ కొరతేమీ లేదు. పైగా, నలభైయేడేళ్ళ వయసులో హీరోగా నటిస్తున్న వ్యక్తి, రాజకీయాల్లో డిప్యూటీసీఎం పాత్ర నిర్వహించకూడదన్న నియమమేమీ లేదు. వాళ్ళపార్టీ వాళ్ళిష్టం అని సరిపెట్టుకుంటున్నవాళ్ళు కూడా జూనియర్ స్టాలిన్‌కు పట్టాభిషేకం చేయడానికి పెద్దస్టాలిన్ కాసింత తొందరపడ్డారని మాత్రం అంటున్నారు. ఐదేళ్ళక్రితమే పార్టీ యువజన విభాగం కార్యదర్శిగా ఉదయనిధి అధికారిక ప్రవేశం చేశారు. ఆ తరువాత ఎమ్మెల్యేకావడం, ఏకంగా మంత్రిగా అవతరించడం తెలిసినవే. 'సనాతన ధర్మం' మీద ఆ పాటి కఠినమైన వ్యాఖ్యలు చేయకపోతే, దేశమంతా ఆయన పేరు మారుమోగేదికాదేమో. వారసుడన్నాక ప్రమోషన్‌కు సహజమే కానీ, స్టాలిన్‌కు కరుణానిధి పట్టాభిషేకం చేయడానికి కనీసం మూడుదశాబ్దాలు ఆగారు. తమకుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని సీనియర్ స్టాలిన్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఎందుకు హామీ ఇచ్చారో, అధికారంలోకి వచ్చిన తరువాత మనసెందుకు మార్చుకున్నారో తెలియదు కానీ, తండ్రిలాగా ఎక్కువకాలం నిరీక్షించాల్సిన అవసరం లేకుండానే జూనియర్ స్టాలిన్‌కు రాజమార్గం సుగమమైపోయింది. ఏడాదిన్నరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈ చర్య అధికులను ఆశ్చర్యపరచలేదు కానీ, ఆదివారం జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో సెంథిల్ బాలాజీకి మళ్ళీ మంత్రిగా చోటుదక్కడం మాత్రం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మాత్రమే ఇచ్చిందనీ, నిర్దోషి అనలేదని స్టాలిన్ మరిచిపోయినట్టున్నారు.

రెండురోజుల క్రితం సెంథిల్ బాలాజీ బెయిల్ మీద విడుదలైన వెంటనే ఆయనను కీర్తిస్తూ స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు, స్వాగతసత్కారాలు, పార్టీ హడావుడి చూసిన తరువాత, ఆయనకు మళ్ళీ మంత్రిపదవి కట్టబెట్టే ప్రమాదం ఉన్నదని చాలామందికి తోచింది. అది అప్రదిష్ఠ, అనైతికం అన్న హెచ్చరికలు, హితవులను పక్కనబెట్టి తాను అనుకున్నదే స్టాలిన్ చేశారు. మనీలాండరింగ్ కేసులో పదిహేను నెలలుగా జైల్లో ఉన్న సెంథిల్‌మీద అన్నాడీఎంకె హయాంలో ప్రభుత్వ రవాణాసంస్థలో ఉద్యోగాలు అమ్ముకున్న అభియోగాలున్నాయి. సిట్ దర్యాప్తులో సెంథిల్ కుట్రంతా వెలుగుచూసి న్యాయస్థానాలకు చేరింది. ఫిర్యాదుదారులకు తాను డబ్బులు తిరిగి ఇచ్చేశానని కేసు కొట్టివేయమని సెంథిల్ ఒక దశలో న్యాయస్థానాన్ని అభ్యర్థించాడు. మద్రాస్ హైకోర్టు ఈ జాబ్స్ ఫర్ క్యాష్ కేసు కొట్టివేస్తే, సుప్రీంకోర్టు అడ్డుపడటంవల్లనే నిజానికి వ్యవహారం అరెస్టులవరకూ వచ్చింది. 'రవాణామంత్రి తన శాఖను అమ్మకానికి పెట్టేశాడు. అవినీతి, దోపిడీ, భూకబ్జాలు, అపహరణలతో ఆయన ఎదిగాడు. పదిహేనుసార్లు మంత్రివర్గం మార్పులు జరిగినా ఆ అవినీతి పరుడి స్థానం పదిలం. ఆయన అవినీతిమీద శాసనసభలో నేను స్వయంగా సాక్ష్యాలు సమర్పించినా చర్యలు లేవు' అంటూ జయలలిత ప్రభుత్వంలో సెంథిల్ అవినీతిమీద స్టాలిన్ 2016 ఎన్నికల ప్రచారసభలో తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఒక దశలో జయలలిత కూడా దూరం పెడితే కేవలం రాజకీయార్థిక ప్రయోజనాలకోసం ఆయన డీఎంకెలో చేరాడు.

పదిహేను నెలలుగా ఆయన జైల్లో ఉన్నా సమీపకాలంలో కేసు విచారణకు వస్తుందన్న నమ్మకం లేకపోవడంతో మనీలాండరింగ్ కేసులో సైతం కోర్టు బెయిల్ ఇచ్చింది. తిరిగి మంత్రి కాకూడదన్న ఆంక్షలు విధించకపోవచ్చును కానీ, ఆయన పదవిలో ఉంటే దర్యాప్తు ప్రక్రియకు విఘాతం కలుగుతుందంటూ అప్పట్లో రాజ్‌భవన్ సెంథిల్‌ను సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ప్రకటన ఇప్పుడు చాలామందికి గుర్తుకొస్తున్నది. క్యాష్ ఫర్ జాబ్స్, మనీలాండరింగ్ ఆరోపణలతో పాటు, అంతకుపూర్వంనుంచే ఆయనపై అనేక క్రిమినల్ కేసులున్నాయి. అటువంటి వ్యక్తి ఇప్పుడు ఎటువంటి అభ్యంతరాలు లేకుండా తిరిగి అధికారం స్వీకరించడం ఆశ్చర్యకరమైన విషయం. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు మద్రాస్ హైకోర్టు నియమించే కమిషన్ విచారణ పూర్తయిన తరువాత ఆయనకు మంత్రిపదవి దక్కివుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. క్యాష్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో బాధితులకు అన్యాయం జరిగిందన్న అప్రదిష్ఠ స్టాలిన్‌కు వచ్చేది కాదు.

సహనభావమే సనాతనధర్మం

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల తిరుపతి దేవస్థానంలో కోట్లాది హిందువులు మహా ప్రసాదంగా స్వీకరించే లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని, అందులో ఫారిన్ ఫ్యాట్స్ కలగలిసి ఉన్నట్లు రూఢి అవ్వడంతో యావత్ హిందూ సమాజం దిగ్భ్రాంతికి గురయ్యింది. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం, టీటీడీ దేవస్థానం ఈవో కూడా ధ్రువీకరించడంతో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవి సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డిలు వరుస ప్రెస్‌మీట్లు పెట్టి ఇదంతా చంద్రబాబు చేస్తున్న రాజకీయ కుట్ర అని చెబుతూ, చేసిన తప్పుని కప్పిపుచ్చుకోవడమే కాకుండా ఎదురు దాడికి దిగే ప్రయత్నం చేశారు. జరిగిన తప్పిదాన్ని సరిచేయడానికి, శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, ఇతర నైవేద్యాలు పవిత్రతను పునరుద్ధరింపచేసేందుకు శుద్ధి, శాంతి హోమాలను టీటీడీ నిర్వహించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ అపవిత్రత ఎవరివల్ల, ఎందుకు జరిగిందనే విషయాన్ని విచారించడానికి ఐజి స్థాయి అధికారి నేతృత్వంలో సిట్ ఏర్పాటుకు ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు.



> సనాతన ధర్మాన్ని, హిందూ సాంప్రదాయాలను సెక్యులరిజం పేరుతో కొంతమంది హేళన చేస్తున్నా, జగన్‌రెడ్డి లాంటి వారు విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్నా మౌనంగా ఉండడం హిందువులకే కాదు... సర్వమత సహనాన్ని కాంక్షించే వారికి, మన దేశ ఔన్నత్యాన్ని ముందు తరాలకు అందించాలనుకునే వారికి కూడా భావ్యం కాదు.

శతాబ్దాలుగా శ్రీవారి కొండపై ఎప్పుడూ జరగని అపచారాలు వైసీపీ ప్రభుత్వంలో జరిగాయి. లడ్డూ, అన్న ప్రసాదాల నాణ్యత విషయంలోనూ, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా చేసిన అవినీతి, భక్తుల తలనీలాల లావాదేవీలు, ప్రోటోకాల్ దర్శనాలను విచ్చలవిడిగా వినియోగించుకోవడం... ఇలా అన్ని విధాలుగా టీటీడీని ఒక వ్యాపార కేంద్రంగా చేశారు. ఇవే కాకుండా రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు, రథాల దగ్ధం, హిందూ దేవుళ్లపై చులకన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలందరినీ బాధించాయి. పైగా మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, నటుడు ప్రకాష్‌రాజ్ లాంటి వారు జరుగుతున్న పరిణామాలపై వెటకారంగా మాట్లాడడం, వక్రభాష్యం చెప్పడం హిందూ ధర్మం పాటించే వారి మనసులనూ కలిచి వేసాయి. సనాతన ధర్మాన్ని, హిందూ దేవుళ్లు-దేవతలను, సాంప్రదాయాలను కించపరచడం, చులకనగా మాట్లాడంపై పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీరియస్ అంశాలను, ఎంతోమంది మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాలను మాట్లాడే సమయంలో జాగ్రత్త వహించాలని, అదే విధంగా సనాతన ధర్మానికి భంగం వాటిల్లితే ఖచ్చితంగా మాట్లాడతామని హెచ్చరించారు. సనాతన ధర్మానికి హాని కలిగితే హిందువులందరూ కలిసికట్టుగా మాట్లాడాలని, మౌనం వహించడం మంచిది కాదన్నారు.

మన దేశంలో ఇతర మతాలను విమర్శించాలంటే భయపడేవారు కూడా హిందూ ధర్మాన్ని విమర్శించడాన్ని హీరోయిజంగా భావిస్తున్నారు. లౌకికవాదం పేరుతో కొంత మంది అనాదిగా ఈ వికృత చేష్టలకు పాల్పడుతూనే ఉన్నారు. భావప్రకటనా స్వేచ్ఛ ముసుగులో ఇష్టారీతిన వ్యాఖ్యానించడం, మెజారిటీ ప్రజల మనోభావాలను కించపరచడం... ఎవరైనా ఎదురు తిరిగితే కులాలు, మతాలు, రాజ్యాంగ హక్కుల గోడల వెనుక దాక్కోవడం అలవాటైపోయింది.

వాస్తవానికి హిందూ మత పెద్దలు చెబుతున్న దాని ప్రకారం.. హిందూ ధర్మం, సనాతన ధర్మం వేర్వేరు కాదు. హైందవ ధర్మం, సనాతన ధర్మం కవల పిల్లల వంటివి. అయితే, హైందవ ధర్మం కాలానుగుణంగా మార్పులను స్వీకరిస్తుంది. త్రేతాయుగంలో ఉన్న జీవన విధానాన్ని కలియుగంలో పాటించడానికి కుదరదు. యుగ ధర్మాన్ని బట్టి మారుతూ ఉండేది హైందవ ధర్మం. కానీ, ఈ ధర్మాలకు మూలం సనాతన ధర్మం. ఇది ఎప్పటికీ ఒకేలా ఉంటుంది. కొన్ని తరాలుగా మతం పేరుతో ఎన్ని యుద్ధాలు జరిగినా, హిందూ మతం మానవీయ కోణంలో మారుతూనే ఉంది. వేల ఏళ్ల చరిత్ర కలిగిన మన భారతీయ సమాజం సంప్రదాయం ముసుగులో ఉండే అనేకమైన దురాచారాలను కాలానుగుణంగా తొలగించుకుని, మార్పులు చేసుకుని ముందుకు సాగుతూనే ఉంది.

ఎటువంటి భావజాలాన్నైనా ఇముడ్చుకోగలిగే సంప్రదాయం ఒక్క మన దేశంలోనే ఉంది. దేవుడు లేడని వాదించిన చార్వాకుడిని కూడా మన హైందవ సంస్కృతిలో భాగస్వామిని చేసాం. ఋషిగా పూజించాం. ఇది ప్రపంచంలో ఏ మతంలోనూ సాధ్యం కాదు. అనేక రకాలైన మతాలను, భావాలను, సంస్కృతులను ఏ రకమైన ఇబ్బంది లేకుండా ఇముడ్చుకోగలిగింది మన దేశం. హైందవులు అయినా కూడా అయ్యప్ప స్వామి సన్నిధికి చేరడానికి ముందే వావర్ మసీదును దర్శించుకోవడం, దర్గాలను దర్శించుకోవడం, క్రిస్మస్ రోజున సంబరాలు చేసుకోవడం ప్రపంచంలో ఎక్కడైనా సాధ్యమా? వేల సంవత్సరాలుగా సహజీవనం అలవాటైన మన దేశంలో మాత్రమే ఇది సాధ్యం. అదేవిధంగా మతానికతీతమైన ధార్మిక చింతన ఈ దేశంలో ఉంది. కొన్ని అఘాయిత్యాలు ఇంకా జరుగుతున్నా మన దేశంలో శాంతిభద్రతలు ఉన్నాయంటే ఇక్కడ ఉన్న కోర్టులు, చట్టాల వల్ల కాదు... అది కేవలం మన సంప్రదాయంలో ఉన్న కుటుంబ వ్యవస్థ, కట్టుబాట్ల వల్లనే. ప్రపంచ తత్వవేత్త, పురావస్తు శాస్త్రవేత్త, జర్మన్ సైంటిస్ట్ 'ఆర్నాల్డ్ టాన్బీ' పరిశోధన ప్రకారం ప్రపంచంలోని 28 ప్రాచీన సంస్కృతులు గల దేశాలలో నేటికీ సజీవ సంస్కృతి ఉన్న దేశం భారతదేశం మాత్రమే. శకులు, తురుష్కులు, మొఘలులు, సుల్తానులు, నవాబులు, షేక్‌లు, పఠాన్‌లు, పోర్చుగీస్, ఫ్రెంచ్, డచ్, బ్రిటీష్ వాళ్లు.. ఇలా ఒకరి తర్వాత ఒకరు ఎన్ని దాడులు చేసినా మన సంస్కృతి, సంప్రదాయాలకు కించిత్ కూడా విఘాతం కలిగించలేకపోయారు. ఇది కేవలం పర మత సహనాన్ని ప్రబోధించే సనాతన ధర్మం గొప్పతనం. సనాతన ధర్మం అంటే.. ఎప్పటికీ మారని, నిత్యమైన జీవన విధానం అని అర్థం. వేదాలు ఎంత ప్రాచీనమైనవో సనాతన ధర్మం అంత ప్రాచీనమైనది.

అటువంటి సనాతన ధర్మాన్ని, హిందూ సాంప్రదాయాలను సెక్యులరిజం పేరుతో కొంతమంది హేళన చేస్తున్నా, జగన్‌రెడ్డి లాంటి పాలకులు విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్నా మౌనంగా ఉండడం హిందువులకే కాదు.. సర్వమత సహనాన్ని కాంక్షించే వారికి, మన దేశ ఔన్నత్యాన్ని ముందు తరాలకు అందించాలనుకునే వారికి కూడా భావ్యం కాదు. మన దేశ భవిష్యత్తుకి కూడా క్షేమకరం కాదు.

• **కూసంపూడి శ్రీనివాస్**
జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి


కులానికి కూడా పెట్టుబడి కావాలా?

ఎవరికీలేని ఘన చరిత్ర మనకుంది! వేద కాలంనాటి గాయత్రి మంత్రాన్ని ఇప్పటికీ ఉచ్చరిస్తూనే ఉన్నాం. రెండువేల ఏళ్లనాటి మహాకావ్యాలు, పురాణాల విశేషాలను ఇంకా వింటూనే ఉన్నాం. శతాబ్దాల కిందటే జనభాషగా సంస్కృతం అంతరించినా దాని పదాలను ఇంకా వాడుకుంటూనే ఉన్నాం. ఎప్పుడో పుట్టిన జ్యోతిష్య శాస్త్రాన్ని ఇంకా నమ్ముతూనే ఉన్నాం. జాతక చక్రాన్ని బట్టి జీవిత ఎత్తుపల్లాలపై లెక్కలు వేసుకుంటూనే ఉన్నాం. కాల క్రమంలో మార్పులకు లోనైనా కులం నిర్దేశించే పద్ధతుల కింద ఇంకా జీవిస్తూనే ఉన్నాం.

గతాన్ని ఇంత గట్టిగా పాటించే మనం కళ్లముందు జరిగిన ఒకనాటి పరిణామాలను అక్షరబద్ధం చేయటంలో చాలా వెనుకబడి ఉండటమే విచిత్రం! రాజుల చరిత్రా మనకు క్రమబద్ధంగా లభించదు. ఏ గ్రంథం ఎప్పటిదో, దాన్ని రాసింది ఎవరో చెప్పలేని పరిస్థితి ఇంకా ఉంది. ఒకరి పేరుతో ఉన్న గ్రంథం పలువురు రాయటం మనకు సహజం! వారెవరో తెల్సుకోలేని అశక్తతా అంతకంటే నిజం! పరమ పవిత్రం అనుకున్న గ్రంథాల్లో మార్పులూ చేర్పులూ జరిగాయి. ప్రక్షిప్తాల్లేని ప్రాచీన సాహిత్యం ఇదీ అని నిర్దిష్టంగా చెప్పలేం. వీటన్నిటికీ కాలనిర్ణయం చేయటం ఇప్పటికీ కత్తిమీద సామే! అందుకే మన చరిత్రలో పలు సంఘటనలను ఊహలకు పదునుపెట్టి అర్థం చేసుకోవటం చాలా ఎక్కువ. కాలంలో వెనక్కి వెళ్లిన కొద్దీ ఈ అవసరం బాగా పెరుగుతుంది. ముందుకొచ్చిన కొద్దీ పరిస్థితి కొంత తేటపడుతుంది. అందుకే రెండుమూడు వందలేళ్లనాటి పరిణామాలను అర్థం చేసుకోవటంలో సాపేక్షికంగా ఇబ్బందులు తక్కువ.

కులాలు ఎప్పటి నుంచో ఉన్నా వాటి ఘనతల గురించి చరిత్రలు రాయటం గడిచిన వందేళ్లలోనే ఎక్కువ. కులవృత్తాంతాలు, కులదీపికలు అలానే పుట్టుకొచ్చాయి. అవెంత పాక్షిక దృష్టితో రాసినా వాటి ద్వారానూ కొన్ని పరిణామాలు తెలుస్తాయి. అన్ని భాషల్లోనూ అవి ఉన్నా మహారాష్ట్రలో వాటి సంఖ్య కాస్త ఎక్కువ. వాటిని నిశితంగా పరిశీలించి కులాల్లో వస్తున్న మార్పులను వివరించే అధ్యయనాలూ వచ్చాయి. మహారాష్ట్రలో చిత్పావన్ బ్రాహ్మణుల గురించి.. చరిత్రకారులు మొరీస్ ఎల్.పి. పాటర్‌సన్, రవీందర్ కుమార్ చేసిన అధ్యయనాలు పలు ఆసక్తికరమైన విషయాలను వెలుగులోకి తెచ్చాయి.

కులాలకు రిజర్వేషన్లు, అధికారంలో సముచిత వాటాలుండాలనే వాదనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. కులపక్షపాతం అన్నిస్థాయిల్లో వేళ్లూనుకుందని భావించటమూ మనకు కొత్తకాదు. ఆధునిక చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత కూడా ఆ భావన బలహీనపడకుండా ఉండటానికి గట్టి కారణాలే ఉన్నాయి. రాజకీయ అధికారాన్ని చెలాయించే కులాలు చూపించిన పక్షపాతాన్ని చాలా మంది కళ్లారా చూశారు. ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లకు ఛైర్మన్లుగా ఉన్నవారు బంధుగణాలకు వీలున్న చోట్ల ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలూ అదే చేశారు. అలా చేయటం.. సమన్యాయపాలనకు విరుద్ధమని వారికి తెలియదనలేం. కులప్రీతి దృష్ట్యా అది తప్పుకాదనే ధోరణి చాలామంది అంతరాంతాలల్లో నాటుకుపోయింది. కులవ్యవస్థ ఏర్పరిచిన మనస్తత్వ పరిధులను దాటలేని నాయకులే మనకు ఎక్కువ. ఇక ఎన్నికల ప్రజాస్వామ్యం వచ్చిన తర్వాత ఓట్ల కోసం సొంతకులాన్ని బుజ్జగించటం అనివార్యంగా మారిపోయింది. ప్రజాస్వామ్యం కులదృష్టిని పెంచింది. కులాల ఆధారంగా పార్టీ టిక్కెట్లు ఇవ్వటం, తాయిలాలను ప్రకటించటం, కులసంఘాలకు స్థలాలు కేటాయించటం, భవనాలు నిర్మించటం, కార్పొరేషన్ల ఏర్పాటు లాంటివి చూస్తే ప్రజాస్వామ్యం-కులం ఒకదానితో ఒకటి పెనవేసుకుని నడుస్తున్నట్లు స్పష్టంగా కనపడుతుంది.



> చిత్పావనుల చరిత్ర చెప్పేదొకటే! రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాన్ని చవిచూసిన కులాలు ప్రభుత్వ దన్ను లేకుండా కూడా పోటీ పరిస్థితుల్లో నెగ్గుకు రాగలవు. దశాబ్దాల పాలనానుభవం, ఆర్జించిన విద్య, ఇతర సౌకర్యాలు అనేక మెలకువులతో కూడిన ప్రతిభను, చొరవను చిత్పావనులకు సంపాదించి పెట్టాయి. వీటినే సాంస్కృతిక పెట్టుబడిగా వర్ణించొచ్చు. ఇతర అగ్రకులాలకూ ఇది ఎంతో కొంత స్థాయిలో లభిస్తోంది. పోటీ ప్రపంచంలో అదే వారికి కలిసివస్తోంది!

చిత్పావన బ్రాహ్మణుల ఎదుగుదల చూస్తే రాజకీయాలకు కులాలకు ఉన్న సంబంధం స్పష్టంగా తెలుస్తుంది. ఛత్రపతి శివాజీ పాలనను స్వర్ణయుగంగా భావించటం ఇటీవల బాగా పెరిగింది. అందుల్లో సత్యాసత్యాలను అలా ఉంచి ఒక విషయాన్ని స్పష్టంగా చూడాలి. శివాజీ వారసుల పాలన ఎంతో కాలం కొనసాగలేదు. పీష్వాలే (ప్రధానమంత్రులు) అధికారాన్ని గుప్పిటపట్టారు. ఛత్రపతి వారసులందరూ వారికి కీలుబొమ్మలుగా మారారు. శివాజీ మనుమడు సాహు 1713లో చిత్పావనుడైన బాలాజీ విశ్వనాథ్ భట్‌ను పీష్వాగా నియమించారు. వెంటనే సొంత కులం వారికి కీలక ఉద్యోగాలను కట్టబెట్టే పనిని బాలాజీ మొదలుపెట్టారు. ఆ తర్వాతి పీష్వాలు అదే పనిని ఇంకా గట్టిగా చేశారు. గ్రామస్థాయి నుంచి పీష్వా కార్యాలయం వరకూ అనేక పదవులు చిత్పావనులకు లభించాయి. శిస్తుభారం లేకుండా భూములనూ భారీగా కట్టపెట్టారు. సుంకాల మినహాయింపునూ ఇచ్చారు. చిత్పావనులు అంతకు ముందు రత్నగిరి ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉండేవారు. వ్యవసాయాన్నే ప్రధానంగా చేసుకునేవారు. మతపరమైన కార్యక్రమాలతోనూ కొందరు పొట్టపోసుకునేవారు. రాజకీయ ప్రాపకంతో వారి జాతకమే మారిపోయింది. 1818లో బ్రిటిషు సైన్యం చేతిలో పీష్వా ఓడిపోయే వరకూ వారి ప్రాభవానికి తిరుగులేకుండా పోయింది. పీష్వాల పాలన సాగిన ప్రాంతమంతా చిత్పావనులు విస్తరించారు. నిజానికి చిత్పావనులు స్థానికులు కారు. బయటి నుంచి వచ్చి రత్నగిరి పరిసరాల్లో స్థిరపడ్డారు. 1707 వరకు వీరి గురించి తెలిసింది చాలా తక్కువ. చిత్పావనులు తమ మూలం గురించి చిత్రమైన కథ చెప్పుకొంటారు. పరశురాముడు క్షత్రియులందరినీ వధించిన తర్వాత ప్రక్షాళనకు ఉపక్రమిస్తే స్థానిక బ్రాహ్మణులు సహాయ నిరాకరణ చేస్తారు. ఆ సమయంలోనే సముద్ర తీరం వెంబడి 14 శవాలు కొట్టుకువస్తాయి. వాటికి పరశురాముడు దహన సంస్కారాలు చేసిన అనంతరం చితి మీదుగా మళ్లీ ప్రాణం పోస్తాడు. అట్లా చితి నుంచి పావనమై ప్రాణం పొందారు కాబట్టి చిత్పావనులు అయ్యామని చెప్పుకొంటారు. ఈ మొత్తం కథను చారిత్రక దృష్టితో పరిశీలిస్తే చిత్పావనులు సముద్ర ప్రయాణం చేసి మహారాష్ట్ర తీరానికి చేరారనే తెలుస్తుంది.

రాజకీయ అధికారంతో ఉన్నతస్థానాలకు ఎగబాకిన చిత్పావనులకు.. పీష్వా అధికారాన్ని (1818 తర్వాత) కోల్పోయిన తర్వాత ఏం జరిగింది? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. పాలకులు మారటంతో తాత్కాలికంగా ఒడిదొడుకులు వచ్చాయి. కానీ వందేళ్ల అధికారంలో రాటుతేలటంతో కొత్తపాలనలో తేలికగానే కుదురుకున్నారు. బ్రిటిష్ పాలకులు స్థాపించిన విద్యాసంస్థల్లో చేరారు. వాటిల్లో రాణించారు. తిరిగి వలసపాలనలోనూ కీలకపాత్ర పోషించారు. ఆధునిక వృత్తుల్లో ప్రవేశించారు. వీళ్లనే రవీందర్ కుమార్ కొత్త బ్రాహ్మణులుగా వర్ణించారు. దీనికి భిన్నంగా పాత సంప్రదాయాలను పట్టుకుని వేళ్లాడే సనాతన వర్గం ప్రతిచోటా ఎంతోకొంత ఉంటుంది. ఈ వర్గం చిత్పావనుల నుంచి మొదట్లో ప్రతిఘటన వచ్చింది. బ్రిటిషు పాలకులు బ్రాహ్మణులకు దక్షిణలు ఇవ్వటాన్ని ఆపేసినప్పుడు చాలా ఆందోళన చేశారు. పాలకుల నుంచి దక్షిణలు పొందటం తమ హక్కుగా వాదించారు. సమాజానికి తాము ధర్మ చింతను బోధిస్తూ సామాజిక వ్యవస్థను సమన్వయంతో నడిపిస్తున్నామనీ దక్షిణలు ఆపి దాన్ని దెబ్బతీస్తే రాజకీయ అస్థిరత వస్తుందనీ హెచ్చరించారు. పుణేలో ఆనాడు బ్రాహ్మణ కులాల పంచాయతీలు చాలా బలంగా ఉండేవి. ఆ పంచాయతీల తీర్మానాల ద్వారా కులస్థులను క్రమశిక్షణలో ఉంచేవారు. ఇతర కులాల వివాదాలపై కూడా బ్రాహ్మణ పంచాయతీలు తీర్మానాలు చేసేవి.



■ **రాహుల్ కుమార్**

కాలం గడిచిన కొద్దీ ఆధునిక భావాల ప్రభావంతో కొత్త బ్రాహ్మణుల నుంచి సామాజిక సంస్కరణలు కావాలనే గొంతుకలు బలంగా విన్పించాయి. రెనడే, గోఖలే, ధొండో కేశవ్ కర్వేలు సామాజిక సంస్కరణలకు ప్రతినిధులుగా నిలిచి మధ్యతరగతిని బాగా ప్రభావితం చేశారు. సంస్కరణ జోలికి వెళ్లకుండా రాజకీయ అధికారం దక్కించుకోవాలనుకునే వారికి ప్రతీకగా బాల్‌గంగాధర్ తిలక్ నిలిచారు. ఈ రెండు రకాల రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన వారందరూ చిత్పావనులే. అలాగే హిందుత్వవాదాన్ని తెరపైకి తెచ్చిన వినాయక్ దామోదర్ సావర్కర్, ఆ వాదంతో ప్రేరణపొంది మహాత్మా గాంధీని కాల్చి చంపిన గొడ్సే కూడా చిత్పావనులే. భూదానోద్యమ నేత వినోబాభావే, ప్రముఖ నిఘంటుకారుడు వీ.ఎస్.ఆప్టే, ధర్మశాస్త్రాల చరిత్రను రాసిన పీ.వీ. కాణె, ప్రముఖ అంత్రపాలజిస్టు ఇరావతి కర్వే.. ఇలా చెప్పుకొంటూ పోతే చిత్పావనుల జాబితా పెద్దదిగానే ఉంటుంది. అమెరికాలో వైద్యశాస్త్రం చదివిన తొలి భారతీయ మహిళ ఆనందీ బాయ్ కూడా చిత్పావన కులం నుంచే వచ్చారు.

చిత్పావనులతో పాటు మొత్తంగా బ్రాహ్మణులు అనేక రంగాల్లో చొచ్చుకుపోయారు. ముఖ్యంగా విద్యా, ఉద్యోగాల్లో వీరి ఆధిపత్యాన్ని ప్రశ్నించటం 1850ల నాటికే మొదలైంది. ఇందులో జ్యోతిరావు పూలె ముందుండటమే గాక బ్రాహ్మణ వ్యతిరేకతకు సిద్ధాంతాన్ని కూడా ప్రచారంలోకి తెచ్చారు. బ్రాహ్మణులందరూ బయటి నుంచి వచ్చినవారేనన్న వాదన లేవదీశారు. విద్యారంగంపై బ్రాహ్మణ ఆధిపత్యం ఆనాడు ఎలా ఉండేదో వివరించటానికి రవీందర్ కుమార్ 1884లో బాంబే రాష్ట్రంలోని ఆరు కాలేజీల్లో విద్యార్థుల వివరాలను ఇచ్చారు. బ్రాహ్మణులు 241, కాయస్థ ప్రభువులు 29, క్షత్రియులు 13, వ్యాపారకులాలు 51 చొప్పున కళాశాలల్లో సీట్లు పొందారు. ఇతర అగ్రకులాలు ఏవీ బ్రాహ్మణులకు దరిదాపుల్లో లేరు. చిత్పావనులు ప్రచురించిన 34 కుల వృత్తాంతాలను పరిశీలించి మొరీస్ ఉద్యోగాలు, వృత్తుల గురించి ఆసక్తికరమైన సమాచారాన్ని ఇచ్చారు. 1960 నాటికి 2 లక్షల చిత్పావన బ్రాహ్మణులు ఉన్నారు. అందులో 34,000 మంది పురుష ఉద్యోగుల, వృత్తి వివరాలు కుల వృత్తాంతాల్లో లభ్యమైంది. 35 శాతం మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నారు. ఏ కోణం నుంచి చూసినా ఈ శాతం చాలా ఎక్కువ! ప్రైవేటురంగ ఉద్యోగాల్లో 20.5 శాతం, వ్యాపారాల్లో 21.9 శాతం, వ్యవసాయంలో 16 శాతం, సంప్రదాయ మతపరమైన వృత్తిలో 5.5 శాతం మంది ఉన్నారు. ఇక 1.1 శాతం మంది గురించి సమాచారం దొరకలేదు.

చిత్పావనుల చరిత్ర చెప్పేదొకటే! రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాన్ని చవిచూసిన కులాలు ప్రభుత్వ దన్ను లేకుండా కూడా పోటీ పరిస్థితుల్లో కూడా నెగ్గుకురాగలవు. దశాబ్దాల పాలనానుభవం, ఆర్జించిన విద్య, ఇతర సౌకర్యాలు అనేక మెలకువులతో కూడిన ప్రతిభను, చొరవను చిత్పావనులకు సంపాదించి పెట్టాయి. వీటినే సాంస్కృతిక పెట్టుబడిగా వర్ణించొచ్చు. ఇతర అగ్రకులాలకూ ఇది ఎంతో కొంత స్థాయిలో లభిస్తోంది. పోటీ ప్రపంచంలో అదే వారికి కలిసివస్తోంది!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

ప్రైవేటీకరణ దిశగా భారత రైల్వేలు!

భారతదేశంలో కరోనా వైరస్ వ్యాప్తి నుంచి కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైల్వే సామాన్యుడికి దూరమవుతూ వస్తోంది. ఓ పథకం ప్రకారం రైల్వేను ప్రైవేటుపరం చేయడానికి కేంద్రం అనుసరిస్తున్న విధానాలతో సామాన్య ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. నిత్యం దేశ వ్యాప్తంగా కోట్లాది ప్రయాణికులు రైళ్ల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి పరిస్థితి దయనీయంగా ఉంది. రెండో అతిపెద్ద రవాణా వ్యవస్థగా ఉన్న రైల్వేలు ప్రజలకు అందిస్తున్న సేవలు అంతంత మాత్రమే. లాభార్జన కోసం జనరల్ బోగీలను కుదిస్తున్నారు, స్లీపర్ స్థానంలో ఏసీ బోగీలను పెంచుతున్నారు.

విశాఖ, గోదావరి, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌ల తరహాలో ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్ క్లాస్ బోగీలకు కోత పడుతోంది. ఫలితంగా సీటు లేదా బెర్త్ రిజర్వేషన్ దొరక్క ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సెలవులు, పండుగల సందర్భాల్లో రిజర్వేషన్ టికెట్లు దొరకట్లేదు. ఫలితంగా జనరల్ టికెట్ తీసుకుని ప్రయాణించే వారు నిల్చోవడానికి కూడా ఖాళీ దొరక్క స్లీపర్ క్లాసు బోగీల్లో ఎక్కేస్తున్నారు. ఇది రిజర్వేషన్ ఉన్న ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతోంది. జనరల్ బోగీలతో సమానంగా ఇప్పుడు రిజర్వుడు స్లీపర్ క్లాస్ బోగీలు కిక్కిరిసిపోతున్నాయి. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. వేసవిలో దూర ప్రయాణాలకు వెళ్లేవారి సమస్య ఇంకా తీవ్రంగా ఉంది.

రైళ్లలో అధికభాగం పేద, మధ్య తరగతి వర్గాలే ప్రయాణిస్తుంటారు. కానీ, ధనిక వర్గాలకే ప్రాధాన్యమిచ్చేలా ఏసీ బోగీలను పెంచడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రైల్వే మంత్రిత్వ శాఖ సామాన్య ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాధారణ, స్లీపర్ క్లాస్ బోగీలను పెంచాలి. రైల్వేలను అభివృద్ధి చేస్తున్నామనే నెపంతో సామాన్యులు అధికంగా ఆధారపడే పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను కుదిస్తూ, వాటి స్థానంలో వందేభారత్ రైళ్లను ప్రారంభిస్తున్నారు. ట్రాక్ సామర్థ్యం సరిగా లేకున్నా, ఎలాగైనా వందేభారత్ రైళ్లను నడిపి రైల్వేలను అభివృద్ధిపథంలో నడిపిస్తున్నామనే సంకేతాన్ని ప్రజల్లో కలిగించాలనే భావనతో వివిధ రకాల ట్రాక్ ఇంటర్ లాకింగ్, అభివృద్ధి పనులు చేస్తున్నామంటూ సాధారణ రైళ్లను తరుచూ రద్దు చేస్తూ ప్రయాణికులకు తీవ్ర వేదన కలిగిస్తున్నారు.

దీనికితోడు రైలు ప్రమాదాలు సగటు ప్రయాణికుడి భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఒక వైపు అధిక ధరలు, నిరుద్యోగం, పేదరికంతో నెట్టుకొస్తున్న సగటు జీవిపై రైల్వేల రూపంలో ఇంకొంత భారం మోపుతున్నారు. ఇప్పటికే దశలవారీగా సీనియర్ సిటిజెన్, జర్నలిస్ట్ టికెట్ రాయితీలను ఎత్తివేసిన కేంద్రప్రభుత్వం, మరికొద్ది రోజుల్లో రైల్వేలను పూర్తిస్థాయిలో ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెట్టినా ఆశ్చర్యపోనవసరం లేదు.

– అప్పన్న గొనప, విశాఖపట్నం

మనం మరచిందే ముర్ము చెప్పారు!

కలకత్తా వైద్య విద్యార్థిని హత్యాచార ఘాతుకంపై దేశమంతా అట్టుడికిపోయిన తర్వాత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన సందేశం అరుదైనది. పిటిఐ (ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా)కు రాసిన ఒక వ్యాసంలో ఆమె చేసిన వ్యాఖ్యలు కొందరినైనా ఆలోచింపచేసి ఉండాలి.


అత్యాచార, హత్యాచారాలు నిరంతరాయంగా జరిగిపోతున్నాయని దేశ రాజ్యాంగ అధినేతగా ఆమె అంగీకరించారు. ఇటువంటివి తరచూ జరుగుతున్నా పట్టించుకోని మొద్దుబారినతనం మనల్ని ఆవహించిందని ఓ కమ్చీ దెబ్బ వేశారు. దీనిని వదిలించుకోవాలన్నారు. ఆడవారిపై అత్యాచార పర్వాన్ని నిరోధించడానికి చిత్తశుద్ధితో కూడిన కృషి జరగాలన్నారు. ఏదో ఒక ఘటనపై దేశమంతా గగ్గోలు పెట్టడం, తర్వాత నిద్రపోవడం జరుగుతున్నదనీ నిర్భయ దారుణ ఘటన తర్వాత లెక్కలేనన్ని హత్యాచారాలు చోటు చేసుకున్నాయని అన్నారు. మహిళను తక్కువ స్థాయి మనిషిగా; శక్తి సామర్థ్యాలు లేని జాతికి చెందిన వ్యక్తిగా; బుద్ధి హీనురాలుగా చూసే దుర్మార్గ మనస్తత్వం రాజ్యం చేస్తున్నదనీ ఎత్తి చూపారు. ఇది ఒక స్త్రీగా భారతీయ సమాజంపై ఆమె హృదయావేదనతో చేసిన వ్యాఖ్య.

ఇటువంటి దారుణాలు జరిగినప్పుడెల్లా మరింత తీవ్రమైన శిక్షల గురించి, అందుకు అవసరమైన చట్టాల గురించి రాజకీయ పదవుల్లోనివారు, అధికారులు వల్లిస్తుంటారు. ఇటువంటి నేరాలకు విధిగా ఉరిశిక్ష పడేలా కేంద్రం చట్టం తేవాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సూచించారు. ఆమె తన వంతుగా తన రాష్ట్రంలో ఉరి శిక్ష చట్టాన్ని తీసుకువచ్చారు. ఢిల్లీ వీధుల్లో పరిగెడుతున్న బస్సులో చెప్పడానికి సిగ్గుపడాల్సిన భయంకర అమానుష అత్యాచారానికి గురై ఆసుపత్రిలో మరణించిన నిర్భయ కూడా తన చివరి ఆకాంక్షలో ఆ దుండగులను ఉరి తీయాలని, సజీవ దహనం చేయాలని కోరినట్టు వార్తలు వచ్చాయి. నిర్భయ హత్యాచారంలో పాల్గొన్న వారిలో 18 ఏళ్ల లోపు బాలుడు ఉన్నందున బాల నేరస్థుల చట్టాన్ని కూడా బీజేపీ పాలకులు సవరించారు. 16-18 మధ్య బాలురు ఇటువంటి అమానుషాల్లో పాల్గొంటే వారిని పెద్దవారుగానే పరిగణించి శిక్ష విధించాలని బీజేపీ పాలకులు చట్ట సవరణ చేశారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వారించినా పాలకులు వినలేదు. నిర్భయ దారుణోదంతం 2012లో జరిగింది. అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం ఉంది. ఆ తర్వాత వచ్చిన బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ఈ చట్టాలను తెచ్చింది. మహిళపై జరిగే పలు రకాల నేరాలకు శిక్షలను పెంచింది. 2012లో దేశంలో 24,923 అత్యాచార ఘటనలు సంభవించాయి. నిర్భయ ఉదంతం అందులో ఒకటి. అంటే ఆ ఏడాది రోజుకి 68.28 ఉదంతాలు చోటు చేసుకున్నాయి. ఆ తర్వాత ప్రతి సంవత్సరం అదనంగా 24 ఘటనలు (అంటే రోజుకి 90) సంభవించాయని జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

రాజ్యాంగం 14 ఆర్టికల్ మహిళలకు పురుషులతో సర్వ సమానత్వ హక్కును కల్పించింది. రాజ్యం లేదా ప్రభుత్వం స్త్రీని ఏ విధంగానూ తక్కువగా చూడరాదని ఆర్టికల్ 15(1) నిర్దేశిస్తున్నది. ఆర్టికల్ 16 ఆమెకు సమానావకాశాలు కల్పిస్తున్నది. సమాన పనికి పురుషునితో సమాన వేతనాన్ని ఆర్టికల్స్ 39(డి), ఆర్టికల్ 42 హామీ ఇస్తున్నాయి. అయితే కోర్టులకు ఎక్కితే గాని ఇవి ఆమెకు అందుబాటులోకి రావడం లేదు. మగవారు వీధి కుక్కల్లా సందుల్లో గొందుల్లో సైతం మాటువేసి చిన్నారుల నుంచి పెద్దవారి వరకు మహిళలపై లైంగిక దాడులకు తెగబడుతున్నారు. చట్టమంటే భయం ఏ కోశానా కనిపించడం లేదు. సంతానోత్పత్తికి స్త్రీ పురుషుల మధ్య ప్రకృతి ఏర్పరచిన ఆకర్షణను హేళన చేస్తూ ఆమె స్వేచ్ఛను, స్వయం నిర్ణయాధికారాన్ని కాలరాస్తున్న మగ జాతిని ఏమనాలి? సంసారానికి, వంశ వృద్ధికి ఆమె కావాలి, మనిషిగా మగవాడితో సమానంగా తల ఎత్తుకునే హక్కును ఆమె అనుభవించకూడదు. తమకు భోగవస్తువుగా ఉపయోగపడాలి. ఒంటరిగా ప్రయాణం చేయకూడదు. ఒళ్ళు కనిపించకుండా కప్పుకోవాలి. సంప్రదాయం, సనాతనం పేరిట సగాన్ని చచ్చుబరుస్తూ ఇటువంటి దుర్నీతిని పాటించే సమాజానికి మంచి మనుగడ ఉంటాయా? ఈ అభిప్రాయాన్నే ద్రౌపది ముర్ము పరోక్షంగా ప్రకటించారు.

'మీ టూ'ల్లోను, మలయాళ చలన చిత్ర రంగంలో మహిళా కళాకారులపై లైంగిక వేధింపులను బయటపెట్టిన హేమ కమిటీ ఉదంతాల్లోను, మిగతా దాదాపు అన్ని భాషల సినిమా రంగాల్లోను మగాహంకారాల్లో మహిళ దుస్థితి తెలుస్తూనే ఉన్నది. విషాదమేమిటంటే స్త్రీ పురుషులు ప్రధానంగా శారీరక శ్రమ చేసి బతికే కార్మిక వర్గంలో లేని అసమానత వారు మధ్యతరగతికి చేరుకునే క్రమంలో వచ్చి చేరుతున్నది. మహిళకు పురుష బానిసత్వం, దాన్ని బలపూరితం చేసే పూజలు, వ్రతాలూ వంటివి బిగుసుకుంటున్నాయి. మొన్న జూన్‌లో విడుదలైన ప్రపంచ లింగ వివక్ష సూచీలో 146 దేశాల్లో భారతదేశం ర్యాంకు 129 వద్ద మరి రెండు స్థాయిలు పడిపోయింది. కేవలం చట్టాల వల్ల నయమయ్యే రోగం కాదిది. ఈ విషయం తెలిసి కూడా ప్రభుత్వాలు చట్టాలు చేసి చేతులు దులుపుకుంటున్నాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రోగ మూలాన్ని పట్టుకున్నారు. మహిళను రెండో తరగతి పౌరురాలిగా, మగవాడి అడుగులకు మడుగులొత్తే జాతిగా చూడడం పట్ల నిరసన ప్రకటించారు. ఇప్పుడు చికిత్స జరగాల్సింది అక్కడే. అది అనుకున్నంత సులభం కాదు, మొత్తం సమాజం గట్టి సంకల్పం వహించాలి, అవరోధాలుగా ఉన్న అంశాలను నిర్మొహమాటంగా, నిష్పక్షపాతంగా గుర్తించాలి.

> రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రోగ మూలాన్ని పట్టుకున్నారు. మహిళను రెండో తరగతి పౌరురాలిగా, మగవాడి అడుగులకు మడుగులొత్తే జాతిగా చూడడం పట్ల నిరసన ప్రకటించారు. ఇప్పుడు చికిత్స జరగాల్సింది సరిగ్గా అక్కడే.



భారత రాజ్యాంగం నిర్దేశించిన సర్వ సమానత్వం అన్ని రంగాల్లోనూ మహిళకు ఆచరణలో లభించేలా చూడాలి. కుటుంబ జీవనంలో నాలుగు గోడల మధ్య కూడా ఇది అమలుకు నోచుకునేలా చూడాలి. ఇందుకు అనువుగా ఆమె పాతివ్రత్య బంధనాలను సడలింపజేయాలి. తదనుగుణంగా క్షేత్ర స్థాయిలో సాంస్కృతిక ప్రచారం లోతుగా, విస్తృతంగా జరగాలి. మగాధిపత్యాన్ని పెంచి పోషించే ధోరణులకు స్వస్తి పలకాలి. ప్రగతిశీల రాజ్యాంగపాలిత దేశంలో పురుష సింహాలు, అబలలు అనే పదాలకు రవ్వంతైనా చోటు లేదని చాటాలి. పురుషుడి దయాదాక్షిణ్యాలపై బతికే దుస్థితి స్త్రీకి తొలగాలి. అంటే మహిళ తరతరాలుగా అనుభవించిన పురుష దాస్యం నుంచి మానసికంగా బయటపడి పరిపూర్ణమైన ఆర్థిక స్వాతంత్ర్యం అనుభవించే స్థితిని సాధించాలి. కుటుంబ పరిధిలోనూ స్త్రీ పురుషుల మధ్య సమానమైన శ్రమ విభజన ఆచరణలోకి రావాలి. ఖాప్ పంచాయితీలకు బదులు గ్రామ స్థాయి నుంచి రాజ్యాంగ సామాజిక పంచాయితీలను నెలకొల్పి వాటికి చట్టబద్ధ అధికారాలు ఇవ్వాలి. ఇప్పటికే సుప్రీంకోర్టు దృష్టిలో ఉన్న వైవాహిక అత్యాచారం, దాంపత్య అత్యాచారంపై విస్తృత చర్చ జరగాలి. అందులోని సున్నితమైన చేదు వాస్తవాన్ని భారతీయ సమాజం గుర్తించి, విరుగుడును కనుక్కోవాలి. స్త్రీ పురుషుడి సొంత ఆస్తి, భార్య అతడి సొత్తు అనే భావన పూర్తిగా తొలగాలి. స్త్రీ ఆర్థిక బానిసత్వ నిర్మూలనకు నడుం బిగించాలి. దేశంలోని శ్రమశక్తిలో మహిళ వాటా గణనీయంగా పెరగాలి. 2022-23లో దేశంలోని శ్రమశక్తిలో (కార్మికులు, ఉద్యోగులు) మహిళలు 35.9శాతం కాగా పురుషులు 76 శాతం. స్త్రీని పూజగదిలో పెట్టి పూజిస్తున్న భారతీయ సమాజం వాస్తవంలో మాత్రం ఆమెను పురుషుడికి కట్టుబానిసను చేసిందన్న ఘనమైన నిజం ఇందులో వెల్లడి అవుతున్నది. రాష్ట్రపతి ముర్ము స్త్రీ ద్వితీయ శ్రేణి దుస్థితి గురించి చెప్పిన చేదు వాస్తవం ఇదే! ఈ దేశ సనాతన పెద్దలు, ఆధునిక మేధావులు, పాలకులు అంతా కలిసి తలలు ఒక్క చోట చేర్చి రాపాడించవలసిన తరుణం ఇదే.

■ **గార శ్రీరామమూర్తి**
సీనియర్ జర్నలిస్ట్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
మంగళవారం 1 అక్టోబరు 2024

సిటీలో సుందరం



'సత్యం సుందరం' సినిమా వి జయోత్సవంలో భాగంగా హీరో కార్తీ సోమవారం నగరంలో సందడి చేశారు. దుర్గమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.




కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న సీపీఎం నేతలు

కలెక్టరేట్ కిటకిట

వందలాది మంది రాకతో కిక్కిరిసిన ప్రాంగణం



- తాము కూడా వరద బాధితులంటూ అర్జీలు
- సాయం చేసి ఆదుకోవాలని వేడుకోలు
- ప్రత్యేక కౌంటర్లు పెట్టి దరఖాస్తుల స్వీకరణ

రెండు, మూడు రోజుల్లో పరిశీలించి అర్హుల ఎంపిక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'మాకూ సాయం చేయండి..' అంటూ నగరంలోని పేదలు కలెక్టరేట్‌కు వరదలా తరలివస్తున్నారు. నగరం నలుమూలల నుంచి వస్తున్న బాధితులతో సోమవారం కలెక్టరేట్ కిటకిటలాడింది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వందలాది సంఖ్యలో కలెక్టరేట్‌కు క్యూ కట్టారు. వరద బాధితులకు సహాయం అందించటానికి చివరి రోజు కావటంతో తమకు కూడా సహాయం అందుతుందన్న ఆశతో వీరంతా వచ్చారు. వీరిలో.. ఎన్యూమరేషన్ చేసిన గ్రామ సచివాలయాల పరిధిలో లేనివారు అధికంగా ఉన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలోని వారు కూడా తమను అర్హులుగా చేర్చాలంటూ అర్జీలు సమర్పిస్తున్నారు. కండ్రిక, గొల్లపూడి, వాంబేకాలనీ, పైపులరోడ్డు, సింగ్‌నగర్, పాయకాపురం, రామకృష్ణాపురం, దేవి నగర్ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది తరలివచ్చారు. వందలాదిగా ప్రజలు వస్తుండటంతో కలెక్టర్ సృజన మండలాల ప్రాతిపదికన కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో కౌంటర్ల వద్ద తీవ్రమైన రద్దీ నెలకొంది. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు అర్జీలు స్వీకరించారు. ఈ దరఖాస్తులు పరిశీలించాక అర్హులు ఉంటే, రెండు, మూడు రోజుల్లో సాయం అందించాలని అధికారులు నిర్ణయించారు.

పట్టభద్రుల ఓటు నమోదు

నేటి నుంచే..

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

- మార్చి 2025లో నిర్వహించనున్న ఎన్నికల సంఘం
- ఓటు కోసం ఫాం- 18ను పూర్తి చేసి తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలి




(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు త్వరలో నగారా మోగనుండటంతో పట్టభద్రుల ఓట్ల నమోదుకు రంగం సిద్ధమైంది. మార్చి 2025లో నిర్వహించనున్న ఎన్నికలను పురస్కరించుకుని పట్టభద్రులు తమ ఓటుహక్కును వి నియోగించుకోవడం కోసం మంగళవారం నుంచి నవంబరు 6వ తేదీలోపు ఓటర్లుగా నమోదు చేసుకోవటానికి అవకాశం కల్పించింది. నవంబరు 20వ తేదీన ముసాయిదా ఓటరు జాబితా ముద్రించి 23వ తేదీన ప్రచురిస్తారు. ముసాయిదా ఓటరు జాబితాపై డిసెంబరు 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి 25వ తేదీ నాటికి పరిష్కరించి తుది ఓటరు జాబితా డిసెంబరు 30వ తేదీన ప్రకటిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సాధారణ ఎన్నికల మాదిరిగా పాత ఓటర్ల జాబితా ఉండదు. ఎప్పటికప్పుడు ఓటర్లుగా నమోదు కావాల్సి ఉంటుంది. అర్హులైన పట్టభద్రులంతా కూడా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. దీనికోసం ఫాం-18 దరఖాస్తును సమర్పించాల్సి ఉంది. దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో కూడా చేసుకోవచ్చు. ఫాం-18తో పాటు గ్రాడ్యుయేట్ డిగ్రీ ప్రొవిజినల్ సర్టిఫికెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీ, ఫొటో, ఆధార్ కార్డు కాపీ, ఓటరు ఐడీని జత చేయాల్సి ఉంటుంది. ఇలా జత చేసిన వాటిని స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో అందించాల్సి ఉంది. పట్టభద్రుల ఓటరు నమోదు కోసం ఆన్‌లైన్ విధానంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినపుడు వెరిఫికేషన్ కోసం ఇంటికి వచ్చినపుడు సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుంది. ఓటు నమోదు చేయించుకోవడానికి అక్టోబరు 2021 నాటికి పట్టభద్రులై ఉండాలి. ఇంజనీరింగ్, మెడిసిన్, సీఏ, ఇతర పీజీ డిప్లొమా పూర్తిచేసిన వారు కూడా ఓటుహక్కు నమోదు చేసుకోవటానికి అర్హులే. అయితే వీరంతా రూడా పది+, ఇంటర్+, డిగ్రీ పద్ధతిలో పూర్తిచేసి ఉన్నవారు మాత్రమే అర్హులు. పదో తరగతి తర్వాత దూరవిద్యలో డిగ్రీ పూర్తిచేసిన వారు అనర్హులు.

ఆ ఇద్దరు ఎక్కడ?

- ఇంకా దొరకని తల్లి, కుమార్తె ఆచూకీ
- బందరు కాల్వలో గాలిస్తున్న ఎస్డీఆర్ఎఫ్

విజయవాడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్క్యూబ్రిడ్జి వద్ద బందరు కాల్వలో పిల్లలతో కలిసి దూకిన తల్లి ఆచూకీ ఇంకా లభించలేదు. తిరుమల సుధారాణి పెద్దకుమార్తె జాస్వి, చిన్నకుమార్తె బ్లెసీతో కలిసి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. బ్లెసీ మృతదేహాన్ని పడవలరేవు వద్ద గుర్తించారు. అయితే, రోజు గడిచినా సుధారాణి, జాస్వి ఆచూకీ లభించలేదు. వారికోసం ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి. సుధారాణి భర్త తిరుమలరావు మరో మహిళతో వివాహేతర సంబంధం నడపడమే దంపతుల మధ్య వివాదానికి కారణమని తెలిసింది. తిరుపతిరావు కుటుంబం గుంటూరులో శారదా కాలనీలో నివాసముంటోంది. వెనుక వీధిలో ఉంటున్న ఒక మహిళతో తిరుపతిరావుకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం సుధారాణి తల్లికి తెలిసింది. తిరుపతిరావు ఆమెతో ఉంటూ అత్త కంట్లో పడ్డాడు. ఈ విషయాన్ని ఆమె కుమార్తెకు చెప్పింది. దీంతో తిరుపతిరావు, సుధారాణి మధ్య వివాదం జరిగింది. భర్త వ్యవహారాన్ని ఆమె కృష్ణలంకలో ఉంటున్న తిరుపతిరావు సోదరుడు కోటేశ్వరరావుకు చెప్పడంతో ఆ కుటుంబాన్ని ఇక్కడికి పిలిపించాడు. తన బంధువులు చనిపోవడంతో కోటేశ్వరరావు అక్కడికి వెళ్లాడు. తర్వాత తిరుపతిరావు, సుధారాణి మధ్య మళ్లీ గొడవ జరిగింది. తర్వాత అతడు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. వెంటనే పిల్లలను తీసుకుని సుధారాణి బయటకొచ్చింది. ఆమె ఏమైనా అఘాయిత్యం చేసుకుంటుందని చుట్టుపక్కల ఉన్న మహిళలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పిల్లలతో పరుగులు తీసుకుంటూ స్క్యూబ్రిడ్జి వద్దకు వెళ్లిన ఆమె బందరు కాల్వలోకి దూకినట్టు పోలీసులు గుర్తించారు.

ఖరీదైన సున్నపురాయి నిక్షేపాలను గుట్టుగా దోచేస్తున్నారు. వారం కిందట కొత్త మల్లవల్లిలో భారీ ఎత్తున సున్నపురాయి నిక్షేపాలు బయటపడగా, రహస్యంగా ఉంచిన ప్రైవేట్ వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రుళ్లు తవ్వకాలు చేస్తున్నారు. అత్యంత ఖరీదైన ఈ రాయిని గుడివాడ, బందరుకు తరలిస్తున్నారు. ఈ ప్రైవేటు వ్యక్తుల్లో చాలామంది కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ మైనింగ్ చేసినవారు కాగా, మరికొందరు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి గొడుగు పట్టేవారు.




కొత్త మల్లవల్లిలో సున్నపురాయి తవ్వకాలు (ఇన్‌సెట్‌లో) గ్రావెల్ ముసుగులో లారీలో సున్నపురాయి రవాణా

గుట్టుగా..

సున్నపురాయి తరలింపు ట కొత్త మల్లవల్లిలో బయటపడిన ఖనిజాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /జంక్షన్ రూరల్) : కొత్త మల్లవల్లి సర్వే నెంబర్ 165, 166లో మొత్తం 12 ఎకరాల వి స్తీర్ణంలో సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయి. ఈ ప్రాంతంలో ఎప్పటినుంచో అర్ధరాత్రుళ్లు అనధికారికంగా మైనింగ్ జరుపుతున్న ప్రైవేట్ వ్యక్తుల కంట ఇవి పడ్డాయి. ప్రస్తుత పారిశ్రామికవాడ ఉన్న మల్లవల్లి నుంచి లోపలికి వెళ్తే.. ఈ కొత్త మల్లవల్లి వస్తుంది. ఇక్కడ ఏం జరుగుతుందో బయటి వారికి తెలియదు. పొలాల మీదుగా ఉన్న చిన్నదారిలో ఇక్కడికి వెళ్లాల్సి ఉంటుంది. ఇలాంటి ప్రాంతంలో సున్నపురాయి నిక్షేపాలను మైనింగ్ మాఫియా కనుగొంది. ఇక్కడ గ్రావెల్ నిక్షేపాలను చాలాకాలంగా తవ్వుతున్నారు. తవ్వగా తవ్వగా సున్నపురాయి బయటపడింది. అయితే, వి షయం బయటకు పొక్కకుండా ప్రైవేట్ వ్యక్తులు ప్రణాళికలు రచించుకున్నారు. సరైన దారి లేకపోవడంతో ట్రాక్టర్లను పంపి సున్నపురాయిని తెప్పిస్తున్నారు. పైన పరదా కప్పి, దానిపై గ్రావెల్ వేస్తున్నారు. ఈ ట్రాక్టర్లన్నింటినీ మల్లవల్లి పారిశ్రామి ...కవాడ వద్ద వంద అడుగుల రోడ్డుకు సమీపంలోని పొలాల్లోకి తీసుకొచ్చి పరదాలను తొలగిస్తున్నారు. ఆ తర్వాత పెద్ద టిప్పర్లలోకి సున్నపురాయిని లోడ్ చేస్తున్నారు. ఇలా గుట్టుచప్పుడు కాకుండా బయటకు పంపుతున్నారు.

బయటకు రానివ్వకుండా తవ్వుతున్న ప్రైవేట్ వ్యక్తులు

- 12 ఎకరాల్లోని రాయి అర్ధరాత్రి తరలింపు
- పెద్ద టిప్పర్లలో గుడివాడ, బందరుకు..
- అక్కడి నుంచి సరిహద్దులు దాటింపు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

రూ.కోట్లలో ఆదాయం

సున్నపురాయి ఎంతో విలువైనది. సున్నం తయారీయే కాకుండా వైద్యపరంగా అనేక రకాలుగా ఇది ఉపయోగపడుతుంది. దాదాపు 70 రకాల ఆరోగ్య సమస్యలకు ఇది పరిష్కారం చూపుతుందన్న ప్రచారం ఉంది. ఫలితంగా దీనికి విలువ ఎక్కువ. టన్ను ముడి సున్నపురాయిని తవ్వి అమ్ముకుంటే రూ.50 వేల వరకు వస్తాయి. ఓ పెద్ద టిప్పర్‌లో 25 నుంచి 35 టన్నుల వరకు తరలించవచ్చు. పెద్ద టిప్పర్‌కు రూ.12 లక్షల నుంచి రూ.17.50 లక్షల వరకు ఆదాయం వస్తుంది. వందల సంఖ్యలో తరలిస్తున్న ఈ సున్నపురాయి ద్వారా రూ.కోట్లలో సంపాదించవచ్చు.

పట్టని అధికారులు

వారం రోజులుగా సున్నపురాయి నిక్షేపాలను ప్రైవేట్ వ్యక్తులు గుడివాడ, బందరుకు రహస్యంగా తరలిస్తున్నారు. అక్కడి నుంచి ట్రేడర్ల ద్వారా సరిహద్దులు దాటిస్తున్నారని తెలుస్తోంది. ఇంతా జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగానికి కానీ, మైనింగ్ శాఖ అధికారులకు కానీ తెలియకపోవటం గమనార్హం. ఈ వ్యవహారంపై కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించటంతో పాటు సున్నపురాయి నిక్షేపాలు ఉన్న ప్రాంతాన్ని మైనింగ్ శాఖ ద్వారా తమ ఆధీనంలోకి తీసుకునేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కృష్ణ.. కృష్ణా ఇవేం పీహెచ్‌డీలు?!


కృష్ణా యూనివర్సిటీ

ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమాలు, వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా కృష్ణా యూనివర్సిటీ నిలిచింది. 2021లోనే రద్దు చేసిన జర్నలిజం కోర్సులో తాజాగా ముగ్గురికి పీహెచ్‌డీలు ప్రదానం చేసి కొత్త చరిత్రను లిఖించింది. నియమ నిబంధనలను తుంగలో తొక్కింది. దీనిపై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రులకు ఫిర్యాదులు అందడంతో సమగ్ర విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

కృష్ణా యూనివర్సిటీలో పీహెచ్‌డీల ప్రదానంలో అక్రమాలు

- 2021లోనే రద్దు అయిన జర్నలిజం కోర్సు
- 2023, 2024లో ముగ్గురికి ఈ కోర్సులో పీహెచ్‌డీల ప్రదానం
- విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : 'కృష్ణా యూనివర్సిటీలో జర్నలిజం కోర్సును 2021, జూన్ 17వ తేదీన మూసివేశారు. ఈ కోర్సును రద్దుచేసే నాటికి ముగ్గురు అధ్యాపకులు ఈ విభాగంలో పనిచేస్తున్నారు. వీరిలో ఇద్దరు అధ్యాపకులు ఆంధ్రా యూనివర్సిటీకి వెళ్లిపోగా, ఒకరు నాగార్జున యూనివర్సిటీకి వెళ్లారు. అయితే, 2023, 2024 సంవత్సరాల్లో ముగ్గురికి పీహెచ్‌డీలను ప్రదానం చేశారు. వీరిలో ఒకరు ఓ దినపత్రిక (ఆంధ్రజ్యోతి కాదు)లో పనిచేస్తున్నారు. సంబంధిత పత్రాలపై జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో ఆంధ్రా యూనివర్సిటీలో పనిచేస్తున్న సీఎం వినయ్‌కుమార్, విజయలక్ష్మి సంతకాలు చేశారు. 2023లో జ్యోతిర్మయి అనే అధ్యాపకురాలు మరో విద్యార్థికి ఎంఫిల్ నుంచి పీహెచ్‌డీకి మార్చారు. అయితే, సాధారణంగా పీహెచ్‌డీ చేసిన విద్యార్థులు సమర్పించిన పత్రాలను వివిధ యూనివర్సిటీలకు సంబంధించిన రీసెర్చ్ రివ్యూ కమిటీ నిపుణులు నాలుగు విడతల్లో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తేనే పీహెచ్‌డీ పట్టాను మంజూరు చేసే అవకాశం ఉంటుంది. కానీ, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ పీహెచ్‌డీల ప్రదానంపై ఆంధ్రా యూనివర్సిటీ మాజీ పోస్ట్ డాక్టోరల్ ఫెలో, మాజీ గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ జీకేడీ ప్రసాద్, మరికొందరు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మానవవనరుల శాఖామంత్రి నారా లోకేశ్‌కు సమగ్ర వివరాలు, ఆధారాలతో సెప్టెంబరు 28వ తేదీన ఫిర్యాదు చేశారు.

వినయ్‌కుమార్ బదిలీనే అక్రమం

కృష్ణా యూనివర్సిటీ నుంచి ఆంధ్రా యూనివర్సిటీకి వినయ్‌కుమార్ బదిలీ కావడమే అక్రమమని, ఓ దినపత్రిక (ఆంధ్రజ్యోతి కాదు)లో పనిచేస్తున్న విద్యార్థి పీహెచ్‌డీ కోసం దరఖాస్తు చేసుకున్న మూడు వారాల వ్యవధిలోనే ఆయనకు వైవావోస్‌ను నిర్వహించి చకచకా పీహెచ్‌డీ పట్టాను అందజేయడంలో అప్పటి ప్రభుత్వ పాత్ర ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వినయ్‌కుమార్ అసలు జర్నలిజం కోర్సు లేని కృష్ణా యూనివర్సిటీలో పీహెచ్‌డీ సూపర్‌వైజర్‌గా సంతకం చేయడం మరీ విడ్డూరమని తెలిపారు. ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ చేయాలని వారు వినతిపత్రంలో కోరారు. 2010 నుంచి కృష్ణా యూనివర్సిటీలో జర్నలిజం కోర్సులో మొత్తం 19 మంది పీహెచ్‌డీ చేస్తుండగా, ముగ్గురికి మాత్రం పట్టాలు ఇచ్చి మిగిలినవారికి ఇవ్వకుండా జాప్యం చేయడం గమనార్హం. దీనిపై గవర్నర్, ఉన్నత విద్యామండలి అధికారులకు నేటికీ ఫిర్యాదులు చేస్తుండటం విశేషం.

పీహెచ్‌డీ పట్టా అందక విద్యార్థిని బలవన్మరణం

భీమవరానికి చెందిన పి.అమిత అనే స్కాలర్ భీమవరంలోని ఓ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తూ కృష్ణా యూనివర్సిటీలో కామర్స్ విభాగంలో పీహెచ్‌డీని పూర్తి చేశారు. పీహెచ్‌డీకి

- మిగతా 6లో

నగరంలో మూడు నెలలు సెక్షన్ 30

విజయవాడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మూడు నెలల పాటు సెక్షన్ 30 అమలు చేస్తున్నట్టు పోలీసు కమి షనర్ రాజశేఖరబాబు తెలిపారు. మంగళవారం నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని, ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, నిరసనలు నిర్వహించరాదని, ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నృత్యోత్సవం



ముమ్మనేని సిద్దార్థ కళాపీఠం, సిద్దార్థ అకాడమీ ఆఫ్ జనర్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 'సిద్దార్థ నృత్యోత్సవం' జరిగింది. సిద్దార్థ అకాడమీ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


హుండీల ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కనకదుర్గమ్మ హుండీల ఆదాయం రూ.2.05 కోట్లు

వన్‌టౌన్, సెప్టెంబరు 30 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. 18 రోజుల వ్యవధికిగాను కానుకల రూపేణ మొత్తంగా రూ.2,05,75,378లు నగదు లభించింది. 266 గ్రాముల బంగారం, 5కిలోల 562 గ్రాములు వెండి సమకూరింది. వివిధ దేశాల కరెన్సీ కూడా హుండీలలో లభ్యమైంది. 568 యుఎస్ఏ డాలర్లు, 185 అరబ్ ఎమిరేట్స్ దీర్హాలు, ఒమెన్ రియాల్స్ 31, 2,500 నైజీరియా నైరాలు, 35 మలేషియా రింగెట్లు, 20 ఇంగ్లండ్ పౌండ్లు, 45 కెనడా డాలర్లు, 1 కువైట్ దీనార్, 5 సౌదీ రియాల్స్, 10 స్కాట్‌ల్యాండ్ పౌండ్లు, 30 ఇంగ్లండ్ డాలర్లు, 50 ఆస్ట్రేలియా డాలర్లు, 110 సింగపూర్ డాలర్లు, 10 మాల్దీవులు రుఫియాలు, 118 కతార్ రియాల్స్ చొప్పున విదేశీ కరెన్సీ వచ్చింది. ఆన్‌లైన్ హుండీ ద్వారా మరో రూ.75,396లు భక్తులు సమర్పించారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, దేవదాయ అధికారులు, ఏఈవోలు, సిబ్బంది, ఎస్‌పీఎఫ్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, అమ్మవారి సేవాదారులు లెక్కింపులో పాల్గొన్నారు.


ఆంజనేయస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న కూటమి నేతలు

ఆంజనేయ ఆలయంలో ప్రాయశ్చిత్త పూజలు

అవనిగడ్డ : కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రతను దెబ్బతీసేలా వ్యవహరించిన వైసీపీ ప్రభుత్వ, నాటి టీటీడీ పాలక మండలి తప్పులకు ప్రాయశ్చిత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లో పూజలు చేయాలని పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సతీమణి, కూటమి నేతలు అవనిగడ్డ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించారు. ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రత్యేకపూజలు నిర్వహించి దోష పరిహారార్థం దీపాలు వెలిగించి ఆంజనేయ స్వామికి నివేదించారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా వ్యవహరించిన నాటి వైసీపీ ప్రభుత్వ, టీటీడీ పాలకమండలి, ఈవో వ్యవహార శైలిపై కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అవనిగడ్డ మాజీ ఎంపీపీ బండే నాగ వెంకట కనకదుర్గ, కూటమి నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, మత్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టండి

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 30 : పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. జిల్లాలోని పలుప్రాంతాల్లో సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సోమవారం బందరు మండలం పోతేపల్లిలో నిల్వ ఉంచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల పర్యావరణం కలుషితమవుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేసిన పంచాయతీల్లో కియోస్క్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 11 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించడం జరిగిందన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఉత్పత్తిదారుడే వ్యర్థాల రీసైక్లింగ్‌కు కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జడ్పీ సీఈవో కన్నమనాయుడు, సుమన్ డీపీవో జె.అరుణ, ఎంపీడీవో ఎ.బాలకృష్ణారావు తదితరులు పాలొన్నారు. అనంతరం కలెక్టర్ బాలాజీకి మంత్రి ప్రశంసాపత్రం అందజేశారు. పోతేపల్లి పంచాయతీకి దోమల నివారణ ఫాగింగ్ యంత్రాన్ని, ఇద్దరు మహిళలకు ఇన్సూరెన్స్ సొమ్మును అందజేశారు.

దోషులను వదిలిపెట్టేది లేదు..

ఉయ్యూరు : వైసీపీ నాయకుల దోపిడీతో జిల్లా బలైపోయిందని మంత్రి కొల్లు రవీంద్ర ఆందోళన వ్యక్తంచేశారు. గండిగుంటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకులు వంశీ, పేర్ని నాని వంటి మరి కొంతమంది అక్రమ దోపిడీ వల్ల జిల్లా అభివృద్ధికి నోచుకోక అధోగతిపాలైందన్నారు. దోషులను ఎవరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.


ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న మహిళలు

కొలికపూడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

చిట్యాల(తిరువూరు)సెప్టెంబరు 30 : స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పై ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేశారు. సోమవారం చిట్యాల గ్రామంలో మహిళలు ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు, మహిళలపట్ల ఆయన వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. మహిళలకు ఫోన్‌ల ద్వారా అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతున్నట్టు వారు ఆరోపించారు. తాము పార్టీకోసం కష్టపడుతుంటే, ఎమ్మెల్యే పార్టీకి చెందిన వారినే వేధింపులకు గురిచేస్తున్నాడని విమర్శించారు. కొలికపూడిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

నిబంధనల మేరకే అద్దెకు షాపులు

విద్యాధరపురం, సెప్టెంబరు 30 : గొల్లపూడి మార్కెట్ యార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులను ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అర్హులైన వారికి అద్దెలకు కేటాయిస్తామని ప్రాంతీయ ఉప సంచాలకులు దివాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది బ్రోకర్లు షాపులను కొనుగోలు చేయిస్తామని, లీజులకు ఇప్పిస్తామని మభ్యపెడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. గొల్లపూడి మార్కెట్ యార్డుకు దక్షిణం వైపున ఉన్న జాతీయ రహదారి పక్కన నిర్మిస్తున్న షాపులు, తూర్పువైపున నిర్మిస్తున్న షాపులకు ప్రభుత్వ నిబంధనలకు ప్రకారమే అద్దెలకు ఇచ్చేందుకు ప్రకటనలు జారీ చేస్తామన్నారు. ప్రకటనల మేరకు అర్హులైన వారికి మాత్రమే షాపులు కేటాయిస్తామని, మధ్యవర్తులను, బ్రోకర్లను నమ్మి మోసపోవద్దని తెలిపారు.

రైల్వే కొత్త రూల్స్!



గుర్తింపు కార్డు లేకుంటే టికెట్ తీసుకోనట్టే!

» ఆ ప్రకారం జరిమానాలకు సిద్ధం

» ప్రయాణికులకు విజయవాడ డివిజన్ ఆదేశం

» టికెట్ బదిలీలను నిరోధించటానికి అధికారుల నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రైళ్లలో ప్రయాణించాలంటే ఇకపై తప్పనిసరిగా ప్రయాణికులు గుర్తింపు కార్డును వెంట తీసుకు వెళ్లాల్సిందే.. ఒకవేళ గుర్తింపు కార్డు వెంట తీసుకువెళ్లకపోతే టికెట్ తీసుకోని వారి కింద రైల్వే పరిగణిస్తుంది. అటువారిపై జరిమానా కూడా విధిస్తుంది. బుకింగ్ సమయంలో ఇచ్చిన వివరాలకు, ఆ తర్వాత ప్రయాణిస్తున్న వారి వివరాలు సరిపోలకపోవటం వంటి సమస్యల కారణంగా రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్టు విజయవాడ డివిజన్ అధికారులు సోమవారం ప్రకటించారు. అనధికారిక టిక్కెట్లను నియంత్రించటానికి, టిక్కెట్ బదిలీలను నిరోధించటానికి, ప్రయాణం సాఫీగా జరిగేందుకు దోహదపడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. విజయవాడ డివిజన్ పరిధిలోని రైలు ప్రయాణికులు విధిగా తమ వెంట గుర్తింపు కార్డును తీసుకు రావాల్సిందేనన్నారు. ప్రయాణికులు తమ వెంట తీసుకు వచ్చే గుర్తింపు కార్డులకు సంబంధించి కార్డులను నిర్దేశించటం జరిగింది. వీటిలో ఏదో ఒకటి తమ వెంట తీసుకువెళ్లాల్సిందే.



రైల్వే నిర్దేశించిన గుర్తింపు కార్డులు ఇవే..

1. ఓటరు గుర్తింపు కార్డు, 2. పాస్‌పోర్ట్, 3. పాన్‌కార్డు, 4.డ్రైవింగ్ లైసెన్స్, 5.రేషన్ కార్డు, 6. విద్యాసంస్థలు విద్యార్థులకిచ్చే గుర్తింపు కార్డులు, 7. ఏదైనా జాతీయ బ్యాంకు పాస్‌బుక్, 8.క్రెడిట్ కార్డ్, 9. ఆధార్ కార్డు, 10. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులు, జిల్లా యంత్రాంగం, కార్పొరేషన్, మునిసిపాలిటీలు, పంచాయితీలు జారీ చేసిన గుర్తింపు కార్డులు, 11. బార్ కౌన్సిల్ జారీ చేసిన గుర్తింపు కార్డు.

కుటుంబం యూనిట్‌గా ఆర్థిక సాయం

» అధికారులకు సహకరించాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, సెప్టెంబరు 30 : రాష్ట్ర ప్రభుత్వం ముంపు ప్రభావిత బాధితులకు కుటుంబం యూనిట్‌గా ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని, కుటుంబంలో ఒకరిని గురించి, వారి ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో డీబీటీ ద్వారా నగదు జమచేయడం జరుగుతోందని కలెక్టర్ జీ.సృజన సోమవారం తెలిపారు. కుటుంబంలో మరో వ్యక్తిని లబ్ధిదారునిగా గుర్తించడానికి వీలులేని విషయాన్ని గుర్తించాలని, అనవసరంగా అర్జీలు దాఖలు చేయొద్దని సూచించారు. బాధితులకు అత్యంత పారదర్శకంగా సహాయం అందించడం జరుగుతోందని, ఇప్పటివరకు ఇళ్లు, వాహనాలు తదితర నష్టాలకు సంబంధించి 1,12,481 మంది బ్యాంకు ఖాతాల్లో సాయం జమచేయడం జరిగిందన్నారు.



ఆధార్‌తో బ్యాంక్ ఖాతా అనుసంధానించుకోండి..

ఎన్యూమరేషన్ జరిగి, గుర్తించిన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం పరిహారం మంజూరు చేసిందని అయితే ఆధార్‌తో బ్యాంక్ ఖాతా లింక్ కాకపోవడం, వినియోగంలో లేకపోవడం తదితర కారణాల వల్ల దాదాపు 20 వేలమంది ఖాతాల్లో నగదు జమకాలేదని వివరించారు. ఈ విషయాన్ని ఎస్ఎంఎస్ ద్వారా లబ్ధిదారుల ఫోన్‌లకు సమాచారం ఇచ్చామన్నారు. అందువల్ల సత్వరమే ఆధార్‌కు బ్యాంకుఖాతాను అనుసంధానం చేసుకొని వినియోగంలోకి తెచ్చుకోవాలని సూచించారు. ఈ విషయమై బ్యాంకులకు కూడా సూచనలిచ్చామని, సచివాలయ సిబ్బంది కూడా బాధితులకు సహకారం అందిస్తారని తెలిపారు. అర్హత పొందిన లబ్ధిదారుల జాబితాలు సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో వున్నాయని, అక్కడ పేర్లు వుండి ఇంకా పరిహారం జమకాకపోతే ఆధార్‌తో బ్యాంక్ ఖాతా అనుసంధానం కాలేదని గుర్తించి బ్యాంకుఖాతాను ఆధార్‌తో లింక్ చేసుకోవాలని సూచించారు. ఆధార్‌తో అనుసంధానం అయిన రెండురోజులలోపు ఖాతాలో పరిహారం జమచేయడం జరుగుతుందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎవరూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అసవరం లేదని సూచించారు. అదేవిధంగా పరిహారం కోరుతూ గ్రీవెన్స్‌లో సమర్పించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి రెండు మూడు రోజుల్లోనే పరిష్కరించి ఆపై అర్హులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.


కోడూరు స్టేషన్ ఆవరణలో వేడుకకు హాజరైన కూటమి నేతలు

ఆమె రూటే వేరు!

» వివాదాస్పదంగా ఎస్ఐ పుట్టిన రోజు వేడుక

అవనిగడ్డ : కోడూరు మండల ఎస్ఐ పి.శిరీష జన్మదిన వేడుకలు వివాదాస్పదంగా మారాయి. శనివారం రాత్రి మండలానికి చెందిన వివిధ పార్టీల రాజకీయ నేతలు స్టేషన్ ఆవరణలో ఎస్ఐ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. భారీ కేక్‌తో పాటు బాణాసంచా పేల్చి సంబరాలు చేశారు. ఆ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా పార్టీల నేతలతో స్టేషన్ ఆవరణలో వేడుకలు ఏలా నిర్వహిస్తారంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధుల పుట్టిన రోజు వేడుకల్లో అధికారులు పాల్గొని విమర్శలకు గురికావటం పరిపాటి.. కాగా కోడూరులో ఇందుకు విరుద్ధంగా రాజకీయ పక్షాల నేతలతో కలిసి ఎస్ఐ స్టేషన్ ఆవరణలోనే పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవటం చర్చనీయాంశమైంది.

మీకోసం అర్జీలు పెండింగ్ పెట్టొద్దు

» అధికారులకు కృష్ణా కలెక్టర్ బాలాజీ ఆదేశం

మచిలీపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారవేదిక (మీకోసం) కార్యక్రమంలో ప్రజలనుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపుహాలులో సోమవారం జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావుతో కలిసి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలలనుంచి వచ్చిన 140 మంది సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు 3,841 అర్జీలురాగా, వాటిలో 627 ఇంకా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రెవెన్యూ ఐదు, పోలీస్‌శాఖలో ఐదు, జలవనరులశాఖలో ఒకటి గడువుదాటినవి ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయంనుంచి వచ్చిన అర్జీలలో డీఎస్‌వోకు సంబంధించి నాలుగు, డీపీవోకు సంబంధించి మూడు పెండింగ్ ఉన్నాయన్నారు. అక్టోబరు ఒకటో తేదీన సామాజిక పింఛన్ల పంపిణీలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సకాలంలో పింఛన్లు అందజేసేందుకు చేసిన ఏర్పాట్లపై డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ అరుణను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. .ఆర్‌డబ్ల్యూఎస్, మునిసిపల్ విభాగాల్లో నాలుగు కోర్టుకేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సరైన వకాలతలను సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కేఆర్‌సీసీ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీఎస్‌వో పార్వతి, డీఈవో తాహెరాసుల్తానా, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, ఉద్యానశాఖ జేడీ జ్యోతి, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, అధికారులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు వింటున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

ప్రాధాన్యత క్రమంలో..

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న అర్జీలకు అధికారులు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారాన్ని చూపాలని కలెక్టర్ జి.సృజన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో సృజన, పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ రజనీకుమారితో కలిసి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి, అర్జీదారుని సమస్యను సరైన విధంగా అర్థం చేసుకొని పరిష్కరించాలని సూచించారు. గడువులోగా అర్జీలను పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి హైలైఫ్ ఎగ్జిబిషన్

విజయవాడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నోవాటెల్‌లో హైలైఫ్ ఎగ్జిబిషన్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. రెండ్రోజులపాటుఎగ్జిబిషన్ ఉంటుంది. వివిధ రకాల డిజైన్లలో ఉన్న దుస్తువలు, జువెలరీ, హోండెకార్స్ ప్రదర్శనలో ఉంటాయి.

న్యూస్ బాక్స్


వరద బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉప్పలపాటి ఉదయభాస్కర్ రాజు

నిత్యావసరాల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్ : బుడమేరు వరదలతో సర్వస్వం కోల్పోయిన అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతవాసులకు రైజ్ ఎన్ రైజ్ రియల్ ఎస్టేట్ సంస్థ చైర్మన్ ఉప్పలపాటి విజయభాస్కర్ రాజు నిత్యావసర సరుకులు, ద్విచక్రవాహనాల మరమ్మతుల నిమిత్తం నగదు పంపిణీ చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన 200 మంది బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, రూ.6 లక్షల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పలపాటి మాట్లాడుతూ, వరద బాధితులకు పక్కా ప్రణాళికతో సహాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టర్ బాలాజీకి చెక్కు అందజేస్తూ..

సైనికుల నిధికి మెప్మా ఆర్థిక సాయం

మచిలీపట్నం,సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ రక్షణకోసం దేశసరిహద్దుల వెంబడి ప్రాణాలను పణంగాపెట్టి గస్తీకాస్తున్న సైనికుల సంక్షేమం కోసం ఉమ్మడిజిల్లా మెప్మా సభ్యులు,సిబ్బంది రూ.7,11,867ల ఆర్థికసాయాన్ని కలెక్టర్ బాలాజీకి అందజేశారు. మీకోసం సమావేశపుహాలులో సోమవారం ఈచెక్కును కలెక్టర్‌కు అందజేశారు. మెప్మాపీడీ పి.వెంకటనారాయణ, జిల్లా సైనిక అధికారులు డాక్టర్ కె.కల్యాణివీణ, ఎస్.ఈశ్వర్, మెప్మా సీఎంఎం కేఎస్ ఆనందబాబు, మెప్మాసిబ్బంది టి శ్రీనివాస్, టి.రాజమోహన్, వి.సునీల, జి.జ్యోష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.



కొనకళ్లకు నెట్టెం అభినందన

వన్‌టౌన్ : ఆటోనగర్ ఎన్టీఆర్ జిల్లా టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన కొనకళ్ల నారాయణను మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ దుశ్శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. వాసం మునియ్య, యేదుపాటి రామయ్య, సారేపల్లి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై హోరెత్తిన ధర్నాచౌక్‌లు

» కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ వెంటనే ప్రారంభించాలి

» మోకాళ్లపై కూర్చుని వినూత్న రీతిలో నిరసన తెలిపిన అభ్యర్థులు

ధర్నాచౌక్ : రెండేళ్ల క్రితం ఇచ్చిన కానిస్టేబుల్ నోటిఫికేషన్ భర్తీ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని, హోంగార్డు రిజర్వేషన్లు తగ్గించి పాత పద్ధతిలోనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నాచౌక్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ అభ్యర్థులు మోకాళ్లపై కూర్చుని సోమవారం వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన 6100 పోలీస్ కానిస్టేబుల్



నోటిఫికేషన్‌లో 95,208 మంది అభ్యర్థులు రాత పరీక్షలో అర్హత సాధించారని అభ్యర్థులు తెలిపారు. తర్వాత జరగాల్సిన దేహదారుఢ్య, మెయిన్స్ పరీక్షలు ఇప్పటికీ నిర్వహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హోంగార్డులకు రిజర్వేషన్ల శాతం పెంచడంతో నిరుద్యోగులకు తీవ్రనష్టం కలుగుతోందన్నారు. భవిష్యత్‌లో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని 'యువగళం పాతయాత్ర'లో మంత్రి నారా లోకేశ్ తమకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అనంతరం టీడీపీ కేంద్రకార్యాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర నేతలు నాగేశ్వరరావు, కృష్ణ, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

» సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

ధర్నాచౌక్ : వివిధ పరిశ్రమలు, ప్రభుత్వశాఖలు, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, సమానపనికి సమాన వేతనం, కార్మిక చట్టాల అమలు, రెగ్యులర్ చేయాలనే డిమాండ్లతో ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికులు ఎలాంటి సంక్షేమ పథకాలకు నోచుకోకుండా, యంత్రాల్లా పనిచేస్తున్నారన్నారు. వీరిని కాంట్రాక్టర్లు దోపిడి చేస్తున్నారన్నారు. కార్మికులకు పనిభద్రత లేకుండా, ఉన్న చట్టాలను అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాజమాన్యాలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. వైసీపీ, టీడీపీ ప్రభుత్వాలు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం చేశాయని విమర్శించారు. రాష్ట్ర నేతలు కేఆర్కే మూర్తి, కె.ఉమామహేశ్వరరావు, ఆర్.వి.నరసింహారావు, ఈవీఎల్.నరసింహులు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, కె.కమల, ఎం.మహేష్, సీహెచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





మచిలీపట్నం లక్ష్మీటాకీస్ సెంటర్‌లో..

మచిలీపట్నం టౌన్ : కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలంటూ సోమవారం సీఐటీయూ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో లక్ష్మీటాకీసు సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి లక్ష్మీటాకీసు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాదాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులను రెగ్యులర్ చేయడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62కు పెంచాలని, కారుణ్య నియామకాలు జరపాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.పోలినాయుడు, సుబ్రహ్మణ్యం, జయరావు, ఎం.రాము, ధనికొండ నాగమల్లేశ్వరరావు, దుర్గాప్రసాద్, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ..కృష్ణా.. ఇవేం పీహెచ్‌డీలు?!

(5వ పేజీ తరువాయి)

సంబంధించి పరిశోధనా పత్రాలను 2022 నవంబరు 14వ తేదీన ఆమె సమర్పించారు. పీహెచ్‌డీ చేసినందుకు గాను యూనివర్సిటీకి రూ.1.49 లక్షలను ఫీజుగా కూడా ఆమె చెల్లించారు. పరిశోధనా పత్రాలను సమర్పించి 14 నెలలు గడచినా ఆమెకు పీహెచ్‌డీని ప్రదానం చేయలేదు. దీంతో ఏడాది వ్యవధిలో ఆమె మూడు విడతలుగా తన పరిశోధనా పత్రాలను సమర్పించి, తనకు పట్టాను అందజేయాలని యూనివర్సిటీ అధికారులను పలుమార్లు కోరారు. అయినా యూనివర్సిటీ రీసెర్చ్ విభాగం అధికారులు ఈ విషయాన్ని పక్కనపెట్టేశారు. పీహెచ్‌డీ పట్టా తెచ్చుకోవాలని, పీహెచ్‌డీ వచ్చిన తర్వాతే మళ్లీ ఉద్యోగం ఇస్తామని చెప్పి సదరు కళాశాల నుంచి అమితను పంపేశారు. పీహెచ్‌డీ పట్టాలేని కారణంగా ఉద్యోగం నుంచి తొలగించడంతో ఆమె తీవ్ర మనస్థాపానికి గురై గతేడాది నవంబరులో బలవన్మరణానికి పాల్పడింది. ఇంతా జరిగినా యూనివర్సిటీ అధికారులు ఈ విషయాన్ని అసలు పట్టించుకోలేదు. ఈ అంశంపై అధ్యాపకులంతా అప్పట్లో ఆందోళన చేసినా వర్సిటీ నుంచి స్పందనలేదు.

ప్రభుత్వానికి నివేదిక పంపుతాం

-డాక్టర్ చెరుకూరి జయశంకరప్రసాద్, రీసెర్చ్ విభాగం డైరెక్టర్

కృష్ణా యూనివర్సిటీలో జర్నలిజం కోర్సును రద్దు చేసిన తర్వాత పీహెచ్‌డీల ప్రదానంపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఇటీవలనే రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నా. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ అంశంపై పూర్తిస్థాయి నివేదికను పంపాలని యూనివర్సిటీ వీసీ ఆదేశించారు. పీహెచ్‌డీ విద్యార్థులు సమర్పించిన థీసీస్‌ను రీసెర్చ్ రివ్యూ కమిటీ నాలుగు సార్లు పరిశీలించాలి. విశ్వనాథరెడ్డి సమర్పించిన థీసీస్‌ను రీసెర్చ్ రివ్యూ కమిటీ రెండు సార్లు మాత్రమే పరిశీలన చేసినట్లుగా రికార్డులలో ఉంది. జర్నలిజం కోర్సును రద్దు చేసిన తర్వాత వేరే యూనివర్సిటీలకు వెళ్లిన అధ్యాపకులు, లేదా గైడ్‌లు కృష్ణాయూనివర్సిటీలో పీహెచ్‌డీ పట్టాలను ఇవ్వాలని సిఫార్సు చేయడం నిబంధనలకు విరుద్ధం గతంలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ జరిపి వివరాలతో ప్రభుత్వానికి నివేదిస్తాం.

విజయవాడ

●తూర్పు ●సెంట్రల్ ●పశ్చిమ

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

నందీశ్వరుడుకు మహన్యాస రుద్రాభిషేకం



వన్‌టౌన్, సెప్టెంబరు 30: స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో బహుళ త్రయోదశి తిథిని పురస్కరించుకుని నందీశ్వర స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేసి, పుష్పాలంకరణ చేశారు. పంచహారతులు సమర్పించారు. ఉభయ దాతలకు మంత్రపుష్పం, ఆశీర్వచనం అందచేశారు. ఈవో నటరాజన్ షణ్ముగం ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు రాచకొండ సుమంత్ శర్మ, నాగరాజశర్మ, కొత్తపల్లి సాయికృష్ణ శర్మ, తదితరులు పూజాదికాలను నిర్వహించారు.

పట్టభద్రుల ఓట్ల నమోదును బాధ్యతగా తీసుకోండి

పటమట, సెప్టెంబరు 30 : కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు ఒక బాధ్యతగా తీసుకుని పెద్ద ఎత్తున ఓట్ల నమోదు చేయాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అశోక్‌నగర్‌లోని టీడీపీ తూర్పు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి, ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టభద్రుల ఎన్నికల్లో ఓటర్ల నమోదు కార్యక్రమానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని, కూటమి ఉమ్మడి అభ్యర్థిగా ఆలపాటి రాజాను ప్రకటించారన్నారు. అక్టోబరు ఒకటో తేదీ నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర పార్టీ ప్రారంభించనున్నట్లు వివరించారు. నూతన పద్ధతిలో వాట్సాప్, టెలిగ్రామ్, వెబ్‌సైట్ ద్వారా సభ్యత్వ నమోదు ప్రక్రియ జరుగుతుందని, సభ్యత్వం తీసుకున్న వారికి వెంటనే కార్డును కూడా ఇచ్చేందుకు తాను అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. గన్నె నారాయణ ప్రసాద్, ఎస్ ఫిరోజ్, చెన్నుపాటి గాంధీ, గుండు శ్రీను, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, కాంతి శ్రీ, నందిపాటి దేవానంద్, రత్నం రమేష్, గాబ్రియేల్, జి నామేశ్వరరావు, ఎస్ సంజయ్ వర్మ, వి .దుర్గారావు, రాయి రంగమ్మలు పాల్గొన్నారు.



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

భారతీ కిట్టీ పార్టీ సభ్యుల వితరణ

మొగల్రాజపురం: వరద బాధితులను ఆదుకునేందుకు

టీడీపీ శ్రేణులకు గద్దె పిలుపు

గాయత్రీనగర్‌కు చెందిన భారతీ కిట్టీపార్టీ సభ్యులు రూ. లక్ష రూపాయాల విరాళాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు సోమవారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చి సహాయం చేస్తున్న భారతీ కిట్టీ పార్టీ సభ్యులను అభినందిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, గుత్తికొండ సురేష్, ఆర్. మణికుమారి, టిఎస్ పద్మావతి, విజయలక్ష్మి, జాస్తి లక్ష్మిపతి, మల్లెల రామకృష్ణ, వీరమాచనేని రంగారావు పాల్గొన్నారు.

గద్దె పరిశీలన

లబ్బీపేట: ఇద్దరు పిల్లలతో న్యూ బ్రిడ్జి వద్ద బందరు కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థలాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సోమవారం పరిశీలించారు. గల్లంతైన తల్లి, బిడ్డ కోసం గాలిస్తున్న రెస్క్యూ టీమ్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

స్వచ్ఛతపై మరింత అవగాహనకు సెల్ఫీ పాయింట్స్

పటమట, సెప్టెంబరు 30 : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో స్వచ్ఛతపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేలా వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో సోమవారం సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు చేశారు. సాయిబాబా గుడి వద్ద షాపర్స్ స్టాప్‌మాల్, గురునానక్ కాలనీలోని ఉషోదయ సూపర్‌మార్కెట్ వద్ద, పంట కాల్వరోడ్డులోని నారాయణ స్కూల్, వన్‌టౌన్ గాంధీజీ హైస్కూల్, వీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఆ సెల్ఫీ స్టాండ్‌ల ద్వారా ప్రజలు సెల్ఫీ దిగటమే కాకుండా, స్వచ్ఛత వైపు వారి మద్దతుని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానకీరామ్, శానిటరీ సెక్రటరీలు, స్వచ్ఛ సర్వేక్షణ్ సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాధరపురం: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం దళవాయి సుబ్బరామయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో పారిశుధ్య సిబ్బందికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాతంగి కోటయ్య మాట్లాడుతూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే అది అభివృద్ధికి, ఆరోగ్యానికి సరైన సూచిక అవుతుందన్నారు.

విద్యార్థులు చిన్ననాటి నుంచే పరిశుభ్రతను అలవర్చుకోవాలన్నారు. ఇటీవల వరదలలో విశేష సేవలు అందించిన వీఎంసీ పారిశుధ్య కార్మికుడు మరియదాసు, పాఠశాల పారిశుధ్య సిబ్బంది లక్ష్మి, అబీదాలను ఘనంగా సత్కరించారు. గత పది రోజులుగా పాఠశాలలో విద్యార్థులు గీసిన చిత్రాలలో ఉత్తమమైన వాటికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సెల్ఫీలు దిగుతున్న ప్రజలు, పారిశుధ్య కార్మికులను సన్మానించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

సచివాలయ సెక్రటరీలకు కమిషనర్ ఆదేశం

చిట్టినగర్, సెప్టెంబరు 30: ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 15 అర్జీలు వచ్చాయి. అనంతరం సచివాలయాల సెక్రటరీలతో మాట్లాడుతూ సచివాలయ సెక్రటరీ సెలవులో ఉన్నట్లయితే ఇన్‌చార్జి సెక్రటరీ ప్రజా ఫిర్యాదు తీసుకొని పరిష్కరించాలన్నారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కారం అయ్యే వరకు దాని స్థితి నమోదు చేయాలని సూచించారు. సచివాలయాల స్థాయిలో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సెక్రటరీలతో మాట్లాడుతున్న కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర

చిట్టినగర్ మహాలక్ష్మి దేవస్థానంలో దసరా ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



చిట్టినగర్ , సెప్టెంబరు 30: చిట్టినగర్‌లో ఉన్న మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నామని నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కమిటీ అధ్యక్షకార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు(పీసీ)లు అన్నారు. సోమవారం చిట్టినగర్ ఆలయ ప్రాంగణంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అక్టోబరు 3వ తేదీ నుంచి అక్టోబరు 12వ తేదీ వరకు 10 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఇప్పటికే ఆలయానికి రంగులు దిద్ది, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు పొట్నూరి దుర్గా ప్రసాద్, శీరం వెంకట్రావ్, సభ్యులు పణుకు రమ, తమ్మిన సూర్యకుమారి, కామందుల నరసింహరావు, ఈది ఎల్లా రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, గూడేల రామకృష్ణ, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

భవానీపురం, సెప్టెంబరు 30 : విద్యుత్‌లైన్ల మరమ్మతులు, నిర్వహణ కోసం రామరాజ్యసెక్షన్ పరిధిలో 11 కేవీ కన్యకాపరమేశ్వరి ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయవాడ టౌన్ ఏపీసీపీడీసీఎల్ ఈఈ పి రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గుప్తాసెంటర్, కౌస్తుభ అపార్టుమెంట్, షాదీఖానా, తుళ్లూరి వారి వీధి, వై జ్యోతి హాస్పిటల్ రోడ్డు, అండమాన్ బ్రహ్మయ్య వీధి, శంఖవారి వీధి, లల్లా వారి వీధి, వెంకటేశ్వర స్వామి టెంపుల్ స్ట్రీట్, అరవింద వీధి, భారత్‌గ్యాస్ రోడ్డు ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

భవానీపురం, సెప్టెంబరు 30 : ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీలో స్వీపర్‌గా పనిచేస్తున్న సింగం చిన్నమ్మకు క్రాంబ్వే రోడ్డులోని బ్యాంకు కార్యాలయంలో రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. హెచ్‌బీ కాలనీలో ఉంటున్న చిన్నమ్మ వరదలతో నష్టపోయింది. విజయవాడలోని మూడు బ్రాంచ్‌ల్లోని సిబ్బంది తరఫున ఈ సాయాన్ని ఆమెకు సోమవారం సొసైటీ ఆర్ఎం రంగభాష్యం, గోపాలకృష్ణ, మేనేజర్ అనురాధ, ప్రసాద్‌లు అందించారు.

డీఈఈ పాత్రుడు సేవలు అభినందనీయం

● వీడ్కోలు సభలో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్

వన్‌టౌన్, సెప్టెంబరు 30: విజయవాడ నగరపాలక సంస్థలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసిన ఎంసీఎస్ పాత్రుడు సేవలు అభినందనీయమని అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ వి. ప్రభాకర్ కొనియాడారు. డీఈఈ ఎంసీఎస్ పాత్రుడు పదవీ విరమణ సందర్భంగా సోమవారం గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో విజయవాడ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం, నగరపాలక సంస్థ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ మాట్లాడుతూ పాత్రుడు విజయవాడ నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో అనేక సంవత్సరాలు వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి నగర అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. విజయవాడతో పాటు ఏలూరు, గుడివాడ, తదితర ప్రాంతాల్లో కూడా విధులు నిర్వహించి అభివృద్ధి పనులతో పాటు ఉద్యోగుల అభిమానాన్ని పొందారని తెలిపారు. డీఈఈ ఎంసీఎస్ పాత్రుడు మాట్లాడుతూ విధుల్లో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. వారి సహకారంతోనే తాను ఇంతవాడిని అయ్యానని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పాత్రుడు దంపతులను శాలువాతో సత్కరించి, ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో వీఎంసి సీఈలు, ఎస్ఈలు, డీఈలు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, నగరపాలక సంస్థ కాంట్రాక్టర అసియేషన్ జనరల్ సెక్రటరీ రాయన ఆదిబాబు, జాయింట్ సెక్రటరీ ఎం.ఫణిభూషణ్‌రావు, పాత్రుడు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.



పాత్రుడు దంపతులకు సత్కారం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్లమెంటు మాజీ సభ్యుడు తులసీరెడ్డి

ఇందిరా అభియాన్ పోస్టర్ ఆవిష్కరణ


గవర్నర్‌పేట, సెప్టెంబరు 30: అఖిల భారత యువజన కాంగ్రెస్ నిర్వహిస్తున్న ఇందిరా అభియాన్ (శక్తి సూపర్ షీ) కార్యక్రమం ప్రారంభించిన ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. పోస్టర్ ఆవిష్కరించిన పార్లమెంటు మాజీ సభ్యుడు ఎన్.తులసీరెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళల్ని శక్తిమంతులుగా తీరిదిద్దిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పీటర్ జోసెఫ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇందిరా అభియాన్ విజయవంతంగా ముందుకు సాగుతోందన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో యువజన కాంగ్రెస్ పార్టీ నేతలు కొమ్మినేని సురేష్, బొర్రా రవికుమార్, పీవై కిరణ్, గొల్ల పవన్‌కుమార్, అబ్దుల్ రహీం, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చీరలు, దుప్పట్లు అందజేస్తున్న కోటేశ్వరరావు

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 30 : బుడమేరు వరదతో జలమయమైన నగర శివారు ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు చేసిన సేవలు అభినందనీయమని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు అన్నారు. 58వ డివిజన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో హోచ్‌మెన్ భవనం వద్ద సోమవారం పారిశుధ్య కార్మికులకు చీరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆ పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీ భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోటేశ్వరరావు పారిశుధ్య కార్మికులకు చీరలు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, గురవయ్య పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులపై వేధింపులు ఆపాలి: బోయి సత్యబాబు

భవానీపురం, సెప్టెంబరు 30 : వరదల్లో కష్టపడి పనిచేసిన పారిశుధ్య కార్మికులపై అధికారులు వేధింపులు ఆపాలని, గత నెల రోజులుగా సెలవుల్లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించిన కార్మికులు ఒక్కరోజు సెలవు పెడితే మూడు రోజులు ఆఫీసులు చుట్టూ తిప్పించుకుంటున్నారని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి, సీఐటీయూ నాయకుడు బోయి సత్యబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సితార సెంటర్‌లో సోమవారం జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. వరదల వలన విధులకు రాలేని కార్మికులకు హాజరు వేసి పూర్తి జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దుర్గారావు, రాజ్యం, లీలా దుర్గ, రమణమ్మలు పాల్గొన్నారు.

స్థాయీ సంఘంలో 12 అంశాలకు ఆమోదం

చిట్టినగర్, సెప్టెంబరు 30: నగరపాలక సంస్థ స్థాయీ సంఘం సమావేశంలో 12అంశాలకు ఆమోద ముద్రవేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్థాయీ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో 20అంశాలపై చర్చించి 12అంశాలను ఆమోదించారు. ఒక అంశం రికార్డు చేయడంతోపాటు పరిపాలన పరమైన అంశాలకు సంబంధించి ఒక అంశాన్ని ధ్రువీకరించారు. రెండు అంశాలను వాయిదా వేయటంతోపాటు మూడు అంశాలను ర్యాటీపై చేసి ఒక అంశాన్ని తిర్కరించారు. సమావేశంలో పలువురు కమిటీ సభ్యులు , ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణరావు

వన్‌టౌన్, సెప్టెంబరు 30: విద్యార్థులు కళాశాలలో ఉన్న సదుపాయాలను, అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగటానికి కృషి చేయాలని హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాలలో కొత్తగా డిగ్రీలో చేరిన విద్యార్థులకు 'దీక్షారంబ్' పేరుతో సోమవారం పరిచయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వివిధ విభాగాల నుంచి అందే సేవలను, సదుపాయాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడా, సారస్వత, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ద్వారా అదనపు అర్హతలను సంపాదించాలని సూచించారు. అదనపు డిప్లొమో వంటి కోర్సులను చేయటం ద్వారా మరిన్ని విజయాలను సాధించవచ్చని వివరించారు. సీనియర్ అధ్యాపకులు కె.ప్రకాష్, బీవీ మనోహర్ బాబులు అటానమస్ విధానంలో పరీక్షలు, మార్కులు, గ్రేడ్లు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్ తదితరులు ప్రసంగించారు.

ప్రజలందరిపై ప్రభువు ఆశీస్సులు ఉండాలి

● ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, సెప్టెంబరు 30: పశ్చిమ నియోజకవర్గం, 42వ డివిజన్ హెచ్‌బీ కాలనీలోని క్రీస్తు సంఘం 23వ వార్షికోత్సవం ప్రార్థనా సమావేశం సోమవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరిపై ప్రభువు ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుణదల చర్చి ఫాదర్ ఎస్.కరుణానిధి, మైలవరం జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామ్మోహన్ (గాంధీ), జంపాల సీతారామయ్య, స్థానిక నాయకులు డి.శివాజీ, తిరుపతి సురేష్, చాట్ల రాజశేఖర్, క్రీస్తు సంఘం పెద్దలు, సభ్యులు, పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 30 : యనమలకుదురు శ్రీ రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్ర, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అలంకరణ జరిపారు. పంచహారతులు, పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. తదుపరి సామూహిక భజన కార్యక్రమం, త్రయోదశి సందర్భంగా ప్రదోష సమయంలో మహానందేశ్వర స్వామికి అభిషేకార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను దేవస్థాన ప్రధాన అర్చకులు జీఆర్‌వీ సాగర్ పర్యవేక్షించారు. శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సంగా నరసింహారావు ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారిణి ఎన్.భవానీ పాల్గొన్నారు.

చెత్త, వ్యర్థాలతో మురుగుకాల్వ

● తీవ్ర దుర్వాసన...విజృంభిస్తున్న దోమలు
● భయాందోళన చెందుతున్న స్థానికులు

భారతీనగర్, సెప్టెంబరు 30: పూడికతో నిండిన మురుగు కాల్వతో శివారు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురునానక్ కాలనీ నుంచి భారతీనగర్, నాగార్జున నగర్, శ్రీరామ చంద్రనగర్, కరెన్సీనగర్, కనకదుర్గ నగర్ తదితర కాలనీల మీదుగా మురుగు కాల్వ ప్రవహిస్తోంది. మురుగు కాల్వ పలు చోట్ల చెత్త, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాల్వ నుంచి దుర్వాసన రాకుండా మార్జిన్‌లో బ్లీచింగ్ పౌడర్ చల్లేవారని, ఇటీవల కాలంలో అది కూడా మానేసారని స్థానికులంటున్నారు. మురుగునీరు వల్ల పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయని, ఎక్కడ అనారోగ్యానికి గురవుతామోనని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాల్వ మార్జిన్‌లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదు

గతంలో మురుగు కాలువ నుంచి దుర్వాసన వస్తున్నప్పుడు దానిని నివారించడానికి కాల్వ మార్జిలో బ్లీచింగ్ పౌడర్ చల్లేవారు. ఇటీవల కాలంలో బ్లీచింగ్ పౌడర్ చల్లటమే మానేశారు.

టి.శివాజీ (స్థానికుడు)



కనకదుర్గనగర్ కాలనీ సమీపంలో రంగుమారిన నీరు



శ్రీరామ చంద్రనగర్ కాలనీ సమీపంలో కాల్వలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

ఏసెట్ అక్టోబరు సెషన్ నోటిఫికేషన్

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చురీస్ ఆఫ్ ఇండియా- స్టూడెంట్ నమోదు సహా తదుపరి యాక్చూరియల్ ఎగ్జామ్స్ రాసేందుకు ఉద్దేశించిన 'యాక్చూరియల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏసెట్) 2024 అక్టోబరు సెషన్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఎగ్జామ్‌కు సంబంధించిన వివరాలను అభ్యర్థుల ఈ మెయిల్స్‌కు పంపుతారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం సంస్థ మాక్ టెస్టులు కూడా నిర్వహిస్తుంది. గత ఆరేళ్ల ప్రశ్న పత్రాలు, వాటి సమాధానాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఏసెట్ స్కోర్ వ్యాలిడిటీ మూడేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా, డిగ్రీ కోర్సులు పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మేథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామెట్రిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా చదివిన వారికి; ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, చార్టర్డ్ అకౌంటెంట్, కాస్ట్ అకౌంటెంట్, కంపెనీ సెక్రటరీ కోర్సులు చేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఏసెట్ వివరాలు: పరీక్ష సమయం మూడు గంటలు. ఇందులో మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఇంగ్లీష్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ అంశాలనుంచి 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 100. ఒక మార్కు ప్రశ్నలు 45, రెండు మార్కుల ప్రశ్నలు 20, మూడు మార్కుల ప్రశ్నలు 5 అడుగుతారు. మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌లకు సంబంధించి ఒక్కోదానిలో 30 మార్కులకు; డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇంగ్లీష్‌లకు సంబంధించి ఒక్కోదానిలో 15 మార్కులకు; లాజికల్ రీజనింగ్ నుంచి 10 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. రుణాత్మక మార్కులు లేవు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి.

ఏసెట్ నిర్వహణ: ఇది హోమ్ బేస్డ్ ఆన్‌లైన్ ఎగ్జామ్. ఈ పరీక్ష



రాయదలచుకొన్న అభ్యర్థులు సంస్థ నిర్దేశించిన మేరకు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సాంకేతికతను అందుబాటులో ఉంచుకోవాలి.

- హార్డ్‌వేర్‌కు సంబంధించి పర్సనల్ ల్యాప్‌టాప్/డెస్క్‌టాప్, 640x480 @ 15fps రిజల్యూషన్ ఉన్న వెబ్ కెమెరా, 1 ఎంబీపీఎస్ బ్యాండ్‌విడ్త్‌తో వైర్డ్/వైర్‌లెస్ ఇంటర్నెట్, 2 జీబీ ర్యామ్, 2 కోర్స్-4 థ్రెడ్స్-2.2 గిగా హెర్ట్జ్ ప్రాసెసర్, 64 ఎంబీ గ్రాఫిక్స్ మెమరీ, 1024 x 768కంటే తక్కువ కాకుండా స్క్రీన్ రిజల్యూషన్, మల్టీ మీడియా సపోర్ట్ ఉన్న సౌండ్ కార్డ్ ఏర్పాటు చేసుకోవాలి.
- సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి విండోస్ 10/8/7 ఆపరేటింగ్ సిస్టమ్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్, 4.5.2 నెట్ ఫ్రేమ్ వర్క్ సిద్ధం చేసుకోవాలి.
- పరీక్ష రాసే సమయంలో ఒరిజినల్ ఆధార్ కార్డ్/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్/ఓటర్ ఐడీ కార్డ్/పాన్ కార్డ్‌లను దగ్గర ఉంచుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 5
- **ఏసెట్ 2024 అక్టోబరు సెషన్ తేదీ:** అక్టోబరు 13
- **వెబ్‌సైట్:** www.actuariesindia.org

దిక్సూచి DIKSUCHI

ఎన్టీఆర్ వర్సిటీ మెడికల్ పీజీ నోటిఫికేషన్

విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ/డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మేనేజ్‌మెంట్ కోటా కింద ప్రైవేట్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో; స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్), శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(స్విమ్స్) అనుబంధ కళాశాలల్లో సీట్ల భర్తీకి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 50 శాతం సీట్లను స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద; మిగిలిన 50 శాతం సీట్లను ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు. ప్రైవేట్ అన్ఎయిడెడ్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో 50 శాతం సీట్లను కాంపిటెంట్ అథారిటీ కోటా కింద, మిగిలిన 50 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. పీజీ డిగ్రీ వ్యవధి మూడేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి రెండేళ్లు.

అర్హత: పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. ఆగస్టు 15 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి. నీట్ పీజీ 2024 ఎగ్జామ్‌లో జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 పర్సంటైల్; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 40 పర్సంటైల్; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 45 పర్సంటైల్ మార్కులు ఉండాలి. మెడికల్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** తెలుగు రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థులకు రూ.7080; ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారికి రూ.10,620; విదేశాల్లో చదివినవారికి రూ.15,340
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 4
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

సీటీటీసీలో ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు

భువనేశ్వర్‌లోని సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్(సీటీటీసీ)- ఉచిత శిక్షణ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడు నెలలు. వీటిని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌ఎస్‌డీసీ) స్పాన్సర్ చేస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

సీఎన్‌సీ ఆపరేటర్: సీఎన్‌సీ ఆపరేటర్ టర్నింగ్ ప్రోగ్రామ్‌లో 300 సీట్లు, సీఎన్‌సీ ఆపరేటర్ వర్టికల్ ప్రోగ్రామ్‌లో 250 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** (ఐటీఐ/డిప్లొమా)(మెకానికల్/ఫిట్టర్/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

సీఎన్‌సీ ప్రోగ్రామర్: ఇందులో 210 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** (డిప్లొమా/బీఈ/బీటెక్)(మెకానికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 22
- **వెబ్‌సైట్:** www.cttc.gov.in

ఐసర్ భోపాల్‌లో పీహెచ్‌డీ

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐసర్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు: నేచురల్ సైన్సెస్ స్ట్రీమ్-బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఫిజిక్స్. ● ఇంజనీరింగ్ సైన్సెస్ స్ట్రీమ్- కెమికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్. ● హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ స్ట్రీమ్- ఎకనామిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(కాగ్నిటివ్ సైన్స్, సోషల్ వర్క్ అండ్ సోషియాలజీ)


అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎమ్మెస్సీ/ఎంఏ ఉత్తీర్ణులు; ఎంబీఏ/బీఈ/బీటెక్/బీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/డీబీటీ జేఆర్ఎఫ్/ ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/ఇన్‌స్పైర్ జేఆర్ఎఫ్/రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్/సీఎస్ఐఆర్ ఎల్ఎస్/యూజీసీ ఎల్ఎస్ అర్హత తప్పనిసరి. కనీసం 8 సీజీపీఏ స్కోర్‌తో ఐఐటీల నుంచి బీఈ/బీటెక్ అలాగే ఐసర్ల నుంచి బీఎస్ - ఎంఎస్ పూర్తిచేసినవారికి గేట్/ఫెలోషిప్ అర్హత అవసరం లేదు. మెడికల్ సంబంధిత స్పెషలైజేషన్‌లకు ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు కూడా అర్హులే. జీఆర్ఈ జనరల్ టెస్ట్‌లో 280 స్కోర్/గేట్ వ్యాలిడ్ స్కోర్, టోఫెల్‌లో 60 స్కోర్/ఐఈఎల్‌టీఎస్‌లో 6 స్కోర్ తప్పనిసరి. ● **చివరి తేదీ:** అక్టోబరు 14

- **వెబ్‌సైట్:** www.iiserb.ac.in/

నవ్య | చిత్రజ్యోతి

బెంగాల్ టైగర్‌కు ఫాల్కే పురస్కారం

బాలీవుడ్‌లో 'బెంగాల్ టైగర్'గా పేరొందిన నటుడు మిథున్ చక్రవర్తికి 2022 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ ఇస్తున్నట్లు కేంద్ర సమాచారశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఆశా పరేఖ్, కుష్బూ, విపుల్ అమృత్‌లాల్ షా సభ్యులుగా ఉన్న జ్యూరీ కమిటీ ఈ అవార్డ్‌కు మిథున్ పేరుని ఎన్నిక చేసిందని మంత్రి వెల్లడించారు. దేశంలోని అత్యున్నత పురస్కారాల్లో మూడోది అయిన పద్మభూషణ్ పొందిన ఆరు నెలల కాలంలో భారతీయ చిత్ర పరిశ్రమ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ వరించడంతో బెంగాలీబాబు మిథున్ చక్రవర్తి నట జీవితానికి ఓ సార్థకత లభించిందని చెప్పాలి. మిగతా హీరోల్లా ఆయన కెరీర్ మొదటి నుంచీ అంత సాఫీగా సాగలేదు. ప్రతి దశలోనూ పోరాటమే. విద్యార్థి దశలోనే కాదు చిత్ర పరిశ్రమలోనూ ఆయనది పోరుబాటే. పోరాడి అన్నీ సాధించుకున్నారు మిథున్. అయితే ఆయన అసలు పేరు అది కాదు.. గౌరంగ చక్రవర్తి. 1950 జూన్ 16న కోల్‌కతాలో పుట్టిన గౌరంగ బి.ఎస్సీ చదివారు. వామపక్ష భావజాలం కలిగి ఉండడంతో సమాజంలో పెట్టుబడిదారీ వ్యవస్థ చేస్తున్న దోపిడి చూసి తట్టుకోలేకపోయేవారు. నక్సలిజం ఉద్యమం పట్ల ఆకర్షితుడై సోదరుడితో కలసి అందులో చేరి ఉద్యమకారుడిగా పీడిత ప్రజల్ని ఆకట్టుకున్నారు. అయితే తన సోదరుడు మరణించిన తర్వాత ఉద్యమ బాట వదిలి జనంలోకి వచ్చారు. బెంగాల్‌లో ఇక ఉండలేక ముంబైకి వెళ్లిపోయారు. మొదట్లో సినిమాల మీద ఆసక్తి ఉండేది కాదు. బతకడం కోసం ఏదన్నా ఉద్యోగం చేయాలనుకుని ఓ నైట్ క్లబ్‌లో డాన్సర్‌గా చేరారు. ఆ క్లబ్‌కు వచ్చిన సినీ ప్రముఖుల దృష్టిని ఆకర్షించారు. బెంగాలీ దర్శకుడు మృణాల్ సేన్ 'మృగయా'(1976) చిత్రంలో మిథున్‌కు అవకాశం ఇచ్చారు. అవార్డ్ వచ్చిన సందర్భంగా మిథున్ తన గతాన్ని గుర్తు చేసుకున్నారు. 'ముంబైకి వచ్చిన తొలి రోజుల్లో తినడానికి తిండి దొరికేది కాదు. గార్డెన్‌లో పడుకున్న రోజులు ఉన్నాయి. ఆ కష్టాలు తట్టుకోలేక చచ్చిపోదామని ఎన్నోసార్లు అనిపించేది. కానీ నాకు నేనే ధైర్యం చెప్పుకొన్నా. మంచి రోజులు వస్తాయని నమ్మా. ఆ నమ్మకమే నన్ను నిలబెట్టింది' అని చెప్పారు 74 ఏళ్ల మిథున్.






బాలీవుడ్‌పై బలమైన ముద్ర

తొలి చిత్రంతోనే జాతీయ అవార్డ్ పొందిన మిథున్ చక్రవర్తి నట జీవితాన్ని మలుపు తిప్పిన సినిమా 'డిస్కో డాన్సర్'. అందులో 'ఐయామే డిస్కో డాన్సర్' అంటూ ఆయన తెరపై డాన్స్ చేస్తుంటే థియేటర్లలో ప్రేక్షకులు ఆనందంతో గంతులు వేశారు. అమ్మాయిలు వెర్రెత్తి పోయేవారు. 80ల దశకంలో హిందీ సినిమాపై ఎంతో ప్రభావం చూపిన నటుడాయన. హీరో అనే పదానికి అర్థం మార్చేసిన మిథున్ 1989లో 19 చిత్రాల్లో నటించి రికార్డ్ నెలకొల్పారు. బాలీవుడ్‌లో 'బెంగాల్ టైగర్'గా పేరు తెచ్చుకోవడమే కాదు రెండుసార్లు ఉత్తమ నటుడిగా, ఒకసారి సహాయ నటుడిగా మిథున్ జాతీయ అవార్డులు అందుకొన్నారు. హిందీలోనే కాకుండా బెంగాలీ, ఒరియా, భోజ్‌పురి భాషల్లో 370 పైగా చిత్రాల్లో నటించారు. తెలుగులో పవన్‌కల్యాణ్ నటించిన 'గోపాల గోపాల'లో విలన్‌గా ఆకట్టుకొన్నారు. ఆమధ్య వచ్చిన 'కశ్మీరీ ఫైల్స్' చిత్రంలో మిథున్ నటనని ప్రేక్షకులు మరువలేరు. మంచి పాత్రల కోసం ఇప్పటికీ పరితపించే ఈ నటుడు తనకు వచ్చిన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్‌ను తన కుటుంబానికి, అభిమానులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. అక్టోబర్ 8న జరిగే జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మిథున్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ అందజేస్తారు.

రా మచ్చా

రామ్ చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం నుంచి రెండోపాటను మేకర్స్ సోమవారం విడుదల చేశారు. 'రా మచ్చా మచ్చా' అంటూ హీరో పాత్రను



పరిచయం చేస్తూ సాగే ఈ గీతానికి అనంత్ శ్రీరామ్ సాహిత్యం అందించారు. తమన్ స్వరాలు సమకూర్చగా, నకాష్ అజీజ్ ఆలపించారు. ఈ చిత్రంలో రామ్‌చరణ్ సరసన కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్నారు. దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: తిరుణావుక్కరుసు

శివరాత్రి పాట చిత్రీకరణలో



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా రూపొందుతున్న చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. భారీ సెట్ వేసి అందులో నాగచైతన్య సాయిపల్లవిపై శివరాత్రి నేపథ్యంలో సాగే గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సందర్భంగా పాట చిత్రీకరణకు సంబంధించిన రెండు పోస్టర్స్‌ను చిత్ర బృందం సోమవారం విడుదల చేసింది. శివ పార్వతులను తలపించేలా నర్తిస్తున్న నాగచైతన్య, సాయిపల్లవి జంట ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సంగీతం: దేవి శ్రీ ప్రసాద్. సినిమాటోగ్రఫీ: షామ్‌దత్.

కమిటీ కుర్రోళ్లు యాభై రోజుల వేడుక



నిహారిక కొణిదెల సమర్పణలో పణి అడపాక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం యాభై రోజుల వేడుక సోమవారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగింది. సీనియర్ నటీనటులతో పాటు పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తూ నిర్మించిన ఈ చిత్రానికి యదు వంశీ దర్శకత్వం వహించారు. ఈ వేడుకకు నాగబాబు, దిల్ రాజు ముఖ్య అతిథులుగా హాజరైన యూనిట్ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ రోజుల్లో ఒక సినిమా 50 రోజులు పూర్తి చేసుకోవడం అరుదనీ, 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఆ రికార్డ్ సాధించినందుకు అతిథులు అభినందించారు.

దసరాకు వస్తున్న రాజావారు

ఇన్ ప్రోగ్రెస్



నార్నే నితిన్ హీరోగా సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రం దసరాకు విడుదల కానుంది. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో సంపద హీరోయిన్. ఈ టీజర్‌ను దర్శకుడు వంశీ పైడిపల్లి విడుదల చేసి, టీమ్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ'నార్నే నితిన్ నటిస్తున్న మరో మంచి సినిమా 'శ్రీశ్రీశ్రీ రాజావారు', దసరాకు విడుదల చేస్తున్నాం' అన్నారు.


పరిష్కారం చూపే ప్రయత్నం



'మంత్ర' ఫేం ఓషో తులసీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ థ్రిల్లర్ 'దక్షిణ'. సాయిధన్సిక లీడ్‌రోల్ పోషించారు. ఈ నెల 4న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తులసీరామ్ మాట్లాడుతూ 'ఇదొక సూపర్ థ్రిల్లర్. సమాజంలో అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, వాటికి పరిష్కారం చూపే ప్రయత్నం చేశాం' అన్నారు. సినిమా ఆసక్తికరంగా ఉంటుంది, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని సాయిధన్సిక చెప్పారు.

పవన్‌ను విమర్శించేవాళ్లు సూడో సెక్యులరిస్ట్‌లు

'పవన్ కల్యాణ్ అసలైన సెక్యులరిస్ట్. ఆయన్ను విమర్శించేవాళ్లంతా సూడో సెక్యులరిస్ట్‌లు' అని నటుడు నాగబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న నాగబాబు తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై స్పందించారు. 'వైకాపా నాయకుల విమర్శలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. లడ్డూ కల్తీకి పాల్పడిన వారు ఎవరనేది విచారణలో తేలుతుంది. ప్రభుత్వాల అవినీతి వల్ల హిందూ ధర్మానికి ఆపద వాటిల్లుతోంది అనేదే పవన్ ఆవేదన. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంతో హిందూ ధర్మంపై జరుగుతున్న కుట్రలు పతాక స్థాయికి చేరాయి. హిందూ ధర్మ రక్షణ మండలి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది' అని నాగబాబు అన్నారు. ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన తెలుగు రాష్ట్రాల్లోని శ్రీవారి భక్తులకు మద్దతుగా సంగీత దర్శకుడు కీరవాణి 'ఓం నమో నారాయణాయ' పేరుతో ఓ ఆడియో రికార్డును విడుదల చేశారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో కీరవాణికి, ఆయన బృందానికి అభినందనలు తెలిపారు.



నాగబాబు

దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగొద్దు : ప్రకాశ్‌రాజ్

తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అంశం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి వరుస ట్వీట్లతో తన అభిప్రాయాలను తెలుపుతూ వార్తల్లో నిలుస్తున్నారు నటుడు ప్రకాశ్‌రాజ్. లడ్డూ కల్తీ అంశంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ప్రకాశ్ రాజ్ మరోసారి సోషల్ మీడియా వేదికగా 'జస్ట్ ఆస్కింగ్' అంటూ తనదైన శైలిలో స్పందించారు. 'దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగకండి' అంటూ దండం పెడుతున్న ఎమోజీలను ఆయన పోస్ట్ చేశారు.

సిస్టర్ సెంటిమెంట్‌తో



రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వీ ప్రధాన పాత్రలు పోషించిన 'చిట్టి.. పొట్టి' చిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. భాస్కర్ యాదవ్ దాసరి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన సినిమా ఇది. ఈ సందర్భంగా దర్శకనిర్మాత మాట్లాడుతూ 'అన్నా చెల్లెలు అనుబంధం కథాంశంగా రూపుదిద్దుకున్న సినిమా ఇది. చెల్లెలుగా, మేనత్తగా, చివరికి బామ్మగా .. ఓ మహిళ జీవితంలోని ఎమోషనల్ జర్నీని ఇందులో చూపించాం. అక్టోబర్ 3న విడుదల చేస్తున్నాం' అని చెప్పారు.

వినోదం ప్లస్ సందేశం



సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించిన చిత్రం 'లగ్గం'. రాజేంద్రప్రసాద్ కీలకపాత్ర పోషించారు. రమేశ్ చెప్పాల దర్శకత్వంలో వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది. హీరో సుధీర్‌బాబు ఈ చిత్రం రిలీజ్ డేట్ పోస్టర్‌ను ఆవిష్కరించి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. పెళ్లి నేపథ్యంలో వినోదంతో పాటు చక్కని సందేశంతో తెరకెక్కిన చిత్రమిదని దర్శకుడు తెలిపారు. సంగీతం: మణిశర్మ, చరణ్ అర్జున్, సినిమాటోగ్రఫీ: బాల్‌రెడ్డి

ముగింపు మెప్పిస్తుంది



నోయల్, రిషిత నెల్లూరు జంటగా నటించిన 'బహిర్భూమి' చిత్రం ఈ నెల నాలుగున విడుదల కానుంది. రామ్‌ప్రసాద్ కొండూరు దర్శకత్వంలో మచ్చ వేణుమాధవ్ నిర్మించారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత మాట్లాడుతూ 'న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ బిల్ బోర్డ్ మీద మీ సినిమా ట్రైలర్‌ను డిస్ ప్లే చేస్తున్నాం. తెలుగులో విడుదల చేసిన తర్వాత మిగిలిన భాషల్లో రిలీజ్ చేస్తాం' అని చెప్పారు. బహిర్భూమి అనే టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూస్తే అర్థమవుతుందని దర్శకుడు చెప్పారు. ఈ సినిమా ముగింపు ప్రేక్షకులను మెప్పిస్తుందని నోయల్ చెప్పారు.

కొత్త కాన్సెప్ట్



సుగి విజయ్, జుప్పి భద్ర హీరోహీరోయిన్లుగా నటిస్తున్న 'ఐ హేట్ మ్యారేజ్ ' చిత్రం షూటింగ్ సోమవారం హైదరాబాద్‌లో మొదలైంది. పరమేశ్ రేణుకుంట్ల దర్శకత్వంలో ఎం. దయానంద్ నిర్మిస్తున్నారు. నేటి యువతరంతో పాటు కుటుంబ సభ్యులకు నచ్చే భావోద్వేగాలతో ఈ సినిమా ఉంటుందనీ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉంటుందనీ దర్శకుడు చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'రొటీన్‌కు భిన్నంగా కొత్త కాన్సెప్ట్‌తో చిత్రాన్ని తీస్తున్నాం. డిసెంబర్ వరకూ ఏకధాటిగా జరిగే షూటింగ్‌తో చిత్రం పూర్తవుతుంది' అని చెప్పారు.

కలి స్ఫూర్తిగా



జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు అనే అంశాన్ని 'కలి' చిత్రంలో చూపించబోతున్నాం. కలి పురుషుడి పాత్రను స్ఫూర్తిగా తీసుకొని ఈ చిత్రం తెరకెక్కించాను' అని దర్శకుడు శివశేషు అన్నారు. ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శివశేషు సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'సమయాన్ని, ఆత్మను ఆధారంగా చేసుకొని కలి ఈ యుగాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాడు అనేది ఆసక్తికరంగా చూపించాం. ఇందులో మంచి ప్రేమకథ కూడా ఉంది. వీఎఫ్ఎక్స్ మా సినిమాకు ప్రత్యేకార్షణ' అని చెప్పారు.



చక్కెరకు ప్రత్యామ్నాయంగా..

చక్కెరతో బరువు పెరుగుతామనే విషయం అందరికీ తెలిసిందే! అయితే బరువు పెంచే చక్కెరకు కొన్ని సురక్షితమైన ప్రత్యామ్నాయాలున్నాయి. వాటి గురించి తెలుసుకుందాం!

- **స్టీవియా:** స్టీవియా మొక్కతో తయారయ్యే ఈ సహజసిద్ధ తీపిపదార్థం చక్కెరను మించి తీయగా ఉంటుంది. అయినా దీన్లో క్యాలరీలు ఉండవు. కాబట్టి రక్తంలో చక్కెర మోతాదులను అదుపులో ఉంచుకునేవారు, మరీ ముఖ్యంగా మధుమేహులు స్టీవియాను ఎంచుకుంటూ ఉంటారు. ఆహారంలో చక్కెరను పూర్తిగా మానేయాలనుకునేవారు కూడా తీపి తినాలని అనిపించినప్పుడు స్టీవియాతో తయారుచేసుకున్న స్వీట్లను ఎంచుకోవచ్చు.
- **మాంక్ ఫ్రూట్:** మాంక్ ఫ్రూట్ ఎక్స్‌ట్రాక్ట్ చక్కెరతో సమానంగా తీయగా ఉంటుంది. ఎలాంటి క్యాలరీలు, గ్లైసెమిక్ ఇండెక్స్‌లూ లేని మాంక్ ఫ్రూట్ గుజ్జు బేకింగ్‌లకూ, కాఫీల్లో కలుపుకోడానికీ బాగుంటుంది. ఈ ప్రాచీన పండును సంప్రదాయ ఔషధ తయారీల్లో కూడా ఉపయోగిస్తూ ఉంటారు.
- **ఎరిథ్రిటాల్:** పండ్లు, పులియబెట్టిన పదార్థాల్లో దొరికే ఈ షుగర్ ఆల్కహాల్‌లో 70 శాతం చక్కెర తీయదనం ఉంటుంది. అయినా దీన్లో ఏమాత్రం క్యాలరీలు ఉండవు. ఇది రక్తంలోని చక్కెర మోతాదును ఏమాత్రం పెంచదు. కాబట్టే తక్కువ కార్బ్స్‌తో కూడిన కీటోజెనిక్ డైట్‌ను అనుసరించేవాళ్లు తీయదనం కోసం దీన్నే ఎంచుకుంటూ ఉంటారు.
- **అల్యులోజ్:** రుచిలో చక్కెరకు ఏమాత్రం తీసిపోని అల్యులోజ్ కేవలం 10% క్యాలరీలనే కలిగి ఉంటుంది. ఇది నాన్ గ్లైసెమిక్ కూడా! అంటే దీన్ని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర మోతాదులు ఏమాత్రం పెరగవు. కాబట్టి డిజర్ట్ మొదలు డ్రెస్సింగ్‌ల వరకూ ఈ గిల్ట్ ఫ్రీ తీపిని ఎంచుకోవచ్చు.
- **యాకాన్ సిరప్:** యాకాన్ మొక్క నుంచి సేకరించే సిరప్ క్యారమెల్ రుచిని కలిగి ఉంటుంది. ప్రిబయోటిక్స్ సమృద్ధిగా కలిగి ఉండే ఈ సిరప్ తీయదనాన్ని కలిగి ఉండడంతో పాటు పేగుల ఆరోగ్యానికి కూడా తోడ్పడుతుంది. రోజంతా శక్తి మోతాదులు సమంగా కొనసాగడానికి తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉండే ఈ సిరప్, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉండే ఈ సిరప్‌ను ఎంచుకోవచ్చు.

ఫిట్‌నెస్

కుర్చీలో వ్యాయామం

ఎక్కువ సమయాల పాటు కంప్యూటర్లకు అతుక్కుని పని చేసే ఉద్యోగాలు మనవి. అలాంటప్పుడు శరీరంలో కొవ్వు పేరుకుపోవడం సహజం. జిమ్‌కు వెళ్లే సమయం కూడా దొరకని పరిస్థితి. ఇలాంటి వాళ్లు కుర్చీలో కూర్చుని చేసుకునే వ్యాయామాలు కూడా ఉన్నాయి. అవే ఇవి!

- **సిట్టింగ్ క్రంచెస్:** కుర్చీ అంచు మీద నిటారుగా కూర్చుని, చేతులను మడిచి తల వెనక ఉంచుకోవాలి. తర్వాత ఛాతీ మోకాళ్లకు తగిలేలా వంగాలి. ఇలా వంగేటప్పుడు శ్వాస వదులుతూ పైకి లేచేటప్పుడు శ్వాస పీల్చుకోవాలి. ఇలా 15 సార్లు, 3 సెట్లు చేయాలి.



- **బటర్‌ఫ్లై పోజ్:** బద్ధకోణాసనంతో కూడా పొట్ట కొవ్వును కరిగించవచ్చు. ఈ ప్రయోజనంతో పాటు, ఒత్తిడి కూడా తగ్గుతుంది. ఈ వ్యాయామం కోసం, కుర్చీలో నిటారుగా కూర్చుని, మోకాళ్లను మడిచి, నడుము దగ్గరకు తీసుకురావాలి. ఇలా చేస్తున్నప్పుడు రెండు పాదాలనూ బలంగా ఆనించి ఉంచి, చేతులతో పట్టుకోవాలి. తర్వాత అదే భంగిమలో మోకాళ్లను పైకి, కిందకూ లేపి, దించాలి. ఇలా 15 సార్లు, 3 సెట్స్ చేయాలి.
- **సిట్టింగ్ స్ట్రెయిట్:** కుర్చీలో నిటారుగా కూర్చునే అలవాటు అలవరుచుకోవాలి. ఈ అలవాటుతో రోజుకు 350 క్యాలరీలు ఖర్చవుతాయి. కాబట్టి జారిగిలబడి కూర్చోకుండా, వెన్ను కుర్చీకి ఆనుకుని ఉండేలా నిటారుగా కూర్చోవాలి.
- **అంకెలు గీయాలి:** కుర్చీలో కూర్చుని, కాలి వేళ్లతో గాల్లో అంకెలు, అక్షరాలు గీయడం సాధన చేయాలి. ఇలా చేయడం వల్ల కాలి పిక్కలు, తొడ కండరాలు, లిగమెంట్లు, టెండాన్లు ఆరోగ్యంగా మారతాయి. కాళ్లకు వ్యాయామం దొరుకుతుంది.

హెర్బల్ హెల్త్

కర్పూరవల్లి కమనీయం

వాము ఆకునే కర్పూరవల్లి అంటారు. దీనికి మెక్సికన్ మింట్ అనే ఇంకొక పేరు కూడా ఉంది. కొద్దిపాటి జాగ్రత్తలతో, చిన్న ప్రదేశాల్లో ఈ మొక్కను పెంచుకోవచ్చు. పోషకాల నిలయమైన ఈ ఆకుతో ఒరిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!


- ఈ ఆకు, గొంతు నొప్పి, జలుబులను తగ్గిస్తుంది. ఆకును నమలి, రసం మింగడం వల్ల గొంతు నొప్పి తగ్గుతుంది. ఆకు రసాన్ని తేనెతో కలిపి తీసుకోవడం వల్ల జలుబు తగ్గుతుంది.
- వానాకాలం, చలికాలాల్లో ఈ ఆకుతో బజ్జీలు వండుకుని తినడం ద్వారా దీన్లోని ఔషధగుణాలను ఉపయోగించుకోవచ్చు.



- ఈ ఆకులను నూరి గాయాలకు, దెబ్బలకూ, కాలిన బొబ్బలకూ పట్టు వేయవచ్చు.
- అజీర్తి, నోటి పుండ్లు, చర్మ ఇన్‌ఫెక్షన్లు, వెక్కిళ్లు, పొట్టలో నొప్పుల నుంచి ఈ ఆకు ఉపశమనాన్ని అందిస్తుంది.
- ఇమ్యూనిటీని పెంచుకోవడం కోసం ఈ ఆకులతో తయారుచేసుకున్న కషాయం తాగాలి.
- కర్పూరవల్లి ఆకులను మరగకాచి, ఆవిరి పడితే ఛాతీలో పేరుకున్న కఫం కరుగుతుంది. రసాన్ని ఛాతీకి పూసుకున్నా ఫలితం ఉంటుంది.
- కర్పూరవల్లితో తయారుచేసిన ఎసెన్షియల్ ఆయిల్, యాంటీ కేన్సర్ గుణాలను కనబరిచినట్టు పరిశోధనల్లో రుజువైంది.

ఆంధ్రజ్యోతి
9
నవ్య డాక్టర్
మంగళవారం • 1 అక్టోబరు 2024

> కుటుంబ చరిత్రలో పెద్దపేగు, ప్రోస్టేట్ కేన్సర్ ఉంటే, నడి వయసులో ఈ కేన్సర్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి 45 ఏళ్లకే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.



విదేశాలతో పోలిస్తే, మన దేశంలో ప్రోస్టేట్ కేన్సర్ ఉధృతి తక్కువ. అయినప్పటికీ మొదటి స్థానంలో ఉన్న లంగ్ కేన్సర్ స్థానాన్ని అధిగమించే స్థాయికి ఈ కేన్సర్ కేసులు పెరిగిపోడానికి కారణం అప్రమత్తత లోపమే అంటున్నారు వైద్యులు. అందుబాటులో ఉన్న అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలతో ప్రోస్టేట్ కేన్సర్‌కు ఎలా అడ్డుకట్ట వేయవచ్చో వివరిస్తున్నారు.



పని పడదాం!

మన దేశంలో పురుషుల్లో తలెత్తే రెండవ అత్యంత సాధారణ కేన్సర్ ఇది. మొదటిది... లంగ్ కేన్సర్. ధూమపానంతో లంగ్ కేన్సర్ సోకుతుందనే అవగాహన పెరగడంతో ఈ కేన్సర్ కేసులు తగ్గుముఖం పట్టాయి. కానీ రెండో స్థానానికి పరిమితమైన ప్రోస్టేట్ కేన్సర్ ఉధృతి ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోయింది. ఇందుకు కారణం ఈ కేన్సర్ పట్ల అవగాహన లేకపోవడమే! వయసుతో పాటు పెరిగే ఈ ప్రోస్టేట్ గ్రంథి మూత్రాశయం దిగువన నెలకొని ఉంటుంది. దీన్లోని కణాల్లో తలెత్తే అసహజ మార్పులు, కణ విచ్ఛిత్తి మూలంగా ప్రోస్టేట్‌లో కణితి ఏర్పడుతుంది. ఇలా గ్రంథికే పరిమితమైన కేన్సర్‌ను నయం చేయడం తేలిక. ఒకవేళ కేన్సర్ గ్రంథిని దాటి బయటకు విస్తరిస్తే, దాన్ని తీవ్రమైన కేన్సర్‌గా పరిగణించి తదనుగుణంగా చికిత్స చేయవలసి ఉంటుంది. కాబట్టి సులువైన చికిత్సతో ప్రోస్టేట్ కేన్సర్ నుంచి శాశ్వత విముక్తి పొందాలంటే, దాన్ని తొలినాళ్లలోనే కనిపెట్టడం అవసరం.

కారణాలు కోకొల్లలు

ప్రోస్టేట్ కేన్సర్ సోకడానికి ఎన్నో కారణాలున్నాయి. ప్రధానంగా 65 ఏళ్లు పైబడిన వృద్ధుల్లో ఈ కేన్సర్ కనిపిస్తూ ఉంటుంది. అలాగే పెద్ద వయసుతో సంబంధం లేకుండా 40 నుంచి 45 ఏళ్లకే కేన్సర్ సోకే అవకాశాలూ లేకపోలేదు. అందుకు కారణాలున్నాయి.



జన్యుపరమైన కారణాలు: కుటుంబ చరిత్రలో పెద్దపేగు, ప్రోస్టేట్ కేన్సర్ ఉంటే, నడి వయసులో ఈ కేన్సర్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి 45 ఏళ్లకే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.

మెటబాలిక్ సిండ్రోమ్: ఒబేసిటీ, అదుపు తప్పిన మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ కూడా ప్రోస్టేట్ కేన్సర్ సోకే అవకాశాలను పెంచుతాయి.

హెచ్చరికలను కనిపెట్టాలి

ప్రోస్టేట్ కేన్సర్ కొన్ని లక్షణాల రూపంలో బయల్పడుతూ ఉంటుంది. మూత్రాశయం దిగువన ఉంటుంది కాబట్టి కేన్సర్‌తో దీని పరిమాణం పెరగగానే మూత్రవిసర్జనలో ఇబ్బంది తలెత్తుతుంది. విసర్జన కష్టంగా మారడం, తరచూ మూత్రవిసర్జన అవసరం పడుతూ ఉండడం, అత్యవసరంగా మూత్రవిసర్జన చేయవలసి వస్తూ ఉండడం, మూత్రం పూర్తిగా బయటకు వెళ్లిపోకుండా, లోపలే మిగిలిపోతూ ఉండడడం, మూత్రంలో రక్తం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే పెద్ద వయసులో ప్రోస్టేట్ గ్రంథి పరిమాణం పెరగడం సహజం. కాబట్టి ఈ లక్షణాలు కనిపించినంత వాళ్లందర్లో కేన్సర్ ఉంటుందని భావించడానికి వీల్లేదు. అయినప్పటికీ వయసుతో సంబంధం లేకుండా ఈ లక్షణాలు కనిపించిన ప్రతి ఒక్కరూ ప్రోస్టేట్ పరీక్షలు చేయించుకోవాలి. మరీ ముఖ్యంగా కుటుంబ చరిత్రలో ఈ కేన్సర్ ముప్పు ఉన్నవాళ్లు 40 ఏళ్ల నుంచీ ప్రతి ఏటా ప్రోస్టేట్‌ను పరీక్షించుకుంటూ ఉండాలి.

భిన్నమైన దశల్లో...

ప్రోస్టేట్ కేన్సర్ ఎన్నో దశల్లో బయల్పడుతూ ఉంటుంది. తొలి దశలోనే బయల్పడినప్పుడు, రోబోటిక్ సర్జరీ ద్వారా ప్రోస్టేట్‌ను సమూలంగా తొలగించగలిగితే కేన్సర్ నుంచి పూర్తిగా బయటపడవచ్చు. ముదిరిన తర్వాత ప్రోస్టేట్‌ను తొలగించినా ప్రయోజనం ఉండదు కాబట్టి దాన్ని అలాగే వదిలేసి హార్మోన్ థెరపీ, కీమో, రేడియేషన్‌లను ఆశ్రయించవలసి ఉంటుంది. కేన్సర్ కణాలు టెస్టోస్టెరాన్ పురుష హార్మోన్ ను ఆహారంగా తీసుకుంటూ వృద్ధి చెందుతూ ఉంటాయి. కాబట్టి శరీరంలో ఈ హార్మోన్ మోతాదును తగ్గిస్తూ, అదనపు హార్మోన్లను అందిస్తూ చికిత్సను కొనసాగించాల్సి ఉంటుంది. పూర్వం ప్రోస్టేట్ కేన్సర్ సోకిన వాళ్లందరికీ ఒకే రకమైన చికిత్సా విధానాన్ని అనుసరించే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు వ్యాధి తీవ్రత ఆధారంగా వైద్యులు చికిత్సను ఎంచుకుంటున్నారు. బాడీ బిల్డింగ్ చేసేవాళ్లు, టెస్టోస్టిరాన్ హార్మోన్‌ను అదనంగా తీసుకుంటూ ఉంటారు. అయితే ఇలా అదనంగా తీసుకోవడం వల్ల ప్రోస్టేట్ కేన్సర్ సోకే అవకాశాలు ఉన్నాయని ఇప్పటివరకూ నిరూపణ కానప్పటికీ, ఈ ముప్పు పొంచి ఉన్న వాళ్లు, అప్పటికే ప్రోస్టేట్ కేన్సర్ సోకి ఉన్న వాళ్లు అదనంగా ఈ హార్మోన్‌ను తీసుకోవడం వల్ల కేన్సర్ ఉధృతి పెరిగిపోతుంది. కాబట్టి ఈ హార్మోన్‌ను తీసుకోవాలనుకున్న వాళ్లు ముందుగా వైద్యుల సలహా తీసుకోవడం తప్పనిసరి.

నియంత్రణ ఇలా...



ప్రోస్టేట్ కేన్సర్ రాకుండా నియంత్రించడం కష్టం. కానీ దాన్ని ముందుగానే కనిపెట్టడం మన చేతుల్లోనే ఉంటుంది. కాబట్టి ముప్పు ఉన్నప్పటికీ, లేనప్పటికీ ముందస్తుగా అప్రమత్తంగా వ్యవహరించడం అవసరం. అలాగే వీలైనంత మేరకు ఆరోగ్యకరమైన అలవాట్లతో కేన్సర్ సోకే అవకాశాలను తగ్గించుకోవచ్చు. అవేంటంటే...

- ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగే ఆహారం తీసుకోవాలి
- యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా దొరికే ఆహారం తినాలి. యాంటీఆక్సిడెంట్లు ఫ్లేవనాయిడ్స్‌లో ఎక్కువగా ఉంటాయి. ఈ యాంటీఆక్సిడెంట్లకు కేన్సర్‌ను నిలువరించే గుణాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, ఇవ ఎక్కువగా ఉండే, సహజసిద్ధ ముదురు రంగులను కలిగిన టమేటా, క్యారట్, బీట్‌రూట్, బ్లూబెర్రీ లాంటివి తింటూ ఉండాలి.
- శరీర బరువును నియంత్రణలో పెట్టుకోవాలి. ఒత్తిడి తగ్గించుకోవాలి.
- మధుమేహం, రక్తపోటు, కొలెస్ట్రాల్‌లను నియంత్రణలో పెట్టుకోవాలి.
- క్రమం తప్పక వ్యాయామం చేయాలి.
- కుటుంబ చరిత్రలో కేన్సర్ ఉంటే, 45 ఏళ్ల వయసు నుంచి, ఇతరులు 50 ఏళ్ల నుంచీ ప్రోస్టేట్ స్క్రీనింగ్ చేయించుకోవాలి.



సమర్థమైన ఆధునిక పరీక్షలు

- **పిఎస్ఎ పరీక్ష:** ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్ టెస్టింగ్. ఇది రక్త పరీక్ష. కేన్సర్ ప్రోస్టేట్‌లోనే పెరగాలనే నియమం లేదు. మూత్ర ఇన్‌ఫెక్షన్లు, ఇతరత్రా ఇన్‌ఫెక్షన్లు కూడా కేన్సర్‌కు దారి తీయవచ్చు. కాబట్టి 50 ఏళ్లు దాటిన పురుషులందరూ ఈ పరీక్ష చేయించుకోవడం తప్పనిసరి. ఈ పరీక్షలో కేన్సర్ సోకినట్టు అనుమానం ఉంటే, ఎమ్మారై, ప్రోస్టేట్ బయాప్సీలతో కేన్సర్‌ను నిర్ధారించుకోవచ్చు.
- **జీనోమిక్ ప్రొఫైల్:** ఫస్ట్ డిగ్రీ రిలేటివ్స్ (తండ్రి, సోదరులు)కు ప్రోస్టేట్ కేన్సర్ ఉండి ఉంటే, జీనోమిక్ ప్రొఫైల్ చేయించుకుని కేన్సర్ సోకే అవకాశాలను ముందుగానే పసిగట్టవచ్చు. కాబట్టి ఈ కోవకు చెందిన వాళ్లు 40 నుంచి 45 ఏళ్ల వయసులో ఈ పరీక్ష చేయించుకోవాలి.

డాక్టర్ రాజేష్ కుమార్ రెడ్డి అడపాల
కన్సల్టెంట్ యూరో ఆంకాలజిస్ట్,
ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూరో ఆంకాలజీ అండ్ రోబోటిక్,
ఎఐఎన్‌యు,
బంజారాహిల్స్,
హైదరాబాద్.



అవగాహన

కల్తీ లేని నెయ్యి దొరుకుతుందా?

మంది ఎంత పెరిగినా, బజార్లో దొరికే నేతి మిఠాయిలకు కొదవుండదు. ఇక్కడే నెయ్యి తాజాదనం గురించి తార్కికంగా ఆలోచించాలి. స్వచ్ఛమైన నెయ్యిని పొందడం కోసం కల్తీలను పసిగట్టడంతో పాటు, ఇంట్లో స్వయంగా నేతిని తయారుచేసుకోగలిగే మెలకువల గురించి తెలుసుకోవాలి.

మనం కూరగాయలు, పండ్లు, పూల మొక్కలు పెంచుకుంటాం. పప్పుధాన్యాలు పండించుకుంటాం. కోళ్లు, మేకలను పెంచుకుంటాం! తిరగళ్లతో పిండ్లు ఇసురుకుంటాం! కానీ ఘన, ద్రవ రూపాల్లోని కొవ్వులను మాత్రం బయటి నుంచే కొనుక్కుంటూ ఉంటాం! వంటల కోసం, రుచి కోసం ఉపయోగించే నూనెలు, నెయ్యిలను ఇళ్లలో తయారు చేసుకునే సంప్రదాయం క్రమేపీ అడుగంటింది. అవసరం పెరగడం, ఉత్పత్తులు తగ్గడం వల్ల కల్తీలు సర్వత్రా సర్వసామాన్యపోయాయి. నెయ్యిలోని పోషక విలువల గురించి అవగాహన పెరిగిన తర్వాత, తాజా నెయ్యి కోసం వెంపర్లాట ఊపందుకుంది. కానీ కల్తీ లేని నెయ్యి బజార్లో దొరుకుతుందా? నిజానికి ఎంత ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉన్నా, నూరు శాతం స్వచ్ఛమైన నెయ్యి దొరకని పరిస్థితి నెలకొని ఉంది. అయినా పిండి వంటల తయారీ కోసం, భోజనంలో రుచిని పెంచుకోవడం కోసం తరచూ నెయ్యి మీద ఆధారపడక తప్పడం లేదు. దాంతో మార్కెట్లో దొరికే బ్రాండెడ్ ఘీల మీద ఆధారపడుతున్నాం. లేదంటే గ్రామాల్లో గాలించి తెచ్చుకుంటున్నాం. అయితే ఇలా మనం స్వచ్ఛమైన నెయ్యినే కొంటున్నామా?

కల్తీ నెయ్యిని ఇలా కనిపెట్టాలి

నెయ్యి విషయంలో కళ్లు, ముక్కు మనల్ని మోసం చేయలేవు. ఘుమఘుమలాడుతూ, లేత బంగారు రంగులో కనిపించేది మాత్రమే స్వచ్ఛమైన నెయ్యి. రంగు, వాసనలు, గాఢతలో తేడాలు కనిపిస్తే, కొన్ని తేలికపాటి పరీక్షలతో నెయ్యిలో జరిగిన కల్తీని సునాయాసంగా కనిపెట్టవచ్చు. అదెలాగంటే...

- **పాల అవక్షేప పరీక్ష:** తెల్ల పేపర్ లేదా ప్లేటు మీద ఒక స్పూను నెయ్యిని వేసి, కొన్ని గంటల పాటు అలాగే వదిలేయాలి. తర్వాత పేపర్, లేదా ప్లేటు మీద ఏవైనా మలినాలు, అవక్షేపాలు కనిపిస్తే ఆ నెయ్యి కల్తీదని అర్థం చేసుకోవాలి. స్వచ్ఛమైన నెయ్యితో ఎలాంటి మరకలు ఏర్పడవు.
- **స్పష్టత, ఆకృతి:** స్వచ్ఛమైన నెయ్యి పారదర్శకంగా ఉంటుంది. నున్నని టెక్స్చర్‌ను కలిగి ఉంటుంది. మనకగా ఉన్నా, కణుపులు కనిపించినా, ముద్దగా ఉన్నా దాన్లో కల్తీ జరిగిందని అర్థం చేసుకోవాలి. స్వచ్ఛమైన నేయి, గది ఉష్ణోగ్రతలో ద్రవ రూపంలో ఉంటుంది.



- **బర్న్ టెస్ట్:** ఒక టీ స్పూను నెయ్యిని ప్యాన్‌లో వేడి చేసి అది కల్తీదో కాదో కనిపెట్టవచ్చు. స్వచ్ఛమైన వేడి తగిలిన వెంటనే ఎలాంటి పొగలు, మాడు వాసనలను వెలువరించకుండా క్షణాల్లో కరిగిపోతుంది. మలినాలు కలిసిన నెయ్యి పొగలు, దుర్వాసనలను వెలువరిస్తుంది.
- **నీళ్ల పరీక్ష:** గోరువెచ్చని నీళ్లలో కొద్ది పాటి నెయ్యిని వేయాలి. నెయ్యి స్వచ్ఛమైనదైతే వెంటనే నీళ్లలో కరిగిపోతుంది. నీళ్లు కూడా స్పష్టంగా ఉంటాయి. ఒకవేళ ఏదానా మడ్డి, మలినాలు నెయ్యి నుంచి వేరుపడితే, అది కల్తీదని అర్థం చేసుకోవాలి.
- **ఫ్రిజ్ పరీక్ష:** నెయ్యిని కొన్ని గంటల పాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. స్వచ్ఛమైన నెయ్యి హెచ్చుతగ్గులు లేకుండా సమంగా గడ్డకడుతుంది. దీన్లో వేర్వేరు పొరలు, స్ఫటికాలూ కనిపించవు. హెచ్చుతగ్గులతో కూడిన పొరలు, స్ఫటికాలూ కనిపిస్తే అది కల్తీ నెయ్యిని అర్థం.
- **రుచి పరీక్ష:** స్వచ్ఛమైన నెయ్యి నోట్లో వేసుకున్నప్పుడు వెన్నలా తగులుతుంది. కల్తీ నెయ్యి తేలికగా గొంతులోకి జారకుండా, దంతాలకూ, నాలుకకూ అంటుకుంటుంది.
- **మరక పరీక్ష:** స్వచ్ఛమైన నెయ్యి ఎలాంటి మరకలనూ ఏర్పరచదు. వస్త్రం మీద నెయ్యి మరక ఏర్పడినా, ఏవైనా అవక్షేపాలు మిగిలిపోయినా ఆ నెయ్యి కచ్చితంగా కల్తీదే!

> **నెయ్యి నిల్వ ఇలా...**
> **నెయ్యి గది ఉష్ణోగ్రతలో 3 నుంచి 4 నెలల వరకూ చెక్కుచెదరకుండా ఉంటుంది. ఫ్రిజ్‌లో ఏడాది వరకూ నిల్వ ఉంటుంది. ఒకవేళ గడ్డకట్టిపోకుండా ఉండాలనుకుంటే, నెయ్యి సీసాలో చిన్న బెల్లం ముక్క వేసుకోవాలి.**

టేబుల్ బటర్‌తో నెయ్యి

స్వచ్ఛమైన నెయ్యిని ఎలా తయారుచేసుకోవాలో మనందరికీ తెలిసిందే! పాలు కాచి, తోడుకున్న పెరుగును చిలికితే, వెన్న తయారవుతుంది. ఈ వెన్నను వేడి చేసి నెయ్యి తయారుచేసుకోవచ్చు. కానీ కల్తీ లేని చిక్కని పాలు కరువైపోతున్న ఈ రోజుల్లో, రెడీమేడ్ వెన్న నుంచి నెయ్యినె లా తయారుచేసుకోవచ్చో తెలుసుకుందాం! నెయ్యి తయారీ కోసం సాల్టెడ్ బటర్‌కు బదులుగా అన్‌సాల్టెడ్/టేబుల్ బటర్ ఎంచుకోవాలి. ఈ వెన్నను ముక్కలు చేసి, పాత్రలో వేసి చిన్న మంట మీద కాచుకోవాలి. 5 నుంచి 8 నిమిషాల్లో వెన్న కరిగి, ఉడికి బంగారు రంగులోకి మారిపోతుంది. కమ్మని వాసన కూడా మొదలవుతుంది. చివర్లో గుప్పెడు కరివేపాకు చల్లి పొయ్యి నుంచి దించేసుకుని, చల్లారిన తర్వాత సీసాలో నిల్వ చేసుకుని వాడుకోవాలి. మిల్క్ క్రీమ్ నుంచి కొందరు నెయ్యి తయారుచేసుకుంటూ ఉంటారు. దీన్ని కూడా పాత్రలో వేసి, కాచి, నెయ్యి తయారు చేసుకోవచ్చు. అయితే నెయ్యి తయారు చేసుకునేటప్పుడు పొగలు వచ్చేవరకూ మరిగించుకోకూడదు. ఇలా చేస్తే నెయ్యి మాడిపోవడమే కాకుండా, పోషకాలన్నీ అడుగంటే ప్రమాదం ఉంటుంది.

హెల్తీ స్నాకింగ్

ఇలా కూడా బరువు తగ్గొచ్చు

బరువు పెరగకుండా ఉండాలంటే కడుపు మాడ్చుకోవలసిన అవసరం లేదు. ఆకలిని అదుపులో ఉంచే ఆరోగ్యకరమైన స్నాక్స్‌తో కూడా అదనపు క్యాలరీలు శరీరంలో పెరిగిపోకుండా నియంత్రించుకోవచ్చు. అయితే దీన్లో కూడా కొన్ని నియమాలు పాటించాలి.



- భోజనానికీ భోజనానికీ మధ్య తినే స్నాక్స్ కచ్చితంగా ఆరోగ్యకరమైనవై ఉండాలి.
- ఒకసారి తినే స్నాక్స్ 200 క్యాలరీలను మాత్రమే కలిగి ఉండాలి. పరిమాణం కంటే నాణ్యతే ప్రధానమనే విషయం గుర్తు పెట్టుకోవాలి.
- చురుకైన జీవనశైలిని కొనసాగించే వాళ్లు, రోజుకు మూడు సార్లు స్నాక్స్ తీసుకోవచ్చు. గంటల తరబడి కూర్చుని పని చేసేవాళ్లు ఒక స్నాక్‌తో సరిపెట్టుకోవాలి.
- తాజా పండ్లు, సలాడ్, నట్స్, ఇలా తక్కువ కార్బ్స్, ఎక్కువ ఫైబర్ ఉండే పదార్థాలనే ఎంచుకోవాలి.
- ప్రాసెస్డ్ ఫుడ్స్ స్నాక్స్‌గా పనికి రావు. అలాగే చక్కెరతో తయారైనవీ మానేయాలి.

కనీస పెట్టుబడి రూ.10 లక్షలు

అధిక రిస్క్ తీసుకోగలిగే వారి కోసం సరికొత్త ఇన్వెస్ట్‌మెంట్ సాధనం

ఆమోదం తెలిపిన సెబీ బోర్డు



ముంబై: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కేంద్ర బోర్డు సోమవారం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అధిక రిస్క్ తీసుకోగలిగే హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్ఎన్ఐ) కోసం సరికొత్త అసెట్ క్లాస్‌ను ప్రవేశ పెట్టేందుకు సెబీ బోర్డు ఆమోదం తెలిపింది. ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీస్ పేరుతో పిలిచే ఈ అసెట్ క్లాస్‌లో కనీస పెట్టుబడి పరిమితి రూ.10 లక్షలుగా ఉండనుంది. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు హెచ్ఎన్ఐల కోసం లాంగ్-షార్ట్ ఈక్విటీ వంటి అధిక రిస్క్ వ్యూహాలతో కూడిన పెట్టుబడి పథకాలను ఆఫర్ చేయవచ్చని నియంత్రణ మండలి తన ప్రకటనలో ప్రస్తావించింది. సరికొత్త అసెట్ క్లాస్ విడుదలపై ప్రజాభిప్రాయం కోరుతూ సెబీ ఈ జూలైలో చర్చాపత్రాన్ని విడుదల చేసింది. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న మ్యాచువల్ ఫండ్ (ఎంఎఫ్) పథకాలు, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సేవలకు (పీఎంఎస్) మధ్య అంతరాన్ని పూడ్చడమే ఈ పెట్టుబడి సాధనం ముఖ్య ఉద్దేశం. సెబీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌పై అమెరికన్ మార్కెట్ రీసెర్చ్, షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ పలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో జరిగిన తొలి బోర్డు సమావేశమిదే. ఈ భేటీ అనంతరం ప్రకటించిన మరిన్ని ముఖ్య నిర్ణయాలు..

ఎంఎఫ్ లైట్ ఫ్రేమ్‌వర్క్: పాసివ్ ఫండ్ల కోసం సడలించిన మ్యాచువల్ ఫండ్ లైట్ (ఎంఎఫ్ లైట్) ఫ్రేమ్‌వర్క్‌ను సైతం సెబీ ఆమోదించింది. ఇందులో భాగంగా ఫండ్ స్పాన్సర్ల నెట్‌వర్త్, ట్రాక్ రికార్డ్, లాభదాయకత, ట్రస్టీల బాధ్యత, ఆమోద ప్రక్రియ, సమాచార వెల్లడి వంటి పలు అర్హత నిబంధనలను సడలించింది. ఈ వ్యాపారంలోకి తేలికగా ప్రవేశించేందుకు వీలు కల్పించడంతో పాటు కొత్త వారిని ప్రోత్సహించడం, నిబంధనల భారాన్ని తగ్గించడం, ఈ ఫండ్ల వ్యాప్తితో పాటు మార్కెట్లో ద్రవ్య లభ్యత పెంచడం, పెట్టుబడుల వివిధీకరణ, ఆర్థికావిష్కరణలను ప్రోత్సహించడమే ఈ ఫ్రేమ్‌వర్క్ ప్రధానోద్దేశం.

బ్లాక్ డీల్.. టీ+0 సెటిల్‌మెంట్: ఆప్షనల్ టీ+0 సెటిల్‌మెంట్‌లో ట్రేడింగ్ అర్హత కలిగిన కంపెనీల షేర్ల సంఖ్యను సెబీ దశలవారీగా టాప్ 25 (మార్కెట్ క్యాప్‌పరంగా) నుంచి టాప్ 500కు పెంచనుంది. రిజిస్టర్డ్ స్టాక్ బ్రోకర్లందరూ తమ ఇన్వెస్టర్లకు టీ+0 సెటిల్‌మెంట్ విధానానికి ప్రవేశం కల్పించవచ్చు.

ఇక వేగంగా రైట్స్ ఇష్యూలు: కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిన తేదీ నుంచి 23 పని దినాల్లో రైట్స్ ఇష్యూను పూర్తి చేయవలసి ఉంటుంది. ప్రస్తుతం రైట్స్ ఇష్యూ పూర్తికి సగటున 317 రోజుల సమయం పడుతోంది.

డిస్‌క్లోజర్లకు మరింత సమయం: మార్కెట్ ట్రేడింగ్ సమయం ముగిశాక పూర్తయ్యే బోర్డు సమావేశ నిర్ణయాలను వెల్లడించేందుకు కంపెనీలకు ప్రస్తుత 30 నిమిషాలకు బదులు అదనంగా 3 గంటల సమయం లభించనుంది. అలాగే, లిటిగేషన్లు, వివాదాలకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించేందుకు ప్రస్తుత 24 గంటలకు బదులుగా 72 గంటల సమయం లభించనుంది. కంపెనీల సమాచార వెల్లడి ప్రక్రియను సులభతరం చేసేందుకు సెబీ సింగిల్ ఫైలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఇన్‌సైడర్ ట్రేడింగ్

నియంత్రణ మండలి ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిషేధ నియమావళిలో కనెక్టెడ్ పర్సన్ పరిధిని మరింత విస్తరించింది. తద్వారా మరింత మంది ఈ నిబంధనల పరిధిలోకి రానున్నారు.

ట్రేడింగ్‌లో సొమ్ము బదిలీకి మరో ఆప్షన్

ప్రస్తుత ట్రేడింగ్ విధానానికి అదనంగా, స్టాక్ బ్రోకర్లు క్లయింట్లకు యూపీఐ బ్లాక్ మెకానిజం ద్వారా తమ ఖాతాలోని సొమ్మును బ్లాక్ చేసుకోగలిగే వెసులుబాటుతో పాటు 3 ఇన్ 1 ట్రేడింగ్ అకౌంట్ సౌకర్యాన్ని కల్పించాలి. 2025 ఫిబ్రవరి 1 నుంచి ఈ కొత్త నిబంధన అమల్లోకి రానుంది.

డెరివేటివ్స్ ఊసే లేదు..

ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగంలో రిటైల్ మదుపరుల పాత్రను తగ్గించేలా ఈసారి బోర్డు సమావేశంలో సెబీ పలు సంస్కరణలు చేపట్టవచ్చని విశ్లేషకులు భావించారు. కానీ, నియంత్రణ మండలి ఇందుకు సంబంధించి ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్న ప్రతి పది మంది రిటైల్ మదుపరులలో 9 మంది నష్టపోతున్నారని ఈమధ్యనే సెబీ అధ్యయన నివేదికను విడుదల చేసింది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓల్లో రిటైల్ మదుపరుల పాత్ర పెరగడంపై సెబీ చీఫ్ బుచ్‌తోపాటు పలువురు గతంలో ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

మార్కెట్ మండేస్



స్టాక్ సూచీల భారీ పతనం

సెన్సెక్స్ 1,272 పాయింట్లు డౌన్

26,000 దిగువకి నిఫ్టీ

రూ.3.57 లక్షల కోట్లు ఆవిరి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం భారీగా క్షీణించాయి. ఇజ్రాయెల్-హిజ్బుల్లా మధ్య యుద్ధం తీవ్రతరం కావడం, జపాన్ మార్కెట్ పతనం నేపథ్యంలో దేశీయంగా ఇన్వెస్టర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు బ్యాంకింగ్, ఫైనాన్స్, వాహన రంగ షేర్లలో పెద్దఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను చైనా ఈక్విటీల్లోకి మళ్లిస్తుండటం, చాలా షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనలు మన మార్కెట్‌ను మరింత కుంగదీశాయని ఈక్విటీ విశ్లేషకులు పేర్కొన్నారు. దాంతో సెన్సెక్స్ 1,272.07 పాయింట్లు (1.49 శాతం) కోల్పోయి 84,299.78 వద్దకు జారుకుంది. నిఫ్టీ 368.10 పాయింట్ల(1.41 శాతం) నష్టంతో 25,810.85 వద్ద ముగిసింది. గడిచిన రెండు నెలల్లో సూచీకిదే అతిపెద్ద పతనం. అమ్మకాలు పోటెత్తడంతో ఈక్విటీ మార్కెట్ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.57 లక్షల కోట్లు తగ్గి రూ.474.35 లక్షల కోట్లకు (5.66 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 25 నష్టపోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 3.23 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది.

ఐపీఓకు డాక్టర్ అగర్వాల్స్ హెల్త్ కేర్

రూ.3,000-3,500 కోట్ల సమీకరణ లక్ష్యం

కంటి వైద్య సేవలందించే డాక్టర్ అగర్వాల్స్ హెల్త్ కేర్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా సంస్థ రూ.300 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 6.95 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సంస్థ మొత్తం రూ.3,000-3,500 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.

టఫేతో ఏజీసీఓ తెగతెంపులు

న్యూఢిల్లీ: దేశానికి చెందిన ట్రాక్టర్ల ఉత్పత్తి సంస్థ టఫేతో అమలులో ఉన్న అన్ని ఒప్పందాలను అమెరికాకు చెందిన వ్యవసాయ ఉపకరణాల తయారీ సంస్థ ఏజీసీఓ రద్దు చేసుకుంది. ఇది తక్షణం అమలులోకి వచ్చింది. రద్దయిన వాటిలో మాసే ఫెర్గుసన్ బ్రాండ్ లైసెన్స్ ఒప్పందం కూడా ఉంది. ఒప్పందాలకు ఉల్లంఘనగా టఫే సంస్థ పలు అసంబద్ధమైన, అనధికారిక చర్యలకు పాల్పడుతుండడమే తాము ఈ చర్య తీసుకోవడానికి కారణమని ఏజీసీఓ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రద్దు ప్రకటన అనంతరం తమ మాసే ఫెర్గుసన్ బ్రాండ్ లేదా ఉత్పత్తుల పంపిణీ, వినియోగం హక్కులన్నీ టఫే కోల్పోయినట్టు పేర్కొంది. ఒప్పందాలు రద్దు చేసుకుంటున్నట్టు తాము 2024 ఏప్రిల్‌లోనే నోటీసులు పంపామని, అయినా లెక్క చేయకుండా ఆ తర్వాత కూడా ఆ బ్రాండ్‌ను ఉపయోగించుకున్నందుకు చట్టపరమైన చర్యలు కూడా ప్రారంభించినట్టు ఏజీసీఓ తెలియచేసింది.

సోనీ బ్రావియా సరికొత్త టీవీలు



బ్రాండ్ అంబాసిడర్‌గా ఎస్ఎస్ రాజమౌళి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సోనీ ఇండియా మార్కెట్లోకి బ్రావియా శ్రేణిలో సరికొత్త స్మార్ట్ టీవీలను తీసుకువచ్చింది. సోమవారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో సోనీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ నయ్యర్, టాలీవుడ్ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి ఈ టీవీలను లాంఛనంగా మార్కెట్లోకి విడుదల చేశారు. సినిమా ఈజ్ కమింగ్ హోమ్ కాన్సెప్ట్‌తో 2024 బ్రావియా 7,8,9 సిరీస్‌తో పాటు 3 సిరీస్ టీవీలను తీసుకువచ్చినట్లు కంపెనీ ఎండీ సునీల్ నయ్యర్ తెలిపారు. అంతేకాకుండా బ్రావియా స్మార్ట్ టీవీల కోసం ప్రత్యేకంగా టాలీవుడ్ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళిని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు ఆయన వెల్లడించారు. టీవీ, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో ప్రీమియమైజేషన్ ట్రెండ్ రోజురోజుకు పెరిగిపోతోందని, అందుకు తగ్గట్టుగానే తాము ఈ కొత్త శ్రేణి టీవీలను తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం 55 అంగుళాల విభాగంలో సోనీ వాటా 35 శాతంగా ఉండగా 65, 75, 85 అంగుళాల టీవీ విభాగంలో కంపెనీ వాటా వరుసగా 36 శాతం, 45 శాతం, 49 శాతం వాటా కలిగి ఉందని తెలిపారు.

డాక్టర్ రెడ్డీస్ చేతికి హేలియన్ బ్రాండ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హేలియాన్ పీఎల్‌సీకి చెందిన నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్ఆర్‌టీ) విభాగంలోని కన్స్యూమర్ హెల్త్‌కేర్ బ్రాండ్లన్నింటి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసినట్టు డాక్టర్ రెడ్డీస్ ప్రకటించింది. హేలియాన్ గ్రూప్ నుంచి స్విట్జర్లాండ్‌లోని తమ అనుబంధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ఎస్ఏ ఈ షేర్లన్నింటినీ 45.8 కోట్ల పౌండ్లకు కొనుగోలు చేసిందని, ఆ సొమ్ము చెల్లించడం కూడా జరిగిపోయిందని తెలిపింది. దీంతో ఆ సంస్థ అనుబంధ విభాగాలైన నార్త్‌స్టార్ ఆప్కో, నార్త్‌స్టార్ స్వీడన్ ఏబీ (స్వీడన్) తక్షణం తమ సంపూర్ణ యాజమాన్య విభాగాలుగా మారిపోయినట్టు పేర్కొంది.

పడకేసిన పారిశ్రామికం

ఆగస్టులో మైనస్ 1.8 శాతం వృద్ధి నమోదు

న్యూఢిల్లీ: పారిశ్రామికోత్పత్తికి కీలకమైన ఇన్‌ఫ్రా రంగం ఆగస్టు నెలలో పడకేసింది. ఎరువులు, ఉక్కు మినహా మిగతా ఆరు రంగాలు బొగ్గు, క్రూడాయిల్, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, సిమెంట్, విద్యుత్ ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి. దీంతో ఆగస్టులో ఇన్‌ఫ్రా రంగం వృద్ధి రేటు మైనస్ 1.8 శాతంగా నమోదైంది. ఇన్‌ఫ్రా రంగం ప్రతికూల వృద్ధిని నమోదు చేయడం మూడున్నరేళ్ల తర్వాత తొలిసారి. 2021 ఫిబ్రవరిలో ఈ రంగం వృద్ధి మైనస్ 3.3 శాతం ఉంది. ఈ రంగం వృద్ధి రేటు గత నెలలో 6.1 శాతం ఉండగా గత ఏడాది ఆగస్టులో 13.4 శాతం ఉంది. కాగా ఏప్రిల్-ఆగస్టు నెలల మధ్య కాలంలో ఇన్‌ఫ్రా వృద్ధి రేటు 4.6 శాతంగా నమోదైంది. పారిశ్రామికోత్పత్తి సూచీలో (ఐఐపీ) ఈ ఎనిమిది రంగాల వాటా 40.27 శాతం ఉంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,240▼	70,800▼	1,00,900▼
ముంబై	75,197▼	68,881▼	89,400▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ అక్టోబరు			
హైదరాబాద్	510	విజయవాడ	535
వరంగల్	512	గోదావరి	535
చిత్తూరు	523	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	116
వరంగల్	110	గుంటూరు	121
కరీంనగర్	110	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	115
కర్నూలు	110	నెల్లూరు	115
విశాఖపట్నం	102	అనంతపురం	115
గోదావరి	116		

చిన్న మొత్తాల పొదుపు రేట్లు యథాతథం

న్యూఢిల్లీ: ఈ అక్టోబరు 1 నుంచి ప్రారంభం కానున్న త్రైమాసికానికి చిన్న మొత్తాల పొదుపు పథకాల (స్మాల్ సేవింగ్ స్కీమ్స్) వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం ప్రకటించింది. సెప్టెంబరు 30తో ముగిసే త్రైమాసికానికి ప్రకటించిన రేట్లే అక్టోబరు-డిసెంబరు కాలానికి వర్తిస్తాయని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం చిన్న మొత్తాల పొదుపు రేట్లను మార్చకపోవడం వరుసగా ఇది మూడోసారి. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కేంద్రం ఈ పథకాల వడ్డీ రేట్లను ప్రతి మూడు నెలలకోసారి సవరిస్తుంటుంది. స్మాల్ సేవింగ్ స్కీమ్స్ పరిధిలోకి వచ్చే సుకన్య సమృద్ధి పథకంపై చెల్లించే వడ్డీ రేటు 8.2 శాతంగా ఉండగా..పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) రేటు 7.1 శాతంగా, పోస్టాఫీస్ సేవింగ్ డిపాజిట్ రేటు 4 శాతంగా కొనసాగనుంది. కాగా, కిసాన్ వికాస్ పత్రాలపై 7.5 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)పై 7.7 శాతం వడ్డీ లభించనుంది.

స్పోర్ట్స్

అటు పరుగులు.. ఇటు వికెట్లు



అశ్విన్ (15-1-45-2)

బంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్ 233

- మోమినుల్ అజేయ శతకం
- భారత్ తొలి ఇన్నింగ్స్ 285/9 డిక్లేర్
- జైస్వాల్, రాహుల్ అర్ధసెంచరీలు
- బంగ్లా రెండో ఇన్నింగ్స్ 26/2

మూడు రోజులపాటు ఎక్కడికక్కడే ఆగిపోయిన రెండో టెస్టు.. ఒక్క రోజే రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. సోమవారం నాలుగో రోజు వరుణుడు కరుణించడంతో గ్రీన్ పార్క్ మైదానంలో వికెట్లు నేల కూలడంతో పాటు.. పరుగుల మోత మోగింది. దీంతో ఒక్కరోజే ఇరుజట్లు 18 వికెట్లు కోల్పోగా, ఏకంగా 437 పరుగులు నమోదయ్యాయి.

కాన్పూర్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టు అంచనాలకు భిన్నంగా ఆసక్తికరంగా మారింది. రెండు రోజుల ఆట మాత్రమే మిగలడంతో నిస్సారమైన డ్రాగా ముగుస్తుందనుకున్న మ్యాచ్ రంజుగా మారింది. విజయంపై కన్నేసిన రోహిత్ సేన టీ20 తరహాలో ఆడి ఆఖరిరోజు ఆటకి అనూహ్యమైన ముగింపునిచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ముందుగా భారత బౌలర్ల ధాటికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 233 రన్స్‌కు ఆలౌటైంది. మోమినుల్ హక్ (107 నాటౌట్) అజేయ శతకంతో ఆకట్టుకున్నాడు. బుమ్రాకు 3.. ఆకాశ్‌దీప్, అశ్విన్, సిరాజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. తర్వాత బరిలోకి దిగిన భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 34.4 ఓవర్లలోనే 285/9 వద్ద డిక్లేర్ చేసింది. జైస్వాల్ (51 బంతుల్లో 72), రాహుల్ (43 బంతుల్లో 68), విరాట్ (35 బంతుల్లో 47), గిల్ (39) వేగం కనబరిచారు. దీంతో జట్టుకు 52 పరుగుల ఆధిక్యం దక్కింది. ఆట ముగిసేసరికి బంగ్లా రెండో ఇన్నింగ్స్‌లో 26/2 స్కోరు చేసింది. క్రీజులో షాద్‌మన్(7), మోమినుల్ (0) ఉన్నారు. అశ్విన్‌కు 2 వికెట్లు లభించాయి. ఆఖరిరోజు 98 ఓవర్ల ఆట ఉండడంతో.. రెండు సెషన్లలోపే బంగ్లాను కట్టడి చేయాలని భారత్ భావిస్తోంది.

ఏమా దూకుడు: రెండో సెషన్ ఆరంభమైన కాసేపటికే తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్‌లో.. వీళ్లెంత త్వరగా బంగ్లా స్కోరును దాటేయాలన్న ఆత్రుత కనిపించింది. బంతి పడడమే ఆలస్యం బౌండరీ బాదేసేలా అందరి ఆట సాగింది. మొత్తంగా జట్టు 8.22 రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. ఈ టీ20 తరహా ఆటను బంగ్లా బౌలర్లు ఏమాత్రం అంచనా వేయలేకపోయారు. ఓపెనర్లు జైస్వాల్, రోహిత్ (23) విరుచుకుపడిన తీరుకు వారు చేష్టలుడిగిపోయారు. రోహిత్ కొట్టిన ఓ సిక్సర్ అయితే స్టేడియంపైన పడింది. వీరి ధాటికి 18 బంతుల్లోనే 50 రన్స్ వచ్చాయి. అటు జైస్వాల్ 31 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అలాగే రెండో వికెట్‌కు గిల్‌తో కలిసి 10.1 ఓవర్లలోనే స్కోరును 100కు చేర్చాడు. అలాగే ఈ జోడీ మధ్య రెండో వికెట్‌కు 72 పరుగులు నమోదయ్యాయి. వీరి నిష్క్రమణ తర్వాత పంత్ (6) విఫలమైనా.. ఆఖరి సెషన్‌లో విరాట్, రాహుల్ అదరగొట్టారు. ఐదో వికెట్‌కు 87 రన్స్ జోడించి జట్టు ఆధిక్యానికి సహకరించారు. స్పిన్నర్లు మెహిదీ హసన్, షకీబ్‌ల ధాటికి చివర్లో వికెట్లు వేగంగా నేలకూలడంతో మరో 19 ఓవర్ల ఆట మిగిలి ఉండగానే భారత్ డిక్లేర్ చేసింది. **బంగ్లా ఇన్నింగ్స్‌లో సిరాజ్ పట్టిన క్యాచ్ సింప్లీ సూపర్బ్. షకీబ్‌ను అవుట్‌చేసే క్రమంలో మిడాఫ్‌లో వెనక్కి వంగి ఒక్క చేత్తో ఈ క్యాచ్ అందుకున్నాడు. అంతకుముందు రోహిత్ కూడా ఒంటిచేత్తో క్యాచ్ అందుకుని లిట్టన్‌దాస్‌ను పెవిలియన్ పంపాడు.**



సిరాజ్ అద్భుత క్యాచ్



జైస్వాల్ (72)

బజ్‌బాల్‌ను మించేలా..

బజ్‌బాల్ గేమ్ అంటే ఇంగ్లండ్ గుర్తుకురావడం పరిపాటి. కానీ నాలుగోరోజు ఆటలో టీమిండియా చెలరేగిన తీరు దాన్ని మించిపోయింది. బ్యాటర్లంతా కలిసికట్టుగా ఎదురుదాడికి దిగడంతో బంగ్లా బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. ఈ క్రమంలో టెస్టు ఫార్మాట్‌లో రికార్డులు బద్దలయ్యాయి. అత్యంత వేగంగా 50 (18 బంతుల్లో), 100 (74), 200 (146), 250 (181) రన్స్ పూర్తి చేసిన జట్టుగా టీమిండియా అదుర్స్ అనిపించుకుంది.

స్కోరుబోర్డు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: జకీర్ హసన్ (సి) జైస్వాల్ (బి) ఆకాశ్ దీప్ 0; షాద్‌మన్ (ఎల్బీ) ఆకాశ్ దీప్ 24; మోమినుల్ (నాటౌట్) 107; షంటో (ఎల్బీ) అశ్విన్ 31; ముష్ఫికర్ (బి) బుమ్రా 11; లిట్టన్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 13; షకీబ్ (సి) సిరాజ్ (బి) అశ్విన్ 9; మెహిదీ హసన్ (సి) గిల్ (బి) బుమ్రా 20; తైజుల్ (బి) బుమ్రా 5; హసన్ (ఎల్బీ) సిరాజ్ 1; ఖాలెద్ (సి అండ్ బి) జడేజా 0; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 74.2 ఓవర్లలో 233 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-26, 2-29, 3-80, 4-112, 5-148, 6-170, 7-224, 8-230, 9-231, 10-233. **బౌలింగ్:** బుమ్రా 18-7-50-3; సిరాజ్ 17-2-57-2; అశ్విన్ 15-1-45-2; ఆకాశ్ దీప్ 15-6-43-2; జడేజా 9.2-0-28-1.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) హసన్ 72; రోహిత్ (బి) మిరాజ్ 23; గిల్ (సి) హసన్ (బి) షకీబ్ 39; పంత్ (సి) హసన్ (బి) షకీబ్ 9; విరాట్ (బి) షకీబ్ 47; రాహుల్ (స్టంప్) లిట్టన్ (బి) మిరాజ్ 68; జడేజా (సి) షంటో (బి) మిరాజ్ 8; అశ్విన్ (బి) షకీబ్ 1; ఆకాశ్ (సి) ఖాలెద్ (బి) మిరాజ్ 12; బుమ్రా (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 34.4 ఓవర్లలో 285/9 డిక్లేర్. వికెట్ల పతనం:** 1-55, 2-127, 3-141, 4-159, 5-246, 6-269, 7-272, 8-284, 9-285. **బౌలింగ్:** హసన్ 6-0-66-1; ఖాలెద్ 4-0-43-0; మిరాజ్ 6.4-0-41-4; తైజుల్ 7-0-54-0; షకీబ్ 11-0-78-4.

బంగ్లా రెండో ఇన్నింగ్స్: షాద్‌మన్ (నాటౌట్) 7; జకీర్ (ఎల్బీ) అశ్విన్ 10; హసన్ (బి) అశ్విన్ 4; మోమినుల్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 11 ఓవర్లలో 26/2. వికెట్ల పతనం:** 1-18, 2-26, **బౌలింగ్:** బుమ్రా 3-1-3-0, అశ్విన్ 5-2-14-2, ఆకాశ్ దీప్ 3-2-4-0.

1 ఒకే క్యాలెండర్ ఏడాదిలో ఎక్కువ సిక్సర్లు (90) బాదిన జట్టుగా టీమిండియా

ఓ టెస్టు ఇన్నింగ్స్ (200+రన్స్)లో అత్యధిక రన్‌రేట్ (8.22;భారత్) నమోదు కావడం ఇదే తొలిసారి.



తక్కువ టెస్టు (74)ల్లో 3000+ పరుగులు 300 వికెట్లు తీసిన రెండో ఆటగాడిగా జడేజా. ఇయాన్ బోథమ్ (72) ముందున్నాడు.

2 భారత్‌లో జరిగిన టెస్టుల్లో ఒకే రోజు ఎక్కువ పరుగులు (437) నమోదు కావడం ఇది రెండోసారి. 2009లో శ్రీలంకపై భారత్ 470 రన్స్ చేసింది.

తక్కువ ఇన్నింగ్స్‌ల్లో (594) 27 వేల పరుగుల మైలురాయిని చేరిన కోహ్లీ. ఈ క్రమంలో సచిన్ (623), సంగక్కర (648), పాంటింగ్ (650)ని దాటేశాడు. మొత్తంగా టెండూల్కర్ తన కెరీర్‌లో 782 ఇన్నింగ్స్‌లో 34,357 రన్స్ సాధించాడు.

చాంపియన్స్ ట్రోఫీపై నిర్ణయం కేంద్రానిదే..

కాన్పూర్: చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు భారత జట్టు పాకిస్థాన్ వెళ్లే విషయమై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపాడు. పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న ఆ టోర్నీ వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిల్లో జరగనుంది. 'చాంపియన్స్ ట్రోఫీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అయితే అంతర్జాతీయ పర్యటనలకు కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలన్నది బోర్డు విధానం. మన జట్టు ఏ దేశం వెళ్లాలీ..వెళ్లొద్దు అనేది తేల్చాల్సింది కేంద్రమే' అని శుక్లా సోమవారమిక్కడ చెప్పాడు. 'చాంపియన్స్ ట్రోఫీ విషయంలో కేంద్రం తీసుకునే నిర్ణయానికి మేం కట్టుబడి ఉంటాం' అని చెప్పాడు.



ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో సచిన్

ముంబై: దిగ్గజం సచిన్ టెండూల్కర్ మైదానంలో మరోసారి తన బ్యాటింగ్ విన్యాసాలను ప్రదర్శించనున్నాడు. తొలి ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ (ఐఎంఎల్)లో అతడు బరిలో దిగనున్నాడు. ఆరు జట్ల ఈ టీ20 టోర్నీ త్వరలో దేశంలోని మూడు వేదికల్లో జరగనుంది. భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, ఇంగ్లండ్, శ్రీలంక క్రికెటర్లు పాల్గొనే ఐఎంఎల్ ముంబై, లఖ్‌నవూ, రాయ్‌పూర్‌లో నిర్వహించనున్నారు. టెండూల్కర్, మాజీ కెప్టెన్ గవాస్కర్ ఈ లీగ్‌కు రూపకల్పన చేశారు. గవాస్కర్ ఐఎంఎల్‌కు కమిషనర్‌గా వ్యవహరించనున్నాడు.

స్కేటర్ సుహాన్‌కు రెండు స్వర్ణాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆగ్నేయ ఆసియా ఐస్ స్కేటింగ్ టోర్నమెంట్‌లో ఎనిమిదేళ్ల హైదరాబాద్ చిన్నోడు రెండు రజత పతకాలు సాధించి.. సత్తా చాటాడు. ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో ఈనెల 28 నుంచి రెండ్రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో భారత్, చైనా, ఆస్ట్రేలియా సహా మొత్తం తొమ్మిది దేశాలు పాల్గొన్నాయి. బాలుర జూనియర్ కేటగిరీలో సుహాన్ 300, 500 మీటర్ల రేసులో ద్వితీయ స్థానంలో నిలిచి పతకాలు కొల్లగొట్టారు.

షూటింగ్‌లో భారత్‌కు రెండు కాంస్యాలు

న్యూఢిల్లీ: షూటింగ్ జూనియర్ వరల్డ్‌కప్‌లో రెండోరోజు భారత్‌కు రెండు కాంస్యాలు లభించాయి. పెరూలోని లిమాలో సోమవారం జరిగిన మిక్స్‌డ్ రైఫిల్ కేటగిరిలో గౌతమి బానోత్-అజయ్ మాలిక్ జోడీ 628.9 స్కోరుతో తృతీయ స్థానంలో నిలిచి పతకం సొంతం చేసుకుంది. చైనా స్వర్ణం, ఫ్రాన్స్ రజతం గెలిచాయి. పిస్టల్ ఈవెంట్ కాంస్యపోరులో లక్షిత-ప్రమోద్ ద్వయం 16-8తో భారత్‌కే చెందిన కనిష్క-ముఖేష్ జోడీపై నెగ్గి పతకం సాధించింది. ఈ టోర్నీలో ప్రస్తుతం భారత్ 2 స్వర్ణాలు సహా 5 పతకాలు సాధించి టాప్‌లో ఉంది.

వారి వల్లే..

పారిస్ విజేతలను సన్మానించలేదు



ఐఓఏ చీఫ్ పీటీ ఉష

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ పతక విజేతలను భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తరపున ఇప్పటి వరకు సన్మానించలేకపోయామని అధ్యక్షురాలు పీటీ ఉష ఆవేదన వ్యక్తంజేసింది. ఇందుకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు సహకరించకపోవడమే కారణమని ధ్వజమెత్తింది. అంతేకాదు పారిస్ క్రీడల్లో పాల్గొనే అథ్లెట్ల సన్నద్ధతకు ఉద్దేశించిన నిధులను విడుదల చేయకుండా ఫైనాన్స్ కమిటీ అడ్డుకుందని ఆరోపించింది. పారిస్ క్రీడల్లో భారత్ 6 పతకాలు సాధించిన సంగతి తెలిసిందే. 'పారిస్ వెళ్లే ఒక్కో అథ్లెట్‌కు రూ. రెండు లక్షలు, వారి కోచ్ ఒక్కొక్కరికీ రూ. లక్ష ఇవ్వాలన్న ప్రతిపాదనను ఆర్థిక కమిటీ అడ్డుకుంది' అని ఆమె వెల్లడించింది. ఇందుకు ఐఓఏ కోశాధికారి సహదేవ్ యాదవే కారణమని ఆరోపించింది.

13 ఏళ్ల చిన్నోడు అదరగొట్టాడు

● వైభవ్ సూపర్ ఇన్నింగ్స్ ● భారత్ 103/0
● ఆస్ట్రేలియా 293 ● అండర్-19 అనధికార టెస్ట్



చెన్నై: పదమూడేళ్ల చిన్నోడు వైభవ్ సూర్యవంశీ (47 బంతుల్లో 81 బ్యాటింగ్) ధనాధన్ అర్ధ శతకంతో చెలరేగడంతో.. ఆస్ట్రేలియా అండర్-19తో సోమవారం ఆరంభమైన తొలి అనధికార టెస్ట్‌లో భారత్ అదిరే ఆరంభాన్ని అందుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 293 పరుగులకు ఆలౌటైంది. ఐడెన్ ఓకనార్ (61), రైలీ కింగ్‌సెల్ (53), క్రిస్టియన్ హో (48) రాణించారు. సమర్థ్ నాగరాజ్, మహ్మద్ ఎనాన్ చెరో 3 వికెట్లతో కంగారూల వెన్నువిరిచారు. అనంతరం భారత్ ఆట ముగిసేసరికి తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ కోల్పోకుండా 103 రన్స్ చేసింది. ఈ రన్స్ 7.36 రన్‌రేట్‌తో కేవలం 14 ఓవర్లలోనే సాధించడం విశేషం. వైభవ్‌తోపాటు విహాన్ మల్హోత్రా (21) క్రీజులో ఉన్నారు. బిహార్ తరపున ఇప్పటికే రంజీలు ఆడేసిన 13 ఏళ్ల వైభవ్ తొలి రోజు ఆటలో హైలైట్‌గా నిలిచాడు. ఏ బౌలర్‌నూ వదలకుండా ఎడాపెడా షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.

సమిత్ అరంగేట్రం కష్టమే..

ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్‌తో అండర్-19 కెరీర్ ఆరంభిస్తాడని ఆశించిన రాహుల్ ద్రవిడ్ కుమారుడు సమిత్‌కు నిరాశే ఎదురైంది. మోకాలి గాయం కారణంగా ఎన్‌సీఏలో చికిత్స పొందుతున్న సమిత్ తొలి మ్యాచ్‌కు దూరమయ్యాడు. మిగతా రెండు అనధికార టెస్ట్‌లకు కూడా అతను అందుబాటులో ఉండకపోవచ్చు.

రక్ష ఖాతాలో క్రొయేషియా టైటిల్

ముంబై: యువ షట్లర్ రక్ష కందస్వామి వారం వ్యవధిలో రెండో టైటిల్‌ను అందుకుంది. ఇటీవల బెల్జియం టోర్నీలో విజేతగా నిలిచిన రక్ష తాజాగా సమోబోర్‌లో జరిగిన క్రొయేషియా టోర్నీలో టైటిల్ సాధించింది. ఫైనల్లో రక్ష 21-9, 21-5తో లియోనా లీ (ఇంగ్లండ్)పై నెగ్గింది.


విద్యా శాఖ సమీక్షలో మంత్రి లోకేశ్, అధికారులు

పాఠ్యపుస్తకాల్లో రాజకీయాలొద్దు

▸▸ సాల్ట్ ప్రాజెక్టు ద్వారా టీచర్లకు శిక్షణ: మంత్రి లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఎస్జీటీలకు సాల్ట్ ప్రాజెక్టు ద్వారా శిక్షణ ఇప్పించాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. తద్వారా టీచర్లలో కెపాసిటీ బిల్డింగ్ జరగాలన్నారు. పాఠశాల విద్యాశాఖపై సోమవారం ఉండవల్లిలోని నివాసంలో సమీక్ష నిర్వహించారు. స్టూడెంట్ కిట్ బాలురు, బాలికలకు ఒకేవిధంగా ఉండాలని సూచించారు. పాఠ్యపుస్తకాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయపరమైన రంగులు, కంటెంట్ ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ నెలాఖరులోగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు శిక్షణ పూర్తి కావాలని సూచించారు. పాఠశాలల్లో సౌకర్యాలు, ఫలితాల మెరుగుదలలో ఆ కమిటీల భాగస్వామ్యం అర్థవంతంగా ఉండాలన్నారు. పాఠశాలల నిర్వహణపై అభిప్రాయ సేకరణ కోసం ప్రత్యేకంగా యాప్ రూపొందించాలని ఆదేశించారు. ఈ యాప్‌లో మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు చేయాల్సిన పనులు టీచర్లు చేయొద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వేల కోట్లు ఖర్చు చేస్తున్నా విద్యార్థుల హాజరు 70 శాతంగానే ఉందని, దీనికి కారణాలు గుర్తించి హాజరు శాతం పెంచడానికి చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో ఉన్నతాధికారులు కోన శశిధర్, వి.విజయరామరాజు, కృతికా శుక్లా, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

▸▸ హైకోర్టులో న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు పిటిషన్

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ముంబైకి చెందిన సినీనటి కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై నిర్ణయం వెల్లడించేంత వరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో కుక్కల విద్యాసాగర్‌తోపాటు మరికొందరు అని నిందితుల కాలమ్‌లో పేర్కొన్నారని, ఆ మరికొందరు కింద పోలీసులు తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని అన్నారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రానుంది.

'జగనన్న తోడు' పేరు మార్పు

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గతంలోవీధి వ్యాపారులకు సహకారమందించే పథకానికి ఉన్న 'జగనన్న తోడు' పేరు మారుస్తూ గ్రామ, వార్డ్ సచివాలయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇక నుంచి ఈ పథకాన్ని 'చిరువ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు'గా మారుస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీసీ కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీగా కల్పన బేబీ

బీసీ కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీగా బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరక్టర్ డి.కల్పన బేబీని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

దసరాకు 6100 ప్రత్యేక బస్సులు

▸▸ సాధారణ రోజుల్లో ఉండే టిక్కెట్ ధరలే వర్తింపు

▸▸ అక్టోబరు 4 నుంచి 11 వరకు 3040, దసరా తర్వాత 3060

▸▸ బ్రహ్మోత్సవాలు, నవరాత్రులు, సెలవుల నేపథ్యంలో ఆర్టీసీ ఏర్పాట్లు

అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరాకు సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఏపీఎస్‌ఆర్టీసీ శుభవార్త చెప్పింది. తిరుమల వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు, బెజవాడ కనకదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు, విద్యాసంస్థలకు దసరా సెలవుల నేపథ్యంలో రద్దీని దృష్టిలో పెట్టుకొని 6,100 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు సోమవారం తెలిపింది. అక్టోబరు 4 నుంచి 11 వరకు 3,040, పండుగ తర్వాత 3,060 బస్సు సర్వీసులు ఉంటాయని పేర్కొంది. ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవని, సాధారణ రోజుల్లో ఉండే టిక్కెట్ ధరలే వర్తిస్తాయని విజయవాడ ఆర్టీసీ హౌస్ స్పష్టం చేసింది. దసరా పండుగ నేపథ్యంలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులను నడపనుంది. దుర్గా శరన్నవరాత్రులకు విజయవాడకు వచ్చే భక్తులు, తిరుమల బ్రహ్మోత్సవాలకు వెళ్లే భక్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల నుంచి బస్సులు నడపనుంది.

దసరాకు ముందు.. తర్వాత

దసరాకు ముందు హైదరాబాద్ నుంచి 990, బెంగళూరు నుంచి 275, చెన్నై నుంచి 65 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. విశాఖ నుంచి 320, రాజమండ్రి 260, విజయవాడ 400 బస్సులతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పట్టణాలు, పల్లెలకు 730 ప్రత్యేక సర్వీసులు తిప్పుతోంది. దసరా తర్వాత హైదరాబాద్ 990, బెంగళూరు 330, చెన్నై 70 బస్సులు రాష్ట్రం నుంచి నడుస్తాయి. విశాఖపట్నం నుంచి 260, రాజమహేంద్రవరం 220, విజయవాడ 700, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 490 బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలను చేర్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆర్టీసీ వివరించింది. నవరాత్రుల సందర్భంగా విజయవాడకు భవానీ భక్తులు ఎక్కువగా వస్తున్నందున పొరుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 1100 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ప్రయాణికులకు టిక్కెట్‌తో చిల్లర సమస్య ఏర్పడకుండా యూటీఎస్ మెషీన్లను అందుబాటులోకి తీసుకొచ్చామని ఆర్టీసీ తెలిపింది. ఫోన్‌పే, గూగుల్‌పే, క్యూఆర్ కోడ్ స్కాన్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా టిక్కెట్లు తీసుకోవచ్చని చెప్పింది. ముందస్తు రిజర్వేషన్లు చేసుకోవచ్చని పేర్కొంది. ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న వారికి టిక్కెట్ ధరలో పది శాతం రాయితీ ఉంటుందని చెప్పింది.

ప్రయాణికుల సేవే పరమావధి

ప్రతి పల్లె నుంచి పొరుగు రాష్ట్రాలకు సైతం దశాబ్దాలుగా ప్రయాణ సేవలందిస్తోన్న ఏపీఎస్‌ఆర్టీసీ సేవల్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ కోరింది. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ప్రతిరోజూ 1930 ట్రిప్పులు, గరుడ సేవ ఆ తర్వాతి రోజుల్లో 2,714 ట్రిప్పులు ఆర్టీసీ బస్సులు తిరుగుతాయని చెప్పింది. తమ సిబ్బంది, సూపర్ వైజర్లు ప్రయాణికుల సేవకే ఉంటారని తెలిపింది.

12 నుంచి ప్రైవేటు మద్యం షాపులు

(మొదటి పేజీ తరువాయి)

గెజిట్‌లు జారీ చేస్తారు. 11 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధానాల్లోనూ స్వీకరిస్తారు. ఈ విడతలో 3,396 షాపులను ప్రైవేటుకు కేటాయిస్తున్నారు. ఈ పాలసీ అనంతరం గీత కార్మికులకు రిజర్వ్ చేసిన మరో 340 షాపులకు నోటిఫికేషన్ ఇస్తారు. అలాగే ప్రీమియం బ్రాండ్లు విక్రయించేందుకు ఏర్పాటు చేయదలచిన 12 ఎలైట్ షాపులకు కూడా విడిగా నోటిఫికేషన్ ఇస్తారు. కాగా మద్యం షాపులకు దరఖాస్తు రుసుం రూ.2 లక్షలుగా నిర్ణయించారు. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా, ఎన్ని అయినా దరఖాస్తులు చేసుకోవచ్చని ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్‌లో తెలిపింది. మంగళవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 11న లాటరీ జరుగుతుంది. లాటరీలో లైసెన్స్ దక్కించుకున్న వ్యాపారులు ఒక రోజు వ్యవధిలో మొదటి విడత లైసెన్స్ ఫీజు చెల్లించాలి. ఆ వెంటనే 12వ తేదీ నుంచి ప్రైవేటు షాపులు తెరుచుకుంటాయి. వాస్తవానికి సోమవారంతో ప్రభుత్వ షాపుల పాలసీ గడువు ముగిసింది. అయితే ప్రైవేటు పాలసీ కొంత ఆలస్యమైనందున ప్రస్తుత పాలసీని 15వ తేదీ వరకు పొడిగించారు. ఈలోగా ప్రైవేటు షాపులు ప్రారంభమైతే ప్రభుత్వ షాపులు మూతపడతాయి. ఆ ప్రకారం 11వ తేదీ ప్రభుత్వ మద్యం షాపులకు చివరి రోజు అవుతుంది. ఆ రోజున లైసెన్సీలను ఎంపిక చేస్తారు కాబట్టి ఆ తర్వాత ప్రభుత్వ షాపులు ఉండవు.

భారీగా లైసెన్సు ఫీజులు

ఈసారి లైసెన్స్ ఫీజులను భారీగా పెంచారు. జనాభా ప్రాతిపదికన షాపులను నాలుగు కేటగిరీలుగా విభజించారు. 10 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో లైసెన్స్ ఫీజు రూ.50 లక్షలు. 10 వేల నుంచి 50 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో 55 లక్షలు, 50,001 నుంచి 5 లక్షల వరకు జనాభా ఉన్న పట్టణాల్లో లైసెన్స్ ఫీజు 65 లక్షలు ఉంది. 5 లక్షలు దాటిన నగరాల్లో గరిష్ఠ ఫీజు రూ.85 లక్షలుగా నిర్ణయించారు. ఈ ఫీజులను లైసెన్సీలు ఆరు విడతలుగా చెల్లించవచ్చు. అయితే లైసెన్స్ ఫీజులతో పాటుగా వారికి ఇచ్చే మార్జిన్‌ను ఈసారి రెట్టింపు చేశారు. గతంలో 10శాతం ఉంటే ఇప్పుడు 20శాతం మార్జిన్ వ్యాపారులకు వస్తుంది.

అయ్యా..యస్ ప్రవీణ్ ప్రకాశ్..

ముగిసిన సర్వీస్



(మొదటి పేజీ తరువాయి)

పోస్టింగ్ దక్కించుకున్నారు. జగన్‌తో ఉన్న సాన్నిహిత్యం హైదరాబాద్ మహానగర పాలనవైపు నడిపించింది. వైఎస్ మరణం తర్వాత కొన్నేళ్లపాటు అప్రాధాన్య పోస్టుల్లో పనిచేశారు. కేంద్రంలో 2013-2017 వరకు కేంద్రమంత్రి పీఎస్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా 2019, సెప్టెంబరు దాకా పనిచేశారు. జగన్ అధికారంలోకి వచ్చాక ప్రవీణ్ ప్రకాశ్ ఢిల్లీ నుంచి ఏపీకి వచ్చారు. రాగానే 2019 సెప్టెంబరులో ముఖ్యమంత్రికి ముఖ్యకార్యదర్శిగా నియమితులయ్యారు. దీంతోపాటు కీలకమైన జీఏడీకి ముఖ్యకార్యదర్శిగా ఉన్నారు. ఐఏఎస్‌ల పోస్టింగ్, శాఖాధిపతుల నియామకాలు, సీఎం వ్యవహారాలు.... ఇలా అన్నీ తానే చూసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్ కంటే మరింత పవర్‌ఫుల్ వ్యక్తిగా ఎదిగారు. బ్యూరోక్రాట్లు కూడా ఆయన చుట్టూ తిరిగేవారు. సర్వేరాళ్లపై జగన్ బొమ్మలు, పాసుపుస్తకాలపై ఫొటోలు, ప్రభుత్వ ఆఫీసులు, భవనాలకు వైసీపీ రంగులు ఇలా అనేకానేక వివాదస్పద నిర్ణయాల వెనక ఈయన ప్రమేయమే ఉందని చెబుతుంటారు. కరోనా కాలంలో స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో జగన్ పట్టుదలకు పోవడానికి, ఎన్నికల కమిషన్‌తో గొడవకు దిగడం, హైకోర్టు కెళ్లి చీవాట్లు తినడం వెనక ఈయన సలహాలే ఉన్నాయని సహచర అధికారవర్గాలు చెప్పాయి. ఒక దశలో సీఎం తన మాట కాదనరన్న ధీమాతో అనేకానేక రాజకీయ అంశాల్లో కూడా జోక్యం చేసుకున్నారని వైసీపీ నేతలే చెబుతుంటారు.


అర్ధరాత్రి జాగారాలు..

ప్రభుత్వ ఉద్యోగులకు సమయపాలన ఉంటుంది. ప్రవీణ్‌ప్రకాశ్ ఉదయం అంతా జగన్ క్యాంపు ఆఫీసులో ఉండేవారు. సాయంత్రం తర్వాత సచివాలయానికి వెళ్లేవారు. ఇక అక్కడి నుంచి ఏ అర్ధరాత్రి వరకో ఆఫీసులో పనిచేసేవారు. ఆ సమయంలో తన ఆఫీసు సిబ్బంది, అవసరం లేని సిబ్బంది కూడా సచివాలయంలోనే ఉండాలని ఒత్తిడిచేసేవారని ఉద్యోగ సంఘాలు పలుమార్లు సీఎంకు ఫిర్యాదు చేశాయి. జగన్ వీరభక్తుడిని అని చెప్పుకోవడానికి పలు సమావేశాలు, ప్రభుత్వ ఫంక్షన్‌లలో జగన్ ముందు మోకాళ్లమీద కూర్చొని తన స్వామిభక్తిని చాటుకునేవారని, దీనివల్ల ఐఏఎస్‌ల గౌరవం దెబ్బతీశారని విమర్శలున్నాయి. తన చర్యలతో సీఎంవోలో ఒక్క క్షణం కూడా ఆయనను భరించలేని పరిస్థితిని తెచ్చుకున్నారు. దీంతో 2022 ఫిబ్రవరిలో ఆయన్ను సీఎంవో నుంచి తప్పించి తిరిగి ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా జగన్ పంపించారని అధికారవర్గాలు చెబుతున్నాయి. సరిగ్గా ఎనిమిది నెలల తర్వాత అంటే, 2022 నవంబరులో తిరిగి ప్రవీణ్ ప్రకాశ్ ఏపీకి వచ్చారు. కీలకమైన ఆర్‌అండ్‌బీ ముఖ్యకార్యదర్శి పోస్టు దక్కించుకున్నారు. అక్కడ ఇమడలేక తిరిగి సీఎంఓకు వెళ్లేందుకు విఫల ప్రయత్నాలు చేశారు. నెల తిరిగాక పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా పోస్టు తెచ్చుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చేవరకు ఆయన అదే పోస్టులో పనిచేశారు. ఉపాధ్యాయలోకం జగన్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు చేయడంలో ప్రవీణ్‌ప్రకాశ్ తీసుకున్న అనేకానేక నిర్ణయాలే ప్రధాన కారణమని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఉపాధ్యాయులకు పాఠశాలల్లోని మరుగుదొడ్ల ఫొటోలు తీయడం వంటివి అప్పగించారు. ఇలాంటి చర్యలు జగన్ ప్రభుత్వ ప్రతిష్ఠను పాతాళంలో పడేశాయి. ఇంగ్లీషు మీడియం మోజులో సిలబస్‌ను మార్చడం, విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు ఇప్పించడం సంచలన చర్యలుగా మిగిలాయి. ఏటా 670 కోట్ల వ్యయంతో బైజూస్ కంటెంట్ ఉన్న ట్యాబ్‌లను ప్రభుత్వంతో కొనిపించడంలో ప్రవీణ్ ప్రకాశ్ సూచనలు, సలహాలే ప్రధానంగా ఉన్నాయని చెబుతున్నారు.

ఎక్కడకెళ్లినా గొడవలు, వివాదాలే..

ఎన్నికల్లో గెలిచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ప్రవీణ్‌ప్రకాశ్‌కు భవిష్యత్ దర్శనం కనిపించి ఉంటుంది. జగన్‌తో అంటకాగి ప్రతిపక్షాలను, ఇతర అధికారులను వేధించిన ఫలితం తనను వెంటాడుతుందని ఆందోళనకు గురయి ఉంటారు. అంతే.. ప్రభుత్వం కొలువు తీరిన వెంటనే స్వచ్ఛంద పదవీ విరమణకు డిజిటల్ సైన్‌తో కూడిన పత్రంపై దరఖాస్తు చేశారు. అది చెల్లదని దానిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. ఆయన అప్పుడైనా పునరాలోచన చేయకుండా జూన్ 26న పూర్తిస్థాయి ఫార్మాట్‌లో వీఆర్ఎస్‌కు దరఖాస్తు ఇచ్చారు. ప్రభుత్వం ఆయన వినతిని ఆమోదించి సెప్టెంబరు 30 నుంచి వీఆర్ఎస్ అమల్లోకి వస్తుందని నోటిఫికేషన్ (జీఓ-1207) ఇచ్చింది. ప్రవీణ్‌ప్రకాశ్ 30 ఏళ్ల సర్వీసులో చేసిన గొప్పపనులు, నిర్వహించిన ఘనకార్యాలు అంటూ ఏమీలేవు. విశాఖ, ఖమ్మం, తూర్పుగోదావరి, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్‌గా ఉన్న సమయంలో తోటి ఉద్యోగులతో గొడవలు, విబేధాలే సాగించారు. కలెక్టర్ హోదాలో ప్రజల సంక్షేమం కోసం, పాలనలో గొప్ప మార్పులు తీసుకొచ్చేందుకు ఆయన చేసిన ఒక్క మేలూ లేదని ఉద్యోగులే చెబుతున్నారు.

నేరస్థులను వదలొద్దు



(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి, గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలు, అక్రమాలు, అవినీతి కేసుల స్థితి గతులపై అధికారులతో మాట్లాడారు. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల కొండపైన అక్రమాలపై విజిలెన్స్ నివేదికలోని అంశాలను ప్రస్తావించారు. వైసీపీ నేతలు అడ్డగోలుగా జారీచేసిన బ్రేక్ దర్శనాల టికెట్లకు కమీషన్ల వసూళ్లు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సంఖ్యలో చూపించిన తేడాలు, ఇతర అంశాలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. పోలీసుల పనితీరులో అన్ని చోట్లా మార్పు కనిపించాలని, గత ప్రభుత్వ వాసనలు ఒక్క పోలీసు స్టేషన్‌లోనూ కనిపించడానికి వీల్లేదని డీజీపీ తిరుమలరావుకు సూచించినట్లు తెలిసింది. 'టెక్నాలజీకి ప్రాధాన్యం ఇవ్వాలి. కేసుల్లో శిక్షలు పెరిగితేనే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయన్న మీ పోలీసు సూత్రాన్ని గట్టిగా అమలుచేయండి' అని సీఎం వ్యాఖ్యానించినట్లు తెలిసింది. జగన్ పాలనలో వైసీపీ నేతలు రాష్ట్రమంతా దోచేశారని, ఇసుక దోపిడీలో తవ్వే కొద్దీ అక్రమాలు ఉన్నాయని అన్నట్టు సమాచారం. సహజ, ప్రభుత్వ వనరులు దోపిడీ చేసిన వ్యక్తులు ఎంతటి వారైనా వదిలి పెట్టొద్దని ఆదేశించారు. ప్రజల నుంచి వేలాది ఫిర్యాదులు టీడీపీ కార్యాలయానికి వస్తున్నాయని, అందులో భూ సంబంధిత అక్రమాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రజల్ని వేధించి హింసించిన వ్యక్తుల్ని జైల్లో పెట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైన ఇళ్లను రాక్రీట్ అనే సంస్థకు ఎలాంటి టెండర్ లేకుండా కట్టబెట్టిన వైనాన్ని విజిలెన్స్ డీజీ హరీశ్ కుమార్ గుప్తా వివరించారు. అప్పటి రాప్తాడు వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సోదరుడికి చెందిన సంస్థ చేపట్టిన పనుల కన్నా కోట్లాది రూపాయల బిల్లులు అధికంగా డ్రా చేసుకున్నట్లు విజిలెన్స్ విచారణలో తేలిందన్నారు. మొత్తం ఏడు జిల్లాల్లో 52 వేల ఇళ్ల నిర్మాణం కాంట్రాక్టు తీసుకుని 23 వేల ఇళ్లకు పైగా పూర్తి చేయలేదని, ఇప్పటి వరకూ అందిన సమాచారం మేరకు 50 కోట్లకు పైగా అదనపు చెల్లింపులు జరిగాయని వివరించినట్లు తెలిసింది. ఇలాంటి దోపిడీతో పాటు మదనపల్లె ఫైల్స్ లాంటివి రాష్ట్రంలో చాలా చోట్ల ఉన్నాయని, పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకోవడం లేదని సీఎం వ్యాఖ్యానించారు. చిన్న భూకబ్జా అయినా బాధ్యులకు శిక్ష పడేలా చూడాలని, బాధితులకు న్యాయం జరగాలని అన్నట్టు తెలిసింది. మద్యపాన నిషేధం పేరుతో ప్రజల్ని మోసగించి అధికారంలోకి వచ్చిన జగన్.. వేల కోట్లు ప్రజల నుంచి పీల్చేశారని, అవినీతి సొమ్ము మొత్తం కక్కిస్తేనే భవిష్యత్తులో ఇలాంటి వాటికి ఆస్కారం ఉండదన్నారు. ఈ కేసులో కొంత పురోగతి సాధించామని, ఏపీ బేవరేజెస్ కార్యాలయంలో జరిపిన సోదాల్లో భారీగా డాక్యుమెంట్లు సీజ్ చేశామని ఈ సందర్భంగా సీఐడీ ఏడీజీ చెప్పినట్టు తెలిసింది. సైంటిఫిక్, డిజిటల్ ఎవిడెన్స్‌తో బాధ్యులకు కోర్టుల్లో శిక్షలు పడేలా ఉచ్చు బిగించాలని సీఎం సూచించినట్లు సమాచారం.

8,113 కోట్ల 'షాక్'!

(మొదటి పేజీ తరువాయి)

అనుమతులు ఇవ్వాల్సి ఉన్నా స్పందించలేదు. దీంతో.. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈ బాదుడు 'వాయిదా' పడింది. దీంతో రెండేళ్లకూ కలిపి మొత్తం రూ.20,096.36 కోట్లకు చేరింది. ఇందులో 2022-23నాటి రూ.8,113.60 కోట్ల వసూలుపై కమిషన్ తాజాగా ప్రజాభిప్రాయం కోరింది. కాగా.. ఇదే సమయంలో యూనిట్‌కు 40 పైసల చొప్పున ప్రతి వినియోగదారుడి నుంచి 'ఆటోమేటిక్ పాస్ త్రూ' ద్వారా నెలవారీ బిల్లుల్లో అదనంగా డిస్కంలు వసూలు చేస్తున్నాయి. ఇప్పటివరకు రూ.2,869 కోట్ల వరకు బాదాయి.

భరించలేని బాదుడు...

2014-19 కాలానికి రూ.3,669 కోట్లను జగన్ ప్రభుత్వ హయాంలో వసూలు చేశారు. అదేవిధంగా 2020-21 కాలానికి రూ.4,572 కోట్ల 'మైనస్'ను డిస్కంలు చూపాయి. దీనిని 2022-23నాటి విద్యుత్ బిల్లుల్లో తగ్గించారు. కానీ రూ.3,669 కోట్ల వసూలు కొనసాగడంతో కుదించిన మొత్తాల ప్రభావం కనిపించలేదు. 2021-22లో మరో 3,554.58 కోట్లను సర్దుబాటు చార్జీల కింద వసూలు చేసుకుంటామని డిస్కంలు కోరగా.. రూ.3,082.99 కోట్ల వసూలుకు కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జగన్ హయాంలో విద్యుత్‌చార్జీల బాదుడు భారీగా పెరగడంతో ప్రజల్లో ఆగ్రహం పెరిగింది. అయినా.. 2019-20 నుంచి పెంచుతున్న విద్యుత్ చార్జీలు, ఇంధన కొనుగోళ్లు, ఇంధన సర్దుబాటు చార్జీలకు అదనంగా.. 2022-23 కాలానికి ఏకంగా 8,113.60 కోట్లు వసూలు చేసుకుంటామని డిస్కంలు కోరాయి. ఈ అభ్యర్థనపై ఏడాదిన్నరదాకా ఈఆర్‌సీ నిర్ణయం తీసుకోకుండా తాజాగా ప్రజాభిప్రాయ ప్రకటన చేసింది.

రాష్ట్రప్రభుత్వమే భరించాలి: సీహెచ్ బాబూరావు

2022-23విద్యుత్ సర్దుబాటు చార్జీలను ప్రభుత్వమే భరించాలని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు చార్జీలను పెంచబోమంటూ కూటమి హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ఆర్థిక ఒడిదొడుకుల నేపథ్యంలో ప్రభుత్వం 2022-23 నాటి రూ.8,113 కోట్లు.. 2023-24లో 11,826.42 కోట్లు.. మొత్తం రూ.20,096.36 కోట్ల భారం భరించగలదా అనే సందేహాలు నెలకొన్నాయి.

గత ఐదేళ్లలో ఏపీఈఆర్‌సీ ఆమోదించిన సర్దుబాటు చార్జీలు (రూ.కోట్లలో)

సంవత్సరం	డిస్కంలు కోరింది	ఈఆర్‌సీ ఆమోదించింది	వసూలు చేసిన కాలం
2019-20	1,788.73	1,851.15	2022-23లో సరఫరా చార్జీలతో కలిపి వసూలు
2020-21	-5,186.97	-4,572.42	సరఫరా చార్జీల్లో సర్దుబాటు
2021-22	3,554.58	3,082.99	2023-24లో విడిగా వసూలు
2022-23	8,113.60	కమిషన్ ఇంకా ఆమోదించలేదు	
2023-24	11,862.42	కమిషన్ ఇంకా ఆమోదించలేదు	

(నోట్: ఆటోమేటిక్ పాస్-త్రూ ద్వారా కరెంటు బిల్లుల్లో ఇప్పటికీ అదనంగా వసూలు చేస్తున్నారు. ఇప్పటికి 2,869 కోట్లు వసూలు చేశారు)

లడ్డూపై వాస్తవాలే చెప్పండి

▸▸ కోర్టులపై వ్యతిరేక వ్యాఖ్యలు చేయొద్దు

▸▸ వాటిని తక్కువ చేసేలా మాట్లాడొద్దు

▸▸ పార్టీ నేతలకు టీడీపీ ఆదేశం

▸▸ సీఎం చంద్రబాబు స్వామిభక్తుడు

▸▸ కల్తీ జరిగిందని ల్యాబ్ నిర్ధారించాకే స్పందించారు

▸▸ వాస్తవాలు తేల్చడానికే సిట్ వేశారు

▸▸ తిరుమల పవిత్రతపై రాజీపడం టీడీపీ నాయకుల స్పష్టీకరణ



అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వివాదంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో తమ నేతలకు తెలుగుదేశం పార్టీ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంలో వాస్తవాలు చెప్పండి గానీ.. కోర్టులపై ఎటువంటి వ్యతిరేక వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టం చేసింది. పార్టీ అధికార ప్రతినిధులు, ఇతర నేతలకు ఇక్కడి కేంద్ర కార్యాలయంలో నిర్దిష్టంగా కొన్ని సూచనలు చేసింది. 'కోర్టు వ్యాఖ్యలపై నేరుగా విమర్శలు చేయొద్దు. కోర్టులను తక్కువ చేసేలా మాట్లాడొద్దు. న్యాయమూర్తులు ఎవరు.. ఎందరు సభ్యుల ధర్మాసనం అనే అంశాల జోలికి పోవద్దు. ప్రజలకు వివరణ ఇవ్వండి. అంతేతప్ప కోర్టులను విమర్శించే ప్రయత్నం చేయవద్దు' అని పేర్కొన్నట్లు సమాచారం. తిరుమల ఆలయానికి సరఫరా అయ్యే నెయ్యిలో కల్తీ జరిగిందని ఒక ప్రతిష్ఠాత్మక ల్యాబ్ నిర్ధారించిన తర్వాతే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు తప్ప ముందుగానే ఎటువంటి విమర్శా చేయలేదన్న అంశాన్ని టీవీల్లో చర్చలు, ఇతర వేదికలపై ప్రస్తావించాలని నాయకత్వం సూచించింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యల తర్వాత పార్టీ నేతల స్పందన ఎలా ఉండాలన్నదానిపై పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతల మధ్య చర్చ జరిగింది. 'తిరుమలకు ఒక కంపెనీ నుంచి 8 ట్యాంకర్ల నెయ్యి వచ్చింది. అందులో 4 ట్యాంకర్ల నెయ్యి వాడారు. అనుమానం రావడంతో మరో 4 ట్యాంకర్ల నుంచి నమూనాలు తీసి ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీబీబీ) ల్యాబ్‌కు పంపారు. కల్తీ జరిగిందని ఆ ల్యాబ్ నిర్ధారించిన తర్వాత ఆ 4 ట్యాంకర్ల నెయ్యిని వెనక్కి పంపారు. ఇంత పెద్ద అంశంలో మౌనంగా ఉండడం మంచిది కాదన్న భావంతో బాధ్యతగా ముఖ్యమంత్రి ప్రజలకు వాస్తవాలు చెప్పారు. బయటకు చెప్పకుండా దాచిపెట్టి ఉంటే అది మరో తప్పయ్యేది. కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం కాబట్టి బయటపెట్టారు. విషయం తెలిశాక కూడా దానిని రహస్యంగా ఉంచి.. అది మరో రకంగా బయటకు వచ్చి ఉంటే ప్రభుత్వం అప్రతిష్ఠపాలయ్యేది. ఆ తప్పును బయటపెట్టడంతోపాటు దానికి ప్రక్షాళనగా ఏం చేయాలో కూడా ముఖ్యమంత్రి చేశారు. వాస్తవాలన్నీ తేల్చడానికే సిట్ ఏర్పాటు చేశారు' అని ఒక నేత పేర్కొన్నారు. వ్యక్తిగతంగా చంద్రబాబు వేంకటేశ్వరస్వామి భక్తుడని, ఆవేదనతోనే ఆయన కల్తీ విషయం బయట పెట్టారని మరో నాయకుడు అన్నారు. 'ముఖ్యమంత్రి తాను మాట్లాడిన రోజు కేవలం కల్తీ జరిగిందనే చెప్పలేదు. తర్వాత తీసుకున్న జాగ్రత్తలు, ఇప్పుడు నాణ్యత ఎలా ఉందో కూడా చెప్పి భక్తులు, ప్రజల్లో ఉన్న అభద్రతను పోగొట్టే ప్రయత్నం చేశారు. కోట్ల మంది భక్తుల విశ్వాసాలను, మనోభావాలను కాపాడే ప్రయత్నం చేశారు. తిరుమల పవిత్రత విషయంలో కూటమి ప్రభుత్వం ఏనాడూ రాజీపడలేదు. రాజకీయం చేయడానికి ప్రయత్నం చేయలేదు. ప్రభుత్వం పూర్తిగా ఆలయ నిబంధనలకు, మత విశ్వాసాలకు, ఆగమ సంప్రదాయాలకు కట్టుబడి ఉంటుంది. వాస్తవాలు మాత్రమే మాట్లాడుతుంది. ఆచితూచి వ్యవహరిస్తోంది. తప్పును ఎత్తి చూపుతోంది. అదే సమయంలో ఆ తప్పు దిద్దడానికి ఏం చర్యలు తీసుకుంటోందో కూడా చెబుతోంది. బాధ్యత కలిగిన ప్రభుత్వంగా వ్యవహరిస్తోంది' అని ఒక మంత్రి వ్యాఖ్యానించారు.

ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

▸▸ హైకోర్టులో ఏఆర్ ఫుడ్స్ ఎండీ పిటిషన్

తిరుమల లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా చేశారనే ఆరోపణలతో టీటీడీ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తిరుపతి ఈస్ట్ పోలీసులు నమోదు చేసి న కేసులో ముందస్తు బెయిల్ కోసం ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.రాజశేఖరన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అరెస్టుతో పాటు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. భారత ఆహార భద్రత-ప్రమాణాల అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) చట్టనిబంధనలకు అనుగుణంగా నెయ్యి శాంపిల్ సేకరణ, విశ్లేషణ జరుగలేదని తెలిపారు. 'నెయ్యి కల్తీ ఆరోపణలపై నా నుంచి ఎలాంటి వివర ణా తీసుకోకుండానే కేసు పెట్టడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం. ఎఫ్ఐఆర్‌లో నాపై మోపిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు నాకు వర్తించవు. రాజకీయ కారణాలతో కేసు పెట్టా రు. నన్ను అరెస్టు చేస్తే పూడ్చుకోలేని నష్టం జరుగుతుంది. దర్యాప్తునకు సహకరిం చేందుకు సిద్ధంగా ఉన్నాను. ముందస్తు బెయిల్ మంజూరుకు కోర్టు ఎలాంటి షరతులు విధించినా కట్టుబడి ఉంటాను. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ ఇవ్వండి' అని రాజశేఖరన్ పిటిషన్‌లో కోరారు.

లడ్డూ కల్తీపై సీబీఐ దర్యాప్తు చేయాలి

▸▸ సుప్రీం వ్యాఖ్యలు కేంద్ర, రాష్ట్రాలకు చెంపపెట్టు: షర్మిల

అమరావతి, న్యూఢిల్లీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ కల్తీ అంశంపై సోమవారం సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెంప పెట్టులాంటిదని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం అన్నారు. అత్యున్నత న్యాయస్థానం సూచన మేరకు కూటమి ప్రభుత్వం లడ్డూ కల్తీ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన 'సిట్' రబ్బరు స్టాంపులాంటిదన్నారు. ఈ అంశాన్ని సీబీఐకి అప్పగిస్తేనే లడ్డూ కల్తీపై లోతైన దర్యాప్తు జరుగుతుందని షర్మిల "ఎక్స్"లో అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆందోళనలో ఉన్న కోట్లాది మంది భక్తులకు నిజానిజాలు తెలుస్తాయని చెప్పారు. కల్తీ ఎలా జరిగిందో.. ఎక్కడ జరిగిందో.. పాల్పడ్డ దొంగలెవరో.. తక్కువ ధరకు కాంట్రాక్టు ఇవ్వడం వెనుక కారణం ఏమిటో.. వంటి వివరాలన్నీ సీబీఐ దర్యాప్తుతోనే బయటకొస్తాయని చెప్పారు. నిందితులెవరైనా కఠిన శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారు. కాగా, లడ్డూ వివాదంపై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని తిరుపతి ఎంపీ, వైసీపీ నేత గురుమూర్తి అన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. లడ్డూ అంశంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో లేదా సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

నెయ్యి ల్యాబ్‌లో 'సిట్'

▸▸ నాలుగున్నర గంటలపాటు పరిశీలన


ట్యాంకరు నుంచి నెయ్యి శాంపిల్ తీయడాన్ని పరిశీలిస్తున్న సిట్ సభ్యులు

తిరుమల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూల నెయ్యి కల్తీ వ్యవహారంలో సిట్ అధికారులు తమ విచారణను విస్తృతంగా చేపడుతున్నారు. తిరుమలలో ప్రసాదాలకు వినియోగించే నెయ్యి, ఇతర ముడి సరుకుల నాణ్యతను పరీక్షించే ల్యాబ్‌కు సోమవారం ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, అదనపు ఎస్పీ వెంకట్రావు, ఇతర సభ్యులతో కలిసి సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ల్యాబ్ మొత్తాన్ని పరిశీలించారు. నెయ్యి ట్యాంకర్లు ఎలా వస్తాయి, శాంపిల్స్ ఎలా సేకరిస్తారు, ఎలాంటి ప్రమాణాలు ఉంటే నెయ్యిని వినియోగానికి తీసుకుంటారు, నెయ్యి పరీక్ష చేసే సిబ్బందికి పూర్తిస్థాయిలో పరిజ్ఞానం ఉందా, నెయ్యిలో జంతువుల కొవ్వు కలిస్తే గుర్తించగలిగే సామర్థ్యం ఇక్కడి ల్యాబ్‌లో ఉందా అనే అంశాలపై దర్యాప్తు చేశారు. గత ఐదేళ్లలో ఎన్ని ట్యాంకర్లు తిరస్కరించారు, తిరస్కరించిన సంస్థలకు ఏవైనా నోటీసులు ఇచ్చారా, తిరిగి అదే సంస్థల నుంచి ఎప్పుడైనా ట్యాంకర్లు వచ్చాయా అనే అంశాలపైనా ఆరా తీశారు. దాదాపు నాలుగున్నర గంటల పాటు ల్యాబ్‌లోనే ఉండి దర్యాప్తు చేశారు. అదే సమయంలో టెస్టింగ్ కోసం వచ్చిన ట్యాంకర్‌లోని నెయ్యి శాంపిల్స్ తీసుకుని పరీక్షించే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. మంగళవారం ఉదయం సిట్ సభ్యులు మరోసారి ల్యాబ్, నెయ్యి నిల్వ కేంద్రం, లడ్డూ తయారీ పోటును తనిఖీ చేయనున్నారు.

లడ్డూ వ్యవహారంలో మీ వైఖరేంటి?

(మొదటి పేజీ తరువాయి)

కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. అయితే.. ఆ మూడు పిటిషన్లతోపాటు తన పిటిషన్‌ను సైతం కలిపి విచారించాలని సురేశ్ చవాంకే తరఫున సీనియర్ న్యాయవాది సోనియా మాథుర్ కోరారు. స్వతంత్ర సంస్థతో దర్యాప్తును ఆయన కోరుతున్నారు. సురేశ్ చవాంకే విజ్ఞప్తి మేరకు ధర్మాసనం నాలుగు పిటిషన్లనూ కలిపి విచారించింది. సుబ్రమణ్య స్వామి తరఫున సీనియర్ న్యాయవాది రాజశేఖర్ రావు, వైవీ సుబ్బారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి, సురేశ్ చవాంకే తరఫున సీనియర్ న్యాయవాది సోనియా మాథుర్, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, టీటీడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హాజరయ్యారు. ఈ పిటిషన్ మొత్తం ప్రపంచంలో నివసించే కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేసేదని, ఎంతోమంది మనోభావాలకు సంబంధించినదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశంపై బహిరంగ ప్రకటనలు చేసేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలని సూచించింది.

దేవుళ్లను రాజకీయాలకు దూరంగా ఉంచాలి...

తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రసాదంగా అందించే లడ్డూల తయారీకి కల్తీ నెయ్యి వాడినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు బహిరంగంగా ఆరోపణలు చేయడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కేసు విచారణలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి ఇలాంటి ప్రకటనలు చేయాల్సిన అవసరం ఏమున్నదని ప్రశ్నించింది. పరీక్షలు జరిపిన తర్వాత నెయ్యిని తిరస్కరించినట్టు, ప్రయోగశాలల నివేదికలు కూడా అదే విషయాన్ని ప్రాథమికంగా నిర్ధారించాయని న్యాయస్థానం గుర్తు చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ప్రకటన ప్రకారం కల్తీ నెయ్యిని ఏనాడూ ఉపయోగించలేదని కొన్ని పత్రికలు నివేదించాయని ధర్మాసనం స్పష్టం చేసింది. మీరు రాజ్యాంగబద్ధమైన పదవిని నిర్వహిస్తున్నప్పుడు.. దేవుళ్లను రాజకీయాలకు దూరంగా ఉంచాలని మేము ఆశిస్తున్నామని జస్టిస్ గవాయ్ అన్నారు.

రెండు ట్యాంకర్లను ఎన్‌డీడీబీకి పంపాం: సిద్ధార్థ లూథ్రా

టీటీడీ తరఫున వాదించిన సిద్ధార్థ లూథ్రా.. జూన్‌లో పంపిణీ చేసిన నెయ్యి, అలాగే జూలై నాలుగు వరకూ అదే కంపెనీ సరఫరా చేసిన నెయ్యిని పరీక్షలకు పంపలేదని తెలిపారు. జూలై 6, 12 తేదీల్లో రెండు ట్యాంకర్లలో కంపెనీ పంపిన నెయ్యిని ఎన్‌డీడీబీ పరీక్షల కోసం పంపినట్టు ఆయన వివరించారు. ఈ నమూనాల ప్రకారం నెయ్యి కల్తీ అయినట్టు తెలిసిందన్నారు. జూన్‌లోనూ, జూలై 4 వరకు సరఫరా చేసిన నెయ్యినే లడ్డూల తయారీకి ఉపయోగించినట్టు ఆయన తెలిపారు. ఈ అంశంపై దర్యాప్తు తప్పనిసరి అని రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయ పడిందని, ఈ మేరకు సెప్టెంబరు 25న దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు చేసేందుకు సిట్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. దర్యాప్తు జరుగుతున్న క్రమంలో రాజ్యాంగ హోదాలో ఉన్న సీఎం ప్రకటన చేయడం మంచిది కాదని కోర్టు అభిప్రాయ పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌నే కొనసాగించాలా? లేదా కేంద్ర దర్యాప్తు అవసరమా అనేది సొలిసిటర్ జనరల్ గురువారంలోపు తమకు తెలపాలని ధర్మాసనం ఆదేశించింది. అదేరోజుకు కేసు విచారణను వాయిదా వేసింది.



సీఎం చంద్రబాబును ఆశీర్వదిస్తున్న దుర్గగుడి అర్చకులు

శరన్నవరాత్రుల ఉత్సవాలకు రండి

▸▸ చంద్రబాబుకు దుర్గగుడి అధికారుల ఆహ్వానం

అమరావతి, విజయవాడ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 3 నుంచి 12వ తేదీ నిర్వహించే దసరా ఉత్సవాలకు రావాలని సీఎం చంద్రబాబును ఆహ్వానించారు. సోమవారం ఉదయం ఉండవల్లిలోని సీఎం నివాసంలో ఆయనను దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ సత్యనారాయణ, దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు, ప్రధాన అర్చకులు కలిశారు. అక్టోబరు 9న మూలానక్షత్రం సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు సతీసమేతంగా విచ్చేయాలని కోరారు.

మంత్రి లోకేశ్‌కు ఆహ్వానం

దసరా మహోత్సవాలకు విచ్చేయాలని మంత్రి లోకేశ్‌ను దుర్గామల్లేశ్వర దేవస్థానం తరఫున మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు, ప్రధాన అర్చకులు ఆహ్వానించారు. అర్చకులు ఆయనను ఆశీర్వదించారు.

జగన్ మతం క్రూరత్వం: మంత్రి అనగాని

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): 'జగన్ చెప్పుకొంటున్నట్లు ఆయన మతం మానవత్వం కాదు. ఆయన మతం క్రూరత్వం' అని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు. సోమవారం ఆయనిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసం త్వరలో రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

భారతీయులకు అందుబాటులో 2.5 లక్షల వీసా అపాయింట్‌మెంట్లు

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): భారతదేశం నుంచి అమెరికా వెళ్లాలనుకుంటున్న వారికి ఆ దేశం శుభవార్త చెప్పింది. ఈ ఏడాది 2.5 లక్షల వీసా అపాయింట్‌మెంట్లను అందుబాటులో ఉంచుతున్నట్లు యూఎస్ ఎంబసీ ప్రకటించింది. పర్యాటకులు, నైపుణ్యం కలిగిన కార్మికులు, విద్యార్థులకు కలిపి వీటిని కేటాయించనున్నట్లు తెలిపింది. గత ఏడాది అత్యధికంగా 1.4 లక్షల మందికి విద్యార్థి వీసాలను ఇచ్చిన అమెరికా ఈ ఏడాది కూడా అత్యధిక స్టూడెంట్ వీసాలను జారీ చేయనుంది. 'ఈ కొత్త స్లాట్ల వల్ల వేలాది మందికి సమయానికి అమెరికా ప్రయాణం చేసే వెసులుబాటు కలుగుతుంది. వరుసగా రెండవ ఏడాది కూడా 10 లక్షల నాన్ ఇమిగ్రెంట్ వీసా దరఖాస్తులు అందాయి' అని ఎంబసీ పేర్కొంది. భారత్‌లోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి మాట్లాడుతూ, 'వీసా జారీ ప్రక్రియను మరింతగా మెరుగుపరిచి, వేగవంతం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు జో బైడెన్ పెట్టుకున్న ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని మేం చేరుకుంటున్నాం. అనూహ్యంగా పెరిగిన డిమాండ్‌ను తట్టుకోవడానికి ఎంబసీలోని మా కౌన్సెలర్ జట్టు, నాలుగు కాన్సులేట్లు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయి' అని అన్నారు.

వెంకటరెడ్డి కస్టడీ పిటిషన్‌పై నేడు తీర్పు

విజయవాడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి కస్టడీపై తీర్పును ఏసీబీ కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. గనుల శాఖలో జరిగిన భారీ అవినీతికి సంబంధించి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఆయనను ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వెంకటరెడ్డి తరఫు న్యాయవాదులు కౌంటర్ వేశారు. రెండు పక్షాల వాదనలు విన్న తర్వాత న్యాయస్థానం తీర్పును మంగళవారానికి వాయిదా వేసింది.



స్పీకర్ అయ్యన్న పాత్రుడుకు జీవన సాఫల్య పురస్కారం అందజేస్తున్న కృష్ణ లాం, సతీష్ వేమన

అయ్యన్నకు అమెరికాలో జీవిత సాఫల్య పురస్కారం

▸▸ గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు సాంస్కృతిక సంఘ స్వర్ణోత్సవాల్లో ప్రదానం

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ స్పీకరు చింతకాయల అయ్యన్న పాత్రుడు అమెరికాలో జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. అక్కడ రెండు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించిన గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు సాంస్కృతిక సంఘం స్వర్ణోత్సవాల్లో ఆ సంఘం అధ్యక్షుడు కృష్ణలాం, తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సతీష్ వేమన.. స్పీకరుకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. అమెరికాలో వేలాది మంది తెలుగువారి సమక్షంలో స్వర్ణోత్సవ వేడుకల శుభవేళ తనకు పురస్కారాన్ని అందజేసి సత్కరించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ స్పీకరు అయ్యన్న ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, మాతృభూమి, మాతృభాష పరిరక్షణ కోసం అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఏపీని మాతృ భూమి, భాషలను కాపాడుకోవడం తెలుగువారి అందరి బాధ్యతని తానా మాజీ అధ్యక్షులు, జయరాం కోమటి, సతీష్ వేమన, గంగాధర్ నాదెళ్ల అన్నారు.

వరద బాధితులకు యూబీఐ ఉద్యోగుల విరాళం 5.9 కోట్లు

▸▸ సిద్ధార్థ అకాడమీ కోటి, ఆర్జా స్టీల్స్ కోటి విరాళం

▸▸ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను కలసి చెక్కులు అందజేసిన పలువురు దాతలు

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు తమ పెద్ద మనసుతో ముందుకు వస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధికి భారీ మొత్తాల్లో విరాళాలను అందిస్తున్నారు. సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలసి చెక్కుల రూపంలో తమ విరాళాలను అందజేశారు. దాతలను సీఎం చంద్రబాబు అభినందించారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉద్యోగులందరూ ఒక రోజు వేతనం సొమ్ము రూ.5,90,01,087లు అందజేశారు. ఉద్యోగుల తరఫున యూనియన్ బ్యాంకు ఎండీ, సీఈవో ఎ.మనిమేఖలై సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబుని రాష్ట్ర సచివాలయంలో కలసి చెక్కు అందజేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రామసుబ్రహ్మణియన్, జనరల్ మేనేజరు, ఎస్ఎల్‌బీసీ రాష్ట్ర కన్వీనర్ సీవీఎన్ భాస్కరరావు తదితర ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఇంకా పలువురు దాతలు సీఎంను కలిసి తమ విరాళాలను అందించారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం.రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు రూ.1 కోటి 1,116ల చెక్కును సీఎంకు అందజేశారు. ఆర్జా స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్ కృష్ణమూర్తి రూ.కోటి, ఆర్.ఆదికేశవుల నాయుడు రూ.10 లక్షలు, అసోసియేషన్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా రూ.10 లక్షలు, శ్రీ విజయ ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.10 లక్షలు, ముక్కామల అప్పారావు రూ.10 లక్షలు, చిన్మయి ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ రూ.10 లక్షలు, తెలుగు విజ్ఞాన సమితి రూ.5 లక్షలు, జయశ్రీ పాలిమర్స్ రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అచ్చెన్నపాలానికి చెందిన పాతూరి కేతన్ చౌదరి తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.10 వేలు అందజేశాడు.

మంత్రి లోకేశ్‌కు విరాళాలు అందజేసిన దాతలు

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను పలువురు దాతలు ఉండవల్లిలోని నివాసంలో కలిసి తమ విరాళాలను అందజేశారు. కేరళకు చెందిన పెన్వర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఫిలిప్స్ థామస్ రూ.50 లక్షలు, విజయవాడకు చెందిన ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.50 లక్షలు, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శశి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు బి.వేణుగోపాలకృష్ణ రూ.25 లక్షలు, అనంతపురానికి చెందిన కేఎం షకీల్ షఫీ నేతృత్వంలో ఏపీ వక్ఫ్ ఇనిస్టిట్యూషన్స్, ముతవల్లీస్ అండ్ మేనేజింగ్ కమిటీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.7.86 లక్షలు, గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, నాయకులు కలిపి రూ.3.36 లక్షలు, పిడపర్తిపాలెం గ్రామానికి చెందిన అరుణోదయ మహిళా గ్రూప్ రూ.1.21 లక్షలు, మచిలీపట్నానికి చెందిన ఎం ధనలక్ష్మి రూ.లక్ష అందజేశారు.



చంద్రబాబుకు విరాళం అందజేస్తున్న యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో ఎ.మనిమేఖలై

పసుపు చొక్కా విప్పించి అవమానించారు!

▸▸ సూళ్లూరుపేట మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిపై పోటీ చేశానని దారుణం

▸▸ ఆ ఎస్సై, సీఐలపై చర్యలు తీసుకోవాలి

▸▸ టీడీపీ గ్రీవెన్స్ సెల్‌లో దళిత నేత విజ్ఞప్తి

▸▸ ముంపు పరిహారం కోసం అధికారులతో కుమ్మక్కై వైసీపీ నేతల యత్నాలు

▸▸ వివిధ సమస్యలపై పార్టీ ఆఫీస్‌కు భారీ సంఖ్యలో పోటెత్తిన బాధితులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిపై పోటీ చేసినందుకు ఎస్సై, సీఐ తన పసుపు చొక్కా విప్పించి మరీ అవమానించారని సూళ్లూరుపేటకు చెందిన దళిత నేత దార్ల రాజేంద్ర వాపోయారు. ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ గ్రీవెన్స్ సెల్‌లో వినతి పత్రం అందజేశారు. సోమవారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీలు అశోక్ బాబు, బీటీ నాయుడు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో బాధితులు పోటెత్తారు. '2021లో జరిగిన సూళ్లూరుపేటలో మున్సిపల్ ఎన్నికల్లో 24 వార్డులు వైసీపీకి ఏకగ్రీవం అయ్యాయి. ఒక వార్డుకు నేను పోటీ చేసినందుకు నన్ను పోలీసులు బహిరంగంగా అవమానించారు. వారిపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలి' అని రాజేంద్ర కోరారు. నాలుగున్నర నెలల నుంచి తన కుమార్తె కనిపించడం లేదని, పోలీసులకు ఫిర్యాదు చేస్తే వెళ్లి వెతుక్కోమని నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ప్రకాశం జిల్లా పొదిలి మండలానికి చెందిన డి.నాగేంద్ర ఫిర్యాదు చేశారు. ఒక టీచర్ పెళ్లిళ్ల బ్రోకర్‌గా మారి మోసం చేస్తున్నాడని నెల్లూరుకు చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. ఉయ్యూరులో పనిచేస్తున్న ఆ ఉపాధ్యాయుడు పెళ్లి సంబంధాల కోసం తన వద్దకు వచ్చిన ఆడపిల్లలకు తన కుమారుడిని ఇచ్చి పెళ్లి చేస్తున్నాడని, 3-4 నెలల తర్వాత వదిలేసి వారి జీవితాలను నాశనం చేస్తున్నాడని ఆమె ఆరోపించారు. తన కూతురికి అన్యాయం చేసిన వారిని శిక్షించి, తన వద్ద నుంచి తీసుకొన్న రూ.8 లక్షలు తిరిగి ఇప్పించాలని కోరారు.

వైసీపీ వాళ్లు దాడి చేస్తే మాపైనే కేసులు..

కడప జిల్లా సింహాద్రిపురం రావెల కొలను గ్రామంలో వైసీపీ నేతలు తమపై దాడిచేస్తే ఎస్సై తమపైనే బైండోవర్ కేసు పెట్టారని టీడీపీ కార్యకర్తలు పార్టీ నేతల దృష్టికి తీసుకెళ్లారు. వారసత్వంగా వచ్చిన భూమి విషయంలో వైసీపీ గూండాలు బెదిరింపులకు దిగుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం బంగారు చెన్నెపల్లి గ్రామానికి చెందిన ఎం.రామిరెడ్డి కోరారు. చంద్రన్న సంచార చికిత్స విభాగంలో పనిచేస్తున్న తమను గత ప్రభుత్వ హయాంలో తొలగించారని, వైద్యశాఖ ఇతర విభాగాల్లో ఉద్యోగాలు కల్పించాలని ఆ ఉద్యోగులు కోరారు. రీసర్వే వల్ల తమ భూములకు 1బీ, అడంగల్ రావడం లేదని కడప జిల్లా సిద్ధవటం మండలం పెద్దపల్లి పంచాయతీ భాకరాపేట గ్రామ సర్పంచి ఫిర్యాదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో పూర్వీకుల హయాం నుంచి అనుభవిస్తున్న 9 ఎకరాల భూమిని కొంతమంది ఆక్రమించేందుకు దాడులు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. కడప జిల్లా జమ్మల మడుగు నియోజకవర్గంలో గండికోట ముంపు గ్రామాలైన కె.బొమ్మేపల్లి, దొరువుపల్లి గ్రామాల్లో పులివెందుల పట్టణం, ఇతర గ్రామాలకు చెందిన వ్యక్తుల పేర్లతో పరిహారం పొందడానికి వైసీపీ నేతలు అధికారులతో కుమ్మక్కై ప్రయత్నిస్తున్నారని, విచారణ జరిపి అడ్డుకోవాలని పలువురు ఫిర్యాదు చేశారు.

నా డబ్బులు నాకు ఇప్పించండి సార్!

గతంలో నంద్యాల జిల్లా బనగానపల్లి ఎస్సైగా పనిచేసి ఇప్పుడు వీఆర్‌లో ఉన్న పోలు రామిరెడ్డి తన వద్ద డబ్బులు తీసుకొన్నారని, తిరిగివ్వాలని అడిగితే తప్పుడు కేసుల్లో ఇరికిస్తానని బెదిరిస్తున్నాడని కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం టి.చౌదరివారిపల్లి గ్రామానికి చెందిన ఓబుల్ రెడ్డి ఫిర్యాదు చేశారు. మొగల్తూరు మండలం కొత్తూరు గ్రామ పంచాయితీలో స్మశాన వాటికకు సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు కోరారు. 2022లో ఆరు వేల కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీ నోటిఫికేషన్ కోర్టు కేసుల వల్ల ఆగిపోయిందని, త్వరగా పరిష్కరించి ఆ పోస్టులు భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము కోరారు.

వెంకట్రామిరెడ్డీ.. తప్పుకో!

▸▸ వాట్సాప్‌లో సచివాలయ ఉద్యోగి పోస్ట్ హల్‌చల్

▸▸ రాజీనామాకు వెల్లువెత్తుతున్న డిమాండ్లు

▸▸ మీ వల్లే సమస్య.. మీరే పరిష్కరించండి

▸▸ అధ్యక్షుడిని నిలదీసిన సభ్యులు

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల బాగోగులను పట్టించుకోకుండా పక్త రాజకీయ నాయకుడిలా పని చేసిన సచివాలయ ఉద్యోగుల సంఘం(అప్సా) అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఆయన కార్యవర్గ సభ్యులు తక్షణమే రాజీనామా చేయాలంటూ ఓ పోస్టు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో గత జగన్ ప్రభుత్వానికి మేలు కలిగేలా అప్సా అధ్యక్ష హోదాలో వెంకట్రామిరెడ్డి ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఆయన వ్యవహరించడంతో అప్సా గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదంటూ ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే 'వెంకట్రామిరెడ్డీ.. తప్పుకో' అంటూ ఒక ఉద్యోగి రాసిన లేఖ వాట్సాప్ గ్రూపుల్లో తిరుగుతోంది. 'రూసా రూల్స్‌కు వ్యతిరేకంగా ఎన్నికల్లో రాజకీయ పార్టీకి పని చేయడం పెద్ద తప్పిదం. నీ కారణంగా సంఘం గుర్తింపు ఇప్పుడు ప్రమాదంలో పడింది. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యతను మరిచి, గత ప్రభుత్వ భజనలో మునిగిపోయారు. ఇక ఆ పోస్టులో ఒక్క క్షణం కూడా ఉండే అర్హత మీకు లేదు. ఇన్నాళ్లు ఉద్యోగులకు చేసిందేమీలేదు. ఇప్పుడయినా మీ పదవులకు రాజీనామా చేసి అప్సా అస్తిత్వాన్ని కాపాడండి' అని ఆ లేఖలో స్పష్టం చేశారు. కాగా, వెంకట్రామిరెడ్డి, ఆయన పాలకవర్గ సభ్యుల రాజకీయ క్రీనీడకు తామెందుకు బలవ్వాలని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. రాజీనామా చేయాలనే డిమాండ్ ఊపందుకుంటోంది. ఇటీవల జరిగిన అప్సా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలోనూ వెంకట్రామిరెడ్డిని పలువురు సభ్యులు ఇదే అంశంపై నిలదీసినట్లు తెలిసింది. 'మీరు వ్యవహరించిన తీరు వల్లే ఈ రోజు అప్సాకు ప్రభుత్వ గుర్తింపు రద్దు చేసే పరిస్థితి వచ్చింది. ఈ సమస్యను మీరే సీఎం వద్దకు వెళ్లి పరిష్కరించాలి' అని సభ్యులు తేల్చిచెప్పినట్టు సమాచారం. అయితే, తమది ఎలక్టెడ్ బాడీ అని, తప్పుకొనేదిలేదని వెంకట్రామిరెడ్డి చెప్పినట్టు తెలిసింది. తాను తప్పుకొంటే గనుక, ఇప్పుడు ఉపాధ్యక్షులుగా ఉన్న తన అనుకూలురను అధ్యక్షులుగా నియమించాలని మెలిక పెట్టినట్లు సమాచారం.

15 నుంచి ఉచిత ఇసుక

▸▸ పూర్తి స్థాయిలో అందుబాటులోకి .. అన్ని రీచ్‌లు ప్రారంభం: కొల్లు



మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 30: రాష్ట్రంలో ఉచిత ఇసుకను అక్టోబరు 15 నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, అబ్కారీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అన్ని రీచ్‌లను ప్రారంభించడం వలన ట్రాన్స్‌పోర్టు తగ్గుతుందన్నారు. ఇసుకను సీనరీస్ నుంచి తమ సొంత వాహనాలతో తీసుకుని వెళ్లవచ్చన్నారు. పట్టా భూముల్లోంచి ఇసుక తీసుకువెళ్లేందుకు అవకాశం కల్పిస్తూ జీవో ఇస్తున్నామని తెలిపారు. సోమవారం కృష్ణా జిల్లా బందరు పట్టణంలోని పోతేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దసరా పండుగ నాటికి నూతన మద్యం షాపులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. బ్రాండెడ్ మద్యం పంపిణీకి రంగం సిద్ధం చేశామన్నారు. కనీస మద్యం ధర రూ.99గా నిర్ణయించామన్నారు. వైసీపీ పాలనలో ప్రభుత్వమే మద్యం షాపులు తెరిచి నాసిరకం మద్యం అమ్మి కోట్ల రూపాయలు దోచుకుందని విమర్శించారు.

ఆంధ్రప్రదేశ్‌కు స్వాతంత్ర్యం వచ్చింది

▸▸ ప్రజల ముఖాల్లో సంతోషం చూస్తున్నాను

▸▸ లడ్డూ కల్తీ వ్యవహారం బాధ కలిగించింది: నారా భువనేశ్వరి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు, టీడీపీ కార్యకర్తలు చాలా ఇబ్బంది ఎదుర్కొన్నారు. కష్టాలు పడ్డారు. నిజం గెలవాలని నేనూ ప్రజల్లోకి వెళ్లాను. చివరకు నిజం గెలిచింది. ఆంధ్రప్రదేశ్‌కు స్వాతంత్ర్యం వచ్చింది. ప్రజల తీర్పు చాలా సంతోషాన్ని ఇచ్చింది. ప్రజల ముఖాల్లో సంతోషాన్ని చూస్తున్నాను. అది ఎప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను' అని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆమె సోమవారం గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ట్రస్ట్ 4వ బ్లడ్ బ్యాంక్‌ను, మొబైల్ క్లినిక్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'రాజమండ్రి ప్రజలు నన్ను తోబుట్టువులా ఆదరించారు. 53 రోజుల పాటు నన్ను, నా కోడలు బ్రాహ్మణిని అందరూ ఆదరించారు. ఎప్పుడూ మర్చిపోలేను. అందరికీ పాదాభివందనాలు. చంద్రబాబు నా భర్తగానే కాకుండా ఒక లీడరుగానూ ముందుండాలని కోరుకుంటాను. ప్రజలు ఇబ్బందుల్లోనూ, కష్టాల్లోనూ ఉన్నప్పుడు ఆయనకు ఎవరూ చెప్పనక్కరలేదు. ఆయనే ముందుంటారు. నేనెప్పుడూ ఆయనను వెనక్కిలాగను. అందరూ బాగుండాలి. చేనేత వర్గాల కష్టాలు చూశారు. వారిని ప్రోత్సహించాలి. వారికి చాలా ఇబ్బందులు ఉన్నాయి. తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారం ఓ భక్తురాలిగా నన్ను బాధపెట్టింది. ప్రభుత్వాలతో సంబంధం లేకుండా పేదల కోసం అన్న క్యాంటీన్లు ఎప్పుడూ ఉండాలి. బ్రాహ్మణికి రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదు. ఇష్టమూ కాదు. కానీ ఎన్టీఆర్ ట్రస్ట్ సేవల్లో ఆమె మరింత ఉత్సాహంగా పనిచేస్తారు' అని భువనేశ్వరి వివరించారు.



రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ ట్రస్ట్ 4వ బ్లడ్ బ్యాంక్ ప్రారంభం

రాజమహేంద్రవరంలోని ప్రకాశ్‌నగర్‌లో టీడీపీ హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ ఆధ్వర్యంలో నడుస్తున్న గోరంట్ల శాంతారావు ఫౌండేషన్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ 4వ బ్లడ్ బ్యాంక్‌ను సోమవారం భువనేశ్వరి ప్రారంభించారు. అనంతరం అంబులెన్స్‌ను, కోలమూరులో ఎన్టీఆర్ మొబైల్ క్లినిక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జీఎస్ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, మేనేజింగ్ ట్రస్టీ గోరంట్ల వెంకటలక్ష్మి, ఎన్టీఆర్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో పేదలకు ఉచిత వైద్యం

▸▸ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో లక్ష్మీషా

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ ద్వారా పేదలందరికీ ఉచిత వైద్యం అందించడం సంతోషకరమని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో డాక్టర్ లక్ష్మీషా అన్నారు. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కార్యక్రమం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం ఉదయం మంగళగిరిలోని ట్రస్ట్ కార్యాలయ నుంచి ఇంటింటికి ఆరోగ్యం, ఇంటింటికి ఆయుష్మాన్ భారత్ పేరుతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంగళగిరి చేనేత జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌పై ఆస్పత్రులతో వర్క్‌షాపు నిర్వహించారు. ప్రతి వైద్యుడికి సంబంధించి రిపోర్టులు, మెడికల్ రికార్డు డిజిటలైజ్ కావాలని అన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. రోగుల అత్యవసర సమయంలో ఈ డిజిటల్ రికార్డులు ఉపయోగపడతాయని సూచించారు. అనంతరం త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే ఆరోగ్య బీమాపై నెట్‌వర్క్ ఆస్పత్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. బీమా ఏలా అమలు చేయాలన్న దానిపై ఆస్పత్రుల యాజమాన్యాల దగ్గర నుంచి ఆయన సలహాలు, సూచనలు తీసుకున్నారు. సమావేశంలో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ అడ్మిన్ ఈవో వెంకట దీపక్, ఈవో డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



సీఎం చంద్రబాబును కలిసిన మోటూరి శంకరరావు తదితరులు

సీఎం చంద్రబాబును కలిసిన ఎక్స్ సర్వీస్‌మన్ వెల్ఫేర్ సభ్యులు

పెనమలూరు, సెప్టెంబరు 30: మాజీ సైనికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటుపై అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నిర్ణయం తీసుకోవడం పట్ల లక్షాపదివేల మాజీ సైనికుల కుటుంబాల తరఫున కూటమి ప్రభుత్వానికి మాజీ సైనికుల సంక్షేమ సంఘం తరపున అసోసియేషన్ అధ్యక్షులు మోటూరి శంకరరావు ఇతర సభ్యులు సామవారం సీఎం చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మోటూరి శంకరరావు మాట్లాడుతూ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన లక్షా పదివేల కుటుంబాల సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, తమ సమస్యలను చర్చించేందుకు సీఎంను కలిశామని, తమకు జరిగిన పరిష్కారాలపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపామన్నారు. తమ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనితకు కృతజ్ఞతలు తెలిపారు.



నీరబ్ కుమార్‌కు దుర్గమ్మ చిత్రపటం ఇస్తున్న అధికారులు, అర్చకులు

ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి దసరా మహోత్సవాల ఆహ్వానం

వన్‌టౌన్, సెప్టెంబరు 30: దుర్గగుడిలో ఈనెల 3 నుంచి 12 వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు విచ్చేయాలని సోమవారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్‌కు దుర్గామల్లేశ్వర దేవస్థానం తరపున ఆహ్వాన పత్రికలను అందజేశారు. నీరబ్ కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసిన దేవదాయ కమిషనర్ ఎస్. సత్యనారాయణ, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు, ప్రధాన అర్చకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తొలుత నీరబ్ కుమార్‌ను శేషవస్త్రంతో సాదరంగా సత్కరించారు. అనంతరం ఆహ్వాన పత్రికను, ప్రసాదం అందజేయగా అర్చకులు ఆశీర్వదించి ఉత్సవాలకు విచ్చేయాలని ఆహ్వానించారు.



కథానాయకుడు కార్తీకి అమ్మవారి ప్రసాదం ఇస్తున్న అర్చకులు

దుర్గమ్మ సన్నిధిలో హీరో కార్తీ

వన్‌టౌన్, సెప్టెంబరు 30: సినీ హీరో కార్తీ, సత్యం సుందరం మూవీ చిత్ర బృందం సోమవారం ఇంద్రకీలాద్రిపైనున్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం వారికి శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేయగా, పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా హీరో కార్తీక్ మాట్లాడుతూ 2013లో దుర్గమ్మను దర్శించుకున్న తరువాత మళ్లీ ఇన్నేళ్లకు దుర్గమ్మ దర్శనభాగ్యం కలిగిందని, ఇందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన కుటుంబానికి విజయవాడ కనకదుర్గమ్మ ఎంతో ఇష్టమైన దేవతని పేర్కొన్నారు. సత్యం సుందరం విజయ యాత్ర సందర్భంగా నగరానికి రావటం సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రం సూపర్ డూపర్ హిట్ కావాలని అమ్మవారిని కోరుకున్నానని, ప్రజలందరూ సంతోషంగా ఉండేలా దీవించాలని కోరుకున్నట్టు తెలిపారు.



స్కేటింగ్ క్రీడాకారిణి ఆర్యాణిని అభినందించిన ఎంపీ శివనాథ్ (చిన్ని)

స్కేటింగ్ క్రీడాకారిణి ఆర్యాణికి ఎంపీ చిన్ని అభినందన

వన్‌టౌన్, సెప్టెంబరు 30: వరల్డ్ స్కేటింగ్ గేమ్‌లో కాంస్యం సాధించిన ఆర్యాణిని సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. ఇటలీలో ఇటీవల జరిగిన స్కేటింగ్ గేమ్‌లో ఆర్యాణి రోలర్ డెర్బీ విభాగంలో కాంస్యం సాధించింది. ఆర్యాణి విజయాన్ని తెలుసుకున్న ఎంపీ చిన్ని ఆమెకు కోచింగ్ ఇచ్చిన తండ్రి శివపరమేశ్వరరావు, తల్లి నాగస్వర్ణను, ఆర్యాణిని ప్రత్యేకంగా గురునానక్ కాలనీలోని పార్లమెంట్ కార్యాలయానికి ఆహ్వానించారు. చేబోయిన ఆర్యాణిని చిన్ని ప్రత్యేకంగా అభినందించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆస్ట్రేలియా, అమెరికాలో జరిగిన మ్యాచ్‌లలో ఉత్తమ ప్లేయర్‌గా అవార్డును అందుకున్న ఆర్యాణి 2019లో స్పెయిన్‌లో జరిగిన వరల్డ్ స్కేటింగ్ గేమ్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో సెమీస్‌కు వెళ్లింది. మాజీ శాప్ చైర్మన్ పొలినేని అంకం చౌదరి, ఫన్‌టైమ్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ అట్లూరి సుమబిందు పాల్గొన్నారు.

రచయిత్రి డాక్టర్ విజయ భారతికి ఘన నివాళి

విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 30: మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రలు ప్రజలకు అందుబాటులో తెచ్చిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ బోయి విజయ భారతి సంతాపసభ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగింది. గోళ్ల నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, మాజీ శాసనమండలి సభ్యులు జల్లి విల్సన్, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గోసాల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి రత్నప్రదీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ డాక్టర్ బోయి విజయభారతి నాటి వర్ణాశ్రమానికి వ్యతిరేకంగా తన రచనలు ద్వారా ప్రజలను చైతన్యం చేశారన్నారు. అధ్యాపక వృత్తిలో ఉంటూ తన రచనలను కొనసాగించారన్నారు.

డిసెంబర్ 14, 15న యూఎస్‌ఎఫ్ఐ జాతీయ మహాసభలు

ధర్నాచౌక్: నూతన విద్యా విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని భారత ఐక్య విద్యార్థి సమాఖ్య (యూఎస్ఎఫ్ఐ) జాతీయ కన్వీనర్ మాదం తిరుపతి డిమాండ్ చేశారు. డిసెంబర్ 14, 15 తేదీల్లో జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభల ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది విద్యార్థుల బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు ఏకతాటిపై నిలిచి పోరాడాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. సందేపోగు ఉదయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆహ్వానసంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి మర్రెడ్డి వెంకటరెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ వేణుగోపాలరావు, రిటైర్డ్ లెక్చరర్ కళ్లెం సాంబిరెడ్డి పాల్గొన్నారు.

సీఆర్‌డీఏకి రూ. 250 కోట్ల ప్రాజెక్టు

● గతంలో కడప జిల్లా కొప్పర్తికి కేటాయింపు ● అక్కడ ఎలాంటి పురోగతి లేకపోవడంతో అమరావతికి తరలింపు ● భూమి ఇచ్చే బాధ్యత సీఆర్‌డీఏ కమిషనర్‌కి కేటాయించిన ప్రభుత్వం



కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ మంజూరు

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి పారిశ్రామికంగా ఊతమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ని కేటాయించింది. 2019లో అప్పటి కేంద్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు తొలుత ఈ సెంటర్‌ని గుంటూరు జిల్లాకు కేటాయించింది. అయితే ఎక్కడైతే సెంటర్ ఏర్పాటు చేద్దామని భావించారో ఆ స్థలాన్ని గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ల పథకానికి ఇచ్చేసింది. దాంతో 2022లో ఈ ప్రతిష్టాత్మకమైన సెంటర్‌ని కడప జిల్లా కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు తరలించాలని నిర్ణయించారు. దాదాపుగా రూ.250 కోట్ల పెట్టుబడిని ఈ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పెట్టనుంది. అయితే 2023లో కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి పారిశ్రామికవాడలో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటును తిరస్కరించింది. గతంలో మంజూరు చేసిన గుంటూరులోనే ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆ మేరకు సీఆర్‌డీఏ పరిధిలో ఎక్కడైనా 20 ఎకరాల భూమిని ఉచితంగానే కేంద్ర ప్రభుత్వానికి కేటాయించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బాధ్యతని సీఆర్‌డీఏ కమిషనర్‌కు అప్పగించింది.

రాష్ట్ర రాజధాని అమరావతిలో నవ నగరాలను నిర్మించాలని టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్యనే నిర్ణయించింది. అందుకు అవసరమైన బృహత్తర ప్రణాళికని కూడా ఆమోదించింది. ఇండస్ట్రియల్ సిటీని నిర్మించేందుకు అప్పట్లో ఏర్పాట్లు కూడా జరిగాయి. వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడి పనులను అక్కడే నిలిపేసింది. దాంతో నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులు ఎక్కడికక్కడ నిలిచిపోయి తీవ్ర నష్టం జరిగింది. ఈ ఏడాది జూన్‌లో టీడీపీ నేతృత్వ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి రాజధానికి పూర్వ వైభవం సంతరించుకోవడం మొదలైంది. జంగిల్ క్లియరెన్స్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా నిలిచిపోయిన పనులన్నింటిని పునఃప్రారంభించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి.

కాగా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రూ. 250 కోట్లతో కేంద్ర ప్రభుత్వం నిర్మించే ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని మంజూరు చేయడం అమరావతికి మంచి బూస్టప్ ఇస్తుందన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది. ఏపీసీఆర్‌డీఏ వద్ద భూమి పుష్కలంగా అందుబాటులో ఉన్నందున కొద్ది రోజుల్లోనే ఈ స్థలాన్ని కేంద్రానికి స్వాధీనం చేయనున్నారు. ఈ సంస్థ ఏర్పాటైతే అందుకు అనుబంధంగా అనేక ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నిర్మాణం జరుగుతాయి. దాంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా అందుబాటులోకి వస్తాయి. అలానే పారిశ్రామికంగా అమరావతి నగరం అభివృద్ధి చెందడానికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని ప్రభుత్వం పేర్కొంటున్నది.

అభివృద్ధికి అంకురార్పణ

● రూ.22 లక్షలతో ఆటోనగర్ డ్రైనేజీ పనులు ప్రారంభం ● కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్





ఎక్స్‌కవేటర్‌తో డ్రైనేజీ పనులు చేయిస్తున్న అధికారులు, పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె

ఆటోనగర్, సెప్టెంబరు 30: కూటమి ప్రభుత్వంతో ఆటోనగర్ అభివృద్ధికి అంకురార్పణ జరిగింది. వర్షం పడితే ఆటోనగర్ సన్‌లైట్ సెంటర్, పలు రహదారులు పూర్తిగా జలమయమైయేవి. దీంతో లారీల రాకపోకలకు, జనజీవన రవాణాకు విఘాతం ఏర్పడేది. గత వైసీపీ పాలనలో ఆటోనగర్ పూర్తిగా నిర్వీర్యమైంది. వేలాది మంది కార్మికులు జీవనాధారమైన ఆటోనగర్ అభివృద్ధికి అమడ దూరంలో నిలిచిం ది. కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే ఆటోనగర్‌పై దృష్టి సారించింది. మురుగునీరు, వర్షపునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన డ్రైనేజీ పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఐలా అధికారులను ఆదేశించారు.

రూ. 22లక్షలతో డ్రైనేజీ పనులు

సైన్‌లైట్ సెంటర్ వద్ద డ్రైనేజీకి రూ.22లక్షలను వెచ్చించి పనులను ఐలా ప్రారభించింది. ఈ పనులు పూర్తయితే వర్షపునీటితో పాటు మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత పాలనలో అధికారులకు ఎన్నిసార్లు వినతులు అందించినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇటీవల వచ్చిన వరదలకు ఆటోనగర్ పూర్తిగా జలమయమవడంతో ఎమ్మెల్యే పర్యటించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఐలా అధికారుల్లో కదిలిక వచ్చి వెంటనే పనులు ప్రారంభించారు. డ్రైనేజీ పనులతో పాటు సన్ లైట్ సెంటర్ నుంచి స్వీట్ మ్యాజిక్ వరకు నాలుగు అడుగుల మేర రోడ్డు ఎత్తు పెంచి రహదారిని నిర్మించనున్నట్టు తెలిపారు. దీంతో వర్షపునీరు నిలబడకుండా ఉంటుందంటున్నారు.

ఆటోనగర్‌లో సమస్యలెన్నో..

ఆటోనగర్ సమస్యల వలయంలో చిక్కుకుంది. ఎక్కడ చూసినా గుంతలమయం. రాత్రి వీధి దీపాల నిర్వహణ గాలికొదిలేశారు. సైడ్ డ్రైనేజీల్లోనే సెప్టింక్ ట్యాంక్ వ్యర్థాలను వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను తగలబెట్టడంతో కాలుష్యం ఏర్పడుతోంది. కార్మికుల గొంతు తడిపే నాథుడే లేకపోలేదు. ఈ సమస్యలను కుటమి ప్రభుత్వం తీర్చాలని కార్మికులు కోరుకుంటున్నారు.

చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

కూటమి ప్రభుత్వం ఆటోనగర్ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. కార్మికుల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాం. గత వైసీపీ పాలనలో ఆటోనగర్ అస్తవ్యస్తమైంది. కార్మికుల మంచినీటి సదుపాయం అందేలా అధికారులతో మాట్లాడాతాం. అలాగే డ్రైనేజీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సన్‌లైట్ సెంటర్ వద్ద డ్రైనేజీకి రూ. 22 లక్షలను వెచ్చించి అభివృద్ధి చేస్తున్నాం. దీంతో వర్షపునీరు, మురుగునీరు నిలవకుండా ఉంటుంది. అలాగే రహదారి ఎత్తును పెంచి నిర్మిస్తున్నాం.

రిటైర్డ్ ఉద్యోగులకు పరిమితి లేని గ్రాట్యుటీ ఇవ్వాలి

బస్టేషన్: ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన, పదవీ విరమణ చేయబోతున్న ఉద్యోగులకు 113 జీవో ప్రకారం పరిమితి లేని గ్రాట్యుటీ అందజేసేందుకు ట్రెజరీల అధికారులకు ప్రత్యేక ఆదేశాలివ్వాలని, ట్రెజరీలు, గణాంక శాఖ సంచాలకులకి ప్రజా రవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వై.శ్రీనివాసరావు, అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి సోమవారం ఒక లేఖ అందించారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి అనేక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లామని, 11వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌కు కూడా అతిపెద్ద అసోసియేషన్ ప్రతినిధులుగా తాము విన్నవించామన్నారు. ప్రజా రవాణా ఉద్యోగులుగా పదవీ విరమణతో పాటు ఇతర కారణాలతో నిష్క్రమించిన ఉద్యోగులు ఈపీఎఫ్ 95లో ఉన్నటైతే ఆర్టీసీ విధానాల మేరకు పరిమితి లేని గ్రాట్యుటీ చెల్లించాలని 2022 జూన్ 3న జీవో 113 ద్వారా చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ ఉత్తర్వులను అమలు చేయకుండా గ్రాట్యుటీ మీద పరిమితి విధించి రూ.16లక్షల వరకు మాత్రమే చెల్లించి ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారన్నారు. పరిమితి లేని గ్రాట్యుటీ చెల్లించేలా ట్రెజరీల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

బస్ పాస్ కౌంటర్ల పనివేళలో మార్పు

వన్‌టౌన్: జిల్లాలోని అన్ని బస్ డిపోల్లో ఉన్న బస్‌పాస్ కౌంటర్ల పని వేళలు ఈనెల 1 నుంచి మార్పు చేస్తున్నట్టు జి ల్లా ప్రజా రవాణ అధికారి ఎంవై దానం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉద యం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, ఆదివా రం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే కౌంటర్లు పనిచేస్తాయని, ఈ మార్పులను గమనించాలన్నారు.

నేడు టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు: ఉమ్మడి కృష్ణా స్కూల్ గేమ్స్ అం డర్-19 బాలబాలికలకు నగరంలోని ఐజీఎం స్టేడియంలో అక్టోబరు 1న ఉదయం 9 గంటలకు టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్ ఎంపికలను నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి వి రవికాంత ఒక ప్రకటనలో తెలిపారు. హాజరయ్యే క్రీడాకారులు టెన్త్ ఒరిజనల్ మార్కుల లిస్టు, ప్రస్తుతం చదువుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సంతకం చేసిన స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో రావాలని కోరా రు. వివరాలకు 9440112455 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం

విజయవాడ: పోలీసు కమిషనరేట్‌లో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులను పోలీసు కమిషనర్ రాజశేఖర బాబు సత్కరించారు. సీఎస్‌బీ ఎస్ఐ జి.కృష్ణారావు, నందిగామ ఏఎస్ఐ వి.విఠల్‌రావు, సీఏఆర్ ఆర్ఎస్ఐ ఎస్.శామ్యూల్, సీపీవో సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీదేవిలను సమావేశపు మందిరంలో సీపీ సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో డీసీపీలు గౌతమీ షాలి, కృష్ణమూర్తినాయుడు, ఏఆర్ ఏడీసీపీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రరూపంతలూగించిన విన్యాసాలు





విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 30: సిద్ధార్థ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య విన్యాసాలు ఉర్రూతలూగించాయి. మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం ముమ్మానేని సిద్ధార్థ కళాపీఠం, సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనర్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంయుక్త అధ్వర్యంలో సిద్ధార్థ నృత్యోత్సవం పేరిట సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థినీ, విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. ముందుగా పీబీ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యార్థిని గానం చేసిన 'పంచాషట్ పీఠ రూపిణీ' కీర్తన షైమరిపించింది. తదుపరి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజ్ ప్రదర్శించిన రామాయణ శబ్దం కూచిపూడి నృత్యం రసరమ్యంగా సాగింది. డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు ప్రదర్శించిన సెమీ క్లాసికల్ డ్యాన్స్ (తమిళ) రంజింపచేసింది. వెలగపూడి దుర్గాంబికా సిద్ధార్థ లా కళాశాల విద్యార్థిని ప్రదర్శించిన మహిషాసురమర్దిని నృత్య విన్యాసం నవరసాలు మేళవించి రసభరితం గావించింది. సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థుల బృందం 27 మంది ప్రదర్శించిన 'రెస్పెక్ట్ ఉమెన్ థీమ్ బేస్డ్ డాన్స్' సభికులను కట్టిపడేసింది. వివిధ కోణాల్లో స్త్రీ వైభవాన్నీ ఆవిష్కరించి అలరించారు. 'బ్రోచేవారెవరురా' అంటూ పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థి చక్కని వాద్య లయ వాద్యాన్ని వినిపించారు. నర్సింగ్ స్కూల్ విద్యార్థులు బెంగాలీ డాన్స్‌తో, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు 'స్త్రీ శక్తి' థీమ్ బేస్డ్ డాన్స్‌తో, పీవీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు మరో బృందం కరగం నృత్యంతో సిద్ధార్థ మహిళా కళాశాల జూనియర్ బృందం పవర్ ఆఫ్ ఇండియన్ సోల్జర్స్ కింగ్ డాన్స్‌తో దేశభక్తిని చాటుతూ అద్భుతంగా డాన్స్ చేశారు. ఇది సిద్ధార్థ కళాశాల ఫ్లాష్ మాబ్, డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థుల 'ఇండియా ల్యాండ్ ఆఫ్ డైవర్సిటీ ఎత్నిక్ షో ఆద్యంతం అలరించాయి. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు చదలవాడ నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ లలిత్ ప్రసాద్, సభ్యుడు శ్రీహరి పాల్గొన్నారు. అడ్మినిస్ట్రేషన్ రమేష్ పర్యవేక్షించారు.

ప్రతి ఒక్కరు బీఎల్ఎస్ శిక్షణ పొందాలి

● చైర్మన్ డాక్టర్ రమేష్‌బాబు



భారతీనగర్, సెప్టెంబరు 30: ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాజంలో అందరికీ ఉపయోగపడేలా ఆయుష్ హాస్పిటల్‌లో మేనేజింగ్ డైరెక్టర్ కే గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్) శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రమాదంలో ఉన్నవారిని లైఫ్ సేవింగ్ ప్రక్రియల ద్వారా ప్రమాదకర పరిస్థితి నుంచి ఎలా రక్షించాలనే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.రమేష్‌బాబు మాట్లాడుతూ సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ బీఎల్ఎస్ శిక్షణ పొందాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కార్డియాలజీ డాక్టర్ పి.ఎస్.శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ బీఎల్ఎస్ శిక్షణ పొందడం ద్వారా గుండెపోటు వచ్చి ప్రమాదంలో ఉన్నవారికి సీపీఆర్ చేసి కాపాడవచ్చునన్నారు. మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ కె.ఎల్.వి ప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ తరుణ్‌చౌదరి, డాక్టర్ పావని ప్రజలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయుష్ హాస్పిటల్ సీఏవో ఎం.జయలక్ష్మీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇలాంటి శిక్షణ శిబిరాలలో పాల్గొనడం ద్వారా తమ తోటి వ్యక్తులను రక్షించే అవకాశం ఉంటుందన్నారు. ఎలక్ట్రికల్, పోలీస్ డిపార్ట్‌మెంట్ వారు, యువతీ, యువకులు సుమారుగా 250 మంది పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి



సమావేశంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని చిన్ని తదితరులు

వన్‌టౌన్, సెప్టెంబరు 30: రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించేందుకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రజా ప్రతినిధులందరూ కష్టపడి పనిచేయాలని ఎన్టీఆర్ కృష్ణాజిల్లాల టీడీపీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్, కొనకళ్ల నారాయణరావు అన్నారు. సోమవారం ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో పట్టభద్రుల ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుపై పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్, పలువురు ఎమ్మెల్యేలతో జిల్లాల అధ్యక్షులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఓట్లను షెడ్యూల్‌లోగా అధికంగా చేర్పించాలన్నారు. ఇప్పటి నుంచే అభ్యర్థి గెలుపునకు ఎమ్మెల్యేలందరూ కష్టపడి పనిచేయాలన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, యార్లగడ్డ వెంకట్రావ్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్, గద్దె రామ్మోహన్, శ్రీరాం తాతయ్య, వసంత కృష్ణ ప్రసాద్, బోడే ప్రసాద్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, పలువురు నేతలు పాల్గొన్నారు.

దుర్గగుడి కళావేదిక పై కూచిపూడి నృత్య ప్రదర్శన



వన్‌టౌన్: దుర్గగుడి కళావేదికపై మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన శ్రీసాయికృప కూచిపూడి కళాక్షేత్రం నిర్వాహకురాలు పడాల బిందుమాధవి ఆధ్వర్యంలోని బృందం కూచిపూడి నృత్యప్రదర్శన చేసింది. పలు కీర్తనలకు చక్కటి అభినయాన్ని ప్రదర్శించి ఆహూతుల హర్షధ్వానాలు అందుకున్నారు.

వెలంపల్లిపై సిట్‌కు ఫిర్యాదు చేస్తాం

● జనసేన సెంట్రల్ ఆంధ్రా కన్వీనర్ బాడిత శంకర్

భవానీపురం, సెప్టెంబరు 30: 100 రోజుల నుంచి పత్తా లేని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ తాజాగా తెరపైకి వచ్చి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అవాకులు, చెవాకులు పేలితే సహించేది లేదని, నీవు మంత్రిగా పనిచేసిన కాలంలో చేసిన అవినీతిపై తిరుమల విషయమై ఏర్పాటైన సిట్‌కు ఫిర్యాదు చేస్తామని జనసేన సెంట్రల్ ఆంధ్రా జోన్ కన్వీనర్ బాడిత శంకర్ హెచ్చరించారు. క్రాంబే రోడ్డులోని జనసేన పశ్చిమ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో దేవదాయశాఖ మంత్రిగా వెలంపల్లి లెక్కలేని అక్రమాలకు పాల్పడ్డారని శంకర్ ఆరోపించారు. తిరుమలలో దర్శనాల టిక్కెట్లను అమ్ముకున్నారని, అక్రమ కాంట్రాక్టులు, దుర్గగుడిలో వెండి సింహాల మాయంలో కేసులో ఆయనపై ఆరోపణలున్నాయన్నారు. వీటన్నింటిపై తాము తిరుమల లడ్డూ విషయంలో ఏర్పడిన సిట్‌కు ఫిర్యాదు చేసి సమగ్ర దర్యాప్తు చేయాలని కోరతామన్నారు. కొప్పిరెడ్డి ఎస్ఎన్ మూర్తి, నగర జనసేన ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్, రాజేష్, రాజానాయుడు,రవి పాల్గొన్నారు.

వెలంపల్లి అక్రమాలపై విచారించాలి

విద్యాధరపురం: మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దేవదాయ శాఖ మంత్రిగా పనిచేసినప్పుడు జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని జనసేన పార్టీ నేత తిరుపతి అనూష అన్నారు. హెచ్‌బీకాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కామన్‌గుడ్‌ఫండ్ (సీజీఎఫ్) నిధులను ఇష్టానుసారం విడుదల చేశారని, దేవస్థానాల భూములకు నో అబ్జిక్షన్ సర్టిఫికెట్లు ఇచ్చారని దుర్గగుడి ఈవోగా సురేష్ బాబు పనిచేసినప్పుడు వెల్లంపల్లి చేసిన అవినీతి అక్రమాలు ఎన్నో ఉన్నాయని, వీటిని వెలికి తీయాలన్నారు. గోవిందలక్ష్మి, దేవకి, పద్మావతి, పిల్లా వేణిశాంతి పాల్గొన్నారు.

అండర్-19 ఏపీ టీంకు ఎన్ఆర్ఐ విద్యార్థి ఎంపిక

విజయవాడ కల్చరల్: ఆగిరిపల్లి సమీపంలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ డేటా సైన్స్ విభాగంలో సెకెండియర్ చదువుతున్న విద్యార్థి తాతా సాయిప్రకాష్ క్రికెట్‌లో అండర్ 19 టీంకు ఎంపికయ్యాడు. అక్టోబరు 4న మహోలిలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పిగౌతు తెలిపారు. సాయిప్రకాష్‌ను చైర్మన్ డాక్టర్ వెంకట్రావు అభినందించారు.



అభిమానులు, పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న పోతిన మహేష్

ఘనంగా మహేష్ జన్మదిన వేడుకలు

వన్‌టౌన్: వైసీపీ నేత పోతిన మహేష్ జన్మదిన వేడుకలు కొత్తపేటలోని ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీశ్రేణులు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, మహేష్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరిన్ని చేసుకోవాలని ఆకాంక్షించారు. వైసీపీ శ్రేణులు, అభిమానులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపేయాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర బాబు

వన్‌టౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించటాన్ని నిలుపుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. హనుమాన్‌పేట దాసరిభవన్‌లో సోమవారం జరిగిన జిల్లా ఏఐవైఎఫ్ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఉక్కు ఫాక్టరీని సెయిల్‌కు అప్పగించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం నుంచి యువజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపడతామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కోరారు. లంకా గోవిందరాజులు, షేక్ సుభాని, కంచర్ల భార్గవ్, లంకే సాయి, మన్నే హనుమంతరావు, మోహనప్రసాద్, శీరం రవి, మనోజ్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన సభ్యుల ఎన్నిక

భారతీనగర్: రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ (పీఏఎల్ఏ) 2024-26 సంవత్సరానికి గాను నూతన సభ్యుల నియామకం సోమవారం జరిగిందని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం విజయ సారథి ఒక ప్రకటనలో తెలిపారు. 2 రోజుల నుంచి ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కె.ఈ శరత్‌రాఘవేంద్ర బాబు (ఎస్‌వీజీపీటీ కళాశాల తిరుపతి), అసిస్టెంట్ అధ్యక్షులు సంపతి రాంబాబు (జీపీటీ అనంతపురం), ఉప అధ్యక్షులు పి. యుగంధర్(శ్రీకాకుళం), జనరల్ సెక్రెటరీ కె. నరసింహారావు (రాజమండ్రి), సెక్రెటరీ కె.సుబాన్ (జీపీటీ అనంతపురం)తో మొత్తం 12మందిని ఎన్నుకున్నారు.

ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం బలోపేతం

» కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆసియా పవర్ ఇండెక్స్ 2024 ప్రకారం ఆసియాలో మూడో అత్యంత శక్తివంతమైన దేశంగా అవతరించడం ప్రపంచ వేదికపై పెరుగుతున్న భారత్ ప్రభావానికి నిదర్శనమని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రధాని మోదీ దార్శనిక నాయకత్వంలో మన దేశం వ్యూహాత్మక, ఆర్థిక, సైనిక రంగాలలో బలోపేతమవుతూ ఆసియా భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలకమైన పాత్రను పోషిస్తోందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సోమవారం, ఇక్కడ రాజీవ్‌గాంధీ భవన్‌లో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి తన శాఖ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమం కింద మన తల్లులకు నివాళిగా ప్రతి ఒక్కరం ఒక్క మొక్కనైనా నాటుదామని ఆయన పిలుపునిచ్చారు.

లులూ గ్రూప్ తిరిగి రాక మంచి పాలనకు ప్రతీక

» ఎమ్మెల్సీ బీటీ నాయుడు



అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): 'జగన్ దెబ్బకు లులూ గ్రూప్ ఈ రాష్ట్రంలో అడుగు పెట్టనని వెళ్లిపోయింది. ఆ గ్రూప్ మళ్లీ ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం మంచి పాలనకు ప్రతీక అని టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావుతో కలసి విలేకరులతో మాట్లాడారు. 'విశాఖ, విజయవాడ, తిరుపతిలో సుమారుగా రూ.172 కోట్ల మేర పెట్టుబడులు పెట్టడానికి లులూ గ్రూప్ ముందుకు వచ్చింది. రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన అనేక సంస్థలు ఇదే మాదిరిగా వస్తున్నాయి. గత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి జే ట్యాక్స్ వసూళ్లే పనిగా పనిచేస్తే చంద్రబాబు యువతకు ఉద్యోగాల గురించి మాత్రమే పనిచేస్తున్నారు. దీనిలో భాగంగా ఏడున్నర లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా కొత్త ఇంధన పాలసీని తయారు చేశారు' అని నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే రాష్ట్రంలో ఆలయాల్లో పరిస్థితిని మెరుగుపర్చి భక్తుల ప్రశంసలు పొందుతోందని గూడపాటి శ్రీనివాసరావు చెప్పారు.

బుడమేరు, కొల్లేరు ఆక్రమణలను తొలగించండి

» సీఎం చంద్రబాబుకు రామకృష్ణ వినతి



అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): 'బుడమేరు, కొల్లేరు ఆక్రమణలను తక్షణమే తొలగించాలని సీఎం చంద్రబాబును కోరాం. ఆక్రమణలు తొలగించకపోతే సమస్య పరిష్కారం కాదని సీఎంకు తెలిపామని, ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. సోమవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన అనంతరం రామకృష్ణ మీడియాతో మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు బుడమేరు ఆక్రమణలను కచ్చితంగా ప్రక్షాళన చేస్తామని చెప్పారు. వరద బాధితులకు కేంద్రం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సహాయం రాకపోయినా రాష్ట్ర ప్రభుత్వ నిధులు, దాతల నుంచి సమీకరించిన నిధులతో సహాయక చర్యలు చేపట్టారు. వరద వల్ల నష్టపోయిన ఆటో యజమానులకు ఇస్తున్న రూ.10 వేలను రూ.25,000 చేయాలని సీఎంను కోరాం. ఆయన పరిశీలిస్తామని చెప్పారు. తిరువూరు ప్రాంతంలోని ఏ కొండూరు మండలంలో కిడ్నీ బాధితులకు మంచినీరు సరఫరా చేయాలని, డయాలసిస్ చేయించుకునే వారందరికీ ఆర్థిక సహాయం చేయాలని కోరాం. అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరించాలని కోరాం. చేనేత కార్మికుల సమస్యలపై సీఎంతో చర్చించాం. పోలవరం నిర్వాసితుల సమస్యను ప్రాధాన సమస్యగా తీసుకుని పరిష్కరించాలని కోరాం' అని రామకృష్ణ తెలిపారు.

చేనేతకు పునర్వైభవం: మంత్రి సవిత

» నేటి నుంచి గుంటూరులో చేనేత వస్త్ర ప్రదర్శన



పెనుకొండ టౌన్, సెప్టెంబరు 30: నేత వృత్తినే నమ్ముకున్న వారికి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని.. చేనేతకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకుంటుందని.. బీసీ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని తన స్వగృహంలో మంత్రి సోమవారం విలేకరులతో మాట్లాడారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 1 నుంచి 14వ తేదీ వరకు గుంటూరులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఏపీకి చెందిన చేనేత కార్మికులతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 80 చేనేత కార్మిక సంఘాలు, సొసైటీలు పాల్గొంటాయని తెలిపారు. ఎగ్జిబిషన్‌లో నూలు చీరలు, పట్టు చీరలు, పావడాలు, డ్రస్ మెటీరియల్స్ విక్రయిస్తామని తెలిపారు. నేతన్నకు అండగా ఉండాలనే లక్ష్యంతో పెద్దఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

కేజీబీవీల్లో ఖాళీలు.. 10 వరకు దరఖాస్తులకు గడువు

అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో బోధనా సిబ్బంది పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన, బోధనేతర సిబ్బంది పోస్టులను అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు అక్టోబరు 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే 7075039990, 7075159996 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ఇతర వివరాలు ఏపీకేజీబీవీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

17 వీసీ పోస్టులకు 2,500 దరఖాస్తులు!

అమరావతి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైస్ చాన్స్‌లర్ పోస్టులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రంలోని 17 యూనివర్సిటీలకు సుమారు 2,500 దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. అంటే సగటున ఒక్కో యూనివర్సిటీకి 140కి పైగా దరఖాస్తులు అందాయి. అయితే ఏ యూనివర్సిటీకి ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే వివరాలను ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి రహస్యంగా ఉంచుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం వేధిస్తోంది

» జాతీయ ఎస్సీ కమిషన్‌కు నందిగం సురేశ్ కుటుంబం ఫిర్యాదు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను వేధింపులకు గురిచేస్తోందని ఆయన కుటుంబ సభ్యులు జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సురేశ్ కుటుంబ సభ్యులు సోమవారం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులతో భేటీ అయ్యారు. అనంతరం సురేశ్ భార్య బేబిలత ఏపీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తన భర్తపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని ఆరోపించారు. మాజీ సీఎం జగన్ మతం గురించి టీడీపీ నేతలు విమర్శలు చేస్తున్నారని, వారికి క్రైస్తవుల ఓట్లు అక్కరలేదా..? అని ఆమె ప్రశ్నించారు.

మాజీ ఐఏఎస్ అధికారిణి చందనా ఖన్ కన్నుమూత



హైదరాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మాజీ ఐఏఎస్ అధికారిణి చందనా ఖన్ కన్నుమూశారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఆమె తన సర్వీసంతా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గడిపారు. రాజమండ్రి, శ్రీకాకుళం జిల్లాల్లో సబ్ కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా, కడప కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాథమిక విద్య, సర్వశిక్ష అభియాన్‌లో అనేక సంస్కరణలు అమలు చేశారు. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఆమె అనేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేశారు.

నిర్మలకు కర్ణాటక హైకోర్టులో ఊరట

» ఎలక్టోరల్ బాండ్ల కేసు దర్యాప్తునకు బ్రేక్

బెంగళూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎలక్టోరల్ బాండ్‌లలో అవినీతి ఆరోపణలకు సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై తిలక్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును దర్యాప్తు చేయకుండా కర్ణాటక హైకోర్టు బ్రేక్ వేసింది. ఈ కేసులో మరో నిందితుడిగా ఉన్న మాజీ ఎంపీ నళిన్‌కుమార్ కటీల్ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఎఫ్ఐఆర్‌పై తదుపరి చర్యలు నిలిపేయాలని న్యాయమూర్తి మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణను అక్టోబరు 22వ తేదీకి వాయిదా వేశారు. కాగా, ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌ను సుప్రీంకోర్టు ఫిబ్రవరిలోనే రద్దు చేసిందని, వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని ఉల్లంఘించేలా కేసు నమోదు చేశారని నళిన్ కుమార్ కటీల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఈడీ అధికారులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర నిందితులుగా ఉన్నారు.

'పటమట' ఖాకీ రాగం!

» అసలు 'స్పా' స్కెచ్ ఎవరిది?

» డీజీ స్థాయి అధికారి ఇచ్చిన ఆదేశాలతోనే దాడులు చేశారా?

» జెత్వానీ ఫోన్ల పాస్‌వర్డుల కోసం ఢిల్లీకి చెందిన అమిత్‌పై కేసు

» ఫేక్ కేసు వ్యవహారంలో ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డిని విచారించే అవకాశం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)



ముంబై నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో ఆమె సన్నిహితుడిపై నమోదు చేసిన మరో ఫేక్ కేసు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో పలు ప్రశ్నలు ముందుకొస్తున్నాయి. జెత్వానీ సన్నిహితుడైన అమిత్ సింగ్‌ను ఇక్కడి ఒక స్పా కేంద్రంలో విటుడిగా పేర్కొంటూ కేసు పెట్టేందుకు అప్పటి పటమట పోలీసులు వినిపించిన రాగం ఏమిటి? పోలీసులకు ఈ 'స్పా' స్కెచ్ ఇచ్చిన అధికారులు ఎవరు? కమిషనరేట్ లోనే నిర్ణయం తీసుకున్నారా? డీజీ స్థాయి అధికారి నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత స్పా కేంద్రంపై దాడులు చేశారా? విషయం చెప్పగానే నాటి ఇన్‌స్పెక్టర్ డీఎస్‌కే మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారా? అనేవి ఇప్పుడు ఉదయిస్తున్న ప్రశ్నలు. కాదంబరి ఐఫోన్ల పాస్‌వర్డులను తెలుసుకునేందుకు ఢిల్లీకి చెందిన అమిత్‌కుమార్ సింగ్‌పై పటమట పోలీసులు ఫేక్ కేసు నమోదు చేసిన విషయం తాజాగా వెల్లడైన విషయం తెలిసిందే. ఒకపక్క ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో కాదంబరిపై నమోదైన కేసు వ్యవహారంపై విచారణ జరుగుతోంది. ఇదిలా ఉండగానే పటమట పోలీసులు నమోదు చేసిన కేసు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కుక్కల విద్యాసాగర్ సూచనతో అమిత్ సింగ్‌ను అరెస్టు చేయడానికి పోలీసులు పక్కాగా స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. క్రైం నంబర్ 105/2024తో ఐపీసీ 370(ఎ)(2), 370(3), ఐటీపీ చట్టంలోని 3, 4, 5, 7 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారుడిగా అప్పటి ఇన్‌స్పెక్టర్ డీకేఎస్ మోహన్‌రెడ్డి ఉన్నారు. ఈ కేసులో ఏ1గా డిచెన్ తమాంగ్, ఏ2గా అమిత్ కుమార్ సింగ్, ఏ3గా భాస్కర్, ఏ4గా మోటుపల్లి ప్రశాంతి, గద్దె మల్లికార్జునరావు, ఏ5గా లక్కిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఏ6గా సందిపోగు జవహర్‌బాబు, ఏ7గా త్రిపురమల్లు శ్రీనివాస్‌లను చేర్చారు. వారి నుంచి రూ.11 వేల నగదు, పది డ్యూరెక్స్ కొత్త కండోమ్‌లు, ఐఫోన్ 12ప్రో, ఐ ఫోన్ 15ప్రోను సీజ్ చేసినట్లు కోర్టుకు సమర్పించిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

ఏసీపీకి సమాచారం ఇచ్చారా లేదా?

ఫిబ్రవరి 10న స్పా కేంద్రంలో తనిఖీలు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. ఢిల్లీలో ఉన్న అమిత్ సింగ్‌ను అరెస్టు చేయడానికి అదే రోజున విమానం టికెట్లు బుక్ చేశారు. ఆ సమయంలో సెంట్రల్ జోన్ ఏసీపీగా భాస్కరరావు వ్యవహరించారు. పటమట పోలీసుస్టేషన్ సెంట్రల్ జోన్ పరిధిలోకి వస్తోంది. మోహన్‌రెడ్డి స్పా కేంద్రంలో దాడులు చేయడానికి వెళ్లే ముందు ఏసీపీకి సమాచారం ఇచ్చారా లేదా అన్న ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు. ప్రస్తుతం మోహన్‌రెడ్డి ఏలూరు రేంజ్‌లో వీఆర్‌లో ఉన్నారు. ఇబ్రహీంపట్నంలో కాదంబరిపై నమోదు చేసిన ఫేక్ కేసు విచారణ పెద్ద టాస్క్‌గా మారింది. ఈ వ్యవహారంలో ప్రాథమిక ఆధారాలు సేకరించిన తర్వాత నాటి ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, అప్పటి పోలీసు కమిషనర్ కాంతిరాణా, డీసీపీ విశాల్‌గున్నీతోపాటు ఏసీపీ హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణపై వేటు వేశారు. మిగిలిన అధికారులపై విచారణ కొనసాగుతోంది. పటమట పోలీసులు నమోదు చేసిన కేసు విషయంలో మోహన్‌రెడ్డిని విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమిత్ సింగ్ కోసం స్పా కేంద్రం స్కెచ్ ఎవరు వేశారన్న వివరాలను రాబట్టే సూచనలు కనిపిస్తున్నాయి. మోహన్‌రెడ్డి చెప్పిన విషయాలు వాస్తవమా? కాదా? అనేది తెలుసుకునేందుకు అమిత్ సింగ్‌ను పిలిపించి విచారించే అవకాశం కూడా ఉంది. వాస్తవానికి జెత్వానీపై చేపట్టిన ఆపరేషన్ మొత్తం పీఎస్ఆర్ కనుసన్నల్లోనే సాగింది. కాదంబరి ఐఫోన్ల పాస్‌వర్డుల కోసం అమిత్ సింగ్‌ను ఎత్తుకు రావాల్సిన అవసరం ఏముందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అనుమానం రాకుండా ప్లాన్!

ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి నమోదు చేసింది ఫేక్ కేసు అయినా చాలా తెలివిగా వ్యవహరించారు. స్పా కేంద్రం నిర్వాహకురాలిని ఏ1గా చేర్చి, అరెస్టు చేయాల్సిన వ్యక్తి అమిత్ సింగ్‌ను ఏ2గా చేర్చడంతోపాటు మరికొంతమందిని నిందితులు చేర్చారు. ఢిల్లీ నుంచి అమిత్‌ను తీసుకురావడం కోసం స్పా కేంద్రంలో దొరకని అతడిని పరారీలో ఉన్నట్లు చూపించారు. అతడు ఒక్కడే పరారయ్యాడా అన్న ప్రశ్న వస్తుందని భావించి ఏ3 భాస్కర్ పేరు పరారీ జాబితాలో చేర్చారని స్పష్టమవుతోంది. ఢిల్లీకి వెళ్లిన బృందానికి అమిత్‌కుమార్ చిక్కి ఉంటే అతడికీ కాదంబరి పరిస్థితి ఎదురయ్యేదా అన్న అనుమానం వ్యక్తమవుతోంది.

విచారణకు సహకరించకుంటే.. మోహిత్‌రెడ్డి బెయిల్ రద్దుకు పిటిషన్ వేశారా?

» వివరాలు సమర్పించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

» విచారణ ఎల్లుండికి వాయిదా



అమరావతి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దర్యాప్తునకు సహకరించకుంటే ఆయన బెయిల్ రద్దు కోసం ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి (అక్టోబరు 3వ తేదీకి) వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా ఎస్వీయూ క్యాంపస్ పోలీసులు నమోదు చేసిన కేసులో తనపై జారీ చేసిన లుకవుట్ నోటీసును ఉపసంహరించేలా ఆదేశించాలని కోరుతూ మోహిత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా.. పిటిషనర్ తరఫు న్యాయవాది వెంకటేశ్ వాదనలు వినిపించారు. ప్రస్తుత కేసులో మోహిత్‌రెడ్డికి పోలీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇచ్చారని హైకోర్టు సైతం షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసిందని తెలిపారు. విదేశాలకు వెళ్లకుండా నిషేధం విధిస్తూ ఎలాంటి షరతూ విధించలేదన్నారు. పిటిషనర్ రిఫరెన్స్ ఉంటేనే ఆయన సోదరుడికి లండన్ యూనివర్సిటీలో సీటు లభిస్తుందన్నారు. అడ్మిషన్ పొందేందుకు అక్టోబరు 3 చివరి తేదీగా పేర్కొన్నారు. ఇప్పుడు వెళ్లకుంటే అడ్మిషన్ కోల్పోయే అవకాశం ఉందన్నారు. కేసు దర్యాప్తునకు సహకరిస్తున్న నేపథ్యంలో లుకవుట్ నోటీసును ఉపసంహరించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ప్రభుత్వ న్యాయవాది సోమరాజు స్పందిస్తూ.. మోహిత్‌రెడ్డి దర్యాప్తునకు సహకరించడం లేదన్నారు. సోదరుడి అడ్మిషన్ పేరుతో విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. ఆయన దర్యాప్తునకు సహకరించకుంటే బెయిల్ రద్దు కోసం సంబంధిత కోర్టులో పిటిషన్ ఏమైనా వేశారా అని ప్రశ్నించారు. పూర్తి వివరాలు కోర్టు ముందుంచాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.



21వేల మంది విద్యార్థులతో స్వచ్ఛత హి సేవ మానవహారం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 30: స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల్లో భాగంగా 21వేల మంది విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో సోమవారం 60 పాఠశాలల నుంచి 21వేల మంది విద్యార్థులు స్వచ్ఛత హి సేవ లోగో ఆకారంలో మానవహారం నిర్వహించారు. ఈ దృశ్యాలను డ్రోన్ కెమెరాలో భద్రపరిచారు. నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ స్వీయ పర్యవేక్షణలో భారీస్థాయిలో ఈ మానవహారం నిర్వహించారు.

మోదీ పద్మవ్యూహంలో జనం

» రెండు నిమిషాలు చాలు.. యువత ఛేదించేందుకు...

» హరియాణా ఎన్నికల సభలో రాహుల్ వ్యాఖ్యలు

చండీగఢ్, సెప్టెంబరు 30: దేశ ప్రజలు ప్రధాని మోదీ పన్నిన 'చక్ర వ్యూహం'లో చిక్కుకున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. చక్రవ్యూహాన్నే 'పద్మ వ్యూహమ'ని కూడా అంటారంటూ బీజేపీ ఎన్నికల గుర్తుపై విమర్శలు గుప్పించారు. రెండు నిమిషాల్లో దేశ యువత దీన్ని ఛేదిస్తారని అన్నారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కురుక్షేత్ర జిల్లాలోని తానేశ్వర్‌లో జరిగిన ప్రచార సభలో ప్రసంగించారు. కురుక్షేత్రలో జరిగిన మహాభారత యుద్ధాన్ని గుర్తుచేస్తూ తన ప్రసంగంలో అందులోని ఘట్టాలను ప్రస్తావించారు. "పేదల జేబుల్లోని డబ్బులు గుంజి కొంతమంది కోటీశ్వరులకు కట్టబెట్టడమే బీజేపీ అమలు చేస్తున్న 'చక్రవ్యూహం'. మహాభారతంలోని చక్రవ్యూహంలో వేలాది మంది సైనికులు పాల్గొంటే ఇప్పటి చక్రవ్యూహాన్ని కేవలం ఆరుగురే అమలు చేస్తున్నారు. వారే నరేంద్ర మోదీ, అమిత్ షా, అదానీ, అంబానీ, అజిత్ దోవల్, మోహన్ భాగవత్. పేదల సొమ్ము 20-25 మంది కుబేరులకు చెందేలా చేయడమే వారి ఆశయం. చక్రవ్యూహం కమలంలా కనిపిస్తుంది కాబట్టి దాన్ని పద్మవ్యూహమని కూడా అంటారు. అది బీజేపీ గుర్తు. కాంగ్రెస్ గుర్తు అభయహస్తం. అంటే 'డరో మత్' (భయపడద్దు). అభయ హస్తం అన్ని మతాల్లోనూ కనిపిస్తుంది. భారత యువకులు అభిమన్యులు కారు..అర్జునులు. రెండు నిమిషాల్లో పద్మవ్యూహాన్ని ఛేదిస్తారు. ఇదే విషయాన్ని మోదీకి చెప్పా" అంటూ వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ హస్తం గుర్తు ఉన్న టీ-షర్ట్ ధరించారు.

తాత్కాలిక డీజీపీల నియామకంపై ఏపీ, తెలంగాణకు సుప్రీం నోటీసులు

6 వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తాత్కాలిక డీజీపీల నియామకంపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా ఏడు రాష్ట్రాలకు, కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. ఆరువారాల్లో అఫిడవిట్లు సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబరు 19వ తేదీకి వాయిదా వేసింది. సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దేశంలోని కొన్ని రాష్ట్రాలు నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక డీజీపీలను నియమిస్తున్నాయని ఈ ఏడాది ఆగస్టు 8న సావిత్రి పాండే సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. "డీజీపీ నియామకానికి సంబంధించి మూడు నెలల ముందే ప్రక్రియ ప్రారంభించాలి. ఏదైనా రాష్ట్రంలో డీజీపీ పోస్టు ఖాళీ అవడానికి మూడు నెలల ముందే యూపీఎస్సీ చైర్మన్ అధ్యక్షతన ఒక కమిటీకి సీనియారిటీ ప్రకారం ముగ్గురు పేర్లను పంపించాలి. కనీసం ఆరు నెలల సర్వీసు ఉన్న డీజీ ర్యాంకు అధికారులందరి జాబితాను కమిటీకి పంపాలి. యూపీఎస్సీ చైర్మన్ అధ్యక్షతన కమిటీ మెరిట్, సీనియారిటీ ఆధారంగా ముగ్గురు పేర్లతో కూడిన జాబితాను ఫైనల్ చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ ముగ్గురిలో ఒకరిని డీజీపీగా నియమించుకోవాల్సి ఉంటుంది" అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఏపీ, తెలంగాణ, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాలకు తాత్కాలిక డీజీపీలు మాత్రమే ఉన్నారని స్పష్టం చేశారు.

ఫిబ్రవరిలో సునీతా విలియమ్స్ భూమిపైకి

» అంతరిక్ష కేంద్రంలో స్పేస్‌ఎక్స్‌కు ఘనస్వాగతం

కేప్ కెనావెరల్, సెప్టెంబరు 30: ఈ ఏడాది జూన్ నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లను వచ్చే ఏడాది ఫిబ్రవరిలో భూమి మీదకు తిరగొచ్చేందుకు లైన్ క్లియరైంది. వారిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు నాసా చేపట్టిన స్పేస్ఎక్స్ మిషన్‌కు ఐఎస్ఎస్‌లో ఘనస్వాగతం లభించింది. క్రూ-9 మిషన్‌తో కూడిన రాకెట్‌ను నాసా ఫ్లోరిడాలోని కేప్ కెనావెరల్ నుంచి శనివారం ప్రయోగించగా.. ఆదివారం సాయంత్రం ఈ క్యాప్సూల్ ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమైంది. డాకింగ్ ప్రక్రియ పూర్తికాగానే క్రూ-9 విషన్‌లోని నాసా వ్యోమగామి నిక్ హేగ్, రష్యన్ కాస్మోనాట్ అలెగ్జాండర్ గోర్బునోవ్ ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించారు. ఐఎస్ఎస్‌లో ఉన్న వ్యోమగాములు వీరిని ఆలింగనం చేసుకుని ఘనస్వాగతం పలికారు. అందుకు సంబంధించిన వీడియోను నాసా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. కాగా, క్రూ-9లో ఐఎస్ఎస్‌కు చేరుకున్న హేగ్, అలెగ్జాండర్ అక్కడే ఐదు నెలలపాటు ఉండి పరిశోధనలు చేపట్టనున్నారు. అనంతరం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో భూమిపైకి రానున్నారు. సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లను కూడా దీనిలోనే భూమికిపైకి తీసుకువస్తారు. వారిద్దరూ ఈ ఏడాది జూన్ 6న స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. వారు జూన్ 14నే తిరిగిరావాల్సి ఉండగా.. వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా అక్కడే చిక్కుకుపోయారు. ఆ తర్వాత సమస్యను పరిష్కరించిన బోయింగ్.. స్టార్‌లైనర్ సురక్షితమే అని చెప్పినప్పటికీ.. నాసా అందుకు అంగీకరించలేదు. అంతరిక్షంలో చిక్కుకున్న వారికోసం స్పేస్ఎక్స్‌కు చెందిన క్రూ-9ను ఐఎస్ఎస్‌కు పంపింది. దీనిలో నిక్ హేగ్, అలెగ్జాండర్ గోర్బునోవ్‌తోపాటు.. సునీత, విల్‌మోర్‌లను కూడా తీసుకొచ్చేందుకు వీలుగా మరో రెండు సీట్లు ఖాళీగా ఉంచినట్టు నాసా తెలిపింది.

ఐస్‌క్రీమ్ తిని డబ్బులివ్వని పోలీసులు

» దాడి చేసిన చిరు వర్తకులు.. విశాఖ ఆర్‌కే బీచ్‌లో సంఘటన

మద్దిలపాలెం (విశాఖపట్నం), సెప్టెంబరు 30: ఐస్‌క్రీమ్‌లు తీసుకుని డబ్బులు ఇవ్వకపోవడమే కాకుండా తిరిగి బెదిరింపులకు పాల్పడిన పోలీసులపై చిరు వ్యాపారులు దాడి చేశారు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి విశాఖ ఆర్‌కే బీచ్‌లో చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం... అల్లూరి సీతారామరాజు జిల్లాలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షేక్ రహీమ్ నగరానికి వచ్చారు. నగర పరిధిలో హోంగార్డులుగా పనిచేస్తున్న తన మిత్రులు నూకరాజు, అనిల్‌తో కలిసి ఆదివారం రాత్రి ఆర్‌కే బీచ్‌కు వెళ్లారు. ముగ్గురూ అక్కడ ఓ బండి వద్ద ఐస్‌క్రీమ్‌లు తీసుకున్నారు. కానీ.. డబ్బులివ్వలేదు. వర్తకుడు డబ్బులు అడగ్గా.. 'మేం పోలీసులం.. మమ్మల్నే డబ్బులు అడుగుతావా..' అంటూ బెదిరించారు. 'పోలీసులైతే డబ్బులు ఎందుకివ్వరు..' అని ఆ వర్తకుడు ప్రశ్నించడంతో వారి మధ్య వాగ్వాదం మొదలైంది. దీంతో సమీపంలోని చిరు వ్యాపారులంతా ఐస్‌క్రీమ్ బండి వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకుని బండి యజమానికి మద్దతుగా నిలిచారు. గొడవ పెరగడంతో ఒక్కసారిగా పోలీసులపై దాడిచేశారు. ఈ సంఘటనలో రహీమ్, నూకరాజు, అనిల్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. దాడి జరిగిన విషయం వాస్తవమేనని, కానీ ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని త్రీటౌన్ పోలీసులు వివరించారు.

నా తప్పుంటే ఏ శిక్షనైనా అంగీకరిస్తా..

» ఆరోపణలు నిరూపించే వరకు దీక్ష చేస్తా: ఎమ్మెల్యే కొలికపూడి

తిరువూరు, సెప్టెంబరు 30: తనపై వచ్చిన లైంగిక ఆరోపణలను నిరూపించాలని, అప్పటి వరకూ దీక్షలో కూర్చుంటానని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. తన తప్పు ఉంటే ఎటువంటి శిక్షనైనా అంగీకరిస్తానని చెప్పారు. బాధ్యత కలిగిన ఎమ్మెల్యేగా ఉండి ఆ రోజు విలేకరుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం తప్పేనని, అందుకు వారికి బహిరంగంగా క్షమాపణలు చెప్తున్నానని తెలిపారు. తన క్యాంప్ కార్యాలయం వద్ద ఆయన సోమవారం బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను ఎవరినైతే లైగింకంగా వేధించానని ఆరోపణలు వచ్చాయో.. వాటిని నిరూపించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తాను దీక్షలో కూర్చుంటానని చెప్పి దీక్షలో కూర్చున్నారు. తప్పు నిరూపించలేకపోతే తనపై ఆరోపణలు చేసిన దంపతులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



దీక్షలో కూర్చున్న కొలికపూడి శ్రీనివాసరావు

851 కిలోల గంజాయి స్వాధీనం

» ఇద్దరి అరెస్టు.. ఏడుగురు పరార్

కొయ్యూరు, సెప్టెంబరు 30: ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి మైదానానికి తరలిస్తున్న 851 కిలోల గంజాయిని అల్లూరి జిల్లా కొయ్యూరు పోలీసులు ఆదివారం మధ్యాహ్నం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేయగా, మరో ఏడుగురు పరారయ్యారు. కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు... ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి కొయ్యూరు మండలంలోని బూదరాళ్ల మీదుగా మైదాన ప్రాంతానికి రెండు కారుల్లో భారీగా గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. కొయ్యూరు ఎస్ఐ సిబ్బందితో ఆదివారం మధ్యాహ్నం మండలంలోని చీడిపాలెం కూడలి వద్ద మాటు వేశారు. బూదరాళ్ల నుంచి ద్విచక్ర వాహనంతో పాటు రెండు కార్లు వస్తున్నట్టు గుర్తించారు. పోలీసులను చూసి బైక్‌పై వస్తున్న ఇద్దరు వాహనాన్ని విడిచిపెట్టి పరారయ్యారు. వెనుక వస్తున్న రెండు కారుల్లోని ఐదుగురు కూడా పరారయ్యారు. పోలీసులకు ఆ కార్ల డ్రైవర్లు ఇద్దరు పట్టుబడ్డారు. డ్రైవర్లను విచారించగా కారులో గంజాయి తరలిస్తున్నట్టు అంగీకరించారు. ఒక కారులోని 185 ప్యాకెట్లు, మరో కారులోని 94 ప్యాకెట్ల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారైన వారి కోసం గాలిస్తున్నారు.

గంజాయి తరలిస్తూ పట్టుబడిన బీటెక్ విద్యార్థులు

» ముగ్గురూ నెల్లూరుకు చెందినవారిగా గుర్తింపు

వైరా/భద్రాచలం, సెప్టెంబరు 30: అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ ఖమ్మం జిల్లా వైరాలో నెల్లూరుకు చెందిన ముగ్గురు బీటెక్ విద్యార్థులు పట్టుబడ్డారు. కొణిజర్ల మండలం పల్లిపాడు సమీపంలో అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని తనిఖీ చేయగా రూ.2 లక్షల విలువైన 8.5కేజీల గంజాయి బయటపడింది. నిందితులను అఫ్రోజ్, అజీజ్, చంద్రబాబుగా గుర్తించారు. తనిఖీల్లో సీఐ మమత, ఎస్ఐ సాయిరాం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలంలో 138కేజీల గంజాయి పట్టివేత

మరో ఘటనలో భద్రాచలం ఆర్టీఏ చెక్‌పోస్ట్ దగ్గర ఎక్సైజ్ అధికారులు 138కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని మల్కాన్‌గిరి నుంచి భద్రాచలం, హైదరాబాద్ మీదుగా కారులో ముంబైకి తరలిస్తున్న 138కేజీల గంజాయిని గుర్తించారు.

500 తాబేళ్లు స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

» నర్సీపట్నం నుంచి ఒడిశాకు అక్రమ రవాణా



ఒడిశా అటవీ శాఖాధికారులు స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా), సెప్టెంబరు 30: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుంచి ఒడిశాకు తాబేళ్లను అక్రమరవాణా చేస్తున్న ఇద్దరిని అటవీ శాఖాధికారులు అదుపులోకి తీసుకుని 500 తాబేళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా అటవీ శాఖాధికారులు తెలిపిన వివరాలు... నర్సీపట్నం నుంచి ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా కలిమెలకు తాబేళ్లు రవాణా చేస్తున్నారని చిత్రకొండ అటవీ శాఖాధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని రాజుకొండ చెక్‌పోస్టు వద్ద రేంజ్ అధికారి బన్మాలి నాయక్ సిబ్బందితో నిఘా పెట్టారు. సోమవారం మధ్యాహ్న సమయంలో అటుగా వస్తున్న వ్యాన్‌ను తనిఖీ చేయగా థర్మాకోల్ బాక్సుల్లో 500 తాబేళ్లు ఉన్నట్టు గుర్తించారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తాబేళ్లు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు చిత్రకొండ అటవీ శాఖాధికారులు తెలిపారు.

అక్రమ పొగాకు మార్కెట్‌పై ఎఫ్ఐఎఫ్ఏ ఆందోళన

గుంటూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏటా పెరుగుతున్న అక్రమ పొగాకు మార్కెట్‌పై అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య(ఎఫ్ఏఐఎఫ్ఏ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అక్రమ వ్యాపారం ప్రత్యక్షంగా చట్టబద్ధమైన పొగాకు ఉత్పత్తిదారుల ఆదాయంపై ప్రభావం చూపుతోందని పేర్కొంది. సిగరెట్లపై అధిక పన్నులు విధింపు ఈ అక్రమ వ్యాపారానికి ఊతమిస్తున్నదని పేర్కొంది. విదేశాల నుంచి సిగరెట్ల స్మగ్లింగ్ యథేచ్ఛగా జరుగుతుండటం కూడా దేశీయ పొగాకు రైతులకు నష్టం చేకూరుస్తోందని, తక్షణమే కేంద్ర ప్రభుత్వ విధానాల్లో మార్పులు చేయాలని అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తాజాగా ఒక సుదీర్ఘమైన లేఖను ఎఫ్ఏఐఎఫ్ఏ అధ్యక్షుడు జవారే గౌడ, జనరల్ సెక్రెటరీ పీ.ఎస్ మురళీబాబు విడుదల చేశారు. ప్రభుత్వం కొన్ని విధానపరమైన సవరణల ద్వారా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● మంగళవారం 1 అక్టోబరు 2024



ఎన్టీఆర్ వర్సిటీ మెడికల్ పీజీ నోటిఫికేషన్

విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ/డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మేనేజ్‌మెంట్ కోటా కింద ప్రైవేట్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో; స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్), శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(స్విమ్స్) అనుబంధ కళాశాలల్లో సీట్ల భర్తీకి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 50 శాతం సీట్లను స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద, మిగిలిన 50 శాతం సీట్లను ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో 50 శాతం సీట్లను కాంపిటెంట్ అథారిటీ కోటా కింద, మిగిలిన 50 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. పీజీ డిగ్రీ వ్యవధి మూడేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి రెండేళ్లు.

అర్హత: పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. ఆగస్టు 15 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి. నీట్ పీజీ 2024 ఎగ్జామ్‌లో జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 పర్సంటైల్; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 40 పర్సంటైల్; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 45 పర్సంటైల్ మార్కులు ఉండాలి. మెడికల్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** తెలుగు రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన అభ్యర్థులకు రూ.7080; ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారికి రూ.10,620; విదేశాల్లో చదివినవారికి రూ.15,340
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 4
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in



యూక్యూ-ఐఐటీడీ రీసెర్చ్ అకాడమీలో

పీహెచ్‌డీ

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీడీ), ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌లాండ్(యూక్యూ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న యూక్యూ-ఐఐటీడీ రీసెర్చ్ అకాడమీ- జాయింట్ పీహెచ్‌డీ ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. భారతదేశ అభ్యర్థులు ఇండియాలో మూడేళ్లు; ఆస్ట్రేలియా-బ్రిస్బేన్‌లో ఏడాది చదవాల్సి ఉంటుంది. అలాగే ఆస్ట్రేలియా అభ్యర్థులు బ్రిస్బేన్‌లో మూడేళ్లు; ఇండియాలో ఏడాది చదవాలి. అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు రెండు యూనివర్సిటీలు ఉమ్మడిగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీని అందిస్తాయి.

విభాగాలు: ఆర్కిటెక్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్, ఆర్కిటెక్చర్, ఆర్కిటెక్చర్-ప్లానింగ్-డిజైన్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, ఎకనామిక్స్ అండ్ లా, ఇంజనీరింగ్, హెల్త్ అండ్ బిహేవియరల్ సైన్సెస్, హ్యూమానిటీస్, హ్యూమానిటీస్-సోషల్ సైన్సెస్-ఎడ్యుకేషన్, ఐటీ అండ్ కంప్యూటర్ సైన్స్, మెడిసిన్, ప్లానింగ్ అండ్ డిజైన్, సైన్స్ అండ్ మేథమెటిక్స్, సోషల్ సైన్సెస్ అండ్ ఎడ్యుకేషన్.

అర్హత: ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ/బ్యాచులర్స్ డిగ్రీ లేదా మాస్టర్స్ డిగ్రీ(సైన్సెస్/ఆర్ట్స్/హ్యూమానిటీస్) లేదా ఎంబీబీఎస్/బీడీఎస్/ఎండీఎస్/బీహెచ్‌ఎంఎస్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. పీజీ స్థాయిలో 65 శాతం మార్కులు, డిగ్రీ స్థాయిలో 80 శాతం మార్కులు ఉండాలి. గేట్/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/ఐకార్/ఐసీఎంఆర్/డీఎస్‌టీ-ఇన్‌స్పయిర్ స్కోర్ తప్పనిసరి. కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉన్న వారికి జాతీయ పరీక్ష స్కోర్ అవసరం లేదు. ఆస్ట్రేలియా అభ్యర్థులకు జీఆర్ఈ/ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్ ఉండాలి.

స్కాలర్‌షిప్: భారతదేశ అభ్యర్థులకు మొదటి ఏడాది నెలకు రూ.47,000; రెండో ఏడాది సంవత్సరానికి 35,000 ఆస్ట్రేలియన్ డాలర్లు; చివరి రెండేళ్లు నెలకు రూ.52,000ల స్టయిపెండ్ ఇస్తారు. ట్రావెలింగ్ ఖర్చుల నిమిత్తం రీలొకేషన్ గ్రాంట్ కింద 5,200ల ఆస్ట్రేలియన్ డాలర్లు; రెండేళ్లకు హెల్త్ కవరేజ్ సింగిల్ పాలసీ ఇస్తారు.

- ఆస్ట్రేలియా అభ్యర్థులకు స్టయిపెండ్ కింద ఏడాదికి 35,000 ఆస్ట్రేలియన్ డాలర్లు; రీలొకేషన్ గ్రాంట్ కింద 2,500 ఆస్ట్రేలియన్ డాలర్లు; ఐఐటీడీ నుంచి ట్రావెల్ ఇన్సూరెన్స్ అందిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 3
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** అక్టోబరు 30
- **ఇంటర్వ్యూలు:** నవంబరు 3 నుంచి 21 వరకు
- **వెబ్‌సైట్:** https://home.iitd.ac.in

లాల్ బహదూర్ శాస్త్రి ఇన్‌స్టిట్యూట్‌లో

పీజీడీఎం

ఢిల్లీలోని లాల్ బహదూర్ శాస్త్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎల్‌బీఎస్ఐఎం)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి మూడు చొప్పున మొత్తం ఆరు ట్రైమెస్టర్‌లు ఉంటాయి. ఇందులో కంపల్సరీ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, సమ్మర్ ఇంటర్న్‌షిప్, రీసెర్చ్ ప్రాజెక్ట్ ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. జాతీయ స్థాయి పరీక్ష స్కోర్, అనుభవం, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 15 మందికి మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్ అందిస్తారు. అకడమిక్ ప్రతిభ, కుటుంబ ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ ఎంపిక చేసినవారికి ఒక్కొక్కరికి రూ.లక్ష చెల్లిస్తారు.



స్పెషలైజేషన్‌లు: జనరల్, రీసెర్చ్ అండ్ బిజినెస్ అనలిటిక్స్, ఈ బిజినెస్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసే వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2024/జీమ్యాట్(2021 జనవరి 1 నుంచి 2025 జనవరి 31 మధ్య)/ఎక్స్‌ఏటీ 2025 స్కోర్ ఉండాలి. రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. స్పాన్సర్డ్ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.

ఎంపిక: క్యాట్/ఎక్స్‌ఏటీ/జీమ్యాట్ స్కోర్, అకడమిక్ ప్రతిభ, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ ఎబిలిటీ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జాతీయ పరీక్ష స్కోర్‌కు 60 శాతం; అకడమిక్ మెరిట్, అనుభవం, గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ స్కోర్‌కు 40 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,200
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** డిసెంబరు 15
- **రిటెన్ ఎబిలిటీ టెస్ట్, జీడీ, ఇంటర్వ్యూ కేంద్రాలు:** హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర నగరాలు
- **వెబ్‌సైట్:** www.lbsim.ac.in

జాబ్ కార్నర్



కేజీబీవీల్లో ఉద్యోగాలు

ఖాళీలు: 604

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ(పాఠశాల విద్యాశాఖ) ఆధ్వర్యంలో నిర్వహించే కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను(ఏడాది) కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. బోధన సిబ్బందిని ఒప్పంద ప్రాతిపదికన బోధనేతర సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియామక ప్రక్రియ చేపడతారు.

1. ప్రిన్సిపాల్: 10 పోస్టులు
2. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ): 165 పోస్టులు
   సబ్జెక్టులు: ఇంగ్లీష్/సివిక్స్/కామర్స్/మేథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/బోటనీ/జువాలజీ/ఒకేషనల్.
3. కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్(సీఆర్‌టీ): 163 పోస్టులు
   సబ్జెక్టులు: తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మేథ్స్, ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్.
4. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ): 4 పోస్టులు
5. పార్ట్‌టైం టీచర్(పీటీటీ): 165 పోస్టులు
6. వార్డెన్: 53 పోస్టులు
7. అకౌంటెంట్: 44 పోస్టులు

వయోపరిమితి: ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

గౌరవ వేతనం: నెలకు ప్రిన్సిపాల్‌కు రూ.34,139, పీజీటీకి రూ.26,759, సీఆర్టీకి రూ.26,759, పీఈటీకి రూ.26,759, అకౌంటెంట్‌కు రూ.18,500, వార్డెన్‌కు రూ.18,500, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.18,500.

ఎంపిక ప్రక్రియ: అకడమిక్ మార్కులు, సర్వీస్ వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు రుసుము: రూ.250

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 18

వెబ్‌సైట్: https://apkgbv.apcfss.in/

ఎడ్‌సిల్ లిమిటెడ్‌లో ఐటీ స్టాఫ్

ఖాళీలు: 20

ఢిల్లీలోని ఎడ్‌సిల్ లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ కన్సల్టెంట్: 1 పోస్టు
2. కన్సల్టెంట్ - మేనేజ్‌మెంట్: 3 పోస్టులు
3. సివిల్ ఇంజనీరింగ్: 2 పోస్టులు
4. సాఫ్ట్‌వేర్ డెవలపర్: 4 పోస్టులు
5. పబ్లికేషన్ అండ్ బ్రాండింగ్ ఎక్స్‌పర్ట్: 1 పోస్టు
6. అకౌంటెంట్: 3 పోస్టులు
7. ఐటీ స్టాఫ్: 6 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీకాం, బీఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంకాం, బీటెక్/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.

వయోపరిమితి: సీనియర్ కన్సల్టెంట్ పోస్టుకు 50 ఏళ్లు; ఇతర పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: విద్యార్హతలు, పని అనుభవం, రాత పరీక్ష, ఇంటర్వ్యూ, పీపీటీ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 14

వెబ్‌సైట్: https://www.edcilindia.co.in/

బామర్ లారీ లిమిటెడ్‌లో జూనియర్ ఆఫీసర్లు

కోల్‌కతాలోని ప్రభుత్వ రంగ సంస్థ- బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్...ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 4

1. జూనియర్ ఆఫీసర్(సేల్స్ అండ్ మార్కెటింగ్): 2 పోస్టులు
2. జూనియర్ ఆఫీసర్(ఆపరేషన్స్): 2 పోస్టులు

అర్హత: ఏదైనా డిగ్రీ

వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు

ఎంపిక ప్రక్రియ: దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

పని ప్రదేశాలు: బెంగళూరు, కోల్‌కతా

దరఖాస్తులకు చివరి తేదీ: అక్టోబరు 4

వెబ్‌సైట్: https://www.balmer-lawrie.com/



ఎన్ఐటీఎంలో టెక్నికల్ అసిస్టెంట్స్

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్)కు చెందిన కర్ణాటక, బెళగావిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ మెడిసిన్(ఎన్ఐటీఎం)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 4

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.300

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ద డైరెక్టర్, ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ మెడిసిన్, నెహ్రూనగర్, బెళగావి చిరునామాకు పంపించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 18

వెబ్‌సైట్: https://icmrnitm.res.in/

లిటిల్స్


అహంకారంతో ఆనందం దూరం

ఒక తోటలో చాలా రకాల పూలు ఉండేవి. వాటిలో ఒక గడ్డి పువ్వు కూడా ఉంది. ఒక ఉదయం పూట ఇద్దరు మనుషులు ఆ పూలతోటకు వచ్చి అన్ని మొక్కలను చూస్తూ, దాన్ని చూడు గడ్డిపువ్వు అయినా ఎంత అందంగా ఉందో అన్నారు. ఆ మాటలు విన్న గడ్డి పువ్వు చాలా ఆనందించింది.ఆ తోటలో ఉన్న అన్ని పూలకంటే తానే అందమైన దాన్ని అనుకున్నది. దాని మనసులో తాను మిగతా పూలకన్నా ప్రత్యేకం అనే భావన ప్రవేశించింది. అదే ఆలోచనతో తన పక్కనున్న మొక్కలకు పూచిన పూలు తనను స్నేహంగా పలకరించినా మొహం తిప్పుకుని వాటితో మాట్లాడకుండా ఉండటం తన గొప్పతనం అనుకున్నది.




ఇదేమిటి అని అడిగిన మిగతా పూలతో ఉదయం కొందరు ఈ తోటకు వచ్చి, అన్ని పూలనుచూసి అన్నిటి కంటేనేనే అందంగా ఉన్నానుఅని చెప్పి, వెళ్లారు, రేపో మాపో నేను చాలా మంచి స్థానంలో ఉంటాను అని వాటితో చెప్పింది. ఆ మర్నాడు ఉదయం గుడిలో దేవుడికి పూల మాలలు సమర్పించడానికి గుడి పూజారి పూలు కోసుకెళ్లడానికి వచ్చాడు మందారాలు, నంది వర్ధనాలు,పారిజాతాలు వంటి అన్నిపూలను కోసాడు కానీ ఈ గడ్డి పువ్వు వంక తిరిగి కూడా చూడలేదు గడ్డి పువ్వుకు బాధ కలిగినా ఈయన కాకపోతే మరొకరు వచ్చినన్ను మంచి చోటుకు తీసుకుపోతారు అని తనను తాను ఓదార్చుకుంది. ఆ రోజు సాయంత్రం అత్తర్లు తయారు చేసే వ్యాపారి పూల సేకరణ కోసం వచ్చాడు అతను మల్లెలు గులాబీలనే తప్ప మిగతా పూలను పట్టించుకోలేదు,ఈ గడ్డిపువ్వు వంక తిరిగి చూడనైనా చూడలేదు. ఈసారి గడ్డిపువ్వు ఇంకా ఎక్కువ బాధ పడింది. ఆ మర్నాడు పెద్ద గాలివాన వచ్చి, గడ్డిపువ్వు ఎగిరిపోయి దూరంగా ఉన్న చెత్తకుప్ప మీద పడిపోయింది. అహంకారంతో మిగతా ఏ పూలతో మాట్లాడకుండా ఉన్నగడ్డిపువ్వుకు ఆ చెత్తకుప్ప మీద అసలు మాట్లాడటానికి వేరే పువ్వులే కనిపించలేదు. అనవసరంగా తోటలో మంచి మిత్రులను దూరం చేసుకున్నాను కదా అని బాధ పడింది గడ్డి పువ్వు.

10 తేడాలను కనిపెట్టండి






సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 423

					2	3	9	
8			3	6			1	7
				7	1			8
	4				8			3
		7				4		
2			4				7	
5			2	4				
1	2			3	7			9
	6	9	1					

సుడోకు - 422 సమాధానం

7	8	3	1	9	6	5	4	2
1	5	6	4	2	7	3	8	9
4	2	9	5	3	8	7	1	6
5	3	1	8	4	9	6	2	7
8	6	2	7	5	1	4	9	3
9	7	4	2	6	3	1	5	8
6	4	5	9	7	2	8	3	1
3	9	8	6	1	5	2	7	4
2	1	7	3	8	4	9	6	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.